
## కార్మికవర్గ ప్రియ పుత్రుడు, సాహసిక నాయకుడు, కేంద్రకమిటీ సభ్యుడు, ట్రైజంక్షన్ స్పెషల్ జోనల్ కమిటీ కార్యదర్శి కామ్రేడ్ దేవరాజ్, పీడిత ప్రజల ప్రియతమ నాయకురాలు, స్పెషల్ జోనల్ కమిటీ సభ్యురాలు కామ్రేడ్ అజితలకు విప్లవ జోహార్లు



కామ్రేడ్ దేవరాజ్ (సి.సి.ఎం.)

2016 నవంబర్ 24న భారత కమ్యూనిస్టు పార్టీ (మావోయిస్టు) కేంద్రకమిటీ సభ్యుడు, ట్రైజంక్షన్ ఎస్.జడ్.సి. కార్యదర్శి కామ్రేడ్ దేవరాజ్ (మంజు, రమేష్, యోగేశ్, ప్రసాద్), ట్రైజంక్షన్ ఎస్.జడ్.సి. సభ్యురాలు కా. అజిత (కావేరి)లు నీలంబూర్ అడవి ప్రాంతం (మలప్పురం జిల్లా, కేరళ రాష్ట్రం) లోని కరైకుళం గ్రామం వద్ద బూటకపు ఎన్‌కౌంటర్‌లో అమరులైనారు.

*(మిగతా 2వ పేజీలో......)*



కామ్రేడ్ అజిత (ఎస్.జడ్.సి.ఎం.)



కామ్రేడ్ దయ (ఎస్.జడ్.సి.ఎం.)

## భారత విప్లవోద్యమ చరిత్రలో పెద్ద ఘటన–రాంగూడ దాడి

ఆంధ్ర–ఒడిశా సరిహద్దులో అక్టోబర్ 24, 2016న కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సమన్వయంతో ఆంధ్రప్రదేశ్, ఒడిశా రాష్ట్రాలకు చెందిన గ్రేహౌండ్స్, ఎస్.ఓ.జి.పోలీసుకమాండో బలగాలు సంయుక్తంగా ఉదయం 6 గం॥లకు రాంగూడ వద్ద నున్న పి.ఎల్.జి.ఎ. బలగాలపై అకస్మాత్గా దాడి జరిపి 31 మందిని హత్య చేశారు. ఈ మారణకాండలో

*(మిగతా 30వ పేజీలో......)*



కామ్రేడ్ ప్రసాద్ (ఎస్.జడ్.సి.ఎం.)

# క్రాంతి

### లోపలి పేజీల్లో...


సాంస్కృతిక విప్లవానికి 50 ఏళ్ళు......5
పాతికేళ్ళ ప్రపంచీకరణ ఫలితాలు....10
కార్పొరేట్ల మెప్పకే నోట్ల రద్దు ......19
సర్జికల్ స్ట్రైక్ ......25
వస్తు సేవల పన్నుల చట్టం .....28
రాంగూడ అమరులు.....మధ్యపేజీ...30
ఆర్.కె. ఇంటర్వ్యూ ......42
ట్రంప్ ఎన్నిక .......48
పంజాబు దళితుల పోరాటం .......51
డి.కె.లో ప్రజా ప్రతిఘటన.................55



సి.పి.ఐ. (మావోయిస్టు) ఎ.పి., తెలంగాణ., ఎ.ఒ.బి. కమిటీల అధికార పత్రిక

సంపుటి: 41 సంచిక: 1 అక్టోబర్ 2016–మార్చ్ 2017 వెల: పది రూపాయలు

అమరులకు కేంద్రకమిటీ వినమ్రంగా తలవంచి బిగిపిడికిళ్లెత్తి జోహార్లు చెబుతున్నది. అమరుల ఆశయ సాధనకు ప్రతిజ్ఞ చేస్తున్నది. అమరుల ఆశయ సాధనకు ప్రజాయుద్ధ మార్గాన దృఢ సంకల్పంతో ముందుకుసాగాలని యావత్తు పార్టీకి పిలుపునిస్తున్నది.

కేంద్రంలోని హిందూ ఫాసిస్టు మోడీ ప్రభుత్వం, కేరళలోని సోషల్ ఫాసిస్టు సి.పి.ఎం. పెన్నారై విజయన్ ప్రభుత్వం కుమ్మక్కై వందలాది పోలీసు-పారా మిలటరీ కమాండో బలగాలతో కరైకుళం గ్రామం వద్ద దాడి చేసి కామ్రేడ్స్ దేవరాజ్, అజితలను అరెస్టు చేసి క్రూరంగా చిత్రహింసలకు గురిచేసి హత్య చేశారు. ఈ క్రూరహత్యలను ఖండించాల్సిందిగానూ, వీటికి వ్యతిరేకంగా పోరాడాల్సిందిగానూ దేశ ప్రజలకు, ప్రజాస్వామికవాదులకు, దేశభక్తులకు, ప్రజలకు పిలుపునిస్తున్నాం. అమరులైన ఈ కామ్రేడ్స్ కుటుంబాలకు, బంధుమిత్రులకు, సహ కామ్రేడ్స్‌కు కేంద్రకమిటీ ప్రగాఢ సంతాపాన్ని తెలియజేస్తున్నది. వారి బాధలో పాలు పంచుకుంటున్నది.

మన ప్రియతమ కా. దేవరాజ్ (62) విప్లవ ప్రస్థానం ఇలా ప్రారంభమైంది. ఆయన పట్టణ పేద కుటుంబానికి చెందినవాడు. ఆయనకు భార్య, పిల్లలు, తమ్ముడు, చెల్లెండ్లు ఉన్నారు. ఆయన ఉన్నత చదువు చదివాడు. ఆయన విప్లవోద్యమంలో అడుగిడిన తర్వాత ఆయన ఇల్లు విప్లవానికి కేంద్రంగా మారింది. 1980లో సి.పి.ఐ.(ఎం.ఎల్.)(పి.డబ్ల్యు.) కార్యకలాపాలు ప్రారంభం కావడంతో కర్నాటకలో పార్టీ సెల్ నిర్మాణాలు ఏర్పడ్డాయి. ఆ సమయంలో కా. దేవరాజ్ ఎల్ అండ్ టి కంపెనీలో ఉద్యోగం చేస్తున్నాడు. కర్నాటక రాష్ట్ర పార్టీ ఇన్‌ఛార్జ్ కా. చెరుకూరి రాజకుమార్ (ఆజాద్) నాయకత్వంలో కామ్రేడ్స్ దేవరాజ్, సాకేత్ రాజన్‌లతో పాటు మరికొందరు విప్లవోద్యమంలో పూర్తికాలం కార్యకర్తలుగా ఎదిగారు. కా. దేవరాజ్ 1980వ దశకంలో బెంగుళూరు, మైసూరు, కోలార్‌లలో జరిగిన పోరాటాలలో క్రియాశీలంగా పాల్గొన్నాడు. రాయచూర్, బీదర్, హైదరాబాద్, కర్నాటకలో రైతాంగ ఉద్యమానికి నాంది పలికాడు. 1985 నాటికే ఆంధ్రప్రదేశ్, బీహార్ మొదలైన ప్రాంతాల్లో జరిగే విప్లవ పోరాటాల గురించి విస్తృతంగా ప్రచారం జరిగి కా. దేవరాజ్ ఏ.ఐ.ఎల్.ఆర్.సి. లో కూడా చేరాడు.

1985లో పార్టీ కేంద్రకమిటీలోని విచ్ఛిన్నకర ముఠాకు వ్యతిరేకంగా జరిగిన పోరాటానికి కర్నాటకలో కా. ఆజాద్ నాయకత్వాన కామ్రేడ్స్ దేవరాజ్, సాకేత్ రాజన్‌లతో కూడిన లీడింగ్ టీం కీలక పాత్ర నిర్వహించింది. కా. ఆజాద్ నాయకత్వంలో ఏర్పడిన రాష్ట్ర లీడింగ్ టీం సైద్ధాంతికంగా, రాజకీయంగా దృఢమైన ఐక్యత గల నాయకత్వ టీముగా కర్నాటకలో వివిధ రంగాల్లో ఉద్యమాన్ని ముందుకు తీసుకుపోయింది. కర్నాటకలో మరింతమంది పార్టీ కార్యకర్తలను అభివృద్ధి చేసుకొని 1987లో పార్టీ రాష్ట్ర ప్రథమ మహాసభను నిర్వహించారు. ఈ మహాసభలో కా. ఆజాద్ రాష్ట్ర పార్టీ కార్యదర్శిగానూ, కామ్రేడ్స్ దేవరాజ్, సాకేత్ రాజన్‌లతో పాటు ఐదుగురితో రాష్ట్రకమిటీ (ఎస్.సి.) ఎన్నుకోబడింది. ఈ మహాసభలోనే గ్రామీణ ప్రాంతంలో రైతాంగ ఉద్యమాన్ని నిర్మించాలనే నిర్ణయం తీసుకొని ఉత్తర కర్నాటక లోని రాయచూర్, బీదర్ (ఏ.పి.ని ఆనుకొని ఉన్న ప్రాంతం)ల మైదాన ప్రాంతానికి ఉద్యమాన్ని విస్తరించారు. ఈ గ్రామీణ ప్రాంత ఉద్యమానికి కా. దేవరాజ్ నాయకత్వం వహించాడు.

అలాగే బెంగళూరు, చిత్రదుర్గ, శివమొగ్గ, మైసూర్, ధార్వాడ్, రాయచూర్, బీదర్ ప్రాంతాల్లోని విద్యార్థుల్లోకి విప్లవ రాజకీయాలను తీసుకెళ్లి ప్రగతిపర విద్యార్థి కేంద్ర అనే విద్యార్థి సంఘాన్ని నిర్మించి గైడ్ చేశాడు.

కర్నాటకలో జాతి సమస్య ముందుకు వచ్చినప్పుడు పార్టీ రాష్ట్రకమిటీ దాని ప్రాముఖ్యత గుర్తించి ఈ సమస్యపై ఉద్యమాన్ని నిర్మించడానికి కన్నడ విమోచన రంగ అనే సంస్థను నిర్మించింది.

1990లో కర్నాటక రాష్ట్ర పార్టీ 2వ మహాసభను నిర్వహించారు. అదే సమయంలో ఏ.పి., కర్నాటక, తమిళనాడు రాష్ట్ర కమిటీలు కేంద్ర ప్లీనం జరపడానికి నిర్ణయం తీసుకొని కేంద్ర ప్లీనం నిర్వహించాయి. తిరిగి 1991లో పార్టీలో 2వ సంక్షోభం వచ్చింది. మైనార్టీ గ్రూపు తప్పుడు ధోరణులను ఎండగడ్తూ కర్నాటక ఎస్.సి. డాక్యుమెంట్‌ని రూపొందించి అవకాశవాద ముఠాకు వ్యతిరేకంగా పోరాడాలని కేడర్‌కు పిలుపునిచ్చింది. విచ్ఛిన్నకర ముఠాను అర్థం చేసుకొని సైద్ధాంతికంగా పోరాడాలనేది వీరి లక్ష్యం.

1993లో కర్నాటక రాష్ట్ర ప్లీనం జరిగింది. అఖిల భారత పార్టీ మహాసభలో భాగంగా 1995లో కర్నాటక 3వ రాష్ట్ర మహాసభ జరిగింది. ఈ మహాసభలో కా. దేవరాజ్ కార్యదర్శిగా నూతన రాష్ట్రకమిటీ ఎన్నుకోబడింది. అలాగే 1995లో జరిగిన అఖిల భారత పార్టీ మహాసభలో కా. దేవరాజ్ ప్రత్యామ్నాయ కేంద్రకమిటీ సభ్యునిగా ఎన్నికయ్యాడు. 1997లో పూర్తికాలం కేంద్రకమిటీ సభ్యునిగానూ కోఆప్ట్ చేసుకోబడినాడు. బెంగుళూరులో 1999లో శత్రువు తనను చుట్టుముట్టినప్పుడు భయపడకుండా చాకచక్యంగా తప్పించుకోగలిగాడు.

2001లో సి.పి.ఐ.(ఎం.ఎల్.)[పీపుల్స్‌వార్] 9వ కాంగ్రెస్ జరిగి కా. దేవరాజ్ సి.సి.లోకి, అలాగే పశ్చిమ రీజినల్ బ్యూరో సభ్యునిగానూ ఎన్నికయ్యాడు. 2002 లోనే కర్నాటక పర్‌స్పెక్టివ్ ప్రాంత ఉద్యమాన్ని నీరుగార్చడానికి రాష్ట్రకమిటీలో ముందుకు వచ్చిన అవకాశవాద విచ్ఛిన్నకర ముఠా ప్రయత్నాలను కామ్రేడ్స్ దేవరాజ్, సాకేత్ రాజన్‌లు దృఢంగా అడ్డుకొన్నారు. 2003లో జరిగిన రాష్ట్ర ప్లీనంలో మల్నాడ్ పర్‌స్పెక్టివ్‌ని ఆమోదింపజేశారు. పార్టీ 9వ కాంగ్రెస్‌కు ముందే జరిగిన కర్నాటక రాష్ట్ర మహాసభ రూపొందించిన మల్నాడు పర్‌స్పెక్టివ్‌ని సి.సి. ఆమోదించింది. కర్నాటక రాష్ట్రకమిటీ కార్యదర్శి కామ్రేడ్స్ సాకేత్ రాజన్, దేవరాజ్‌లు

కలిసి మల్నాడు ప్రాంత సామాజిక, ఆర్థిక పరిస్థితులను అధ్యయనం చేశారు. ఆ పర్‌స్పెక్టివ్ ప్రాంత ఉద్యమ అభివృద్ధిలో వీరిరువురు కీలకపాత్ర వహించారు. అక్కడ ఉద్యమం వేళ్లూనుకుంటున్న తరుణంలోనే 2005 ఫిబ్రవరిలో పోలీసులు కా. సాకేత్ రాజన్‌పై చేసిన దాడిని ఆయన వీరోచితంగా తిప్పికొడుతూ అమరుడైనారు.

కా. సాకేత్ రాజన్ అమరత్వం తర్వాత కర్నాటకలోని విచ్ఛిన్నకర అవకాశవాదులు సి.పి.ఐ.(మావోయిస్టు) ఏర్పాటును వ్యతిరేకిస్తూ 2005 నవంబర్‌లో రివిజనిస్టు పంథాను ముందుకు తెచ్చారు. ఈ రివిజనిస్టు పంథాకు వ్యతిరేకంగా సి.సి., ఆర్.బి.ల గైడెన్స్‌లో కా. దేవరాజ్ పోరాటం కొనసాగించాడు. 2006లో జరిగిన పార్టీ రాష్ట్ర 5వ మహాసభలో మెజార్టీ కామ్రేడ్స్ పార్టీ పంథాను అంటిపెట్టుకొని ఉండి అవకాశవాద రివిజనిస్టు ముఠాను వ్యతిరేకించడంతో సంక్షోభం పరిష్కారమైంది. అవకాశవాద రివిజనిస్టు ముఠా పార్టీని విడిచి వెళ్లిపోయింది.

1985లో పార్టీలో తలెత్తిన సంక్షోభం వల్ల తమిళనాడు పార్టీలో సైద్ధాంతిక, రాజకీయ గందరగోళం నెలకొన్నది. ఇలాంటి పరిస్థితిలో నిజాయితీ గల నూతన కామ్రేడ్స్‌ని పునస్సంఘటితం చేసి నూతన రాష్ట్రకమిటీని ఏర్పరచి అక్కడ ఉద్యమ నిర్మాణానికి కా. దేవరాజ్ చేసిన కృషి చాలా ప్రాధాన్యత గలది, మరువలేనిది. కా. దేవరాజ్ తమిళనాడు పార్టీని గైడ్ చేసే బాధ్యతను కూడా తీసుకున్నారు. 2002లో తమిళనాడులో ఉద్యమాన్ని అభివృద్ధి చేయడానికై పర్‌స్పెక్టివ్ ప్రాంతాన్ని నిర్ధారించుకొని సాయుధ పోరాటాన్ని అభివృద్ధిపర్చడం కోసం మిలటరీ క్యాంపు నిర్వహిస్తున్న సమయంలో బహిర్గతమై శత్రువు దాడి చేయడంతో రాష్ట్ర కార్యదర్శితో పాటు చాలా మంది కామ్రేడ్స్ అరెస్టు అయినారు. దీనితో 2003 ప్రారంభంలో కా. దేవరాజ్ తమిళనాడు రాష్ట్ర కార్యదర్శి బాధ్యతలు కూడా తీసుకోవాల్సి వచ్చింది. అదే సమయంలో కేరళలో జనశక్తి, ఇతర మితవాద పార్టీలను విడిచి బయటికి వచ్చిన నిజమైన విప్లవ శక్తులతో చర్చలు జరిపి పార్టీలో చేర్చుకున్నారు. దీనితో కేరళలో సరైన పంథాలో పార్టీ ఏర్పడింది. ఎస్.ఓ.సి.ని ఏర్పాటు చేసి అక్కడ కార్మికవర్గ ఉద్యమం బలపడేలా కా. దేవరాజ్ గైడ్ చేశాడు.

కా. దేవరాజ్ దక్షిణ భారతదేశం లోని అనేక భాషలు మాట్లాడగల సమర్థతలు పెంచుకున్నాడు. ఇంగ్లీషు, తమిళం, మలయాళం, కన్నడభాషలపై పట్టు సాధించారు. అవకాశవాదులకు వ్యతిరేకంగా పొలిమికల్ డాక్యుమెంట్లు రాయడం, పార్టీ కార్యకర్తలను సిద్ధాంతపరంగా, రాజకీయపరంగా ఎదిగించే కృషి చేయడం, సర్క్యులర్లు రాయడం, పార్టీ పత్రికలకు వ్యాసాలు రాయడం, బోధించడంలో నేర్పరిగా ఉండేవాడు. పార్టీలో రెక్టిఫికేషన్ నిర్వహించేందుకూ, నూతన నాయకత్వాన్ని అభివృద్ధి చేసేందుకూ నాయకత్వ తర్ఫీదు కార్యక్రమం (లీడర్‌షిప్ ట్రెయినింగ్ ప్రోగ్రామ్-ఎల్.టి.పి.) నిర్వహించాడు.

2007లో తమిళనాడు స్టేట్‌కమిటీతో కలిసి మధురై, దిండిగల్ ప్రాంతాల పర్‌స్పెక్టివ్‌ను రూపొందించి దానిని అమలుపర్చేందుకు వెళ్లిన కొద్ది రోజుల్లోనే అక్కడి సాయుధ దళం అరెస్టు కావడం, రెండవ దళంపై కూడా పోలీసు దాడి జరిగి కమాండర్ అమరుడు కావడంతో తాత్కాలికంగా బలగాలను వెనక్కి తీసుకొని ఆ వ్యూహాత్మక పథకాన్ని విరమించుకోవాల్సి వచ్చింది.

ఆపరేషన్ గ్రీన్‌హంట్‌లో భాగంగా పశ్చిమ కనుమల్లో తీవ్రతరమైన శత్రు నిర్బంధం నడుమనే తగిన సైద్ధాంతిక, రాజకీయ, నిర్మాణపర సన్నాహాలు పూర్తి చేసుకొని కా. దేవరాజ్ నాయకత్వంలో కర్నాటక, కేరళ కామ్రేడ్స్ అనేక కష్టనష్టాలు భరిస్తూనే ట్రైజంక్షన్ ఉద్యమ నిర్మాణానికి పూనుకున్నారు. మల్నాడు నుండి బయలుదేరి శత్రుదాడుల నెదిరిస్తూనే నెలల తరబడి ప్రయాణించి ట్రైజంక్షన్ (మూడు రాష్ట్రాల బోర్డర్)కు చేరుకున్నాడు. కా. దేవరాజ్ అక్కడ ఎస్.జడ్.సి.ని ఏర్పాటు చేసి తాను స్వయంగా దాని కార్యదర్శి బాధ్యతలు చేపట్టాడు. ఆ ప్రాంత ప్రజల్లోకి వెళ్లి సర్వే (వర్గపరిశీలన) నిర్వహించి కా. దేవరాజ్ నాయకత్వంలో డాక్యుమెంట్ రూపొందించారు. తన నాయకత్వంలో ఎస్.జడ్.సి. ఆ ప్రాంతంలో సాయుధ గెరిల్లా దళాలను నిర్మించి దీర్ఘకాల సాయుధ పోరాట రాజకీయాలను ఆదివాసీ ప్రజల్లో బహుళ ప్రచారం చేసింది. పార్టీ నాయకత్వాన పి.ఎల్.జి.ఏ. రాజకీయ-సైనిక ప్రచార క్యాంపెయిన్‌ని విజయవంతం చేసింది. ప్రజావిముక్తి గెరిల్లా దళాలు మరింతగా ప్రజలతో సమైక్యమైనాయి. ఈ క్యాంపెయిన్‌లో భాగంగా కొన్ని బడాబూర్జువా, బహుళజాతి కంపెనీల ఆస్థులు ధ్వంసం గావించబడ్డాయి. ట్రైజంక్షన్‌లో ఉద్యమం రివిజనిజానికి వ్యతిరేకంగా ఎక్కుపెట్టబడడంతో అది కేరళ పాలక రివిజనిస్టులకు గొడ్డలి పెట్టుగా మారింది. ఈ క్యాంపెయిన్ అంతటిలోనూ కా. దేవరాజ్ క్రియాశీల భూమిక నిర్వహించాడు. కా. దేవరాజ్ నాయకత్వంలో ఆ ప్రాంత ప్రజల్లోకి వెళ్లి సామాజిక పరిశోధన (వర్గపరిశీలన) నిర్వహించి డాక్యుమెంట్ రూపొందించారు.

కా. దేవరాజ్ విప్లవ కమ్యూనిస్టు పార్టీలతో, ముఖ్యంగా నక్సల్‌బరీతో సి.సి. తరపున చర్చలు జరిపారు. పార్టీల రాష్ట్ర పత్రికలు, ప్రజాసంఘాల పత్రికలు నడిపారు. కేంద్రపత్రికలకు (వ్యాన్‌గార్డ్-పీపుల్స్‌మార్చ్) వ్యాసాలు రాశారు. ఎల్.టి.టి.ఇ. పోరాటం ఓటమి చెందడానికి కారణాలను విశ్లేషించి పీపుల్స్‌మార్చ్ పత్రికలో వ్యాసాలు రాశాడు. దేశంలో సాయుధ పోరాట నిర్వహణకై ఆయుధాలు, మందుగుండు, గ్రెనేడ్స్ తదితరాల వుత్పత్తిలోనూ, సరఫరాల్లోనూ కా. దేవరాజ్ ముఖ్యపాత్ర నిర్వహిస్తూ వచ్చాడు.

2009లో దేశ పాలకవర్గాలు మన పార్టీనీ, దేశవ్యాప్తంగా విప్లవోద్యమాన్ని తుడిచిపెట్టే లక్ష్యంతో గ్రీన్‌హంట్ ఆపరేషన్ పేరుతో పెద్ద దాడిని ప్రారంభించాయి. పశ్చిమ కనుమల ట్రైజంక్షన్‌లో విప్లవోద్యమ నూతన రంగాన్ని ప్రారంభించడంతో

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఎల్.ఐ.సి. పాలసీలో భాగంగా కుట్ర పన్ని కా. దేవరాజ్‌ను, కా. అజితను పట్టుకొని, చిత్రహింసలకు గురిచేసి ఎదురుకాల్పుల పేరుతో హత్యచేశాయి.

కా. దేవరాజ్ గురించి మరో ముఖ్యమైన అంశం కా. వర్గీస్ వారసునిగా నిలవడం. 50 సంవత్సరాల క్రితం ప్రజల కోసం అమరుడైన వర్గీస్ ఆశయాలను కొనసాగించాలని ప్రజలు కోరుకుంటున్నారు. ఆ మార్గంలోనే మన ప్రియతమ నాయకుడు కా. దేవరాజ్ నాయకత్వంలో సాయుధ గెరిల్లా దళాలు ప్రజల వద్దకు వెళ్లగానే వారు చురుకుగా ఉద్యమిస్తున్నారు. నేడు కా. దేవరాజ్, కా. అజితల అమరత్వాన్ని ఎత్తిపట్టి ప్రజలు ముందుకు నడుస్తున్నారు. వారి ఆశయ సాధనకు దీక్ష బూనుతున్నారు.

కా. దేవరాజ్ అమరత్వం దేశంలోనూ, మరీముఖ్యంగా ట్రైజంక్షన్‌లో మన పార్టీకి పెద్ద నష్టం. భారత విప్లవం ఒక మంచి నాయకుణ్ని కోల్పోయింది. భావజాలపరంగా, సైద్ధాంతికంగా, రాజకీయంగా ఆయన పరిణతి చెందిన కామ్రేడ్. ఆయన చాలా అంతర్గత పోరాటాల్లో పాల్గొన్నారు, వాటిని నిర్వహించాడు. ఆ పోరాటాల్లో ఆయన రాటుదేలాడు. తక్కువ స్వీయాత్మక శక్తులు, తక్కువ వనరులే ఉన్నా గొప్ప ధైర్యంతో, దృఢమైన పట్టుదలతో పనిచేశాడు. ప్రతి ఒక్కరితో కలిసిమెలసి మెలిగేవాడు. పార్టీ కార్యకర్తలలో ప్రజాస్వామిక వాతావరణం పెంపొందించాడు. ప్రజల, విప్లవ కార్యకర్తల విశ్వాసం చూరగొన్నారు. వారి హృదయాల్లో ఎన్నటికీ నిలిచిపోయి ఉంటారు.

పార్టీ సంబంధాలు తెగినా, అక్కడ పార్టీ ఎన్నో కష్టనష్టాలను ఎదుర్కొన్నప్పటికీ మొక్కవోని విశ్వాసంతో ఆయన వ్యవహరించాడు. ఆయన నిస్వార్థ వ్యక్తి. కమిటీ నిర్ణయించినది ఏదైనా ఆయన తన కర్తవ్యంగా స్వీకరించాడు. భారత విప్లవంలో, ముఖ్యంగా పశ్చిమ కనుమలు, ఏ.పి., తెలంగాణా, దండకారణ్య ఉద్యమాల కామ్రేడ్స్ సదా ఆయన్ని జ్ఞాపకం పెట్టుకుంటారు. ఆయన అంకితభావం, కఠిన శ్రమ, త్యాగనిరతి పార్టీని తప్పక ముందుకు తీసుకెళ్లుతాయి. కా. దేవరాజ్ చెక్కుచెదరని దృఢదీక్ష ప్రస్తుతం జరిగిన భారీ నష్టాన్ని అధిగమించటానికి నిరంతరం కేడర్‌ని ఉత్తేజపరుస్తూనే ఉంటుంది.

ఆయన సాంస్కృతిక రంగంలో పనిచేస్తూ విప్లవ గీతాలు చాలా అనురక్తితో పాడేవాడు. ఆయన నిరంతరం కామ్రేడ్స్‌తో కలిసినప్పుడు వారి ఆరోగ్య, యోగక్షేమాలు తెలుసుకోవడంతో పాటు ప్రతి విషయంలో మంచి సలహాలు ఇచ్చేవాడు. మంచి కామ్రేడ్లీ వాతావరణాన్ని కలుగజేసేవాడు. గెరిల్లా జోన్లలో పర్యటిస్తున్నప్పుడు అక్కడి ఉద్యమంలోని మంచి అంశాలను ఎత్తిపట్టడంతో పాటు నెగెటివ్ అంశాలపై దృష్టి పెట్టి వాటిని సరిచేసేలా రాజకీయ -సైద్ధాంతిక గైడెన్స్ ఇచ్చేవాడు. తనకు తెలిసిన విషయాలు ఇతరులకు ఎంత స్పష్టంగా చెప్పేవారో భేషజం లేకుండా అదే తరహాలో ఇతరుల నుండి నేర్చుకునేవాడు. సాదా సీదా జీవనం, కార్మికవర్గ దృక్పథం ఆయనలో ఉట్టిపడేవి.

ఆయన ఆదర్శాలను ఎత్తిపట్టాల్సిందిగా పార్టీ శ్రేణులన్నింటికీ సి.సి. పిలుపునిస్తోంది. కా. దేవరాజ్ నిరంతరం ప్రదర్శించిన గొప్ప విప్లవ స్ఫూర్తినీ, పట్టుదలనూ, ధైర్యసాహసాలనూ, కఠిన పరిస్థితిలో నిర్భీతితో ఉండే ఆయన కమ్యూనిస్టు ఆదర్శాలను కొనసాగించాలనీ పార్టీ శ్రేణులన్నింటికీ కేంద్రకమిటీ పిలుపునిస్తోంది. ఆయన వేసిన విప్లవ మార్గంలో ప్రయాణిస్తూ నష్టాలను తొలగించుకునేలా ఏటికి ఎదురీదే ప్రయత్నం చేస్తూనే దూరదృష్టి కలిగిన కా. దేవరాజ్‌లా పార్టీ శ్రేణులన్నీ ఎదగాలని కేంద్రకమిటీ ఆశిస్తున్నది. కామ్రేడ్స్ అలా ఎదగడమే ఆయన స్మృతికి గొప్ప నివాళి. పార్టీ కేడర్లకు, అతని కుటుంబానికి సహవేదనను, సంతాపాన్ని తెలుపుతున్నాం.

కా. అజిత (కావేరి)(45) తమిళనాడు రాష్ట్ర రాజధాని చెన్నైలో పేద కుటుంబంలో జన్మించింది. ఆమె 1980ల చివరిలో విప్లవోద్యమంలోకి అడుగుపెట్టింది. విద్యార్థిగా ఉన్నప్పుడే కా. అజిత 'తమిళనాడు పెన్నూరిమై కజగం' అనే మహిళా సంఘంలో చేరి నాయకురాలిగా పనిచేసింది. మహిళలపై జరిగే హింసకు వ్యతిరేకంగా ఆమె ఎన్నో పోరాటాలకు నాయకత్వం వహించి వారిని విప్లవమార్గంలో నడిపించేందుకు కృషి చేసింది. తమిళనాడులో నిర్బంధం మొదలు కావడంతో 2002లో ఆమె రహస్య జీవితానికి వెళ్లి పట్టణ ప్రజాసంఘాలకు నేతృత్వం వహించింది. ఆమె ట్రేడ్‌యూనియన్ పోరాటాలను నడిపింది. తమిళనాడు పార్టీలో తలెత్తిన అవకాశవాద పంథాకి వ్యతిరేకంగా పోరాడుతూ మన పార్టీ యొక్క సరైన పంథా వైపు దృఢంగా నిలబడింది. తన జీవిత సహచరుడు అవకాశవాదపంథా చేపట్టినప్పటికీ ఆమె విప్లవ పంథా వైపే దృఢంగా నిలబడింది. పురుషాధిపత్యానికి వ్యతిరేకంగా పార్టీ లోపలా, బయటా దృఢంగా అలుపెరుగని పోరాటం చేసింది. 2012లో ఆమె ఎస్.జడ్.సి.లోకి ఎన్నికయ్యింది. కోయంబత్తూర్ అరెస్టుల తర్వాత కా. అజితను కూడా అరెస్టు చేసేందుకు పోలీసులు అనేకసార్లు ప్రయత్నించారు. ఎస్.జడ్.సి. నిర్ణయం మేరకు ప్రజల్ని ఆర్గనైజ్ చేసేందుకు ఆమె ట్రైజంక్షన్ గెరిల్లా దళాల్లో ఉండి పనిచేసింది. కా. అజిత కా. దేవరాజ్‌తో పాటు అమరురాలైంది.

కామ్రేడ్స్ దేవరాజ్, అజితలను మననుండి దూరం చేయడం ద్వారా దోపిడీ పాలకవర్గాలు విప్లవాన్ని ఆపగలం అని పగటి కలలు కంటున్నారు. ఈ కామ్రేడ్స్ అమరత్వం ప్రజా ఉద్యమాలకు, పార్టీకి తీరని నష్టమే అయినప్పటికీ వారు అజరామరంగా మనలో, ప్రజల్లో నిలిచే ఉంటారు. నిరంతరం వారి విప్లవ స్ఫూర్తిని మదిలో నింపుకొని పురోగమిద్దాం. అమరుల ఆశయ సాధనకై అంకిత భావంతో ఉద్యమిద్దాం. అమరుల ఆశయాలను పూరిద్దాం.

**కేంద్రకమిటీ,**

**సి.పి.ఐ. (మావోయిస్టు)**

వార్షికోత్సవం

# ఆధునిక రివిజనిజానికి, పెట్టుబడిదారీ పునరుద్ధరణకు వ్యతిరేకంగా నడిచిన గొప్ప శ్రామికవర్గ సాంస్కృతిక విప్లవంకు ఏబై ఏళ్ళు

ప్రపంచ సోషలిస్టు విప్లవంలో గొప్ప శ్రామికవర్గ సాంస్కృతిక విప్లవం (జి.పి.సి.ఆర్.) ఒక శాస్త్రీయ పోరాట సాధనం. చైనా విప్లవంలో ప్రయోగాత్మకంగా రాటుదేలిన ఆయుధం. ఇది ప్రజా బాహుళ్యంలోకి వెళ్లే ఒక నూతన పోరాట రూపం. మార్క్సిస్టు సిద్ధాంత ఆచరణలలో ఒక గొప్ప గెంతు. ఇది ప్రపంచ కార్మికవర్గానికి సోషలిజాన్ని నిర్మించే మార్గాన్ని, పెట్టుబడిదారీ విధానం పునరుద్ధరణను నివారించే మార్గాన్ని నిర్దేశించింది. గొప్ప శ్రామికవర్గ సాంస్కృతిక విప్లవం, అంతర్జాతీయ కార్మిక వర్గపు ఆయుధాగారానికి ఎం.ఎల్.ఎం. సమకూర్చిన అత్యంత ముఖ్యమైన చేర్పులలో ఒకటి. మార్క్సిస్టు ఎవరు అనడానికి లెనిన్ ఇచ్చిన నిర్వచనాన్ని సవరించవలసిన సమయం నేడు ఆసన్నమైంది.



"వర్గ పోరాటాన్ని, కార్మికవర్గ నియంతృత్వాన్నీ మాత్రమే గుర్తించేవాళ్ళు ఇంకా మార్క్సిస్టులు కారు. వర్గ పోరాటం, కార్మికవర్గ నియంతృత్వాలను గుర్తించడాన్ని, ప్రపంచ విప్లవాన్ని పరిపూర్తి చేసి సాధ్యమైనంత త్వరగా కమ్యూనిస్టు సమాజాన్ని నిర్మించడమన్న లక్ష్యాన్ని దృష్టిలో ఉంచుకుని ఉపరితలంలో నిరంతరం విప్లవాన్ని సాగించడాన్ని గుర్తించేవరకూ విస్తరించేవారు మాత్రమే మార్క్సిస్టులు" -(సి.పి.ఐ.(ఎం.ఎల్.) పీపుల్స్‌వార్ సి.సి. తీర్మానం, ఆధునిక రివిజనిస్టు డెంగ్ ముఠాకు వ్యతిరేకంగా పోరాడండి)

"సాంస్కృతిక విప్లవం కార్మికవర్గ నియంతృత్వ పరిస్థితుల్లో జరిగే ఒక మహోత్తర రాజకీయ విప్లవం, ఉపరితల రంగంలో జరిగే ఒక మహోత్తర విప్లవం" అని సి.పి.సి. 9వ కాంగ్రెస్ రాజకీయ నివేదిక పేర్కొన్నది.

ఆర్థిక రంగంలో (ఉత్పత్తి సాధనాల యాజమాన్యంలో) సోషలిస్టు విప్లవం దానికదే సరిపోదు. సంఘటితపడదు. రాజకీయ, భావజాల రంగాల్లో లోతుగా విప్లవం జరిగితీరాలి. పెట్టుబడిదారీ పునరుద్ధరణ నివారించాలన్నా, సోషలిస్టు నిర్మాణం పురోగమించాలన్నా, అలాగే కమ్యూనిజంలోకి పరివర్తన చెందాలన్నా సోషలిస్టు విప్లవ దశలో కార్మికవర్గ నియంతృత్వాన్ని కొనసాగించడం ద్వారా సోషలిస్టు విప్లవాన్ని చివరికంటా నడపాలి. ప్రజాపంథాకు అనుగుణంగా ప్రజా బాహుళ్యాన్ని చైతన్య పరిచి ధైర్య సాహసాలతో పెద్దఎత్తున ప్రజా ఉద్యమం చేపట్టాలి. జనాభాలో 95శాతం ఉండే ప్రజారాశులతో ఐక్యం కావాలి. లెనినిస్టు దృక్కోణం నుండి చూస్తే ఒక దేశంలో సోషలిస్టు విప్లవం అంతిమ విజయం ఆ దేశంలోని కార్మికవర్గం, విశాల ప్రజా రాశులు మాత్రమే సాధించలేరు. ప్రపంచ విప్లవ విజయం, మానవజాతి విముక్తిలపై అది ఆధారపడి ఉంటుంది.

సోవియట్ రష్యాలో పార్టీ 20వ కాంగ్రెస్ (1956) నాటికి స్పష్టంగా కృశ్చేవ్ ఆధునిక రివిజనిస్టు విధానాలను ప్రారంభించాడు. మొట్ట మొదటి సోషలిస్టు దేశం రష్యాలో పెట్టుబడిదారీ విధానాన్ని పునరుద్ధరించే శాంతియుత పరివర్తన, శాంతియుత సహజీవనం, శాంతియుత పోటీలను ప్రవేశపెట్టాడు. మావో నాయకత్వంలో చైనా కమ్యూనిస్టు పార్టీ 1956 నుంచి 1966 వరకు ఒక దశాబ్ద కాలం ఆధునిక రివిజనిస్టు కృశ్చేవ్ ముఠాకు వ్యతిరేకంగా గ్రేట్ డిబేట్ నిర్వహించింది. ఈ గ్రేట్ డిబేట్ సూత్రబద్ధంగా, సమగ్రంగా జరిగింది. ఇది మార్క్సిజం - లెనినిజం మీద ఆధారపడిన శాస్త్రీయమైన అభివృద్ధి. మార్క్సిజం - రివిజనిజం ల మధ్య జరిగిన సైద్ధాంతిక పోరాటం అంతర్జాతీయ కమ్యూనిస్టు ఉద్యమంకు సాధారణ విప్లవ పంథాను దృఢపరిచింది.

**సాంస్కృతిక విప్లవ నేపథ్యం**

చైనా కమ్యూనిస్టు పార్టీ ప్రారంభమైన 1921 నుండి నూతన ప్రజాస్వామిక విప్లవం విజయవంతమైన 1949 వరకు పార్టీలో ఆరు సార్లు రెండు పంథాల మధ్య పోరాటం జరిగింది. విప్లవం విజయవంతమయిన తర్వాత కూడ రెండు పంథాల మధ్య పోరాటం జరిగింది.

1956 నాటికి వ్యవసాయంలోనూ, చేతి వృత్తుల్లోనూ పెట్టుబడిదారీ పరిశ్రమల్లోనూ, వర్తకంలోనూ ఉత్పత్తి సాధనాలపై వ్యక్తి యాజమాన్యం మౌలికంగా రద్దయింది. నూతన ప్రజాస్వామిక విప్లవం సోషలిస్టు విప్లవంగా పరివర్తన చెందింది. ఈ విజయాల్ని 8వ కాంగ్రెస్ ఎత్తిపట్టింది. అయితే ఈ దశలోనే రష్యాలో ఆధునిక రివిజనిజం తలెత్తిన కాలంలోనే చైనా కమ్యూనిస్టు పార్టీ, ప్రధాన కార్యదర్శి లీషావ్-చీ రివిజనిస్టు అవగాహన పార్టీ 8వ కాంగ్రెస్‌లో ఆధిపత్యం వహించింది. ప్రధాన వైరుధ్యాన్ని సోషలిస్టు సామాజిక వ్యవస్థకు, సమాజంలో వెనుకబడిన ఉత్పత్తి శక్తులకు మధ్య ఉన్న వైరుధ్యమే అని వ్యాఖ్యానించాడు. ఇదే "ఉత్పత్తి శక్తుల సిద్ధాంతం". 8వ కాంగ్రెస్ తర్వాత లీషావ్-చీ తనకు అనుకూలమైన బూర్జువా ప్రతినిధులను క్రింది నుండి పై వరకు పార్టీ నిర్మాణంలోనూ, ప్రభుత్వ

యంత్రాంగంలోనూ కీలక స్థానాల్లో ప్రవేశపెట్టి తన ఆధిపత్యాన్ని కుట్ర పూరితంగా నెలకొల్పుకున్నాడు.

1956లో "నూరు పూలు వికసించనివ్వండి–నూరు ఆలోచనలు పోటీ పడనివ్వండి" ఉద్యమాన్ని లీషావ్–చీ ముఠా కుట్ర పూరితంగా నిలిపివేసింది. 1957లో "ప్రజల మధ్య వైరుధ్యాలను సరిగ్గా పరిష్కరించడం" అని కా. మావో గొప్ప రచన చేశాడు. 'సుగంధ పుష్పాలను విష పూరిత కలుపు మొక్కల' నుండి వేరు చేయడానికి ప్రజలకు తోడ్పడే విధానాన్ని వివరించాడు. 1957లోనే 'స్వావలంబన' సూత్రం ఆధారంగా గ్రేట్ లీఫ్ ఫార్వర్డ్–గొప్ప ముందడుగు– అనే గొప్ప ఉద్యమం నడిచింది. 1957 లోనే బూర్జువా మితవాదులకు వ్యతిరేకంగా పోరాటం నడిచింది. 1959లో పెంగ్ టీ హూయే ముఠా పార్టీ వ్యతిరేక ముఠాగా బహిర్గతమైంది.

1962లో సోషలిస్టు విద్యా ఉద్యమం ప్రారంభమయ్యింది. వర్గ పోరాట ప్రాధాన్యత, నాలుగు పరిశుభ్రతలు, పార్టీ నాయకత్వం, కేడర్ ఉత్పత్తిలో పాల్గొనడం వంటి 10 అంశాలు కార్యక్రమం చేపట్టారు. 1962లోనే 8వ కాంగ్రెస్ 10వ ప్లీనంలో కా. మావో పార్టీలో సమైక్యతను సాధించే కృషిలో భాగంగా 'మౌలికపంథా' భావనను పూర్తిగా అభివృద్ధి చేసాడు. 1967 నవంబర్ వరకు మౌలిక పంథాను సోషలిస్టు సమాజంలో వైరుధ్యాల, వర్గాల, వర్గ పోరాటాల సిద్ధాంతంగానూ, కార్మికవర్గ నియంతృత్వం క్రింద విప్లవాన్ని నడపడంగానూ వివరించారు. ఆ తర్వాత కార్మికవర్గ నియంతృత్వం క్రింద నిరంతరాయ విప్లవ సిద్ధాంతం అనేది వాడుకలోకి వచ్చింది. కా. మావో సోషలిస్టు మౌలిక పంథాను ఆ కాలానికి అంతటికి ఉపయోగపడేలా రూపొందించాడు. (1976 వరకు ఇదే పంథా అమలు జరిగింది) ఆ పంథా "ఉత్పత్తి శక్తులలో, ఉత్పత్తి సంబంధాలలో అభివృద్ధి కోసం ఉపరితలాన్ని మార్చడం, వాటి అభివృద్ధి పునాదిగా ఉపరితలాన్ని విప్లవీకరించడం" ద్వారా మార్క్సిస్టు సూత్రాలకు, సోషలిజంలో వర్గ పోరాట నియమాలకు కట్టుబడి ఈ రకంగా సమాజం నిరంతరాయ వరుస విప్లవాల ద్వారా పురోగమిస్తుంది.

పార్టీలో దాగి ఉన్న పెట్టుబడిదారీ మార్గీయులపై దాడిని ఎక్కుపెడుతూ కా. మావో 1964లో వ్యవసాయ రంగంలో తాచై నుండి, పారిశ్రామిక రంగంలో తాచింగ్ నుండి నేర్చుకోండి అని పిలుపునిచ్చాడు. చైనా కమ్యూనిస్టు పార్టీ విద్యా ఉద్యమాన్ని సమీక్షించి, సమస్యల పరిష్కారానికి 23 పాయింట్ల డాక్యుమెంటును రూపొందించింది. దీనితో 1964 నుండి పార్టీలో దాగి ఉన్న పెట్టుబడిదారీ మార్గీయులపై ప్రజా ఉద్యమం ప్రారంభమయ్యింది.

**కార్మికవర్గ సోషలిస్టు విద్య లక్ష్యం**

విద్య నేర్చుకున్న ప్రతివ్యక్తి నైతికంగా, మేధోపరంగా, భౌతికంగా అభివృద్ధి చెందడం వలన సోషలిస్టు చైతన్యంతో, సంస్కృతితో కూడిన కార్మికులు నిజంగా ప్రజలకు సేవ చేయడానికి సిద్ధపడతారు. ఇది ఒక కేంద్ర సమస్య. విప్లవ భవిష్యత్ విప్లవ వారసులతో ముడిపడి ఉంది. యువతరం విప్లవాన్ని తన చేతుల్లోకి తీసుకోవాలి. చదువును, పనిని, పరిశోధనను, ఉత్పత్తిని సమన్వయపరిచే కొత్త పద్ధతులు రూపొందించాలి. అలాంటి విద్యా విధానమే "కమ్యూనిస్టు, నిపుణుడు" అయిన కార్యకర్తలను తయారు చేయగల్గుతుంది. సాంస్కృతిక విప్లవ కాలంలో కార్మిక, కర్షక, సైనిక కాలేజి విద్యార్థులు చైనాలో మున్నెన్నడూ లేని విధంగా అత్యుత్తమ కాలేజి విద్యార్థులుగా గుర్తింపు తెచ్చుకున్నారు.

**రివిజనిజానికి పునాదిగా చైనా సమాజంలో కొనసాగుతున్న పరిస్థితులు**

చైనాలో భూస్వాములు, నిరంకుశ పెట్టుబడిదారుల వ్యక్తిగత ఆస్తిని నూతన ప్రజాస్వామిక విప్లవం స్వాధీనం చేసుకున్నది. 1956 నాటికి చైనా మౌలికంగా సోషలిస్టు యాజమాన్య వ్యవస్థగా రూపొందినది. అయినప్పటికీ చైనా ప్రజలను భావజాల పరంగా మలచడానికి ఇంకా చాల కాలం పడుతుంది. a. అధికారం కోల్పోయిన వర్గాల్లో కొందరు మాజీ భూస్వాములు భూసంస్కరణల ఉద్యమ కాలంలో తప్పించుకొని సమిష్టి క్షేత్రాలలో నాయకత్వ స్థానాల్లో ఉన్నారు. b. సామ్రాజ్యవాద వ్యతిరేక, భూస్వామ్య వ్యతిరేక పోరాటంలో కలిసివచ్చి విప్లవ పక్షాన నిలిచిన వారిలో కార్మికవర్గేతర ప్రాపంచిక దృక్పథం వీడని వాళ్ళున్నారు. వారు సోషలిస్టు దశకు పరివర్తన చెందడాన్ని ప్రతిఘటిస్తూ రివిజనిస్టు పంథాను అనుసరిస్తున్నారు. c. మధ్య తరహా బూర్జువా వర్గం, గ్రామీణ ధనిక రైతాంగంకు చెందినవారి భావజాలం, ఆర్థిక, రాజకీయ, సాంస్కృతిక ప్రభావం ఉంది. d.మధ్య తరగతి రైతులు, పట్టణ పెటీ బూర్జువా వర్గాలలో కొనసాగుతున్న సంకుచిత వర్గ దృష్టి నుండి పూర్తిగా బయటపడలేదు. e. కార్మికులు, పేద రైతాంగంలో మార్క్సిజం గురించి సాపేక్షికంగా తక్కువ అవగాహన ఉన్న కారణంగా రివిజనిస్టుల కుట్రలకు ప్రభావితులవుతున్నారు. f. వేలాది సంవత్సరాల నుండి చైనా ప్రజల ఆలోచనలలో, ఆచరణలో ఆధిపత్యంలో ఉన్న దోపిడీ వర్గాల భావజాల ప్రభావం ఉంది. ప్రజల్లో ఉన్న వెనుకబడిన భావజాలాన్ని రివిజనిస్టులు తరచు వినియోగించుకుంటున్నారు. g. ఉత్పత్తి సాధనాల యాజమాన్యం పరివర్తన చెందే క్రమం అనేక దశలుగా ఉంటుంది. సాపేక్షికంగా సుదీర్ఘకాలం పడుతుంది. ఈ కాలమంతటా యావత్తు ప్రజల ప్రయోజనాలకు భిన్నంగా వ్యక్తి ప్రయోజనాలు; పాక్షిక సంకుచిత, స్వార్థ ప్రయోజనాలు ముందుకొచ్చి రివిజనిజానికి పునాదిగా కొనసాగుతున్నాయి.

వర్గాలు, వర్గ వైరుధ్యాలు, వర్గ పోరాటం కొనసాగుతున్నంత వరకు బూర్జువా, కార్మికవర్గాల మధ్య గెలుపు పరిష్కారం కానంతవరకు, ప్రపంచంలో పెట్టుబడిదారీ వ్యవస్థ ఆధిపత్య వ్యవస్థగా ఉన్నంతవరకు, రివిజనిస్టు పంథాలు పొడచూపే విధానం

ఉన్నంత వరకు అలాగే మావో ఆలోచన ముసుగులో బూర్జువా ప్రతినిధులు దాగున్నంత వరకు సోషలిస్టు సమాజంలో పెట్టుబడిదారీ విధాన పునరుద్ధరణకు అవకాశాలు ఉంటాయి. అది కమ్యూనిస్టు పార్టీలోకి చొరబడి మితవాద, అతివాద అవకాశ వాద రూపాల్లో రివిజనిజంగా దాని ప్రభావాన్ని చూపిస్తుంది.

**చైనాలో గొప్ప శ్రామికవర్గ సాంస్కృతిక విప్లవం అమలు జరిగిన విధానం**

1965 నవంబర్‌లో యావో వెన్ యువాన్ ఒక నాటకం (హాయ్ జుయిని ఆఫీసు నుండి తొలగించారు) గురించి రాసాడు. పెకింగ్ డిప్యూటీ మేయర్ వూ-హాన్ ను విమర్శిస్తూ రాసిన ఆ వ్యాసంతో చర్చ ప్రారంభమైంది. మావో ఆ నాటకాన్ని విమర్శించడం, ప్రజాభిప్రాయం సమీకరించడం, శక్తులను పెంపొందించడం జరిగింది. అలా రివిజనిస్టు నాయకులను విమర్శిస్తూ అనేక వ్యాసాలు వచ్చాయి. అప్పుడు పెట్టుబడిదారీ మార్గీయులను తొలగించి సాంస్కృతిక విప్లవ బృందాన్ని పునర్నిర్మించారు. 1966 మే 16న సాంస్కృతిక విప్లవం సర్క్యులర్ వెలువడింది. పెకింగ్ విశ్వవిద్యాలయంలో మొదటి సోషలిస్టు పెద్ద అక్షరాల పోస్టర్‌ను మావో సమర్థించాడు. ఆగస్టు 8న మావో స్వంత అక్షరాలతో "అధికార కేంద్రాన్ని బద్దలు కొట్టండి" పోస్టరును విడుదల చేశాడు. దేశవ్యాపిత ప్రచారం జరిగింది. అన్ని విశ్వవిద్యాలయాలు, పాఠశాలల నుండి మూడు నెలల్లోనే రెండు కోట్ల మంది విద్యార్థులు ఉప్పెనలా కదిలి వచ్చి రెడ్ గార్డ్స్ డిటాచ్‌మెంట్లలో సమీకృతులయ్యారు. దేశవ్యాపితంగా సాంస్కృతిక విప్లవం విస్తరించింది. సాంస్కృతిక విప్లవం మొదలయ్యే నాటికి అంటే 1966 మధ్య కాలానికి పెట్టుబడిదారీ మార్గీయుల ప్రభావం బలంగా ఉంది. సి.సి.లోని 7గురితో ఉన్న స్టాండింగ్ కమిటీలో కా. మావోతో పాటు చౌ-ఎన్-లై, లిన్‌పియావో ముగ్గురే (మైనారిటీ) కార్మికవర్గ విప్లవ పంథా వైపు నిలిచారు. విముక్తికి పూర్వం చైనా కమ్యూనిస్టు పార్టీలో అంతర్గత పోరాటాలు, రెండు పంథాల మధ్య పోరాటాలు ఆరు జరిగినా, విముక్తి తర్వాత కావో-కాంగ్, పెంగ్ టీ-హువాయ్ పంథాలకు వ్యతిరేకంగా మరో రెండు జరిగినా అవన్నీ కూడ అంతర్గతంగా పరిష్కారమయ్యాయి. కాని ఇప్పుడు రివిజనిస్టులు ఎంతో శక్తివంతంగా తయారు కావడంతో పాత పోరాట పద్ధతుల ద్వారా ఓడించడం సాధ్యం కాదు.

కామ్రేడ్ మావో మార్గదర్శకత్వాన విప్లవ కేంద్ర నాయకత్వం విశాల ప్రజానీకం మీద విశ్వాసం ఉంచి వర్గపంథా- ప్రజా పంథాను అమలు చేస్తూ పెద్ద సంఖ్యలో ప్రజలను సమీకరించడం ద్వారానే బూర్జువా వర్గం హెడ్ క్వార్టర్‌పై దాడిని ప్రారంభించింది. కా. మావో స్వయంగా 'బూర్జువా హెడ్ క్వార్టర్‌ను బద్దలు కొట్టండి' అని పిలుపిచ్చాడు. సోషలిస్టు విప్లవం పురోగమించింది. అలా ప్రారంభమైన సాంస్కృతిక విప్లవంలో ప్రజలు ముందుగా విద్యార్థులు, మేధావులు, తర్వాత కార్మికులు, రైతులు స్పందించారు. శత్రువు బలమైన కేంద్రాలను తుఫానులా చుట్టు ముట్టారు. ప్రజల సృజనాత్మకత, శక్తి, మిలిటెన్సీ, చొరవ సంపూర్ణంగా బయటకు వచ్చాయి.

**సాంస్కృతిక విప్లవం లక్ష్యం ప్రజల ప్రాపంచిక దృక్పథాన్ని తీర్చి దిద్దడం**

సాంస్కృతిక విప్లవ క్రమంలో క్రింది నుండి అధికారం స్వాధీనం చేసుకున్నారు. అధికారంలో ఉన్న బూర్జువా ప్రతినిధులనూ, బూర్జువా రివిజనిస్టు దృక్పథాన్ని ప్రశ్నించే, విమర్శించే, కులదోసే క్రమంలో పార్టీ నాయకులు, కేడర్, ప్రజలు తమను తాము పరిశీలించుకున్నారు. స్వయం విమర్శ చేసుకున్నారు. తమ ప్రాపంచిక దృక్పథాన్ని తీర్చి దిద్దుకున్నారు. ప్రధాన లక్ష్యాన్ని సాధించారు. అధికారంలో ఉండి పెట్టుబడిదారీ మార్గాన్ని అనుసరిస్తున్న వారికి వ్యతిరేకంగా పోరాడడం ద్వారా తమ కర్తవ్యాన్ని నిర్వహించారు. పార్టీలో లోతుగా పాతుకుపోయిన రివిజనిజానికి వ్యతిరేకంగా రాజీలేని పోరాటం నడిపారు.

చైనా కమ్యూనిస్టు పార్టీ 8వ కాంగ్రెస్ 11వ ప్లీనరీ సమావేశం నిర్ణయం మేరకు 1966లో ఆగస్టు 8న సాంస్కృతిక విప్లవంకు సంబంధించిన కార్యక్రమాన్ని వివరిస్తూ కేంద్రకమిటీ విడుదల చేసిన ముఖ్యమైన డాక్యుమెంటులోని 16 అంశాలు ఈ విధంగా వున్నాయి.

1. సోషలిస్టు విప్లవంలో ఒక నూతన దశగా సాంస్కృతిక విప్లవం కొనసాగాలని చెప్పింది. 2. ఇది తక్షణం ముఖ్యమైన కర్తవ్యం అని ఈ మార్గం జిగ్ జాగ్‌గా ఉంటుందని వివరించింది. 3. అన్ని పోరాటాలలో సాహసాన్ని నింపి జన సమూహాల్ని ఉత్తేజ పరచాలని చెప్పింది. 4. ఉద్యమంలో ప్రజలు వారంతట వారే విద్యావంతుల అయ్యేలా చేయాలని నిర్దేశించింది. 5. పార్టీ యొక్క వర్గ పంథాను ఖచ్చితంగా అమలు చేయాలని కోరింది. 6. ప్రజల మధ్య వైరుధ్యాలతో సరిగా వ్యవహరించాలని హెచ్చరించింది. 7. విప్లవకారులను ప్రతీఘాతుక విప్లవ కారులుగా ముద్ర వేసే వారి నుండి రక్షణ కల్పించాల్సిన అవసరాన్ని నొక్కి చెప్పింది. 8. కేడర్లను 4 రకాలుగా విభజించి-a.మంచివాళ్లు, b. సాపేక్షికంగా మంచివాళ్ళు. c. తప్పులు చేసినప్పటికీ పార్టీకి వ్యతిరేకం కానివారు. d. పార్టీ వ్యతిరేకులు. నాలుగు రకాలలో పార్టీ వ్యతిరేకుల్ని గట్టిగా దెబ్బ గొట్టాలని వారి ప్రభావాన్ని తొలగించాలని చెప్పింది. 9. విప్లవ సాంస్కృతిక బృందాలు, కమిటీలు, కాంగ్రెస్‌లను నిర్మించడం, వాటి నాయకత్వాన్ని ప్రజల మధ్య చర్చించి రీ కాల్ చేసే హక్కుతో ఎన్నిక చేయడం, దీర్ఘ కాలిక పోరాట స్వభావంతో వాటిని నిర్వహించడం గురించి చెప్పింది. 10. శ్రామికవర్గ రాజకీయాలకు సేవ చేసేలా విద్యా సంస్కరణలను అమలు చేయాలని కోరింది. 11. విమర్శించే సందర్భంలో పేరు ప్రకటించేందుకు అనుమతి కోరడం అవసరం అన్నది. 12. శాస్త్రవేత్తలు, సాంకేతిక నిపుణులు, సాధారణ శ్రామిక సమూహాల పట్ల ప్రత్యేక శ్రద్ధతో వారి ప్రాపంచిక దృక్పథాన్ని, పని పద్ధతులు మార్చాలి అని చెప్పింది. 13. పట్టణ,

గ్రామీణ ప్రాంతాల సోషలిస్టు విద్యా ఉద్యమాన్ని సాంస్కృతిక విప్లవంతో సమన్వయించి ఉన్నతస్థాయి అభివృద్ధిని సాధించాలన్నది. 14. విప్లవాన్ని దృఢంగా కొనసాగించడం ద్వారా ఉత్పత్తిని వేగవంతం చేయగలమన్నది. 15. సాయుధ శక్తులలో సాంస్కృతిక విప్లవాన్ని, సోషలిస్టు విద్యా ఉద్యమాన్ని మిలిటరీ కమీషన్, పి.ఎల్.ఎ. రాజకీయ విభాగాల సూచనలతో నిర్వహించాలన్నది. 16. గొప్ప శ్రామికవర్గ సాంస్కృతిక విప్లవంలో మావో ఆలోచన విధానాన్ని ఆచరణకు మార్గదర్శకంగా తీసుకోవడం గురించి వివరించింది.

1966లో పెకింగ్ నగరం సాంస్కృతిక విప్లవానికి కేంద్రం అయ్యింది. లక్షలాది మంది విద్యార్థులు, రెడ్‌గార్డ్స్ ప్రజా వెల్లువకు నాయకత్వం వహించారు. కొద్ది నెలల తర్వాత ప్రధాన కేంద్రం కార్మిక నగరం షాంఘైకు మారింది. 1967 జనవరి తుఫాన్‌గా ప్రసిద్ధి చెందిన షాంఘై అధికారాన్ని స్వాధీనపరచుకోవడంలో మూడు శక్తులు-విప్లవ నాయకత్వ కేడర్లు, ప్రజా విముక్తి సైన్య ప్రతినిధులు, విప్లవ ప్రజానీకపు ప్రతినిధులు-కలిసి విప్లవ కమిటీలు ఏర్పరిచారు. విప్లవాన్ని సాగిస్తూనే ఉత్పత్తిని పెంచారు. స్వార్థానికి వ్యతిరేకంగా పోరాడుతూ రివిజనిజాన్ని తుడిచిపెట్టారు. కార్మికవర్గ ప్రాపంచిక దృక్పథాన్ని నేర్చుకున్నారు. 1967 చివరి నాటికి షాంఘైలో విప్లవ ప్రతిఘాతకుల్ని ఓడించి 90 శాతం అధికారాన్ని స్వాధీనం చేసుకున్నారు. దేశంలోని చాలా ప్రాంతాలలో ఇదే పరిస్థితి కొనసాగింది. అధిక భాగంలో పెట్టుబడిదారీ మార్గీయుల నుండి అధికారాన్ని స్వాధీనం చేసుకున్నారు. 1969 ఏప్రిల్‌లో జరిగిన పార్టీ 9వ కాంగ్రెస్‌లో సాంస్కృతిక విప్లవం మొదటి దశ విజయవంతమయినట్లు ప్రకటించారు. లీషావ్-చీని రహస్య ద్రోహిగా, రెనెగ్రేడ్‌గా, విచ్ఛిన్న కారుడుగా గుర్తించి అన్ని పదవుల నుండి తొలగించారు.

సాంస్కృతిక విప్లవ ప్రధాన లక్ష్యానికున్న చారిత్రక ప్రాధాన్యతకనుగుణంగా మహోద్యమం కొనసాగుతన్న క్రమంలో అందులో కొన్ని నెగెటివ్ ధోరణులు అభివృద్ధి చెందాయి. మొదటిది అరాచకవాదులు సృష్టించిన మురాతత్వం. ఉదాహరణకు వాళ్ళు కుట్రతో నడిపిన “మే 16” గ్రూపు. రెండవది అతివాదులు జరిపిన విధ్వంసం. 9వ సిసి 2వ ప్లీనం (1970 సెప్టెంబర్)లో అతివాదుల రహస్య పథకాలు బహిర్గతమయ్యాయి. అప్పుడు కా. మావో “ఎర్రజెండాకు వ్యతిరేకంగా ఎర్రజెండాను ఊపడం” అనే ప్రకటనను జారీ చేసాడు. అతివాద వాగాడంబరానికి వ్యతిరేకంగా, మావో వ్యక్తి పూజకు వ్యతిరేకంగా ఒక క్యాంపెయిన్‌ను నిర్వహించారు. అప్పుడు లిన్‌పి-యావోకు వ్యతిరేకంగా పోరాటం మొదలయ్యింది. లిన్‌పి-యావో నిలిపి వేసిన ప్రజా మిలీషియాకు తిరిగి ట్రైనింగ్ ప్రారంభమైంది. చైనా నాయకత్వాన్ని చేజిక్కించుకునే అవకాశాలు ఇక లేక పోవడంతో మావో హత్యకు, సైనిక తిరుగుబాటుకు లిన్‌పియావో పథకం రూపొందించాడు. అది బహిర్గతం కావడంతో పారిపోతూ మార్గం మధ్యలో విమానం కూలి చనిపోయాడు. 1973 ఆగస్టులో 10వ కాంగ్రెస్ బూర్జువా కేరీరిస్టు, విశ్వాస ఘాతకుడైన లిన్‌పియావో కుట్రను సమీక్షించింది. లిన్‌పి-యావో ను విమర్శించి, పని శైలిని చక్కదిద్దుకునే ఉద్యమాన్ని చేపట్టింది.

చైనాలో వ్యవసాయం, పారిశ్రామిక రంగంలో “విప్లవాన్ని అర్థం చేసుకోండి-ఉత్పత్తిని పెంపొందించండి” అన్న పంథాను అనుసరించి ప్రజల మౌలిక అవసరాలను తీర్చింది. ప్రజా కమ్యూన్స్‌లోని పరిశ్రమల్లో కార్మికులు, సాంకేతిక నిపుణులు, మేనేజర్లు (త్రీ ఇన్ వన్) కలయికతో కూడిన నిర్మాణాలను ఏర్పరచి సమన్వయంతో నిర్వహించింది. పార్టీ, సైన్యం, ప్రభుత్వ నిర్మాణాల్లో ‘త్రీ ఇన్ వన్’ సూత్రానికనుగుణంగా వృద్ధ, మధ్య, యవ్వన వయస్సు వారి కలయికను ప్రోత్సహించింది. సైనిక రంగంలో స్వావలంబన ను సాధించింది. ప్రజలు, సైన్యం, పార్టీ ప్రతినిధుల మధ్య సమన్వయాన్ని సాధించి ఒకటిలో మూడు సూత్రం ప్రాతిపదికన విప్లవ కమిటీలను నిర్మాణం చేసింది.

సాంస్కృతిక విప్లవం ప్రభావంతో వ్యవసాయం, పరిశ్రమలు, విద్యా రంగంలో జరుగుతున్న విప్లవాత్మక పరిణామాలు, నూతన సోషలిస్టు పంథా కోసం జరుగుతున్న పోరాటాలు, ప్రజల జీవన రంగానికి చెందిన సంస్కృతి, సైనిక వ్యవహారాలు, విదేశాంగ వ్యవహారాలు, పురోగామి శాస్త్రీయ పరిశోధన, కళలు, సంగీతం, సాహిత్యం లలో జరుగుతున్న పురోగామి అభివృద్ధి గణనీయమైనవి.

**1966 నుండి 1976 వరకు జరిగిన సాంస్కృతిక విప్లవ విజయాలు:**

1966 - 76ల మధ్య కార్మికవర్గ నియంతృత్వాన్ని సంఘటితపరిచి లీషావ్-చీ, లిన్‌పి-యావో, డెంగ్ సియావో-పెంగ్‌ల అధికారాన్ని ధ్వంసం చేసింది. పెట్టుబడిదారీ పునరుద్ధరణను నివారించి, చైనా సోషలిస్టు విప్లవం పురోగమించింది. 2.వర్గపోరాట నియమాలను అభివృద్ధి చేసి భావజాల రంగంలో మార్క్సిజం లెనినిజం మావో ఆలోచన విధానాన్ని ఉన్నత స్థాయికి తీసుకు వెళ్లింది. 3.ఆర్థిక పునాది, ఉపరితల రంగాలలో నిరంతరాయ విప్లవాలు తప్పనిసరి అవసరాన్ని స్పష్టపరిచింది. 4.బూర్జువా సిద్ధాంత వ్యక్తీకరణ అయిన రివిజనిజం మార్క్సిజానికి, విప్లవానికి ప్రమాదకరమని చెప్పి రివిజనిజానికి వ్యతిరేకంగా నిరంతర సిద్ధాంత పోరాటం జరగాలని గుర్తింపజేసింది. 5.సోషలిస్టు సమాజ పరివర్తనా కాలమంతటా కార్మికవర్గం వర్గ పోరాటాన్ని, సంపూర్ణ కార్మికవర్గ నియంతృత్వాన్ని అమలు చేయాలని, విప్లవ శక్తుల్ని ఐక్యం చేసి దేశ, విదేశీ ప్రతీఘాతుక శక్తుల పట్ల అప్రమత్తంగా ఉండాలని చెప్పింది. 6. విశాల ప్రజారాశులను ఐక్య పరిచేందుకు వర్గపంథా-ప్రజాపంథాల అవసరాన్ని నొక్కి చెప్పింది. 7. ప్రజల్ని 95 శాతం ఐక్య పరిచి 5 శాతంగా ఉన్న విప్లవ ప్రతీఘాతక శక్తులను ఒంటరిని చేయాల్సిన అవసరాన్ని చెప్పింది. 8.ఒకటి రెండవుతుందన్న సిద్ధాంతాన్ని, వర్గ పోరాట అవసరాన్ని, రాజకీయాలను ఆధిపత్యంలో ఉంచాల్సిన

అవసరాన్ని నొక్కి చెప్పింది. 9."మార్క్సిజాన్ని ఆచరించండి, రివిజనిజాన్ని కాదు; ఐక్యంకండి, చీలిపోవద్దు; విశాలంగా సూటిగా ఉండండి, కుట్రలు కుహకాలకు పాల్పడవద్దు." అంటూ చేయవలసిన మూడు, చేయకూడని మూడు సూత్రాలను చెప్పింది. స్వార్థానికి వ్యతిరేకంగా పోరాడండి, రివిజనిజాన్ని తిప్పికొట్టండి అని బలంగా చెప్పింది. 10.సాంస్కృతిక రంగంలో కళా, సాహిత్య విషయాల్లోనూ, విద్యారంగంలోనూ, వైద్య రంగంలోనూ విప్లవాత్మక మార్పులను తెచ్చి నూతన నమూనాలను ఆవిష్కరించింది. ప్రజలకు సేవ చేసే దృక్పథాన్ని పెంపొందించింది. ప్రజల ప్రయోజనాన్ని సామాజిక వికాసానికి సమన్వయించి నడిపింది.

సోషలిస్టు చైనాలో మహిళలు ఉత్పత్తిలో, రాజకీయాల్లో, వర్గ పోరాటంలో, సహచరుల ఎన్నికలో, వర్గ పోరాటంలో పురుషులతో కలిసి పోరాడారు. స్వతంత్రతను సాధించుకున్నారు. కమ్యూన్ జీవితాన్ని కోరుకున్నారు. ఇంటి చాకిరి నుండి విముక్తి కోరుకున్నారు. వృద్ధులు పిల్లల బాధ్యతను సామాజిక బాధ్యతగా అనుసరించారు. సోషలిస్టు విప్లవం ప్రపంచ వ్యాపితంగా విప్లవకారులకు పితృస్వామ్యానికి వ్యతిరేక పోరాటాంలో నూతన అవగాహనను అందించింది.

వైద్య రంగంలో సృజనాత్మకతను అభివృద్ధి చేసి వికేంద్రీకరణ విధానంలో 15 లక్షల మంది బేర్‌ఫుట్ డాక్టర్ల ద్వారా అందరికి ఆరోగ్య సేవలు అందేలా చూసారు. విద్యా, వైజ్ఞానిక, సాంస్కృతిక విషయాల్లో సాధించిన ప్రగతికనుగుణంగా శాస్త్రీయదృష్టితో పాటు సాంప్రదాయక (ఆంక్యుపంచర్ లాంటి)వైద్య విధానాన్ని సమన్వయం చేసి అభివృద్ధి చేసారు. సమస్త సామాజిక రంగాల్లో అన్ని సెక్షన్ల ప్రజల్లో దశాబ్ద కాలం పాటు సాంస్కృతిక విప్లవ చైతన్యం తొణికిసలాడింది. పెట్టుబడిదారీ మార్గీయులకు వ్యతిరేకంగా నిరంతర పోరాటం నడిపారు.

అంతర్జాతీయంగా చూస్తే సాంస్కృతిక విప్లవం ప్రభావం అనేక విషయాలలో బలంగా వ్యక్తమయ్యింది. ప్రపంచంలోని కమ్యూనిస్టు పార్టీలలో రెండు పంథాల మధ్య పోరాటాన్ని తీవ్రతరం చేసింది. సోవియట్ రివిజనిస్టులను బలంగా ఎండగట్టింది. అనేక దేశాల్లో ఎం.ఎల్.ఎం. మార్గదర్శక సిద్ధాంతంగా విప్లవ పార్టీలు ఆవిర్భవించాయి. ప్రజాయుద్ధ నూతన వెల్లువను తెచ్చింది.

చైనా విప్లవంలో రివిజనిజాన్ని అనేక సార్లు ఓడించినప్పటికీ అది మరల మరల పుడుతుంది. సోషలిజం నిర్మాణమవుతున్న క్రమంలో లీషావ్-చీ తో జరిగిన రెండు పంథాల మధ్య పోరాటం (9 వది) చాలా ప్రాధాన్యత కలది. అలాగే లిన్‌పి-యావో కు వ్యతిరేకంగా జరిగిన పోరాటం (10 వది) చాల ముఖ్యమైనది. డెంగ్ పియావో పెంగ్ లాంటి వారిపై 1968లో చర్యలు తీసుకున్నా 1973లో మరల నాయకత్వ స్థానంలోకి రాగలిగాడు. పిల్లి నల్లదయినా తెల్లదయినా పరవాలేదన్నాడు. ఎలుకల్ని పడితే చాలన్నాడు. ఆ మాటల వెనుక డెంగ్ ఉద్దేశ్యం స్పష్టమే. ఉత్పత్తి ముఖ్యం. పెట్టుబడిదారీ విధానమయినా పరవాలేదు అంటున్నాడు. 1976లో ముందుగా సిన్హ్వా విశ్వవిద్యాలయంలో ప్రారంభమైన ప్రజా ఉద్యమం ఏప్రిల్ 5న పెకింగ్‌లోని తీన్‌మెన్ స్కేర్ వద్ద ప్రజా సమీక్షంలో డెంగ్‌ను విచారించి సాంస్కృతిక విప్లవం విధానాలను తిరిగి తోడుతున్నాడని నిరూపించింది. 1976 ఏప్రిల్ 8న పొలిట్ బ్యూరో సమావేశం నుండి డెంగ్-జి-యావో-పింగ్‌ను తొలగించింది. డెంగ్‌ను పార్టీ, ప్రభుత్వ పదవుల నుండి, అన్ని స్థాయిల నుండి బహిష్కరించారు. 1976 డెంగ్ వ్యతిరేక పోరాటం పార్టీలో రెండు పంథాల మధ్య జరిగే తీవ్ర వర్గ పోరాటమనీ, అది సోషలిస్టు దశ అంతటా జరుగుతుందని నొక్కి చెప్పారు.

సాంస్కృతిక విప్లవం పది సంవత్సరాల పాటు పెట్టుబడిదారీ పునరుద్దరణను అడ్డుకోగలిగింది. కానీ ఆ విజయాల్ని నిలబెట్టుకునే విధంగా సాంస్కృతిక విప్లవం కొనసాగలేదు. 1976 జులైలో జరిగిన 10వ కేంద్ర కమిటీ మూడవ ప్లీనం డెంగ్‌ను తిరిగి పదవుల్లోకి తెచ్చింది. 1976 సెప్టెంబర్‌లో కామ్రేడ్ మావో అమరుడయ్యాడు. కా. మావో తో పాటు సీనియర్ నాయకులు చూటే, కాంగ్-షెంగ్, టెంగ్-షీ-వూ, చౌ-ఎన్-లై లు కూడా 1976లో అమరులయ్యారు. రివిజనిస్టులు హువా-డెంగ్ ముఠా కుట్రతో మరల పార్టీ నాయకత్వాన్ని, ప్రభుత్వాధికారాన్ని తమ చేతుల్లోకి తీసుకున్నారు. 10 సంవత్సరాలు పాటు నడిచిన ఉద్యమాన్ని అణిచివేసారు. సాంస్కృతిక విప్లవానికి నాయకత్వం వహించిన వారిని అరెస్టు చేసి "గ్యాంగ్ ఆఫ్ ఫోర్" పేరుతో జైళ్లో పెట్టారు. క్రియాశీల కార్యకర్తలను హత్యలు చేసారు. పార్టీ విధానాన్ని, ప్రభుత్వ పాలసీలను తిరగదోడి తిరోగమన దిశకు దారి మళ్లించారు. వ్యక్తికి పట్టం గట్టి సమిష్టికి చరమగీతం పాడారు.

సాంస్కృతిక విప్లవ కాలంలో అన్ని రంగాలలోనూ, అన్ని స్థాయిలలోనూ ధైర్యంగా చేపట్టిన ప్రయోగాలు మంచి ఫలితాలనిచ్చాయి. చైనాకు సంబంధించి ఇది ఒక తీవ్రమైన రసాయనిక చర్య. లోతైన సృజనాత్మక కార్యాచరణ, ఆత్మ పరిశీలన, తీవ్ర పోరాటం జరిగింది. "స్వార్థాన్ని జయించండి, రివిజనిజాన్ని ఓడించండి." స్వార్థం నుండి బయట పడడం కేవలం వ్యక్తిగత కర్తవ్యం మాత్రమే కాదు. అది విప్లవ పట్ల మన కర్తవ్యం కూడా. మన స్వీయాత్మక ఆలోచనా ధోరణి స్వార్థపు ప్రయోజనం నుండి మొదలయితే మనం వాస్తవమైన వస్తుగత ప్రపంచాన్ని చూడలేం. సాంస్కృతిక విప్లవం సాధించిన ప్రగతిని అర్థం చేసుకోలేం.

ఓటమి తాత్కాలికం-అంతిమ విజయం ప్రజలదే. భారత నూతన ప్రజాస్వామిక విప్లవ పురోగమనంలోని మనం చరిత్ర నుండి గుణపాఠాలు నేర్చుకుందాం. సాంస్కృతిక విప్లవాన్ని అధ్యయనం చేద్దాం. పునాది, ఉపరితలాల్లో జరగాల్సిన విప్లవాన్ని కొనసాగిద్దాం.

○

# పాతికేళ్ల సామ్రాజ్యవాద ప్రపంచీకరణ ప్రజల బతుకుల్లో వెలుగులు నింపిందా? చీకట్లు పరిచిందా?

## భారత పాలకవర్గాల లొంగుబాటు విధానాలను బట్టబయలు చేయాలి

1980 దశకంలో కాంగ్రెస్ పార్టీ నాయకత్వంలో దేశంలో సరళీకరణ విధానాలు అమలు చేయడం ప్రారంభించింది. ఇది రాజీవ్‌గాంధీ పరిపాలనలో ఊపందుకొని, 1991లో పి.వి. నరసింహారావు ప్రధానమంత్రి అయిన వెంటనే సామ్రాజ్యవాద ప్రపంచీకరణలో భాగంగా దేశంలో ఆర్థిక సంస్కరణలు ప్రారంభమైనాయి. దేశంలో ఆర్థిక సంస్కరణలు ప్రారంభమై 25 సంవత్సరాలు గడిచాయి. ఈ కాలంలో కాంగ్రెస్., బి.జె.పి. ప్రభుత్వాలు కేంద్రంలో అధికారాన్ని నడిపాయి. కాంగ్రెస్ ప్రారంభించిన ఈ సంస్కరణలను బి.జె.పి. భుజాన వేసుకొని, తానే సంస్కరణలను వేగవంతం చేయగలననే విశ్వాసాన్ని సామ్రాజ్యవాదులకు కల్గించడానికి తీవ్ర ప్రయత్నాలు చేస్తున్నది. ప్రస్తుత ప్రధానమంత్రి మోడీ పరిపాలనలో ప్రపంచీకరణ విధానాలు గత ప్రభుత్వాలను మించి ముందుకు సాగుతున్నాయి. అందుకే 'మేక్ ఇన్ ఇండియా' 'డిజిటల్ ఇండియా' లాంటి నినాదాలు బి.జె.పి. ప్రభుత్వం ముందుకు తెచ్చింది. మోడీ 50కి పైగా దేశాల్లో పర్యటించి భారతదేశంలో పెట్టుబడులు పెడితే లాభాలకు కొదవలేకుండా చేస్తానని సామ్రాజ్యవాదులకు కావలసిన భరోసా ఇచ్చాడు.

దేశంలో పెద్ద ఎత్తున క్రమబద్ధీకరించే మిశ్రమ ఆర్థిక వ్యవస్థ బదులు 1991లో అమలులోకి తెచ్చిన ఆర్థిక సంస్కరణలతో ప్రభుత్వ రంగ అజమాయిషిని రద్దు చేసి, సాపేక్షికంగా బంధనాలు లేని మార్కెట్లు మరియు ప్రైవేటీకరణను చేపట్టి కనీస రెగ్యులేషన్ కంట్రోల్ విధానాన్ని అమలు చేసే పాలసీని చేపట్టారు. అందులో భాగంగా వ్యాపార సరళీకరణ, విదేశీ పెట్టుబడులకు తలుపులు బార్లా తెరవడం, ద్రవ్య సడలింపు (డీ రెగ్యులరైజేషన్), ప్రైవేటీకరణ, ప్రభుత్వ రంగ పరిశ్రమలను అమ్మకానికి పెట్టడం, మార్కెటీకరణ, లైసెన్స్ విధానంలో సడలింపులు ప్రారంభించారు.

దేశంలో ఆర్థిక సంస్కరణలు ప్రవేశపెట్టిన తర్వాత ఈ 25 సంవత్సరాల్లో సాధించిన ఫలితాలు పాలకవర్గాలు గొప్పగా ప్రచారం చేస్తున్నాయి. ఈ సంస్కరణల వలన సమతుల్య అభివృద్ధిని సాధిస్తున్నామని చెబుతూ అందుకు రెండు దుష్టాంతాలను పాలకవర్గాలు దేశం ముందుంచుతున్నాయి. ఒకటి ఆర్థిక సంస్కరణల తర్వాత జి.డి.పి. పెరుగుదల సాధించామని, రెండవది విదేశీ మారక నిల్వలను సమృద్ధిగా సంపాదించుకోగలిగామని, దాని వలన 1991 నాటి విదేశీ నిల్వల కొరతను అధిగమించడమే గాక, మళ్లీ ఆ స్థితి రాకుండా ముందుకు సాగామని చెప్పుకుంటున్నది. ఈ రెండు విషయాలను మనం లోతుగా విశ్లేషించాల్సిన అవసరం ఉంది. వీటిని విశ్లేషించడం ద్వారానే ఆర్థిక సంస్కరణల వలన దేశం ప్రయోజనం పొందిందా? లేదా సామ్రాజ్యవాదుల గుప్పిట్లోకి దేశం మరింత వెళ్లిందా? అనే విషయం అర్థమవుతుంది.

**మొదట** జి.డి.పి. పెరుగుదల విషయాన్ని సంవత్సరాలుగా చూస్తే 1950-51 నుండి 1964-65 వరకు 4.8 శాతం; 1964-65 నుండి 1974-75 వరకు 3.4 శాతం; 1974-75 నుండి 1984-85 వరకు 4.2 శాతం; 1984-85 నుండి 1994-95 వరకు 5.9 శాతం చొప్పున పెరుగుదల ఉండగా; 1994-95 నుండి 2004-05 వరకు 7.1 శాతం ఉండగా, 2004-05 నుండి 2013-14 వరకు 8.3 శాతం పెరుగుదల నమోదు అయ్యింది. పైన తెలుపబడిన లెక్కల ద్వార పాలకవర్గాలు బాకాలుదుతున్న వృద్ధి ప్రచారం నిజమని నమ్మే పరిస్థితి ఉంది. ఈ వృద్ధి రేటు లెక్కల ప్రకారంగా చూస్తే నిజమే అయినప్పటికీ నూతనంగా 2011-12వ సంవత్సరం ఆధారంగా రివైజ్ చేసిన జాతీయ అకౌంట్స్ లెక్కలపై ఆధారపడి జి.డి.పి.ని అంచనా వేసే పద్ధతి వలన అసలు జి.డి.పి. పెరుగుదలపై దేశంలో అనేక అనుమానాలు తలెత్తాయి. దీని కంటే ముఖ్యమైన విషయమేమంటే పాలకవర్గాలు చెప్పుకుంటున్నట్లుగా ఈ వృద్ధి దేశంలో సమతుల్య అభివృద్ధికి ఉపయోగపడిందా? లేదా? అనే కోణంలో చూసినపుడు దేశంలో సంపద పెరిగినప్పటికీ, దాని అసమ పంపకం వలన తీవ్రమైన అంతరాలు ఏర్పడ్డాయి. ఈ మధ్య దావోస్‌లో విడుదల చేసిన ప్రకటన ప్రకారం మన దేశంలో 58శాతం సంపద అత్యంత సంపన్నమైన ఒక్క శాతం వ్యక్తుల చేతుల్లో ఉన్నది. అంటే దేశంలో 57 మంది డాలర్ శత కోటీశ్వరుల దగ్గర ఉన్న సంపద మొత్తం 216 బిలియన్ డాలర్లు (పద్నాలుగు లక్షల డెబ్బై వేల కోట్ల రూపాయాలు) అది దేశంలో అట్టడుగున ఉన్న 70 శాతం జనాభా కున్న సంపదతో సమానం. భారత శతకోటీశ్వరులలో 46శాతం తమ సంపదను కేవలం ప్రభుత్వ అనుమతులను తమకు అనుకూలంగా మలుచుకోగల అధికారం నుంచి, ప్రభావం నుంచి,

ప్రాధాన్యతల, సౌలభ్యాల నుండి గ్రహించారని కూడ ఈ నివేదిక తెల్పింది. ఈ లెక్కలు వాస్తవాలను ముందుంచాయి. పాలకవర్గాలు సమతుల్య అభివృద్ధి గురించి మాట్లాడడం ఎంత హాస్యాస్పదమైన విషయమో అర్థమవుతున్నది.

**రెండవది,** దేశంలో ప్రస్తుతం విదేశీ నిల్వల ఖాతాలో 370 బిలియన్ డాలర్లు ఉన్నాయి. అంటే దిగుమతుల కోసం 11 నెలలకు సరిపోతాయి. 1991లో విదేశీ మారక ద్రవ్య నిల్వలు ఘోరంగా పడిపోయి 15 రోజుల దిగుమతులకు కూడ సరిపోని పరిస్థితి నెలకొంది. ఆ పరిస్థితిలో ప్రభుత్వం లండన్ బ్యాంకులో బంగారాన్ని కుదువ పెట్టి దిగుమతుల సంక్షోభాన్ని పరిష్కరించింది. వెంటనే ఐ.ఎం.ఎఫ్., ప్రపంచబ్యాంకు ఆదేశాలకు తలొగ్గి సామ్రాజ్యవాద ప్రపంచీకరణ విధానాలు చేపట్టింది.

ఇకపోతే విదేశీ కరెన్సీ నిల్వలు పెట్రోలియం ఉత్పత్తుల దిగుమతి కోసం ప్రధానంగా వినియోగిస్తున్నారు. అసలు వస్తువులు, సేవలను ఎగుమతి చేయడం ద్వారా విదేశీ నిల్వలు సంపాదించాల్సి వుంటుంది. కాని మన దేశ పాలకవర్గాలు అప్పుల రూపంలో ఈ విదేశీ మారక నిల్వలు పొందుతున్నాయి. విదేశీ పెట్టుబడి దారులు దేశంలో అవసరానికి మించి పెట్టుబడులు కుమ్మరిస్తున్నారు. ఇది పెట్టుబడిదారులకు వడ్డీతో సహా మళ్లీ చెల్లించాల్సి ఉంటుంది. లేదా పెట్టుబడుదారులకు ఆస్తులు అమ్మి దేశం ఆ ఉచ్చు నుండి బయటపడాలి. 15 సంవత్సరాల క్రితం విదేశీ అప్పులు 98.3 బిలియన్ డాలర్ల నుండి 2015 సంవత్సరంలో 444.2 బిలియన్ డాలర్లకు పెరిగాయి. మన పాలకవర్గాలు గొప్పగా విదేశీ నిల్వల గురించి చేసే ప్రచారం కేవలం బూటకమైనది.

సామ్రాజ్యవాద ప్రపంచీకరణ విధానాల వలన దేశంలో పారిశ్రామిక ఉత్పత్తులు వృద్ధి అయి ఎగుమతుల్లో పెరుగుదల లేదు. కాబట్టి మోడీ అధికారానికి వచ్చిన తర్వాత 'మేక్ ఇన్ ఇండియా' ద్వారా విదేశీ పెట్టుబడుల సహాయంతో ప్రపంచీకరణ గొలుసులోని విలువలోకి, సామ్రాజ్యవాదానికి అధీనమైన సప్లై దారుగా భారత పరిశ్రమలను మలచ ప్రయత్నిస్తున్నాడు. భారత పాలకవర్గాలు పారిశ్రామికీకరణను చేయలేకపోగా, మాంద్యం నుండి బయట పడడానికి కొత్తగా, 'మేక్ ఇన్ ఇండియా' అనే పాలసీని చేపట్టాయి.

### వ్యవసాయంలో ఆర్థిక సంస్కరణలు

విదేశీ వ్యాపారంలో ఉదారీకరణ విధానాన్ని అవలంభించడం సంస్కరణల్లో ఒక ముఖ్యమైన భాగం. ఇందులో భాగంగా మొదటగా వ్యవసాయ సంబంధిత సరుకులకు ఎగుమతి పన్నులపై ఆంక్షలను ఎత్తివేశారు. తదుపరి ఈ సరుకులకు దిగుమతి సుంకాల్లో పరిమితంగా ఆంక్షలను తొలగిస్తూ వచ్చారు. ఒక స్థాయిలో ప్రాథమికమైన దిగుమతులను మినహాయించి వాటిని పూర్తిగా ప్రైవేట్ ఏజెంట్లకు అప్పజెప్పారు. క్రమంగా ఒక దశాబ్ధ కాలంలో చెప్పుకోదగిన స్థాయిలో దిగుమతి సుంకాలు తగ్గాయి. గోధుమ, బియ్యం లాంటి దినుసులకు ఎగుమతులపై ఆంక్షలు తొలగించారు. తద్వార శుద్ధి చేయని, శుద్ధి చేసిన వ్యవసాయ సరుకులకు ఎగుమతులకు ప్రోత్సాహాన్ని కలిగించారు.

నిజానికి, గాట్ ఉరుగ్వే రౌండ్ అగ్రిమెంట్ ప్రకారం సామ్రాజ్యవాదం ఇలాంటి ఉదారీకరణ విధానం వ్యవసాయ వాణిజ్యంలో కోరుతుంది. అయితే దేశంలో మొదటి దశాబ్ధంలో విదేశీ సరుకులతో పోలిస్తే దేశీయ వ్యవసాయ సరుకులు చౌకగా దొరికే పరిస్థితిలో రైతులకు విదేశీ వాణిజ్యం లాభసాటిగా ఉండేది. దీనితో ప్రపంచబ్యాంకుతో మొదటి రేంజ్‌లో కుదుర్చుకున్న పన్నులను కట్టబడని (టారిఫ్ బైండింగ్స్) ఒప్పందం దేశీయ రైతాంగానికి వ్యతిరేకంగా మారింది. అంతేకాక దీని తర్వాత చాల పంటలకు వర్తింపచేస్తూ దిగుమతి సుంకాలను ఎత్తివేయడానికి ఎలాంటి పన్నులు లేని జీరో టారిఫ్ బైండింగ్స్ ప్రభుత్వం ప్రపంచబ్యాంకుతో ఒప్పందం కుదుర్చుకున్నది. దీనితో, ఎప్పుడైతే అంతర్జాతీయంగా వ్యవసాయ ఉత్పత్తుల ధరలు పడిపోయి, మన దేశంలోకి విదేశీ సరుకులు చౌకగా దిగుమతి కావడం ప్రారంభమయ్యిందో అప్పుడు, భారతదేశ సరుకులకు గిరాకి పడిపోయి వ్యవసాయదారుల జీవన పరిస్థితులపై తీవ్ర నెగెటివ్ ప్రభావం పడింది. భారత పాలకవర్గాలు ప్రపంచీకరణ విధానం ద్వార సామ్రాజ్యవాదులకు లొంగిపోయి దేశంలోని రైతాంగానికి విద్రోహం చేశారు.

భారతదేశ వ్యవసాయదారులు అంతర్జాతీయ పోటీలో ప్రపంచ ధరలపై ఆధారపడవల్సిన పరిస్థితిలో పోటీ పడలేక చితికి పోయారు. ప్రభుత్వం అవలంభించిన పంటలకు మద్దతు ధరలు, ఉత్పత్తి కారకాలకు సబ్సిడీలు విధానాల వలన కూడ రైతులను ఈ సంక్షోభం నుండి బయటపడేయలేక పోయాయి. క్రమంగా ప్రభుత్వం ప్రపంచబ్యాంకు ఆదేశానుసారం వ్యవసాయ సబ్సిడీలను కూడ తగ్గించుకోవడం ప్రారంభించింది.

ఈ అంతర్జాతీయ పోటీని తట్టుకోవడానికి భారత రైతులు అధికోత్పత్తిని ఆశించి, హైబ్రిడ్ విత్తనాలను, ఉత్పత్తి కారకాలను వాడవల్సిన అనివార్యతకు లోనై వ్యవసాయ ఉత్పత్తి ఖర్చులు విపరీతంగా పెరిగి పోయాయి. దీనితో రైతు మరింతగా సామ్రాజ్యవాదుల కంబంధ హస్తాల్లో చిక్కుకొనిపోయాడు.

అంతిమంగా భారత వ్యవసాయ రంగాన్ని విదేశీ సామ్రాజ్యవాద మార్కెట్లకు బార్లా తెరవడం ద్వారా భారత వ్యవసాయరంగంలో

పాలకవర్గాలు సంక్షోభాన్ని సృష్టించాయి. అధిక సబ్సీడీలతో సామ్రాజ్యవాదులు ఉత్పత్తి చేసే వ్యవసాయ సరుకుల దాటికి ప్రపంచ మార్కెట్లో తట్టుకోలేక భారతదేశ వ్యవసాయదారులు చితికి పోయారు. చివరకు ఈ పోటీతో వ్యవసాయ దారులు అప్పుల్లో చిక్కుకుని పోయారు. వ్యవసాయ రంగంలో గ్రోత్ రేటు చాల అస్తవ్యస్థంగా ఉంది. 1990లో 2.78 శాతం కాగా ఆర్థిక సంస్కరణల తర్వాత 1999లో 2.67 శాతంకు, 2009-10 సంవత్సరంలో 0.81 శాతంకు దిగజారి 2013-14లో 4.71 శాతంగా ఉంది. మరో వైపు జి.డి.పి.లో వ్యవసాయ రంగం వాటా 1950లో 55.3 శాతం కాగా ఇప్పుడు 21.8 శాతంకు చేరింది. అదే సమయంలో సర్వీస్ రంగం వాటా 29.8 శాతం నుండి 53.7 శాతంకు పెరిగింది.

ఆర్థిక సంస్కరణలో భాగంగా ద్రవ్యలోటును తగ్గించడానికి ప్రభుత్వం తీసికొన్న చర్యల వలన ఎరువులు, విత్తనాలపై సబ్సీడీలను తగ్గించడం, గ్రామీణ ప్రాంతాల్లో 1990 దశకంలో తలసరి ఖర్చు చేసే వ్యయంలో తగ్గుదల, దీనికి తోడు ఇన్‌ఫ్రాస్టక్చర్, ఇంధనం పై ప్రభుత్వం చేసే ఖర్చులో తగ్గుదలతో గ్రామీణ ప్రాంతాలను దెబ్బతీశాయి. అలాగే ద్రవ్య ఉదారీకరణ విధానాల ద్వారా ద్రవ్య పరపతిలో జరిగిన మార్పులు వ్యవసాయంపై తీవ్ర ప్రభావాన్ని వేశాయి. బ్యాంకులు వ్యవస్థాగత రుణాలు తగ్గించి, ప్రాధాన్యతా సెక్టారులకు రుణం ఇచ్చే విధానం వలన వ్యవసాయదారులకు రుణాలు చాలినన్ని దొరకకుండా పోయాయి. అంతేకాక, చిన్న రైతులు, కౌలుదార్లు, భూమిపై పట్టాదారు పాస్ పుస్తకాలు (టైటిల్ డీడ్స్) లేని రైతులకు బ్యాంకుల నుండి నేరుగా రుణాలు లభించక రుణాల కోసం మార్కెట్ వ్యాపారులు, ప్రైవేట్ వడ్డీ వ్యాపారుల మీద ఆధారపడడంతో వారి దోపిడీకి గురైన పేద, మధ్య తరగతి రైతులకు వ్యవసాయం మోయలేని భారంగా మారి రైతుకు వురితాడులా మారింది. వాటిని తీర్చలేక ఈ 25 సం॥రాల ఆర్థిక సంస్కరణల విధానాలతో సుమారు 3 1/2 లక్షల మంది రైతులు ఆత్మహత్యలు చేసుకొన్నారు. ఈ రెండు సంవత్సరాల్లో ఒక్క తెలంగాణ రాష్ట్రంలోనే మూడు వేలకు మించి రైతుల ఆత్మహత్యలు జరిగాయి.

**తయారీరంగ పరిశ్రమలు**

సామ్రాజ్యవాద ప్రపంచీకరణలో భాగంగా అన్ని స్థాయిలలో తయారీరంగ పరిశ్రమలలో ఉత్పత్తులపై సుంకాలు తగ్గించి, అంతర్జాతీయ మార్కెట్లో పోటీకి తయారు చేస్తానని ప్రభుత్వం చెప్పింది. సుంకాలు తగ్గించడం వలన పారిశ్రామిక ఉత్పత్తులు మరియు కాపిటల్ సరుకులు తక్కువ ధరకే దొరికి అంతర్జాతీయ పోటీని తట్టుకోగలమని చెప్పింది. అందుకే డబ్ల్యూ.టి.ఓ. నిర్దేశకత్వంలో పారిశ్రామిక ఉత్పత్తులకు మాత్రమే గాక, విద్యుచ్ఛక్తి, ఇంధన ఉత్పత్తి పరికరాలకు కూడ వర్తింపజేసింది. ఈ పరికరాలు విదేశాల నుండి చౌకగా దిగుమతి కావడంతో ప్రైవేట్ కంపెనీల పైననే గాక, బి.ఎచ్.ఇ.ఎల్. లాంటి ప్రభుత్వ రంగ పరిశ్రమలపై కూడ ఈ ప్రభావం పడింది. చౌక ధరలో విదేశాల నుండి దిగుమతులు రావడంతో బి.ఎచ్.ఇ.ఎల్. లాంటి సంస్థతో దీర్ఘకాల ఒప్పందాలు కుదుర్చుకున్న చిన్న కంపెనీలపై ప్రభావం పడి అవి కోలుకోలేని విధంగా దివాళ తీశాయి.

విదేశీ పెట్టుబడులు (ఎఫ్.డి.ఐ.) ను తీసుకొని రావడం ద్వారా తయారీ రంగంలో అంతర్జాతీయ ప్రమాణాల్లో సామర్థ్యంతో కూడిన ఉత్పత్తిని పెంచడం, టెక్నాలజీని సంపాదించి ఇంతవరకు చేరలేని మార్కెట్లలోకి సరుకులను పంపించగలమని ప్రభుత్వం నమ్మబలుకుతూ వచ్చింది. దేశీయ పరిశ్రమలకు విదేశీ నిధులు సమకూర్చడం అనే విధానం వలన, ఇంటర్నేషనల్ కమర్షియల్ బారోయింగ్ (ఈ.సి.బి.) ద్వారా పరిశ్రమాధిపతులకు నిధులు అందుబాటులోకి వచ్చాయి. ఇవి విదేశీ కరెన్సీ రూపంలో లభించడం వలన తక్కువ వడ్డీ రేట్లు ఉంటాయని భావించారు. కాని కరెన్సీ మార్చుకొనే క్రమంలో జరిగే నష్టాలను చూసుకొన్నప్పుడు ఇది మొత్తం పారిశ్రామిక రంగంపై తీవ్రమైన నెగటివ్ ప్రభావం పడింది. అంతేగాక దేశీయ బ్యాంకులకు, దేశీయ పరిశ్రమలకు ఉండవలసిన సంబంధం తెగిపోయి ఆర్థికవ్యవస్థ దెబ్బతినడం ప్రారంభమైంది. ఈ విధానం వలన ముఖ్యంగా చిన్నతరహ పరిశ్రమలు ఘోరంగా దెబ్బతిన్నాయి.

విదేశీ పెట్టుబడులు (ఎఫ్.డి.ఐ.) కోసం ప్రభుత్వం అర్రులు చాచడం చూస్తూనే ఉన్నాం. కాంగ్రెస్ ప్రభుత్వం మాదిరిగానే మోడీ ప్రభుత్వం 'మేక్ ఇన్ ఇండియా' నినాదంతో విదేశీ పెట్టుబడుల కోసం తహతహలాడి పోతుంది. మరో వైపు సామ్రాజ్యవాద పెట్టుబడిదారులు భారతదేశంలో పెట్టుబడులు పెట్టి త్వరగా లాభాలు చేసుకోవడానికి పోర్టు పోలియో కాపిటల్ (ఎఫ్.ఎఫ్.సి.) రూపంలో పెట్టుబడులు దేశంలో ఇబ్బడి ముబ్బడిగా పెడుతున్నాయి. సరాసరి విదేశీ పెట్టుబడులు 2004-2005కు ముందు 8-15 బిలియన్ డాలర్లు రాగా, 2007-08 నాటికి 60 బిలియన్ డాలర్లకు, 2014-15 నాటికి 70 బిలియన్ డాలర్లకు చేరింది. 2000-2015 మధ్యలో మొత్తం విదేశీ పెట్టుబడుల్లో 49శాతం పెట్టుబడులు కేవలం రెండు దేశాల ద్వారానే దేశంలోకి వచ్చాయి. మారిషస్ నుండి 35శాతం కాగా, సింగపూర్ నుండి 14 శాతంగా ఉంది. భారతదేశంలోని పెట్టుబడిదారులు, పరిశ్రమాధిపతులు తమ పెట్టుబడులను విదేశాలకు తరలించి మళ్లీ వాటిని పై రెండు

దేశాల ద్వారా విదేశీ పెట్టుబడుల రూపంలో దేశంలోకి తీసికొస్తాయి. ఈ రూపంలో విదేశీ పెట్టుబడులపై ప్రభుత్వం ఇచ్చే పన్ను రాయితీలు ఈ పెట్టుబడులకు లభిస్తుంది. ఇలాంటి పెట్టుబడుల ద్వారా ప్రభుత్వం చెబుతున్నట్లుగా ఉత్పత్తి సామర్థ్యం పెరగడం గాని, దీర్ఘకాలిక పథకంలో భాగంగా విదేశీ టెక్నాలజీ లభించడం సాధ్యం కాదు.

విదేశీ పెట్టుబడుల్లో చిన్న మొత్తాలు మాత్రమే తయారీ రంగంలో పెట్టుబడులుగా వస్తున్నాయి. ఇందులో 2000-2012 వరకు లెక్కలు చూస్తే, 60శాతం పెట్టుబడులు ఫార్మాసుటికల్స్, కెమికల్స్, ఆటో మొబైల్స్, లోహ పరిశ్రమల్లో మాత్రమే వినియోగం అవుతున్నాయి. తక్కిన పెట్టుబడులు ఎక్కువ మొత్తంలో ప్రభుత్వ రంగ పరిశ్రమలతో పాటు దేశీయ పరిశ్రమల్లో షేర్లు కొనుగోలు చేసి భారత మార్కెట్లను గుప్పిట్లో పెట్టుకోవడానికి విదేశీ పెట్టుబడిదార్లు వినియోగిస్తున్నారు. దానితో పాటు మార్కెట్లలో పోటీని తగ్గించి, ధరల నిర్ణయాన్ని వారి కంట్రోల్‌లో పెట్టుకొని మార్కెటులో ధరలను వారికనుకూలంగా నియంత్రిస్తారు. దీనితో పాటు విదేశీ పెట్టుబడిదారులు పారిశ్రామిక రంగం బదులు పెద్ద మొత్తంలో ఇన్‌ఫ్రాస్టక్చర్ (రైలు, రోడ్డు, పోర్టులు, షిప్‌యార్డ్ లాంటి) రంగాల్లో పెట్టుబడులు పెడుతున్నారు. ఇది సామ్రాజ్యవాదుల సత్వర లాభాలకు అనుకూలంగా ఉంది.

పారిశ్రామిక రంగంలో జరిగే అభివృద్ధి ఆర్థిక వ్యవస్థకు ఇంజన్‌లా పని చేస్తుంది. వ్యవసాయంలో కూరుకుపోయిన 'అధిక జనాభాకు' పారిశ్రామికీకరణ ద్వారా ఉపాధి కల్పించడం జరుగుతుంది. పారిశ్రామికీకరణలో భాగంగా సమాజంలో క్రమశిక్షణ, నైపుణ్యాలు అవసరమవుతాయి. అందుకు గాను విద్య అవసరమవుతుంది. పారిశ్రామిక రంగంలో జరిగే మార్పుల వలన సమాజంలో అన్ని రంగాల్లో మార్పులు జరుగుతాయి. నిజమైన పారిశ్రామిక పాలసీ ద్వారానే ఈ మార్పులు సాధ్యమవుతాయి. కాని నరేంద్రమోడీ అధికారంలోకి వచ్చిన తర్వాత ఈ పారిశ్రామిక పాలసీలో 'మేక్ ఇన్ ఇండియా' అంటే 'లూట్ ఇండియా'గానే మారింది. మోడీ 3 ఏండ్ల పరిపాలనలో కూడ పారిశ్రామిక తయారీ రంగంలో మాంద్యం నెలకొని ఉంది.

మొత్తంగా చూసినప్పుడు 1989-90లలో జి.డి.పి.లో పారిశ్రామిక వాటా 16.4 శాతం ఉండగా, ప్రస్తుత ప్రభుత్వాలు ఎన్నో కొత్త ప్యాకేజీలు తెచ్చినప్పటికీ 2015-16లో కూడ 16.2శాతం మాత్రమే వాటాగా ఉండడం ప్రభుత్వం ప్రతిష్టాకరమైన (ఫ్లాగ్ షిప్) ప్రోగ్రాం అయిన 'మేక్ ఇన్ ఇండియా' బోలు తనం ఏమిటో స్పష్టంగా అర్థమవుతున్నది.

**పరిశ్రమలు-కార్మిక రంగం**

ప్రభుత్వం సామ్రాజ్యవాద ప్రపంచీకరణ ప్రారంభించిన తర్వాత ప్రైవేటీకరణ పేరుతో అనేక ప్రభుత్వరంగ సంస్థలను మూసివేసింది. పరిశ్రమల స్థానంలో సర్వీసు రంగం అభివృద్ధి జరిగింది. సంఘటిత కార్మికుల స్థానంలో, కాంట్రాక్టు, క్యాజువల్ లేబర్, అసంఘటిత రంగంలో కార్మికుల పెరుగుదల జరిగింది.

పశ్చిమ బెంగాల్‌లో జూట్ మిల్లుకు ప్రసిద్ధిగా ఉంది. ఇందులో 2016 నాటికి 60 జూట్ మిల్లులలో 13 మిల్లులు మూత పడడంతో 2.5 లక్షల మంది జూట్ మిల్ వర్కర్స్, వీటిపై ఆధారపడిన 40 లక్షల మంది జూట్ పండించే రైతాంగం పై తీవ్ర నెగటివ్ ప్రభావం పడింది. బొంబాయిలోని బట్టల మిల్లులు మూతపడి వాటిలో పని చేసిన కార్మికులు వీధిన పడ్డారు. మిల్లు స్థలాలు రియల్ ఎస్టేట్ వ్యాపారుల కబ్జాలోకి వెళ్ళాయి.

ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల్లో ఆల్విన్ నుండి మొదలుకొని నిజాం చక్కర కర్మాగారం, సర్‌సిల్క్ బట్టల మిల్లులు, వరంగల్ ఆజాంజాహి మిల్లుల వరకు మూతపడడం మనకు తెలిసిందే.

ఇక ప్రభుత్వ రంగ పరిశ్రమలు మొదలు ప్రైవేట్ కంపెనీలలో పర్మనెంట్ కార్మికుల సంఖ్యలో విపరీతంగా కోత విధించారు. తెలంగాణలోని సింగరేణిలో 1,20,000మంది పర్మనెంట్ కార్మికుల స్థానంలో నేడు 60 వేలు మంది మాత్రమే ఉన్నారు. రాష్ట్ర రోడ్డు రవాణా కార్పోరేషన్‌లో కూడ ఇదే పరిస్థితి ఉంది. దేశవ్యాప్తంగా చూసినట్లయితే, హర్యానాలో 1992-93 సంవత్సరాల్లో రోడ్డు కార్పొరేషన్‌లో 25,000 మంది కార్మికుల స్థానంలో నేడు అక్కడ 19,000 మంది పర్మనెంట్ కార్మికులు ఉండగా, 13,000 మంది కాంట్రాక్టు లేబర్ ఉంది. విద్యుత్ రంగంలో 50,000 మంది పర్మనెంట్ కార్మికుల నుండి 23 వేలకు పడిపోయింది. ఇలా దేశవ్యాప్తంగా చూస్తే 1991-92లో సంఘటిత రంగంలో 1 కోటి 90 లక్షలు, ప్రైవేట్ రంగంలో సుమారు 80 లక్షల మంది కార్మికులు ఉండగా, 2011-12 నాటికి 1 కోటి 70 లక్షలు సంఘటిత రంగం, 1లక్ష 20 వేలు ప్రైవేట్ రంగంలో ఉన్నారు. (ఆర్.బి.ఐ. హాండ్ బుక్ ఆఫ్ స్టాటిస్టిక్స్ ఆఫ్ ఇండియా ఎకానమి 2014-15) 2011-12 నాటికి భారతదేశం మొత్తం శ్రామికుల్లో 81.5 శాతం మంది స్వంత ఉపాధి లేదా క్యాజువల్ కార్మికులు కాగా 18.5 శాతం మాత్రమే సంఘటిత రంగంలో ఉన్నారు.

1991లో 4.2 కోట్ల మంది నిరుద్యోగులుండగా ఆ సంఖ్య 2016 నాటికి 16.2 కోట్లకు చేరింది. దేశంలో అనేక పరిశ్రమల్లో అవుట్ సోర్సింగ్ ద్వారా పనులు జరిపించడం పెరిగింది. కాంట్రాక్టు, క్యాజువల్, అసంఘటిత రంగ కార్మికులకు ఎలాంటి

వుద్యోగ భద్రత లేదు. వీరు అమానవీయ పరిస్థితుల్లో జీవనం గడపాల్సిన పరిస్థితి ఏర్పడింది. దేశంలో వలస కార్మికుల దుస్థితి చెప్పరాని విధంగా ఉంటున్నది. కార్మికుల వేతనాలు దినదినం పడిపోతున్నాయి.

చట్టబద్ధం కాని కార్మికుల వినియోగం, అవుట్ సోర్సింగ్ విధానం, కార్మిక చట్టాలను తప్పనిసరిగా అమలు చేయాల్సిన ప్రభుత్వాలు ఆ బాధ్యత నుండి తప్పుకోవడమే గాక కార్మికులు పోరాడి సాధించుకొన్న కార్మిక చట్టాలను తుంగలో తొక్క జూస్తున్న ప్రభుత్వ విధానాల వలన కార్మికరంగంలో అసాదారణ పరిస్థితులు నెలకొన్నాయి. నూతన పారిశ్రామిక జోన్‌లు, ఎగుమతి చేసే జోన్‌ల్లో కార్మికులకు ఎలాంటి పారిశ్రామిక చట్టాలు వర్తించవు. దీని వలన కార్మికుల్లో అసంతృప్తి రగులుతున్నది. వారు మిలిటెంట్ ఆందోళనలకు దిగుతున్నారు. 2005 లో హోండా కార్మికులు, 2010లో మారుతీ సుజుకీ కార్మికులు మిలిటెంట్ ఆందోళనలకు దిగారు. మారుతీ సుజుకీ లిమిటెడ్ ఇండియా (ఎం.ఎస్.ఐ.ఎల్.) మేనేజర్‌ను చంపారనే నెపంతో 150 మంది కార్మికులపై కేసులు పెట్టి అందులో 10 మందికి 2017లో యావజ్జీవ శిక్ష విధించారు. దేశవ్యాప్తంగా యూనియన్ పెట్టుకునే హక్కుల కోసం కార్మికులు ఆందోళనలు చేపడుతున్నారు. 2009 నుండి దేశంలోని అన్ని ట్రేడ్ యూనియన్‌లు కలిసి పోరాటాలకు దిగక తప్పడం లేదు. అధికార పార్టీ బి.జే.పీ. అనుబంధ సంస్థ భారతీయ మజ్దూర్ సంఘ్ కూడ ప్రభుత్వ కార్మిక విధానాలను వ్యతిరేకిస్తూ ఆందోళనల్లో చేరాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఆల్ ఇండియా స్టేట్ గవర్నమెంట్, కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులు కలిసి ఏర్పాటు చేసిన ఐక్యకార్యాచరణ కమిటీ నేతృత్వంలో ఇన్సూరెన్స్, రక్షణ, బ్యాంకింగ్ ఉద్యోగస్థులు పోరాటాలకు దిగారు.

ప్రస్తుత బి.జే.పి. ప్రభుత్వం కార్మిక చట్టాల్లో సవరణలు చేస్తున్నది. ఇంటర్నేషనల్ లేబర్ ఆర్గనేజేషన్ నాలుగుకోర్ కన్వెన్షనులలో చేసిన తీర్మానాలను, మూడు పక్షాల మధ్య జరిగిన ఒప్పందాలను, లేబర్ కాన్ఫరెన్స్‌ల తీర్మానాలను, రెండవ జాతీయ కమీషన్ చేసిన కార్మిక చట్టాలను ప్రక్కకు పెట్టి ఈ 25 సంవత్సరాలుగా కాంగ్రెస్, బి.జె.పి. ప్రభుత్వాలు ఫాసిస్టు చట్టాల ద్వారా కార్మికుల హక్కులను కాలరాచి వేస్తున్నాయి. నేడు దేశవ్యాప్తంగా కార్మిక వర్గంలో అసంతృప్తి రగులుతుంది. అది లావాలాగ ఎగజిమ్మ బడుతున్నది. దేశవ్యాప్తంగా కార్మిక సమ్మెలు తత్ఫలితంగా ఎక్కడికక్కడ లాకౌట్‌లు జరుగుతున్నాయి.

దేశవ్యాప్తంగా కార్మికవర్గం సంఘటితమవుతున్నది. యూనియన్ పెట్టుకొనే హక్కు నుండి ఉద్యోగ భద్రత, జీతాల పెరుగుదల లాంటి డిమాండ్లపై కార్మికులు మిలిటెంట్ ఆందోళనల్లో పాల్గొంటున్నారు. రిజిస్టర్డ్ జాతీయ యూనియన్లు నాయకత్వం వహించకపోయినప్పటికీ కార్మికులు ఎక్కడికక్కడ ఆందోళనలు చేపడుతున్నారు.

1976-1990 వరకు సమ్మెల వలన 54.9శాతం పని దినాలు నష్టం కాగా, లాకౌట్స్ వలన 45.1శాతం; 1991-2000 వరకు సమ్మెల వలన 39.2 శాతం పని దినాలు నష్టం జరగ్గా, లాకౌట్స్ వలన 60.8 శాతం జరిగాయి. యజమానులు కార్మికుల్ని అణచడానికి లాకౌట్స్ విధానాల్ని వినియోగిస్తున్నారు. ప్రభుత్వాలు, పెట్టుబడిదారులు అవలంబిస్తున్న నిరంకుశ విధానాలకు వ్యతిరేకంగా కార్మికవర్గం పోరాడుతూనే ఉంటుంది. నూతనంగా ముందుకు వస్తున్న ఈ స్వభావం, కార్మిక వర్గం తమ అంతిమ విజయం కోసం జరిగే పోరాటంలో సంఘటితం కావడం తప్పనిసరిగా జరిగి తీరుతుంది.

**సామ్రాజ్యవాద ప్రపంచీకరణ ఆర్థిక విధానాల వలన మన దేశంలో వివిధ సెక్షన్లు ఏ విధంగా దోపిడీ, పీడనలకు గురి అవుతున్నాయో మనం ఇపుడు చూద్దాం.**

**నిర్లక్ష్యానికి గురవుతున్న వైద్య, ఆరోగ్య రంగం**

ప్రజారోగ్య ప్రమాణాలలో ప్రపచంలోని 188 దేశాలలో భారతదేశం 143వ స్థానంలో ఉంది. ప్రపంచంలోని అతి ఎక్కువగా ప్రైవేటీకరించిన వైద్య విధానం భారతదేశంలోనే ఉంది. సాధారణ ప్రజలు కూడ కార్పొరేటు ఆసుపత్రులపై ఆధారపడాల్సిన పరిస్థితి ఉంది. అత్యంత ఖరీదైన వైద్యం తప్ప ప్రభుత్వ ఆసుపత్రుల్లో వైద్యం దొరకడం లేదు. దేశంలో ప్రజలకు వైద్యాన్నందించాల్సిన బాధ్యత కలిగిన రాష్ట్ర ప్రభుత్వాలు తమ ఆదాయంలో 0.75 శాతం మాత్రమే వైద్యానికి ఖర్చు చేస్తున్నాయి. ప్రభుత్వాలు వైద్య రంగంపై వెచ్చించాల్సిన ఖర్చు ఓ వైపున తగ్గిపోతూ ఉండగా, మరోవైపున ప్రజానీకం వైద్యం కోసం పెడుతున్న ఖర్చు పెరిగిపోతోంది. దాదాపు 64.2 శాతం వైద్య ఖర్చులను ప్రజలు తమ ఆదాయాల నుండే చెల్లిస్తున్నారు.

ఏడు దశాబ్దాల తరువాత కూడా శిశు మరణాల రేటు మాత్రం ప్రతి వెయ్యి జననాలకూ 38 మరణాలతో ప్రపంచంలోనే అత్యధికంగా ఉంది. దేశంలోని సగం మంది పిల్లలు (ఐదేళ్ల లోపు) పోషకాహార లోపంతో బాధపడుతున్నారు. 60 శాతం మహిళలు రక్తహీనతతో బాధపడుతున్నారు. దేశంలో ప్రభుత్వాసుపత్రుల ప్రమాణాలు, సౌకర్యాలు దయనీయంగానే ఉన్నాయి. ప్రధానంగా సరిపడినన్ని ప్రభుత్వ నిధులు లేకపోవడమే ఇందుకు కారణం. ప్రపంచ ఆరోగ్య సంస్థ ప్రమాణాల ప్రకారం ప్రతి వెయ్యి మంది

జనాభాకు 3.5 ఆసుపత్రి ఉండాలి. భారతదేశంలో ప్రతి వెయ్యి జనాభాకు 3.5 ఆసుపత్రి పడకలు ఉండాలి. భారతదేశంలో ప్రతి వెయ్యి మందికి 0.7 పడకలు మాత్రమే ఉన్నాయి. 17 వందల మంది ప్రజలకు ఒక డాక్టరు మాత్రమే అందుబాటులో ఉన్నారు.

ప్రజారోగ్యం పట్ల తీవ్ర బాధ్యతా రాహిత్యాన్ని ప్రదర్శిస్తున్న పాలకులు అరకొరగానున్న ప్రాథమిక వైద్య కేంద్రాన్ని సైతం పక్కన పడేసి, ప్రైవేట్ వైద్య రంగానికి గేట్లు బార్లా తెరిచారు. ఫలితంగా చిన్నపాటి జ్వరం, ఇతర జబ్బులకు కూడా ప్రజలు ప్రైవేటు ఆసుపత్రుల వైపు నెట్టబడుతున్నారు. లాభార్జనే ధ్యేయంగా, ఎటువంటి ప్రభుత్వ నియంత్రణ లేని ప్రైవేట్ వైద్యరంగం, ముఖ్యంగా కార్పొరేట్ వైద్యరంగం, ప్రజల అనారోగ్యాలనే సాధనాలుగా చేసుకొని తమ లాభార్జనకు వనరులుగా మలచుకుంటున్న తీరు ఘోరంగా ఉంది. గ్రామీణ భారత్‌లో సరైన వైద్య సదుపాయాలు లేనందున ప్రతి ఏటా జలుబు, దగ్గు, డయేరియా, డెంగీ, మలేరియా, టైఫాయిడ్ వంటి అంటు వ్యాధులతో లక్షలాది మంది మరణిస్తున్నారు. దేశంలో ఆరోగ్య పరిస్థితి మెరుగుపడాలంటే పోషకాహారం, రక్షిత మంచినీరు, పరిశుభ్రత, విద్య, ఉపాది వంటి సామాజిక రంగాల అభివృద్ధి పైనే ఆరోగ్య పరిస్థితి ఆధారపడి ఉంటుంది.

**విద్య కార్పోరేటీకరణ–బ్రాహ్మణీకరణ**

బాలలు జాతి సంపద, మన దేశంలో 24 సంవత్సరాల వయస్సులోపు వారు 55 శాతం ఉన్నారు. అయితే, మన సామాజిక వ్యవస్థ దేశంలోని అత్యంత విలువైన మానవ ఉత్పాదక సంపత్తిని ధ్వంసం చేస్తోంది. బాల బాలికలకు మౌలిక విద్యను నిరాకరిస్తుంది. యువత మనుగడ సాగిస్తూ ఉత్పత్తిని అభివృద్ధి చేసే వైపుగా సృజనాత్మకతను అభివృద్ధి పరచవలసిన విద్య, పాఠశాల విద్య నుంచి ఉన్నత విద్య వరకు దేశావసరాలకు, మానవ వికాసానికి కాక మార్కెట్ అవసరాలకు, కార్పొరేట్ కంపెనీల దోపిడీ కనుగుణంగా, మూర్ఖపు మత మౌఢ్యాన్ని పెంచి పోషించే విధంగా రూపొందించబడుతోంది. 1986 నూతన విద్యా విధానం నుండి, పాలన సాగిస్తూ వస్తోన్న ప్రభుత్వాలన్ని (రాజీవ్ నుంచి మోడీ వరకు) ప్రపంచీకరణ ఎజెండాను అమలు చేస్తున్నాయి. 1991 నూతన ఆర్థిక విధానాల ప్రారంభంతో, ప్రజలకు విద్యా రంగానికి నిధుల కేటాయింపును క్రమంగా ఉపసంహరిస్తూ వస్తున్నది. మొదట ప్రాథమిక విద్య నెంచుకుంది. పాఠశాలలను పటిష్టం చేసే బదులుగా, అక్షరాస్యతా కార్యక్రమాన్ని, సర్వశిక్ష అభియాన్ వంటి కార్యక్రమాల నెంచుకొని ప్రైవేటీకరణకు మార్గం వేసింది. ఇప్పుడు ఉన్నత విద్యారంగం వంతు వచ్చింది. బోధన, బోధనేతర ఖాళీలు భర్తీ చేయకపోవడం, మౌలిక వసతులు కల్పించకపోవడం వలన క్రమంగా ప్రభుత్వ విద్యా సంస్థలు మూతపడుతున్నాయి.

సామ్రాజ్యవాద ప్రపంచీకరణ విధానాలతో, లాభాల దాహంతో కార్పొరేట్ల నియంత్రణలో, విద్యా వ్యాపారాన్ని కె.జి.నుండి పి.జి.వరకు విస్తరించడం జరుగుతోంది. 'అందరికి విద్య' ఎజెండాలో ప్రపంచబ్యాంకు ప్రాథమిక విద్యలోకి చొరబాటు వెనకనున్న లక్ష్యం క్లుప్తంగా ఇదే! ప్రపంచ వాణిజ్య సంస్థ మార్కెట్ అవసరాలకనుగుణంగా ప్రభుత్వం ఉన్నత విద్యారంగాన్నంతా తెరచి ఉంచింది. 2015 డిసెంబర్‌లో నైరోబీలో నిర్వహింపబడిన డబ్ల్యూటివో మంత్రుల స్థాయి సభలో సంపన్న దేశాల కుటిల విధానాలతో ఉన్నత విద్యారంగంపై భారతదేశ 'ప్రకటన' వారి ఈ 'అంగీకారం' తిరగదోడ వీలులేనిదిగా పరిణమించింది. ఈ విధంగా భారతదేశంలోని బాలలు, పెద్దలు, యువత అంతా అసమానత్వాన్ని, వివక్షను పెంపొందించే బహుళ దొంతరల విద్యావ్యవస్థకు బాధితులుగా ఉండడం మినహా మరోమార్గం లేకుండాపోయింది.

దేశ ప్రజల అవసరాలను ప్రక్కనపెట్టి, సామ్రాజ్యవాద దోపిడీ అవసరాలను తీర్చే విధంగా ఉన్నత విద్యా రంగాన్ని మార్చి వేస్తున్నారు. ప్రాథమిక, మాధ్యమిక విద్యలో ఇప్పటికే ప్రైవేట్ శక్తుల గుత్తాధిపత్యం నెలకొంది. ఉన్నత విద్యారంగంపై ఆధిపత్యం కోసం విదేశీ విశ్వవిద్యాలయాలు అనేక రకాల ఒప్పందాలను చేసుకుంటున్నాయి. అధిక లాభాలకు గల అవకాశాలతో విదేశీ పెట్టుబడిదారులు ఈ రంగంపై కన్నువేశారు. వివిధ ప్రచార సాధానాలలో విద్యారంగ అడ్వర్‌టైజ్ మెంట్ల ఖర్చు కార్ల తర్వాత రెండవస్థానంలోకి వచ్చింది. ఒక పద్ధతి ప్రకారం భారత భాషల స్థానంలో ఇంగ్లీష్‌నూ, స్వతంత్ర స్వావలంబన శాస్త్ర సాంకేతిక స్థానంలో పరాధీన సాంకేతికతనూ ప్రోత్సహిస్తున్నారు. మౌలిక శాస్త్రాల, సామాజిక శాస్త్రాల, మానవీయ అధ్యయనాన్ని నిరుత్సాహపరుస్తున్నారు. ఈ ప్రజా వ్యతిరేక విధానాన్ని కప్పి పుచ్చుకునేందుకు, వెనుకబడిన వర్గాల విద్యార్థుల కాలేజీ ఫీజులను రీయింబర్స్ వంటి ప్రజాకర్షణ పథకాలను ప్రభుత్వం అమలు చేస్తున్నది.

బి.జె.పి. ప్రభుత్వం ప్రతిపాదించిన జాతీయ విద్యా విధానం–2016 'నైపుణ్య భారత్ మిషన్' ద్వారా పాలకవర్గాల, వారి సామ్రాజ్యవాద ప్రభువుల ప్రయోజనాలను ముందుకు తీసుకెళ్లేందుకు, కోట్లాది మంది మన యువత సొంతం చేసుకున్న నైపుణ్యాలను, విజ్ఞానాన్ని నీరుగార్చి, నాశనంగావించే కుటిల వ్యూహంతో 'మేక్ ఇన్ ఇండియా'కు జాతీయ విద్యా విధానాన్ని అనుసంధానించింది. అంటే విద్యా వ్యాపారాన్ని, బ్రాహ్మణీకరణను

పెంపొందించడంతో పాటు కులాధిపత్య భావజాలంపై ఆధారపడి రూపొందింది. దళిత, గిరిజన, మైనారిటీ వర్గాల వారిని సాధారణ విద్యకు దూరం చేసి వారిని శ్రామిక విద్యకు పరిమితం చేయడం నూతన విద్యా విధాన లక్ష్యంగా ఉంది. వ్యాపారీకరించబడిన ఈ 'నైపుణ్యాల'తో ధనిక, విలాసవంతమైన, రాజకీయంగా పలుకుబడి గలిగిన కార్పొరేటు విద్యాసంస్థలలో విద్యనభ్యసించిన మధ్య తరగతి, ఉన్నత తరగతి యువతను కట్టుబానిసల తరహాలో ప్రపంచ పెట్టుబడికి సేవచేసే విధంగా మలచుకుంటున్నది.

**ఆదివాసులు-విస్థాపన**

ఆదివాసులకు చెందవలసిన లక్షలాది ఎకరాల భూములు అన్యాక్రాంతమయ్యాయి. ఖనిజాల తవ్వకాల పేరుతో ఆదివాసుల జీవితాలు చిన్నాభిన్నమౌతున్నాయి. వలస పాలనలో ప్రారంభమైన అణిచివేత చర్యలు నేటికి భారతదేశంలో కొనసాగుతున్నాయి. ఈ అప్రజాస్వామిక ఆంక్షలకు వ్యతిరేకంగా అనేక రాష్ట్రాల్లో ఆదివాసీ ఉద్యమాలు ఉవ్వెత్తున ఎగిశాయి. ఆదివాసుల పోరాటాల ఫలితంగా మన రాష్ట్రంలో చేయబడిన 1/70 చట్టం ప్రకారం-షెడ్యూల్డ్ ప్రాంతంలోని భూములు, అటవీ ఉత్పత్తులపై ఆదివాసులకే హక్కు ఉండాలి. ఈ చట్టం సక్రమంగా అమలు జరగకుండా నీరు గార్చడం వలన లక్షలాది ఎకరాలు ఇప్పటికీ ఆదివాసేతరుల చేతుల్లో వున్నాయి. ఆదివాసేతర పెత్తందార్ల ప్రయోజనాలను కాపాడే పాలకుల విధానాలు, రెవెన్యూ ఉన్నతాధికారుల అవినీతి కారణంగా 1/70 చట్టం అమలు కావడం లేదు.

ఆదివాసులు శతాబ్దాలుగా అనుభవిస్తున్న చారిత్రక అన్యాయాలను తుడిచి పెట్టేందుకే షెడ్యూల్డు తెగల, ఇతర సంప్రదాయ అటవీ నివాసుల కొరకు అటవీ చట్టం 2006 (అటవీ హక్కుల గుర్తింపు చట్టం) తెచ్చామని పాలకులు చెబుతున్నారు. దేశంలోని 750 తెగలకు చెందిన సుమారు 8 కోట్ల మంది ఆదివాసులు తాము పుట్టి పెరిగిన అడవుల్లోనే హక్కులు కోల్పోయి దారుణ దోపిడీకి గురవుతున్నారు. చిరకాలంగా ఆదివాసీ తెగల జీవన విధానం ప్రధానంగా పోడు వ్యవసాయంపై, అటవీ వుత్పత్తులపై ఆధారపడి ఉంది. అడవికీ, ఆదివాసులకు మధ్య విడదీయరాని సంబంధం ఉంది. సంప్రదాయక ఆదివాసుల జీవితం, అటవీ, పర్యావరణ పరిరక్షణ, జాతీయ అటవీ సంపదకు హక్కుదారులుగా ఆదివాసులున్నారు. 2006లో అటవీ హక్కుల గుర్తింపు చట్టం చేస్తూ, ఆ చట్టం ముందు మాటలో 'అటవీ జీవావరణ వ్యవస్థల మనుగడలోనూ, వాటి సుస్థిరతలోనూ భాగస్వాములుగా ఉంటూ వచ్చిన షెడ్యూల్డ్ తెగలు, ఇతర సంప్రదాయక అటవీ నివాసులకు తరతరాలుగా భూములపైనా, ఆవాసం పైనా సమగ్ర హక్కులను గుర్తించడంలో వలస పాలనా కాలంలోనూ, 'స్వతంత్ర' భారతంలోనూ ఆదివాసులకు చారిత్రక అన్యాయం జరిగింది, అని పేర్కొన్నారు. ఆ అన్యాయాన్ని సరిచేసేందుకే చట్టం తెచ్చామని ప్రభుత్వం గొప్పలు చెబుతున్నప్పటికీ గడిచిన దశాబ్ద కాలంలో ఆ దిశగా చర్యలు లేవు. ఈ చట్టం ద్వారా 2005 డిసెంబర్ 13 నాటికి ఆదివాసులు సాగులోనున్న అటవీ భూములకు గరిష్టంగా 10 ఎకరాలకు హక్కు పత్రాలివ్వాలి. చిన్నతరహా అటవీ ఉత్పత్తుల సేకరణ, ఇతర అవసరాల నిమిత్తం ఊరికి ఉన్న అడవిపై ఉమ్మడి హక్కు పత్రాలను ఇవ్వాలి.

దేశవ్యాప్తంగా ఇప్పటివరకూ అమలు చేసిన భూహక్కుల గుర్తింపు గణాంకాలను పరిశీలిస్తే ఆదివాసులకు జరిగిన చారిత్రక అన్యాయాన్ని సరిదిద్దాలన్న చిత్తశుద్ధి పాలకులకు ఏకోశానా లేనట్లు స్పష్టమవుతోంది. కేంద్రం గత సంవత్సరం విడుదల చేసిన లెక్కల ప్రకారం దేశవ్యాప్తంగా 32,37,579 దరఖాస్తులను స్వీకరించగా, 12,79,000 హక్కు పత్రాలు పంపిణీ చేశారు. నివేదిక ప్రకారం దేశవ్యాప్తంగా ఇప్పటివరకూ పంపిణీ జరిగిన భూహక్కు పత్రాలకంటే తిరస్కరణకు గురైనవే ఎక్కువగా ఉన్నాయి. తెలంగాణ రాష్ట్రంలో టి.ఆర్.ఎస్. ప్రభుత్వం ప్రపంచబ్యాంకు సూచనలతో హరితహారం అనే కార్యక్రమం ద్వారా ఆదివాసులు సేద్యం చేసుకొంటున్న భూముల నుండి బేదఖలు చేస్తున్నది.

సామ్రాజ్యవాద ప్రపంచీకరణ విధ్వంసకర అభివృద్ధి నమూనా అమలులోకి వచ్చిన తర్వాత మైనింగ్ కంపెనీలకు మాత్రం విచ్చలవిడిగా అడవిని కేటాయిస్తున్నారు. అభివృద్ధి ప్రాజెక్టుల పేరుతో అటవీ భూమిని ప్రైవేట్ వ్యక్తులకు, కంపెనీలకు బదలాయించే చర్యలు చేపడుతున్నారు. అటవీ మంత్రిత్వశాఖ గత మార్చిలో విడుదల చేసిన గణాంకాల ప్రకారం గనుల చట్టం అమల్లోకి వచ్చిన తర్వాత గనుల తవ్వకాల పేరుతో 3.36 లక్షల ఎకరాల అడవుల్ని నాశనం చేశారు. గనుల తవ్వకం కోసం ఆంధ్రప్రదేశ్ ఉమ్మడి రాష్ట్రంలో 49 వేల ఎకరాలు, గోవాలో 46 వేల ఎకరాలు, ఛత్తీస్‌గఢ్‌లో 68వేల ఎకరాలు, ఒడిశాలో 46 వేల ఎకరాలు, కర్ణాటకలో లక్షా 12 వేల ఎకరాల మేర అడవుల్ని అధికారికంగానే కొల్లగొట్టారు. దేశంలోని రిజర్వు అటవీ ప్రాంతంలో 40 శాతం పైగా అడవులు క్షీణించాయని గణాంకాలు చెబుతున్నాయి. పెద్ద పెద్ద కంపెనీలకు యథేచ్చగా అటవీ భూములు కేటాయిస్తున్న ఈ ప్రభుత్వాలు ఆదివాసుల సాగులోనున్న భూములకు హక్కు పత్రాలివ్వడానికి నిరాకరిస్తున్నాయి.

ఈ నేపథ్యంలోనే సహజ వనరులను సామ్రాజ్యవాదుల కంపెనీలకు, బడా పెట్టుబడిదారులకు దోచి పెట్టడానికి

రూపొందించిన అభివృద్ధి నమూనాలో తమ జీవనోపాధిని, జీవితాలను కోల్పోతున్నవాళ్లు, విస్థాపనకు గురికాబడుతున్న ఆదివాసీలు. భూమిపై, నీటిపై, అడవిపై తమ హక్కులను నిలబెట్టుకోవడానికి, వనరుల విధ్వంసానికి వ్యతిరేకంగా పోరాటాలు సాగిస్తున్నారు.

**మైనారిటీలు-దళితులపై హిందుత్వవాదుల దాడులు**

కేంద్రంలో మోడీ సర్కారు ఏర్పడ్డ నాటి నుంచి అరెస్సెస్ మూకలు చెలరేగిపోతున్నాయి. ప్రగతిశీల, అభ్యుదయ రచయితలపై దాడులు, హత్యలు చేస్తున్నారు. దళితులపై, మైనారిటీలపై దాడులు రోజురోజుకు పెరగడమే కాక క్రూరమైన రూపాలను సంతరించుకొంటున్నాయి. అవమానాలు, వివక్షతలు, వెలివేతలు, తమ తమ భూముల నుండి, ఇళ్ల నుండి గెంటివేతలు, దారుణ హత్యలు లేకుండా రోజు గడవడం లేదు. గడిచిన రెండున్నర సంవత్సరాల బి.జె.పి. పాలనలో ఈ దాడులు సంఖ్యలోనూ, తీవ్రతలోనూ, దుర్మార్గపు స్వభావంలోనూ పెరుగుదల కనిపిస్తుంది. ఉత్తరప్రదేశ్‌లో యోగి ఆదిత్యనాథ్ ముఖ్యమంత్రి అయిన వెంటనే రాష్ట్రంలో కబేలాలను మూసి వేయించాడు. అదే బాటలో జార్ఖండ్, రాజస్థాన్, గుజరాత్ లోని బి.జె.పి. ప్రభుత్వాలు చర్యలు తీసుకుంటున్నాయి. దీనితో లక్షలాది మంది పేద ప్రజలు ముఖ్యంగా ముస్లింలు జీవించే హక్కును కోల్పోయారు.

బి.జె.పి., సంఘ్ పరివార్ శక్తులు తమ ఫ్యూడల్, అగ్రకుల తత్వంతో హిందూత్వ, సాంస్కృతిక జాతీయత భావాలను వ్యాప్తి చేయడానికి గోరక్షకులనే పేరుతో దళితులపై, మైనారిటీ మతస్థులపై దాడులను ప్రేరేపిస్తున్నాయి. ముజఫర్‌పూర్ ఊచకోత, 2016 జూలైలో కర్ణాటకలోని శాంతిపూరాలో దళితులపై దాడులు, హైదరాబాద్‌లో రోహిత్ వేముల ఆత్మహత్య, జె.ఎన్.యు.లో కన్హయ్ కుమార్ తదితరులపై దాడి, కుట్రకేసు (ఫిబ్రవరి 9 సంఘటనపై) జె.ఎన్.యు. విద్యార్థి నజీబ్ అహ్మద్ మిస్సింగ్(అక్టోబర్ 14 నుంచి) 2015 సెప్టెంబర్ ఉత్తరప్రదేశ్‌లోని దాద్రిలో అహ్మద్ అక్లాఖ్‌ను హత్యగావించడం, హర్యానాలోని రోహతక్ పట్టణంలో ఐదుగురితో కూడిన ఒక మూగ దళిత యువతిపై రెండోసారి లైంగికదాడికి పాల్పడిన సంఘటన దిగ్భ్రాంతికరమైంది. రేప్ బాధితురాలు తమపై పోలీసు కేసు పెట్టినందుకు, రాజీకి నిరాకరించినందుకు ఆమెపై ప్రతికారంగా ఈ ఘోరానికి పాల్పడ్డారు. మొదటి రేప్ సంఘటన మూడెండ్ల క్రితం జరగగా అధికారుల ఉదాసీనత మూలంగా, నిందితులు పలుకుబడి గల వారైనందున పోలీసులు నిందితులను అరెస్టు చేసి ఆ తర్వాత బెయిల్‌పై వదిలిపెట్టారు. దీంతో చట్టం తమనేమి చేయలేదన్న ధీమాతో వారు బాధితురాలిపై మరోసారి అఘాయిత్యానికి పాల్పడ గలిగారు. ఇవన్నీ అనేక ఘటనల్లో మచ్చుకు కొన్ని మాత్రమే.

గుజరాత్ రాష్ట్రంలోని గిరి సోమనాథ్ జిల్లాలోని ఉనా పట్టణం నుంచి 20 కి.మీ.ల దూరంలో ఉన్న మోట సమధియాల గ్రామంలో జూన్ 11న నలుగురు యువకులు పశు చర్మాలను సమీప పట్టణంలోని మార్కెట్‌కు తరలిస్తుంటే, గోవధకు పాల్పడ్డారని ఆరోపిస్తూ ఇనుప చువ్వలతో, కర్రలతో దాడి చేసి విపరీతంగా కొట్టారు. జీపుకు తాళ్లతో కట్టి పోలీసుస్టేషన్ దాక ఈడ్చుకుంటూ తీసుకెళ్లారు. వారు తమ దుశ్చర్యలను ధైర్యంగా సామాజిక మాధ్యమాల్లో పోస్టు చేశారు. మన దేశంలో ఉనా ఘటన మొదటిది కాదు. గతంలో కీళవేణ్మని, కారంచేడు, చుండూరు, ఖైర్లాంజీ, లక్ష్మింపేట వంటి ప్రాంతాల్లో అగ్రకులస్థులు దళితులపై దాడులు చేసి ప్రాణాలు తీశారు. సరిగ్గా ఇలాగే హర్యానాలోని జజ్జర్ పట్టణ సమీపంలో దులినా పోలీసు అవుట్ పోస్ట్ వద్ద 2002 అక్టోబర్ 15న బాద్షాపూర్‌కు చెందిన ఐదుగురు దళిత యువకులను పోలీసుల కళ్లెదుటే కొట్టి చంపారు. వీరు చనిపోయిన ఆవుల చర్మాలు వలిచి కర్నాల్ మార్కెట్‌కు తరలిస్తుంటే, గోవధకు పాల్పడ్డారని వందలాది మంది దాడిచేశారు. వారిని పోలీస్ ఔట్‌పోస్టుకు తరలించినా వదలకుండా వెంటాడి హత్యచేశారు.

ఉనా సంఘటన గుజరాత్ వ్యాప్తంగా దళితులను ఏకం చేసింది. నిరసనలు మిన్నంటాయి. ఈ నిరసనలు దేశవ్యాప్తంగా విస్తరిస్తున్నాయి. అణచబడుతున్న ముస్లింలు, దళితులు ఇతర పీడితులు హిందూ ఫాసిస్టు దాడులకు వ్యతిరేకంగా బలమైన ఐక్యతతో ముందుకు వస్తున్నారు. దళితులకు భూమి, ఆత్మ గౌరవం కోసం ఈ పోరాటాలు నూతన ఒరవడిలో ముందుకు వస్తున్నాయి.

**ముగింపు**

సామ్రాజ్యవాద ప్రపంచీకరణ విధానాల వలన దేశ ఆర్థిక వ్యవస్థ పూర్తిగా పరాధీనమైంది. దేశ ఆర్థిక వ్యవస్థ ఐ.ఎం.ఎఫ్., ప్రపంచబ్యాంకు సంస్థల నిర్దేశకత్వంలో బహుళజాతి కంపెనీల నయా వలస దోపిడీకి గురి అవుతున్నది. కేంద్రంలో, రాష్ట్రాల్లో వరుసగా అధికారానికి వస్తున్న ప్రభుత్వాలు ఈ విధానాలు కొనసాగిస్తూ దేశాన్ని సామ్రాజ్యవాదులకు అమ్మి వేస్తున్నారు. సామాన్య ప్రజలకు ఈ వాస్తవాలు అర్థం కాకుండా ఉండడానికి, రాజకీయ నాయకులు అభివృద్ధి మంత్రాన్ని జపిస్తూ రోజుకో వాగ్దానం చేస్తూ పోతుంటారు. ఈ రాజకీయ నాయకులు మాటల్లో ప్రజలకు అరచేతిలో వైకుంఠం చూపిస్తుంటారు. కాని వాస్తవంగా దేశ అభివృద్ధి శూన్యం కాగా, సామ్రాజ్యవాదులకు, దళారీ నిరంకుశ బూర్జువా, బడా భూస్వామ్య వర్గాలకు విపరీతమైన లాభాలు స్వంతమవుతున్నాయి. దేశంలో అంబానీ, ఆదానీ, టాటా, బిర్లాల

ఆస్థులు లక్షల కోట్లలోకి పెరిగిపోతున్నాయి. సామ్రాజ్యవాదుల, వారి మోచేతి నీళ్ళు త్రాగే ఈ దళారీ పెట్టుబడిదారుల చేతుల్లో పత్రికలు, ఇంటర్నేట్, సమాచార వ్యవస్థతో పాటు అన్ని మాధ్యమాలు కేంద్రీకృతమై ప్రజలను వంచించడానికి అబద్దాలు ప్రచారం చేస్తూ ఉంటాయి. ప్రధానమంత్రి మోడీ నల్లధనంకు వ్యతిరేకంగా పోరాడుతున్నానని చెబుతూనే, దేశంలో ఈ కుబేరుల నల్లధనం జోలికి వెళ్లడం లేదు. ఈ దళారీలకే ప్రభుత్వం అన్ని రంగాల్లో కొమ్ముకాస్తున్నది. దేశ సహజ సంపదను, ప్రజల శ్రమను, ఆస్థులను, ఆత్మగౌరవాన్ని దోపిడీ దారుల ప్రయోజనాలకు ఫణంగా పెడుతున్నారు.

మరో వైపు ఈ దోపిడీకి, పీడనలకు వ్యతిరేకంగా కార్మికులు, రైతాంగం, విద్యార్థులు, బుద్ధి జీవులు, ప్రజాస్వామిక వాదులు, యువకులు, మహిళలు, వివిధ సెక్షన్ల ప్రజలు దళితులు ఆదివాసులు, మైనారిటీలు, అల్ప సంఖ్యాకులు, వివిధ జాతులు, పీడిత ప్రజలు మిలిటెంటు పోరాటాలను నడుపుతున్నారు. తూర్పు, మధ్య భారతంలో ఆదివాసులు, దేశ మైదాన ప్రాంతాల్లో రైతాంగం, పట్టణాల్లో కార్మికవర్గం, యూనివర్సిటీల్లో విద్యార్థులు, కశ్మీర్, ఈశాన్య రాష్ట్రాల్లో జాతి పోరాటాలు, గుజరాత్ లోని ఉనా నుండి దేశవ్యాప్తంగా విద్యాలయాల్లో దళితులు పోరాటంలో కదనరంగాన దూకుతున్నారు. దేశంలో రోజురోజుకు విప్లవ పరిస్థితులు పుంజుకుంటున్నాయి.

ఉవ్వెత్తున లేస్తున్న ప్రజా ఆందోళనలకు భీతిల్లుతున్న పాలక వర్గాలు, మోడీ నాయకత్వంలో బి.జె.పి. ప్రభుత్వం దేశంలో బ్రాహ్మణీయ ఫాసిజాన్ని అమలు చేస్తున్నది. దేశవ్యాప్తంగా ప్రజలు, ప్రజాస్వామిక వాదులు, పెటీ బూర్జువాలు, జాతులు, వివిధ సెక్షన్లు ప్రజలపై తీవ్ర దమనకాడ కొనసాగిస్తున్నది. దేశవ్యాప్తంగా ఆపరేషన్ గ్రీన్‌హంట్‌ను తీవ్రతరం చేసి ఆదివాసులపై, ప్రజలపై బూటకపు ఎన్‌కౌంటర్లు తీవ్రతరం చేసింది. మేధావులు, ప్రజాస్వామిక వాదులపై అక్రమ కేసులు బనాయించి ఫాసిస్టు చట్టాల ద్వారా జైళ్ళలో నిర్బంధిసున్నది. జాతుల పోరాటాలను క్రూరంగా అణచివేస్తున్నది. మహిళలపై ప్రభుత్వ పశు బలగాలు జరిపే అత్యాచారాలు లెక్కకు మించి జరుగుతున్నాయి. దళితులపై, మైనారిటీలపై దాడులు తీవ్రతరం అయి కొనసాగుతున్నాయి.

యూనివర్సిటీలు పోలీసు, ఆరెస్సెస్ మూకలకు నిలయాలుగా మారాయి. మావోయిస్టు పార్టీపై మిషన్-2017, సరండా లాంటి యాక్షన్ పథకంతో చుట్టివేత అణచివేత దాడులను కొనసాగిస్తున్నది.

పాతిక సంవత్సరాల సామ్రాజ్యవాద ప్రపంచీకరణ దుష్ఫలితాలు దేశ ప్రజలను తిరుగుబాటుకు ప్రోత్సహిస్తున్నాయి. ప్రజలు ఎక్కడికక్కడ పోరాటాలు కొనసాగిస్తున్నారు. ఈ పోరాటాలకు నాయకత్వం అందించాల్సిన కర్తవ్యం విప్లవ పార్టీలపై ఉంది. ఇప్పుడు కేవలం మాటలు వల్లించడం కాదు, ఆచరణలో ప్రజలను సాయుధ పోరాటాలకు సిద్ధం చేసి పోరాడడం ద్వారానే పాలకవర్గాల పచ్చి ఫాసిస్టు దమనకాండను ఓడించగలం. తూర్పు మధ్య భారతం, కశ్మీర్, ఈశాన్య జాతుల పోరాట బాటలో దేశ ప్రజలందరూ కదలాలి. సాయుధ విప్లవం ద్వారానే ఈ పాలకవర్గాలను కూలదోయాలి. దేశంలో నూతన ప్రజాస్వామిక విప్లవాన్ని విజయవంతం చేయాలి. ○

*(...........57వ పేజీ తరువాయి)*

జరుగుతున్న ఆందోళనలో భాగంగా వేలాది మంది ప్రజలు పెద్ద సంఖ్యలో లారీలను దగ్ధం చేసారు. విప్లవ ప్రచార, ఆందోళన కార్యక్రమాలు, సి.ఎన్.ఎం. శిక్షణ, ప్రదర్శనలు జోన్ వ్యాప్తంగా ఉత్సహంగా జరుగుతున్నాయి.

దండకారణ్యంలో రోజు రోజుకు నిర్బంధం పెరుగుతున్నా, హత్యాకాండ పెచ్చరిల్లి పోతున్నా ప్రజలు విప్లవ పార్టీ నాయకత్వంలో అనేక సమస్యలపై పోరాటాలు కొనసాగిస్తూనే ఉన్నారు. తునికాకు, వెదురు కూలీ రేట్ల కోసం, రైతాంగం గిట్టుబాటు ధరల కోసం, రాజ్య నిర్బంధానికి వ్యతిరేకంగా, మహిళలపై జరుగుతున్న అత్యాచారాలకు వ్యతిరేకంగా పోరాడుతూనే వున్నారు. జనతన సర్కార్లలో ప్రజలు ఉత్పత్తిని అభివృద్ధి చేయడం వైపు దృష్టి మళ్లించి సమిష్టి పనులను విజయవంతం చేస్తున్నారు. బీజాపూర్ లాంటి పట్టణ ప్రాంతాలకు వేలాదిగా కదిలి నిరసన ప్రదర్శనలు చేస్తూ, హక్కులను డిమాండ్ చేస్తూ పోరాడుతున్నారు. ఫిబ్రవరి 10న బీజాపూర్‌లో జరిగిన మహా భూంకాల్ దివాస్‌కు 25 వేల మంది ప్రజలు పాల్గొన్నారు. రాజ్య నిర్బంధానికి వ్యతిరేకంగా నినదించారు. గడ్చిరోలి ప్రాంతంలో మార్చి 8న జరిగిన అంతర్జాతీయ మహిళా దినోత్సవంలో 5వేల మంది ప్రజలు పాల్గొన్నారు. మనుస్మృతిని మంటల్లో దగ్ధం చేసి మహిళల హక్కుల గురించి నినదించారు. రాజ్యహింసను ఖండించారు. భూమి చదును కార్యక్రమాలు ప్రజల రక్షణలో సాగుతున్నాయి. ప్రజల, ప్రజాస్వామిక వాదుల నిరసనకు భయపడిన ఛత్తీస్‌గఢ్ ప్రభుత్వం ఐ.జి. కల్లూరిని ఈ ప్రాంతం బాధ్యతల్లో లేకుండా పంపివేసింది. ప్రజా వ్యతిరేకంగా రూపొందించిన 'అగ్ని'ని రద్దు చేసుకుంది. జాతీయ మానవ హక్కుల సంఘం స్పందించి అత్యాచారానికి గురైన మహిళలకు 37లక్షల రూపాయల నష్ట పరిహారాన్ని ఇవ్వాలని ఆదేశించింది. ఈ రకంగా ప్రజలు పోరాడి తమ హక్కులను నిలుపుకోవడంతో పాటు, మిషన్-2017ను ఓడించేందుకు సిద్ధపడుతున్నారు. దండకారణ్యంలో ప్రజలపై యుద్ధాన్ని ప్రజల జీవితంలో, ఉత్పత్తిలో భాగంగానే చూడాలి.

○

# దేశీయ, విదేశీయ కార్పొరేట్ సంస్థల ప్రయోజనాల కోసమే

# నోట్ల రద్దు-ప్రజా ధనం బ్యాంకుల్లో జమ

సామ్రాజ్యవాద, నిరంకుశ దళారీ బూర్జువా, బడా భూస్వామ్య వర్గాల ప్రధాన సేవకుడు మోడీ 500, 1000 రూపాయల నోట్లను రద్దు చేస్తానని, వాటి స్థానంలో 500, 2000 రూపాయల నోట్లు చెలామణీలోకి తెస్తాననీ నవంబర్ 8 నాటి రాత్రి అకస్మాత్తుగా ప్రకటించాడు. అన్యాయ, ఇబ్బందికరమైన షరతులతో బ్యాంకుల్లో, పోస్టాఫీసుల్లో పాత నోట్లను జమ చేయడానికి డిసెంబర్ 30ని కాలపరిమితిగా నిర్ణయించాడు. పాత నోట్లను మార్చడానికి, కొత్త నోట్లను పొందడానికి తగిన ఏర్పాట్లు చేయనందున దేశవ్యాప్తంగా పేద, ఆదివాసీ, దళిత, వెనుకబడిన, మధ్య తరగతి ప్రజలు చెప్పనలవి కాని కష్టాలనెదుర్కొంటున్నారు. మన దేశంలో 1946లో మొదటిసారి, 1978లో రెండవసారి పెద్ద నోట్లను రద్దు చేసినప్పటికీ, ఆ సమయంలో సాధారణ ప్రజలు పెద్దగా ఇబ్బందులకు గురి కాలేదు. ఎందుకంటే ఆ సమయంలో ఆర్థిక వ్యవస్థలో పెద్ద నోట్ల చెలామణీ కేవలం రెండు శాతం మాత్రమే వుండింది. కాగా నేడు దేశంలోని నగదులో 500, 1000 నోట్ల విలువ 86.4 శాతం వుంటే, 97 శాతం చెల్లింపులు నగదులోనే జరుగుతున్నాయి. రిజర్వ్ బ్యాంకు లెక్కల ప్రకారం 500 రూపాయల నోట్ల మొత్తం విలువ 8.2 లక్షల కోట్లు, కాగా 1000 రూపాయల నోట్ల మొత్తం విలువ 6.4 లక్షల కోట్లు. ఈ విధంగా 500, 1000 నోట్ల మొత్తం విలువ 14.6 లక్షల కోట్ల రూపాయలను ఒక్క దెబ్బతో రద్దు చేయడంతో దేశంలో గందరగోళం నెలకొంది.

**మోడీ నోట్ల రద్దుకు ఏం కారణాలు చెప్పాడు?**

మోడీ నోట్ల రద్దుకు మూడు కారణాలు చెప్పాడు. అవి - ఆర్థిక వ్యవస్థ నుండి 'నల్ల ధనాన్ని' పారదోలడం, అవినీతిని నిర్మూలించడం, నకిలీ నోట్ల చెలామణీని అడ్డుకొని ఉగ్రవాదం, కశ్మీరీ ప్రజా పోరాటం, ఈశాన్య ప్రాంతాల జాతుల పోరాటం, భారత కమ్యూనిస్టు పార్టీ (మావోయిస్టు)లను అంతం చేయడం.

**అసలు నిజమేంటి?**

పాలకుల నినాదాల వెనుక వుండే విధానాలను సరిగా అర్థం చేసుకోకుంటే పాలితులు పదే పదే మోసపోతారని వందేళ్ల క్రితమే కామ్రేడ్ లెనిన్ అన్నాడు. నోట్ల రద్దు సందర్భంలో ఈ మాటలు నూటికి నూరు శాతం నిజమని నిరూపితమవుతున్నాయి. నోట్ల రద్దుకు మోడీ చెప్పిన కారణాలు పూర్తిగా నిరాధారమైనవి, అవాస్తవమైనవి, మోసపూరితమైనవి. నోట్ల రద్దు నిర్ణయం ప్రజా వ్యతిరేకమైనది, దేశ వ్యతిరేకమైనది, ఫాసిస్టుదీ, దేశ ఆర్థిక వ్యవస్థను బలహీనపరిచేది, దేశ-విదేశ కార్పొరేట్ సంస్థలకు అపరిమితమైన ప్రయోజనాలను కట్టబెట్టేది. సామ్రాజ్యవాద అనుకూల సరళీకరణ, ప్రైవేటీకరణ, ప్రపంచీకరణ విధానాలను అపూర్వ రీతిలో అమలు చేయడం కోసం, అంతర్జాతీయ ఆర్థిక, ద్రవ్య సంక్షోభ భారాన్ని పీడిత, శ్రామిక ప్రజల భుజాలపై మోపడం కోసం అంతర్జాతీయ ద్రవ్యనిధి (ఐఎంఎఫ్), ప్రపంచబ్యాంకు, ఏడీబీ వంటి ద్రవ్య సంస్థల దిశా-నిర్దేశాల ప్రకారం నోట్ల రద్దు, నగదు రహిత ఆర్థిక వ్యవస్థ వైపు ప్రయాణించే నిర్ణయం తీసుకున్నాడు.

ఐఎంఎఫ్, ప్రపంచబ్యాంకు ఆదేశాల ప్రకారం ప్రభుత్వం దేశంలోని అధిక, ఇంకా చెప్పాలంటే మొత్తం ప్రజలను అనేక రకాల పన్నుల పరిధిలోకి తీసుకురావడానికీ, వాళ్ల రోజువారీ కార్యకలాపాలన్నింటినీ అధికార పరిధిలోకి తేవడానికి నోట్ల రద్దు, నగదు రహిత ఆర్థిక వ్యవస్థను ముందుకు తెస్తున్నారు. నగదు చెల్లింపుల నుండి నగదు రహిత ఆన్ లైన్ చెల్లింపుల విధానంలోకి ఒకసారి ప్రజలు స్వేచ్ఛగా ప్రవేశించిన తర్వాత వాళ్లంతట వాళ్లే పన్నుల వ్యవస్థలోకి వచ్చేస్తారు. మొత్తం కొనుగోళ్లు-అమ్మకాలు, మొత్తం చెల్లింపులు ఆన్ లైన్ అయితే పన్నులలో పెరుగుదల వుంటుంది. ఇదే మోడీ నోట్ల రద్దు వెనుకనున్న ఉద్దేశంలోని ముఖ్యమైన భాగం.

బ్యాంకు పెట్టుబడిని పెంచడం కోసం, అత్యధిక ప్రజలను బ్యాంకులతో జోడించే కుట్రతో గతంలో మోడీ జన్‌ధన్ యోజనను ప్రారంభించాడు. ఇందులో భాగంగా 26 కోట్లకు పైగా ఖాతాలు తెరువబడ్డాయి. ఈ ఖాతాల్లో 71 వేల కోట్ల రూపాయల కంటే అధిక మొత్తంలో సాధారణ ప్రజల కష్టార్జితం జమయింది. అయితే వీటిలోని అనేక ఖాతాల్లో నయా పైసా కూడా జమ కాలేదన్నది ఒక వాస్తవం. ఇప్పుడీ ధనం బ్యాంకు పెట్టుబడిగా మారి దేశ, విదేశ పెట్టుబడిదారుల ప్రయోజనాలకు ఉపయోగపడుతున్నది. అటల్ పెన్షన్ యోజన, ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజన తదితర పథకాలన్నీ నిజానికి కార్పొరేట్ దోపిడీ గొలుసులలోని పలు లింకులు. నోట్ల రద్దు ఆ గొలుసులలోని మరో లింకు. భారతీయ రిజర్వ్‌బ్యాంకు మాజీ గవర్నర్, మాజీ ఆర్థికమంత్రి, రెండు సార్లు ప్రధానమంత్రిగా పని చేసిన మన్‌మోహన్ సింగ్ నోట్ల రద్దును 'తీవ్ర అస్తవ్యస్తత'గా అభివర్ణించాడు. రాజ్యసభలో మాట్లాడుతూ 'ఇది వ్యవస్థాగత దోపిడీ, చట్టబద్ధ బందిపోటుతనం'గా పేర్కొంటూ దీని మూలంగా రెండు శాతం జీడీపీ తగ్గిపోతుందన్నాడు.

రాజకీయంగా చూస్తే నోట్ల రద్దు నిర్ణయం తాము ఎదుర్కొంటున్న వాస్తవ సమస్యల నుండి ప్రజలనూ, దేశాన్నీ పక్కదారి పట్టించడానికి తీసుకున్న కుట్రపూరిత చర్య. 'అచ్చే దిన్ ఆయేంగే', 'విదేశీ బ్యాంకుల్లో మూలుగుతున్న 'నల్ల ధనాన్ని' వాపస్ తీసుకొచ్చి దేశంలోని పౌరుల ప్రతి ఒక్కరి ఖాతాలో 15 లక్షల రూపాయలను డిపాజిట్ చేస్తాం' అంటూ ఎన్నికల్లో ప్రజలను మభ్యపెట్టడానికి చేసిన వాగ్దానాలను మరిపించడానికి పాల్పడిన నీచమైన చర్య. మరోవైపు సమయమూ, సందర్భమూ చూసినపుడు పంజాబు, ఉత్తరప్రదేశ్‌లతో పాటు ఐదు రాష్ట్రాల ఎన్నికలకు తాను అన్ని రకాల ఏర్పాట్లు చేసుకొని, ఇతర పార్టీల చందాల వనరులపై దెబ్బకొట్టి వాటిని బలహీనపర్చడం. భాజపా నోట్ల రద్దు ప్రకటన కంటే ముందే తన ఖాతాలో పాత నోట్లను డిపాజిట్ చేసి ఫండ్స్ రూపంలోని తమ 'నల్ల ధనాన్ని' తెల్లగా చేసుకుంది.

**'నల్ల ధనం' అంటే ఏమిటి? ఎక్కడుంది? ఏ రూపంలో వుంది? ఎంత వుంది? ఎవరి దగ్గరుంది?**

ఏ దేశ ఆర్థిక వ్యవస్థలోనైనా అమలులో వున్న చట్టాలూ, పన్నుల వ్యవస్థకు లోబడి సంపాదించిన ఆదాయాన్నీ, కూడబెట్టుకున్న సంపదనూ చట్టబద్ధ ధనం లేదా 'తెల్ల ధనం' అంటారు. కాగా పన్నులు కట్టకుండా, తప్పుడు లెక్కలు చూపి, చట్ట వ్యతిరేకంగా సంపాదించిన ఆదాయాన్నీ, కూడబెట్టుకున్న సంపదను 'నల్ల ధనం' లేదా అక్రమ ధనం అంటారు. 'నల్ల ధనం'లోని ఒక పెద్ద భాగం ఎక్కడా లెక్కలోకి రాకుండా, పన్నుల వ్యవస్థ పరిధిలోకి రాకుండా వుంటుంది. ఇక్కడ మనం స్పష్టంగా అర్థం చేసుకోవాల్సిన విషయం ఏంటంటే దోపిడీ, పీడన, అణచివేత, అన్యాయం ద్వారానే సామాజిక సంపద పోగయ్యే దోపిడీ పునాదిని కల్గిన అసమాన సామాజిక వ్యవస్థలో 'తెల్ల' లేదా సక్రమ ధనం, 'నల్ల' లేదా అక్రమ ధనం అనే వాటికి అర్థమే లేదు. ఉత్పత్తి కార్యకలాపాల్లో భాగమయ్యే శ్రామికులకు తమ కష్టానికి తగిన ఫలితం ఎప్పటి వరకు దక్కదో, అప్పటి వరకూ పెట్టుబడిదారులూ, భూస్వాములూ, బహుళ జాతి కంపెనీల దగ్గర పోగుపడిన సంపదంతా అక్రమ ధనమే అని చెప్పుకోవడం సముచితంగా వుంటుంది. ఈ రకమైన ఆర్థిక వ్యవస్థను సమాంతర ఆర్థిక వ్యవస్థ అనవచ్చు.

1978లో పెద్ద నోట్లను రద్దు చేసినపుడు అప్పటి రిజర్వ్ బ్యాంకు గవర్నర్ ఐ.జె.పటేల్ నాటి ప్రధాని మొరార్జీ దేశాయ్‌తో నోట్ల రద్దుతో 'నల్లధనాన్ని' అరికట్టలేమని అన్నాడు. దీనిని బట్టి నోట్ల రద్దుతో 'నల్ల ధనాన్ని' వెలికితీసి పారేస్తామని మోదీ చెప్పడం ఉత్త ప్రేలాపనే కాదు అసలు వుద్దేశాన్ని మరుగుపరిచి ప్రజలను మభ్యపెట్టే గాలి కబుర్లు తప్ప మరేమీ కాదు.

'ది బ్లాక్ ఎకానమీ ఇన్ ఇండియా' రచయిత ప్రొఫెసర్ అరుణ్ కుమార్ ప్రకారం 'నల్ల' ఆర్థిక వ్యవస్థ 90 లక్షల కోట్ల పరిమాణంలో వుంది. ఇది దేశంలో సమాంతరంగా కాక 'తెల్ల' ఆర్థిక వ్యవస్థతో పెనవేసుకుపోయి వుంది. 2012 విలువల ప్రకారం ఇది 63.9 లక్షల కోట్లతో, 106.44 లక్షల కోట్ల రూపాయల దేశ జీడీపీలో 60 శాతంగా వుంది. కానీ 'నల్ల ధనం' ఇనుప పెట్టెల్లో, పరుపుల్లో, తలగడల్లో, స్నానం గదుల్లో, మరుగు దొడ్లలో వుండదు. అది పెద్ద నోట్ల రూపంలో వుండేది కూడా స్వల్ప మొత్తమే. నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ పబ్లిక్ ఫైనాన్స్ అండ్ పాలసీ (ఎన్ఐపీఎఫ్‌పీ) ప్రకారం 'నల్ల ధనం' నగదులో దాదాపు ఆరు శాతం మాత్రమే, 3.83 లక్షల కోట్లు వుంది. నోట్ల రద్దు తర్వాత మళ్లీ మార్కెట్లోకి కొత్త పెద్ద నోట్లను తెస్తున్నారు కనుక, ఒక రమారమి అంచానా ప్రకారం ఎక్కువలో ఎక్కువ పది శాతం, అంటే 38.3 వేల కోట్లు మాత్రమే పెద్ద నోట్లు వాపస్ తేగలిగే అవకాశం వుంది. అంటే మిగతా 94 శాతం 'నల్ల ధనం' ఇతర రూపాల్లో వర్ధిల్లుతున్నది.

వ్యాపారంలో పెట్టుబడిగా పెట్టి పన్నులు చెల్లించనిదే నిజమైన 'నల్లధనం' అవుతుంది. ఇది లంచం తదితరాలతో పోగవుతుంది. నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్ 2012లో చేసిన అధ్యయనం – స్టడీ ఆన్ అన్ అకౌంటెడ్ ఇన్‌కం/ వెల్త్ బోత్ ఇన్ సైడ్ అవుట్ సైడ్ ది కంట్రీ' ప్రకారం తక్కువ విలువ అంచనా కట్టిన భూమి–భవనాలు, బంగారం, వెండి, ఇతర విలువైన లోహాలు, రత్నాలు, వజ్రాలు, బినామీ పెట్టుబడులు, విలువ తగ్గించి చూపే లేదా అప్రకటిత స్టాక్స్ రూపంలో నల్లధనం అత్యధిక పరిమాణంలో వుంటుంది. అప్రకటిత సంపద, అప్రకటిత విదేశీ సంపద–నగదు రూపంలో వుంటుంది. దీనితో పాటు 'నల్లధనం' వాస్తవం కంటే తక్కువ లేదా ఎక్కువ బిల్లులు చూపే విదేశీ వ్యాపార కార్యకలాపాలు, ఉన్నత విద్యా సంస్థలు, కార్పొరేట్ ఆసుపత్రులు, రియల్ ఎస్టేట్ వ్యాపారం, గనుల పరిశ్రమల్లో పెట్టిన పెట్టుబడి రూపంలో వుంటుంది. ఈ పెట్టుబడి నిరంతరం అభివృద్ధి చెందుతూ వుంటుంది. ఇక్కడ గమనించాల్సిన విషయం ఏంటంటే 'నల్లధనం' ఎల్లప్పుడూ 'నలుపు'లోనే వుండదు. అది 'నలుపు' నుండి 'తెలుపు'లోకి మారుతుంది. తిరిగి 'తెలుపు' నుండి 'నలుపు'లోకి మారుతుంది. ఈ క్రమంలో దాని పరిమాణం పెరిగిపోతూ వుంటుంది. ఈ ప్రక్రియ విదేశీ ప్రత్యక్ష పెట్టుబడుల రూపంలో, ప్రవాస భారతీయుల ద్వారా దేశంలో పెట్టే పెట్టుబడుల రూపంలో, దేశం నుండి విదేశీ బ్యాంకు ఖాతాల్లో డిపాజిట్ చేసిన మొత్తం రూపంలో, పాలకుల ద్వారా కార్పొరేట్ సంస్థలకు ఇవ్వబడే పన్నుల మినహాయింపుల బహిరంగ దోపిడీ రూపంలోనూ, దేశీ–విదేశీ కార్పొరేట్ సంస్థల అక్రమ ప్రయోజనాల కోసం తయారు చేసిన

చట్టాల సహాయంతో, భారీ పరిమాణంలో పెట్టుబడిదారుల బ్యాంకు అప్పులను నాన్ పెర్ఫామెన్స్ అసెట్స్ (దివాళా తీసిన ఖాతాలు) పేరుతో రద్దు చేయడం రూపంలో కొనసాగుతుంది. ఏ పార్టీ అధికారంలో వుందనే దానితో సంబంధం లేకుండా ప్రభుత్వాలన్నీ ఈ 'నల్ల ధనాన్ని' సంరక్షిస్తాయి. విదేశాలకు ధనాన్ని తీసుకెళ్లే పరిమితిని గత సంవత్సరం మోడీ ప్రభుత్వం పెంచిందనే విషయం ఇక్కడ గుర్తు తెచ్చుకోవడం అవసరం.

దళారీ నిరంకుశ పెట్టుబడిదారులూ, అవినీతి రాజకీయ నాయకులూ- అధికారులూ, బడా వ్యాపారులూ, బడా కాంట్రాక్టర్లూ, బడా భూస్వాములూ- జమీందార్లూ, భూ మాఫియాలూ ప్రభుత్వ-పాలనా సంరక్షణలో వర్ధిల్లే ఇతర మాఫియా-గూండాలే 'నల్ల ధన' అధినేతలు.

2012 ఫిబ్రవరిలో కేంద్ర ప్రభుత్వం సుప్రీం కోర్టుకు సమర్పించిన అఫిడవిట్‌లో స్విస్, మారిసస్, బ్రిటిష్ వర్జిన్ ఐలాండ్స్, సింగపూర్ తదితర విదేశీ బ్యాంకులలోని భారతీయుల ఖాతాల్లో 500 బిలియన్ డాలర్ల సంపద పేరుకుపోయి వుందని తెలియజేసింది. సుప్రీం కోర్టు చెప్పిన తర్వాతనే మోడీ ప్రభుత్వం స్పెషల్ ఇన్వెస్టిగేషన్ టీం (ఎస్ఐటీ)ని ఏర్పాటు చేసిందనే విషయం ఇక్కడ గుర్తు తెచ్చుకోవాలి. అయితే దేశ సంపదను విదేశీ బ్యాంకుల్లో జమచేసిన 782 మంది దేశద్రోహుల గురించి 'పనామా పేపర్స్', 'వికీలీక్స్'లు బయటపెట్టినప్పటికీ, వాళ్లపై మోడీ వీసమెత్తు చర్య తీసుకోలేదు. విదేశీ సంబంధాలూ, విదేశీ వ్యాణిజ్య ఒప్పందాలూ దెబ్బతింటాయనే సాకుతో ద్రోహుల పేర్లన్నీ బయట పెట్టడానికి కూడా నిరాకరించాడు.

**నోట్ల రద్దుతో ఎలా, ఎవరికి, ఏ ప్రయోజనం చేకూరింది?**

నోట్ల రద్దుతో విదేశీ బడా పెట్టుబడిదారులు (ఎంఎన్‌సీ/టీఎన్‌సీ కంపెనీలు), పెట్టుబడి మదుపుదారులు, బ్యాంకర్లు, అంబానీ, అదానీ, టాటా, బిర్లా, జిందల్, మిత్తల్, రూయియా వంటి దేశీయ దళారీ బడా పెట్టుబడిదారులు చాలా సంతోష పడుతున్నారు. అందుకనే ఐఎంఎఫ్, బిల్‌గేట్స్ వంటి బిలియనీర్లు, ఫిక్కీ, అసోచం వంటి భారత దళారీ పెట్టుబడిదారుల సంఘాలు, దేశీయ బడా పారిశ్రామిక సంస్థలు నోట్ల రద్దును పెద్ద ఎత్తున స్వాగతించాయి.

డిసెంబర్ 30 వరకూ ప్రభుత్వం ప్రకటించనప్పటికీ నోట్ల రద్దు తర్వాత దాదాపు పద్నాలుగు లక్షల కోట్ల రూపాయలు బ్యాంకులో జమ అయ్యాయని ఒక అంచనా. ఉన్న అక్రమ ధనం అంతా నోట్ల రద్దుతో సక్రమ ధనం అయిందని భావించాల్సి వుంటుంది కాబోలు!

ఇప్పుడు బ్యాంకుల్లో జమయిన ఈ మొత్తాన్ని తక్కువ వడ్డీ రేటుపై దేశ, విదేశ కార్పొరేటు సంస్థలకు ఇస్తారు. రిజర్వ్ బ్యాంకు ఇటీవల బ్యాంకు రుణాలతో పాటు బ్యాంకు డిపాజిట్లపై కూడా వడ్డీ రేటును తగ్గించిందనేది ఇక్కడ గమనార్హం. దీనితో చౌకగా పెట్టుబడులు సంపాదించుకొని కార్పొరేట్ సంస్థలు లాభాలు చేసుకోవడానికి వీలవుతుంది.

**బ్యాంకుల ద్వారా కార్పొరేట్ కంపెనీలకు ఇచ్చిన రుణాల మాఫీ**

2013-15 మధ్యలో ప్రభుత్వం చెప్పడంతో ప్రైవేట్ రంగంలోని 20 వాణిజ్య బ్యాంకులు దాదాపు వంద మంది డిఫాల్టర్ కార్పొరేట్ సంస్థలకు 1,14,000 కోట్ల రూపాయల రుణాన్ని మాఫీ చేశారు. ఇవి బడా సంస్థల దివాళా తీసిన ఖాతాలు. ప్రస్తుతం కార్పొరేటు కంపెనీల బ్యాంకు రుణాల మొత్తం 13 లక్షల కోట్లు వుంది. వీటిని బ్యాంకులు దివాళా తీసిన ఖాతాలు/ఎన్‌పీఏగా పరిగణిస్తున్నాయి. వీటిని వసూలు చేయడం కాక మాఫీ చేయడానికి కుట్రలు సాగుతున్నాయి. ప్రభుత్వమూ, బ్యాంకులు ప్రజల సంపత్తిని దోచుకొనే బందిపోట్లను రక్షించడానికిఖైపైన పద్ధతిని కనుక్కొన్నారు. కార్పొరేట్ సంస్థల రుణాలను మొదట ఎన్‌పీఏగా ప్రకటించు, తర్వాత రైట్ ఆఫ్ చేయి. ప్రజా సొమ్మును బ్యాంకుల్లో జమ చేయి. తిరిగి కార్పొరేట్ సంస్థలకు అప్పులివ్వు - ఇదీ పాలకుల నీతి.

అనిల్ అంబానీ-రిలయన్స్ గ్రూప్‌కు 1,25,000 కోట్లు, అనిల్ అగర్వాల్-వేదాంత గ్రూపుకు 1,03,000 కోట్లు, శశి రూయియా, రవి రూయియా-ఎస్సార్ గ్రూప్‌కు 1,01,000 కోట్లు, గౌతం అదానీ గ్రూప్‌కు 96,031 కోట్లు, మనోజ్ గౌర్-జేపీ గ్రూప్‌కు 75,163 కోట్లు, సజ్జన్ జిందాల్-జెఎస్‌డబ్ల్యూ గ్రూప్‌కు 58,171 కోట్లు, జీఎన్ రావ్-జీఎమ్ఆర్ గ్రూప్‌కు 47,976 కోట్లు, ఎల్ మధుసూధన్ రావ్-లాంకో గ్రూప్‌కు 47,405 కోట్లు, జీవీకే రెడ్డి-జీవీకే గ్రూప్‌కు 33,933 కోట్లు. దీనిని బట్టి ప్రజాధనం బ్యాంకుల ద్వారా పెట్టుబడిదారుల జేబుల్లోకి ఎలా చేరుతున్నదో, వాళ్ల సొంత సొత్తుగా ఎట్లా మారుతున్నదో అంచనా కట్టవచ్చు.

ఆదాయపన్ను, కస్టం డ్యూటీ, ఎక్సయిజ్ డ్యూటీ వంటి కార్పొరేట్ పన్నులను ప్రభుత్వాలు పెద్ద ఎత్తున రద్దు చేస్తాయి. కార్పొరేట్ పన్నులను 2013-14 బడ్జెట్ సంవత్సరంలో యూపీఏ ప్రభుత్వం 5 లక్షల 32 వేల కోట్లు రద్దు చేస్తే, 2014-15 బడ్జెట్ సంవత్సరంలో ఎన్‌డీఏ ప్రభుత్వం 5 లక్షల 89 వేల కోట్లు రద్దు చేసింది. గత పదేళ్లలో 42 లక్షల కోట్ల కార్పొరేట్ పన్నులు మాఫీ చేయబడ్డాయి. దీనిని బట్టి ప్రభుత్వాలు ఎవరి ప్రయోజనాల కోసం పనిచేస్తున్నాయో అంచనా కట్టడం పెద్ద కష్టమేమీ కాదు.

మరొక విషయమేమంటే, నోట్ల రద్దుతో దేశంలోని అత్యధిక ప్రజలు బ్యాంకులతో బలవంతంగా జోడించబడ్డారు. ఇప్పుడు పదుల కోట్ల ప్రజల మధ్యా, వాళ్ల రోజువారీ ఇచ్చిపుచ్చుకోవడాలు బ్యాంకుల ద్వారా జరుగుతాయి. చాలా పెద్ద మొత్తంలో పోగయిన

ధనంతో బ్యాంకుల పెట్టుబడి పెరిగింది. దానితో బ్యాంకుల వ్యాపారం బాగా నడవబోతుంది. పెద్ద మొత్తంలో బ్యాంకులకు సేవా పన్ను దొరుకుతుంది. దీనితో పాటు ప్రభుత్వ ఆదాయం కూడా పెరుగుతుంది.

**సాధారణ ప్రజలకు అష్ట కష్టాలు**

అత్యంత నిజాయితీపరులైన పేదలూ, మధ్య తరగతి ప్రజలూ, దళితులూ, కార్మికులూ, ఏ పూటకాపూట కష్టపడి సంపాదించుకొని తినే వాళ్లపై నోట్ల రద్దు దెబ్బ తీవ్రంగా పడింది. ముఖ్యంగా లోతట్టు ప్రాంతాల్లోని ఆదివాసులు చాలా కష్టాలు పడాల్సి వచ్చింది. యాభై రోజుల్లో డబ్బు జమ చేయడానికీ, తీయడానికి రోజుకో కొత్త నియమమూ, నిషేధమూ పెడుతూ ప్రభుత్వం సామాన్య ప్రజలను పెద్ద ఎత్తున ఇక్కట్ల పాలు చేసింది. ప్రజలకు తమ పనీ-పాట్లను వదులుకొని బ్యాంకుల/పోస్టాఫీసులకు చక్కర్లు కొట్టాల్సివచ్చింది. గంటల తరబడి, రోజుల తరబడి క్యూల్లో నిలబడాల్సి వచ్చింది. ఇక్కడ గమనించాల్సిన విషయమేమంటే ఈ క్యూల్లో ఎక్కడా మెర్సిడెస్, ఆడీలు కనబడలేదు. అంబానీ, అదానీ, రతన్ టాటా వంటి వ్యక్తులూ కనబడలేదు.

ఆవులూ, ఎద్దులూ, మేకలూ, పందులూ వంటి పెంపుడు జంతువులనూ, అటవీ ఉత్పత్తులను అమ్ముకొని, కడుపు కట్టుకొని కూడబెట్టుకొన్న పైసలను జమ చేయడానికి బ్యాంకులకు వెళ్లిన ప్రజలకు బ్యాంకు అధికారులూ, పోలీసుల వాకబూ, అవమానకర ప్రవర్తనను ఎదుర్కోవాల్సి వచ్చింది. ఆఖరికి వాళ్ల నిజాయితీని శంకిస్తూ బొటన వేళ్ల మీద చెరిగిపోని ఇంకుతో గుర్తులు పెట్టారు. వాళ్లను నేరస్తులుగా చూశారు. పోరాట ప్రాంతాల్లోని ప్రజల, ముఖ్యంగా ఆదివాసుల కష్టార్జితాన్ని మావోయిస్టుల పైసలని చెప్పి జప్తు చేసుకోవడం, వాళ్లను అరెస్టు చేయడం, తీవ్రంగా చిత్రహింసలు పెట్టడం సాధారణ విషయమైపోయింది. ఇక్కడి అత్యధిక ప్రజానీకం నిరక్షరాస్యులు. కనుక నోట్ల రద్దు నియమ నిబంధనలు వాళ్లకు తెలియవు. అందుకని నోట్లను మార్చుకోవడం కష్టమైపోయింది. కొందరైతే తమ నోట్లను మార్చుకోకుండానే వదిలేశారు.

పాత నోట్లను మార్చుకోవడం కోసం బ్యాంకుల ముందు బారులు తీరడంలో జరిగిన తొక్కిసలాటలో, డబ్బుల కొరతతో సకాలంలో వైద్యమందక, ముందే నిర్ణయమైన పెళ్లిళ్లు ఆగిపోతే తట్టుకోలేక మొత్తంగా నోట్ల రద్దు కారణంగా 150కి పైగా ప్రజలు మరణించారు. రికార్డులకు ఎక్కని మరణాలు ఇంకా ఎన్నో వుంటాయి. ఈ మరణాలన్నీ నిజానికి ప్రభుత్వం చేసిన హత్యలే.

దేశ ఆర్థిక వ్యవస్థలో 90 శాతం అసంఘటిత, ఇన్‌ఫార్మల్ రంగానికి చెందినదే. ఇది మొత్తం 50 శాతం ఉత్పత్తికి ప్రాతినిధ్యం వహిస్తుంది. నోట్ల రద్దుతో, నోట్లు సకాలంలో మారని కారణంగా ఈ రంగాలకు చెందిన ప్రజలు డబ్బు కొరతను తీవ్రంగా ఎదుర్కోవాల్సి వచ్చింది. వాళ్ల కొనుగోలు శక్తి తీవ్రంగా ప్రభావితమైంది. ఫలితంగా ప్రజలకు తమ అవసరాలను తీర్చుకోవడానికి చాలా ఇబ్బంది పడాల్సి వచ్చింది. ముఖ్యంగా రోజువారీ కూలీపై ఆధారపడే కోట్లాది ప్రజలకు బియ్యం, పప్పు, కూరగాయలు వంటి నిత్యావసర సరుకులను కొనుక్కోవడానికి కూడా ఇబ్బంది పడాల్సి వస్తున్నది. ఆకలి దప్పులకు గురికావాల్సి వస్తున్నది. నగరాల్లో నిర్మాణ రంగంతో పాటు, ఇతర పలు చిన్నా చితకా పనులు బందు కావడంతో వాటిపై ఆధారపడిన లక్షలాది ప్రజల నోటి కాడి కూడును లాగేసినట్టయింది. కేవలం హైదరాబాద్ నగరం నుండి (నవంబర్ మధ్య కాలం నుండి) 50 వేల కుటుంబాలు నగరం వదిలి వాపస్ వెళ్లారు.

నోట్ల రద్దుతో చిన్న వ్యాపారాలకూ, లఘు పరిశ్రమలకూ పెద్ద ఎత్తున దెబ్బతగిలింది. పారిశ్రామిక ఉత్పత్తిపై కూడా వ్యతిరేక ప్రభావం పడుతున్నది. వ్యవసాయ రంగ పరిస్థితి మరింత దిగజారింది. దేశ జనాభాలో 67 శాతం గ్రామీణ ప్రాంతంలో నివసిస్తున్నారు. వీరిలోని 67 శాతం మంది వ్యవసాయంపై ఆధారపడుతున్నారు. వ్యవసాయంపై ఆధారపడుతున్న వారిలో 97 శాతం కూలీలే. వీళ్లందరి మొత్తం చెల్లింపులు నగదులోనే జరుగుతాయి. రైతులకు తమ పంటలను అమ్ముకున్నా కూడా నగదు దొరకడం లేదు. దీనితో ఎరువులు, విత్తనాలు కొనలేకపోవడంతో రబీ సాగు కష్టమైపోతున్నది. దీనిని బట్టి వచ్చే సంవత్సరం వ్యవసాయ ఉత్పత్తులపై తీవ్ర ప్రభావం పడబోతుందన్నది స్పష్టం. మొత్తంగా చూస్తే జీడీపీ అభివృద్ధి రేటు పడిపోతుంది. వ్యవసాయంపై దీని ప్రభావం దీర్ఘకాలం కొనసాగనుంది.

**బలవంతంగా నగదు రహిత ఆర్థిక వ్యవస్థ వైపు**

ఐఎంఎఫ్, ప్రపంచ బ్యాంకుల సిఫార్సుల ప్రకారమే నగదుపై ఆధారపడిన ఆర్థిక వ్యవస్థను నగదు రహిత లేదా డిజిటల్ ఆర్థిక వ్యవస్థ వైపుకు బలవంతంగా ఈడ్చుతున్నారు. బహుళ జాతి కంపెనీల టెక్నికల్ యంత్రాంగంపై ఆధారపడి ఇది అమలులోకి వస్తున్నది. వివిధ మొబైల్ ఏప్స్, బ్యాంకు ఏప్స్, పేటీఎం, ఈ-వైలెట్ తదితర అనేకానేక పద్ధతులను పెద్ద ఎత్తున ప్రచారం చేస్తూ, నగదు రహిత చెల్లింపులను పెంచడానికి తీవ్రంగా ప్రయత్నిస్తున్నారు. అత్యాధునిక, అభివృద్ధి చెందిన అమెరికా సహా ఇతర పెట్టుబడిదారీ సామ్రాజ్యవాద దేశాలన్నింటిలో పూర్తిగా నగదు రహిత ఆర్థిక వ్యవస్థను నెలకొల్పడం సాధ్యం కాలేదు. అటువంటిది భారత

దేశంలో 40 శాతం నిరక్షరాస్యులున్నారు. జనాభాలోని 62 శాతం ప్రజలు గ్రామీణ ప్రాంతంలో నివసిస్తున్నారు. దేశంలో వున్న మొత్తం రెండు లక్షల ఏటీఎం మెషిన్లలో 70 శాతం, బ్యాంకుల్లో 65 శాతం పట్టణ ప్రాంతాల్లోనే వున్నాయి. ఇంటర్‌నెట్ సౌకర్యం కనీస స్థాయిలో వుంది. ఈ నేపథ్యంలో దేశాన్ని నగదు రహిత ఆర్థిక వ్యవస్థ వైపు ఈడ్చడం పూర్తిగా అనుచితమైనది. అంతేకాదు ఈ డిజిటల్ సౌకర్యాలేమీ ఉచితంగా లభించవు. ఈ సేవలనందించే కంపెనీలకు 1 నుండి 4 శాతం వరకూ సేవా పన్నులు చెల్లించాల్సి వుంటుంది. ఇది సాధారణ ప్రజలకు చాలా ఖరీదైనది.

**నోట్ల రద్దు నకిలీ నోట్ల చెలామణీని ఆపగలుగుతుందా?**

ముమ్మాటికీ ఆపలేదు. నోట్ల రద్దు తర్వాత, వాటి స్థానంలో కొత్త నోట్లు వచ్చిన వారం రోజులకే నకిలీ 2000 నోట్లు తయారయ్యాయి. కొత్త 2000 నోటును ఏ అదనపు ప్రత్యేక భద్రత లేకుండానే జారీ చేసినట్టుగా రిజర్వ్ బ్యాంకు స్వయంగా అంగీకరించింది. అంటే ప్రభుత్వానికి నకిలీ నోట్ల గురించి ఎటువంటి చింతా లేదనే విషయం స్పష్టం.

కోలకత్తాలో వున్న ఇండియన్ స్టాటస్టికల్ ఇన్‌స్టిట్యూట్ (ఐఎస్‌ఐ) రిపోర్ట్ ప్రకారం మొత్తం కరెన్సీలో నకిలీ నోట్ల శాతం కేవలం 0.02 మాత్రమే. అంటే మొత్తం నకిలీ నోట్ల విలువ 400 కోట్లు మాత్రమే. కొత్త నోట్లను ముద్రించడంతో పోల్చినపుడు ఇంత చిన్న మొత్తం ఆర్థిక వ్యవస్థపై వేసే ప్రభావం చాలా తక్కువ. ఎందుకంటే కొత్త 500, 2000 నోట్లను ముద్రించడానికి దాదాపు 12 వేల కోట్ల రూపాయల ఖర్చవుతుంది. ఈ పని సంవత్సరం పొడుగూతా నడుస్తుంది. ఐఎస్ఐ రిపోర్ట్‌లో నకిలీ నోట్ల బెడద నుండి తప్పించుకోవడానికి నోట్లను రద్దు చేయాలనే సలహా ఎప్పుడూ కూడా ఇవ్వలేదు. దోపిడీ పునాదిపై ఆధారపడిన పరిపాలన వ్యవస్థలో మూలాలు కలిగి వున్న నకిలీ నోట్లను నోట్ల రద్దుకు కారణంగా చూపించడం ఉచితమేనా? ఎంత మాత్రమూ కాదు. ఇది నిజాయితీ లేని మోసపూరిత చర్య.

**నోట్ల రద్దు – అవినీతి**

అవినీతి అనేది దోపిడీపై ఆధారపడిన మన దేశ ఆర్థిక–సామాజిక–రాజకీయ వ్యవస్థలో విడదీయరాని భాగం. నోట్ల రద్దు రూపుమాపలేదు. ప్రభుత్వాలు స్వయంగా దీనిని పెంచడంలో నిమగ్నమై వుంటాయి. 2014 నవంబర్ 17న తన ఆస్ట్రేలియా పర్యటన సమయంలో మోడీ తనకు అత్యంత కావాల్సినవాడైన పారిశ్రామికవేత్త గౌతం అదానీకి 7 బిలియన్ డాలర్ల గనుల తవ్వకాల లీజు, ఎస్‌బీఐ నుండి ఒక బిలియన్ డాలర్ రుణం ఇప్పించాడు. మోడీ గుజరాత్‌లోని తీర ప్రాంతంలోని భూమిని అదానీకి చౌకగా కేటాయించి 45 వేల కోట్ల రూపాయల లాభం చేకూర్చాడు. ఒక అంచనా ప్రకారం మోడీ ఆశీర్వాదం పొందిన 10–12 మంది పారిశ్రామికవేత్తల దగ్గరే 'నల్ల ధనం'లోని సగభాగం వుంది. ఒక వీడియో ఫుటేజ్ ప్రకారం భాజపా అధ్యక్షుడు అమిత్ షా 9 నవంబర్ నుండి 30 డిసెంబర్ వరకూ 37 శాతం కమిషన్‌తో నోట్లను మార్పించే వ్యాపారంలో బిజీగా వున్నాడు. గత యూపీఏ ప్రభుత్వం హయాంలో కుంభకోణాల జోరు కొనసాగింది. ఇప్పుడు భాజపా నాయకుల కుంభకోణాలు ఒక దాని తర్వాత ఒకటి, ఒక దాన్ని మించి మరొకటి వెలుగులోకి వస్తున్నాయి. యూపీఏ ప్రభుత్వం ద్వారా 700 కోట్ల ధర నిర్ణయించబడిన రాఫెల్ విమానానికి, ఎన్‌డీఏ పాలనలో అనిల్ అంబానీ మధ్యవర్తిగా 1600 కోట్లు నిర్ణయించబడింది. రతన్ టాటాకు చెందిన కేవలం 2 వేల కోట్ల నానో కార్ల పరిశ్రమ కోసం మోడీ గుజరాజ్ ప్రభుత్వం 30 వేల కోట్ల రూపాయలు కట్టబెట్టింది. సుప్రీం కోర్టు నిర్ణయాన్ని అపహాస్యం చేస్తూ మోడీ ప్రభుత్వం ద్రవ్య బిల్లు–2016ను ఆమోదించింది. దీని ప్రకారం రాజకీయ పార్టీలకు, సంస్థలకు విదేశీ కంపెనీల నుండి వచ్చే చందా మొత్తం 'ఫారిన్ కంట్రిబ్యూషన్ రెగ్యులేషన్ ఆక్ట్ 2010 (ఎఫ్‌సీఆర్ఏ) కిందికి రాదు. ప్రజా ధనాన్ని కొల్లగొట్టే అవినీతికి సంబంధించిన ఇటువంటి వుదాహరణలు కోకొల్లలు. దోపిడీ–పీడక వర్గాలకు ప్రాతినిధ్యం వహించే ప్రభుత్వాలు ప్రజా వ్యతిరేక విధానాలూ, నిర్ణయాలూ, చట్టాల ఆధారంగానే కాదు, తామే తయారు చేసిన చట్టాలను అపహాస్యం చేస్తూనూ అవినీతిని పెంచుతున్నారు. 'నల్ల ధనం' పోగయ్యే ముఖ్య మార్గాల్లో అవినీతి ఒకటి.

**నోట్ల రద్దు విశ్లేషణ ఏమి తెలియజేస్తుంది?**

సెంటర్ ఫర్ మానిటరింగ్ ఇండియన్ ఎకానమీ (సీఎంఐఈ), 2016 నవంబర్ అధ్యయనం – 'ట్రాంజాక్షన్ కాస్ట్ ఆఫ్ డీమానిటైజేషన్' ప్రకారం నోట్ల రద్దు నిర్ణయం కారణంగా 50 రోజుల్లో దేశానికి ట్రాంజాక్షన్ కాస్ట్ రూపంలో మొత్తం 1.284 లక్షల కోట్ల రూపాయల ఖర్చు చేయాల్సి వస్తుంది. కొత్త నోట్ల ముద్రణకు అయ్యే 12 వేల కోట్ల ఖర్చును కూడా కలుపుకుంటే నోట్ల రద్దు మూలంగా అయిన ఖర్చు 1.404 లక్షల కోట్లయి కూర్చుంటుంది. కాగా నోట్ల రద్దు ద్వారా పొందిన మొత్తం 38.7 వేల కోట్ల రూపాయలు మాత్రమే. అంటే లక్ష కోట్ల కంటే అధిక నష్టం. ఇక సామాన్య ప్రజలకు కల్గిన ఇబ్బందులూ, అసౌకర్యాలూ, వ్యాపార నష్టాలూ, పని గంటల నష్టం వంటి సామాజికంగా చెల్లించిన మూల్యం వేరే. ఇది నోట్ల రద్దు తాత్కాలిక ఫలితం. ఇక దీర్ఘకాలిక ఫలితాల రూపంలో, బడ్జెట్–2017ను ప్రవేశపెడుతూ ఆర్థికమంత్రి అరుణ్‌జైట్లీ అంగీకరించినట్టుగా, రాబోయే సంవత్సరాల్లో జీడీపీ

అభివృద్ధి రేటులో తగ్గుదల మూలంగా ఆర్థిక మాంద్యానికి దారితీయడం అనివార్యం. ఇదీ నోట్ల రద్దుకు మోడీ చెప్పిన మూడు కారణాల అసలు విషయం.

**నోట్ల రద్దు వర్సెస్ ప్రతిపక్షాలు**

కాంగ్రెస్, సమాజ్‌వాదీ పార్టీ, బీఎస్‌పీ, సీపీఐ, సీపీఐ(ఎం), రాష్ట్రీయ జనతా దళ్, ఆమ్ ఆద్మీ పార్టీ వంటి పార్లమెంటరీ పార్టీలు నోట్ల రద్దుతో ప్రజలు గురైన ఇక్కట్లకు గాను ప్రభుత్వాన్ని తీవ్రంగా విమర్శించారు. అయితే ఎవరూ కూడా నోట్ల రద్దు వెనుక వున్న వాస్తవ కారణాన్నీ, కుట్రను బహిర్గతం చేయలేదు. అలాగే ప్రభుత్వానికి వ్యతిరేకంగా నిర్ణాయాత్మక పోరాటం చేయడానికి ప్రయత్నమూ చేయలేదు. ఎందుకంటే పాలకవర్గ పార్టీలన్నీ ఒకే తానులోని గుడ్డ ముక్కలే.

**మావోయిస్టు ఉద్యమం, కశ్మీరీ ప్రజల స్వాతంత్ర్య పోరాటం, ఈశాన్య జాతుల పోరాటాలు నోట్ల రద్దు ప్రభావమేమీ లేకుండా ముందుకు సాగుతాయి**

మావోయిస్టు ఉద్యమం, కశ్మీరీ ప్రజా పోరాటం, ఈశాన్య జాతుల పోరాటాలు నోట్ల రద్దుతో బలహీనపడుతాయనే మోడీ మాటలు నిరాధారమూ, అవాస్తవమూ, మూర్ఖమైనవి. ఈ పోరాటాలన్నీ ప్రజల సహకారంతో నడిచేవి. ఫండ్స్ కోసం పుట్టినవీ కావు. కనుక నోట్ల రద్దుతో ఈ పోరాటాలపై, ముఖ్యంగా సీపీఐ (మావోయిస్టు)పై ఎటువంటి ప్రభావమూ పడదు. సీపీఐ (మావోయిస్టు) పీడిత ప్రజల పార్టీ, వాళ్లకు సేవ చేసే పార్టీ. అయితే ఒకటి నిజం. నోట్ల రద్దుతో సాధారణ ప్రజలు అపారమైన ఇబ్బందులకు గురవుతున్నారు. ప్రజల కష్టాలను విప్లవ పార్టీ తన కష్టంగానే భావిస్తుంది. తన అవసరాలన్నింటికీ పీడిత వర్గాల ప్రజలపై ఆధారపడే సీపీఐ (మావోయిస్టు)కు ఫండ్స్ కాదు, ప్రజలే నిర్ణయాత్మక ప్రాధాన్యత కల్గిన వాళ్లు. విప్లవ పార్టీ శత్రువును ప్రధాన వనరుగా ఉపయోగించుకుంటుంది. ప్రజలపై ఆధారపడి అన్నింటినీ పొందుతుంది. కనుక నోట్ల రద్దుతో సీపీఐ (మావోయిస్టు)నూ, విప్లవోద్యమాన్ని బలహీన పర్చాలనే, నిర్మూలించాలనే మోడీ పగటికల ఎన్నటికీ నెరవేరదు.

**అవిశ్రాంత పోరాటం, నేటి పరిస్థితి చేస్తున్న డిమాండ్**

మోడీ ప్రభుత్వ నోట్ల రద్దు మోసపూరితం, వాగ్దానం తప్పడం, నిజాయితీ రహితం. ఆ నిర్ణయం అన్యాయం, ప్రజా వ్యతిరేకం, దేశద్రోహం. కేవలం నోట్ల రద్దే కాదు, మోడీ నిర్ణయాలన్నీ కూడా ఇదే కోవకు చెందుతాయి.

'నల్ల' ఆర్థిక వ్యవస్థకు జన్మనిచ్చే ప్రధాన కారణాలను నోట్ల రద్దు నిర్మూలించలేదు. 'నల్ల ధనం', అవినీతి, నకిలీ నోట్లు దోపిడీ మూలమైన పెట్టుబడిదారీ కుళ్లిన ఆర్థిక వ్యవస్థలోని విడదీయరాని భాగాలు. ఇవన్నీ వ్యవస్థాగత సమస్యలు కనుక వీటికి పరిష్కారం కూడా వ్యవస్థ మార్పులోనే వుంటుంది. విప్లవోద్యమం ద్వారా నిర్మితమయ్యే దోపిడీ రహిత, సమానతా మూల వ్యవస్థలోనే వీటి అంతం సాధ్యం.

**(నలుపు-తెలుపు అనే వర్ణ వివక్షను దృష్టిలో పెట్టుకొని ఈ వ్యాసంలో 'నల్లధనం' లేదా అక్రమ ధనం అన్నాము.)**

○

---

*(...........50వ పేజీ తరువాయి)*

అరబ్ కూటమిలో వైరుధ్యాలు పెరిగాయి. క్రమంగా అమెరికా ప్రభావిత ప్రాంతాలు తగ్గిపోతున్నాయి. ఇవన్నీ అమెరికా ఆత్మరక్షణ స్థితిలోకి దిగజారడాన్ని సూచిస్తున్నాయి. 2వ ప్రపంచ యుద్ధ కాలంలో యుద్ధంలో దిగకుండా లాభపడిన అమెరికా, నేడు ఇరాక్, ఆఫ్ఘన్ లపై దురాక్రమణ యుద్ధాలు చేసి 12 ట్రిలియన్ డాలర్లు ఖర్చు చేసి రాజకీయంగా, ఆర్థికంగా, సైనికంగా ముఖ్యంగా నైతికంగా బలహీనపడింది.

ప్రపంచ పరిణామాలు భవిష్యత్‌లో మరింత నగ్నంగా శాంతి ముసుగులు తొలగించుకొని పాశవిక విధానాల్ని కొనసాగిస్తాయి. రక్తపాతాన్ని మరింతగా పెంచుతాయి. ఈ ఫాసిస్టు విధానాలు ఏ రకమైన యుద్ధాలకు, దురాక్రమణలకు దారి తీస్తాయో అమెరికాలో జరిగే మార్పుల్ని బట్టి అర్థం చేసుకోవచ్చు.

అమెరికాలో ప్రజాస్వామ్యం ప్రపంచానికే ఆదర్శం అని అనుకునే భ్రమాన్విత జీవులు కళ్ళు తెరిచే వరకు ఈ ప్రపంచ గమనం నిలిచి ఉంటుందని ఎవరైనా భావిస్తే వారి మూర్ఖత్వాన్ని వారికే వదిలి వేద్దాం. అమెరికాలోను, ప్రపంచదేశాల్లోను ఉన్న పీడిత ప్రజలకు రాబోయే ప్రమాదం గురించి, జరగబోయే నష్టాల్ని విడమరిచి చెబుదాం. ఇది అమెరికాలో 13 శాతంగా ఉన్న నల్లజాతి ప్రజల సమస్యనో, విదేశాల్లో ఉద్యోగాలు చేసే వారి సమస్యనో, ముస్లిం మైనారిటీల సమస్యనో కాదు. దురాక్రమణ యుద్ధాల్లో నష్టపోయిన దేశాల ప్రజల సమస్యనో కాదు. అసమాన ఒప్పందాలు, ఆంక్షలు సమస్యనో కాదు. మహిళల పట్ల పితృస్వామ్య భావన కాదు. ఇది ఏ ఒక్కరి ఒంటరి సమస్యా కాదు. అన్ని రకాల సమస్యలకు మూలమైన సామ్రాజ్యవాద పెట్టుబడి సృష్టిస్తున్న సమస్య. అది తెచ్చిన ప్రపంచీకరణ, సంస్కరణల వికృత పర్యవసానాలు సమస్య. అది రాజకీయంగా మితవాదానికి పట్టం కట్టి ఫాసిజానికి లాక్కెళ్ళుతున్న సమస్య. అందుకే అమెరికా రాజకీయాల్ని, ట్రంప్ ఎన్నికను రాబోయే ప్రపంచ వ్యాపిత ఫాసిస్టు ప్రమాదానికి సూచికగా గుర్తించి కార్మికవర్గం నాయకత్వంలో సర్వ శక్తుల్ని ఐక్యం చేసి ఫాసిస్టు శక్తుల్ని ఓడిద్దాం. ○

# పాకిస్థాన్‌పై విద్వేషాన్ని రెచ్చగొట్టడం ద్వార దేశాన్ని యుద్ధ రథ చక్రాలకు కట్టిపడివేస్తున్న మోడీ ప్రభుత్వ విధానాలను ఖండించండి

కశ్మీర్‌లో ప్రజా ఆందోళన చెలరేగినప్పటి నుండి భారత ప్రభుత్వం అనుసరిస్తున్న దురాక్రమణ విధానాల వలన భారత–పాకిస్థాన్ సరిహద్దుల్లో ఘర్షణ వాతావరణం నెలకొంది. గత పది సంవత్సరాలుగా ఇరు దేశాలు సీజ్‌ఫైర్ 'వ్యూహాత్మక వెనకడుగు' అనే పాలసీని కొనసాగిస్తూ రాగా, ఉడీ ఘటన తర్వాత ఈ విధానం భగ్నమై సరిహద్దుల్లో నిత్యం కాల్పులు జరుగుతున్నాయి. కశ్మీర్ నుండి రాజస్థాన్ వరకు వేలాది కి.మీ.ల సరిహద్దు వెంట నివసిస్తున్న ప్రజలను భారత ప్రభుత్వం ఖాళీ చేయించింది. ప్రభుత్వం లక్షలాది సైన్యాన్ని సరిహద్దుల్లో మోహరించింది. ఉడీ ఘటనకు ప్రతీకారంగా వాస్తవాధీన రేఖ (ఎల్ఓసీ)ను దాటి పాకిస్థాన్ భూభాగంలో 'సర్జికల్ (లక్షిత) దాడులు' నిర్వహించి తీవ్రవాదుల శిబిరాలను ధ్వంసం చేశామని భారత ప్రభుత్వం చెప్పుకుంటున్నది.

భారతసైన్యం జరిపిన సర్జికల్ దాడులతో పాకిస్థాన్‌ను కోలుకోకుండా చేశామని అప్పట్లో భారత రక్షణమంత్రి పరీకర్ ప్రకటించాడు. బీజేపీ మోడీని ఆకాశానికెత్తగా, కాంగ్రెస్‌తో సహా ఇతర పక్షాలు అన్ని భారత సైన్య సాహసాన్ని మెచ్చుకున్నాయి. ఈ ఘటనతో దేశంలో పాలక వర్గాలు ప్రజల్లో దురహంకార (జింగోయిజం) భావనలు రెచ్చగొట్టాయి. దేశమంతా యుద్ధ రాజకీయాల వైపుగా మళ్లింది. కశ్మీర్‌లో ప్రజా ఉద్యమం ప్రజ్వరిల్లగానే ఈ ఉద్యమం వెనుక పాకిస్థాన్ హస్తం ఉందని భారత ప్రభుత్వం ప్రకటించడమే గాక, ప్రధానమంత్రి మోడీ పాకిస్థాన్ అంతర్గత వ్యవహారాల్లో జోక్యం చేసుకుంటు బెలుచిస్థాన్ ప్రస్తావన తీసుకొని రావడంతో పాకిస్థాన్‌తో మోడీ కయ్యానికి కాలు దువ్వుతున్నాడనే విషయం స్పష్టమైంది. ఉడీ ఘటనతో మొత్తం పరిస్థితిలోనే మార్పు వచ్చి సరిహద్దు అంతటా టెన్షన్ వాతావరణం నెలకొంది. ఉడీ ఘటన జరిగిన వెంటనే పాకిస్థాన్‌పై యుద్ధం ప్రకటించాలని బీజేపీ నాయకుడు, జమ్మూ కశ్మీర్ పార్టీ వ్యవహారాల బాధ్యుడు రామ్ మాధవ్ ప్రకటించాడు. ఈ పరిణామాలతో భారత పాకిస్థాన్ మధ్య కొనసాగుతూ వచ్చిన, చర్చల ద్వారా అన్ని సమస్యలు పరిష్కరించుకోవాలనే (కాంపోజిట్ డైలాగ్) వైఖరి నిలిచిపోయింది.

మోడీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత జరిగిన పఠాన్‌కోట్ ఘటన సమయంలో లేని ఈ ఘర్షణ వాతావరణం ఉడీ ఘటన తర్వాతనే ఎందుకు ఏర్పడింది. పఠాన్‌కోట్ దాడి సందర్భంలో ఇరు దేశాలు కలిసి ఆ ఘటనపై విచారణ జరిపించే పద్దతి ఎంచుకోగా, ఉడీ ఘటన తర్వాత ఇలాంటి పద్ధతిని ఎంచుకోకుండా భారత ప్రభుత్వం దాడి పద్ధతులను ఎందుకు ఎంచుకుంది. అసలు ఉడీ ఘటనకు కారకులు ఎవరు?ఇది ఎలా జరిగింది అనే విషయంపై అనేక అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. రిటైర్డ్ పోలీసు అధికారి సంజయ్‌బట్ తో పాటు అనేక మంది ఈ అనుమానాలు వ్యక్తం చేశారు. సరిహద్దుల్లో ఎంతో కట్టుదిట్టమైన ఏర్పాట్లతో ఉన్న ముళ్ళ కంచెను, మోషన్ సెన్సార్‌లు, థర్మల్ ఇమోజింగ్ పరికరాలు, ఫ్లడ్‌లైట్లు, హెచ్చరిక గంటలు, ఇంటలిజెన్స్ సమాచారంతో ఎంతో అభేద్యంగా ఉన్న ఈ ప్రాంతంలో నలుగురు తీవ్రవాదులు చొరబడి ఈ ఘటనకు పాల్పడడం ఎలా సాధ్యం అంటూ మాట్లాడారు.

ఉడీ ఘటన తర్వాతనే మోడీ ప్రభుత్వం 'పంటికి పన్ను, కంటికి కన్ను' అనే వైఖరితో పాకిస్థాన్‌పై దాడుల కోసం పథకం వేసింది. అందులో భాగమే 'సర్జికల్ దాడులు' నిర్వహించామని ప్రభుత్వం ప్రకటించింది. మోడీ దేశ ప్రజలందరిని యుద్ధ ఉన్మాదంలోకి దింపే ప్రయత్నాలు ముమ్మరం చేశాడు. పాకిస్థాన్‌తో గల సంబంధాలను విద్వేష పూరితం చేశాడు. పాకిస్థాన్‌ను అంతర్జాతీయ రంగంలో ఒంటరి చేయడం అనే విధానాన్ని ఎంచుకొని పాకిస్థాన్‌లో జరగవలసి ఉన్న 'సార్క్' సమావేశాన్ని జరగకుండా చేయడానికి ప్రయత్నాలు ప్రారంభించి, సార్క్‌లో భాగస్వామ్యం గల శ్రీలంక, బంగ్లాదేశ్, నేపాల్, బూటాన్‌లపై ఒత్తిడి తెచ్చి ఆ దేశాలు సమావేశాలను బహిష్కరించేలా చేశాడు. ఆ రకంగా సార్క్ సమ్మేళనాన్ని జరగకుండా విఫలం చేశాడు. అప్పటికీ భారత –పాకిస్థాన్ ప్రజల మధ్య గల మైత్రీ భావనను ద్వేషంగా మార్చడంలో భాగంగా బీజేపీ పాకిస్థాన్ కళాకారులను భారత్‌లోకి రాకుండా నిషేధించింది. సినీ, నాటక, సాంస్కృతిక రంగాలన్నింటా ఒత్తిడి తెచ్చి పాకిస్థాన్ కళాకారులను భారతదేశంలోకి రానీయకుండా చేస్తున్నది. దేశంలో మీడియా ముఖ్యంగా 'టైమ్స్‌నవ్' న్యూస్ యాంకర్ అర్నాబ్ గోస్వామి (గోబెల్స్) లాంటి వాళ్ళు టీవీల్లో చెలరేగిపోయి పాకిస్థాన్‌పై విద్వేశాన్ని రెచ్చగొట్టడమే కాకుండా ఈ వైఖరిని చేపట్టాలని మేధావులు, కళాకారులు, రచయితల మీద ఒత్తిడి తీసుకొని రావడం జరుగుతూనే ఉంది. ఈ విద్వేశాన్ని రెచ్చ గొట్టడంలో పెట్టుబడిదార్ల మానస పుత్రికలు అయిన వార్తా పత్రికలు, వివిధ చానళ్ళు ముందు వరుసలో ఉన్నాయి. ఈ గొబెల్స్

ప్రచారంతో ప్రభావితమవుతున్న భారత ప్రజలు పాకిస్థాన్‌పై భారత ప్రభుత్వం జరుపుతున్న మిలటరీ, రాజకీయ, దౌత్య పరమైన (డిప్లమాటిక్) దాడికి మద్దతు ఇస్తున్నారు. కాని బీజేపీ ప్రభుత్వం అవలంభిస్తున్న ఈ విధానాల వలన దేశానికి ఒనగూడే చేటు ఏమిటో అర్థం చేసుకోలేకపోతున్నారు.

బీజేపీ సైద్ధాంతిక అవగాహనలో సాంస్కృతిక జాతీయవాదం పాకిస్థాన్‌ను శాశ్వత శత్రువుగా పరిగణిస్తోంది. ఈ సాంస్కృతిక జాతీయవాదం ప్రతిపాదిస్తున్న అఖండ్ భారత్ దృక్పథం మేరకు పాకిస్థాన్‌ను సంపూర్ణంగా నిర్మూలించాలని భావిస్తున్నది. ఈ భావనను భారత ప్రజల నరనరాల్లో నింపాలని బీజేపీ, ఆర్ఎస్ఎస్ విశ్వ ప్రయత్నం చేస్తోంది. అంతేగాక బీజేపీ, ఆర్ఎస్ఎస్‌కు తక్షణ ప్రయోజనాలు కూడా ఉన్నాయి. బీజేపీ ప్రభుత్వానికి కశ్మీర్‌లో చెలరేగిన ప్రజా ఉద్యమం, దాని పట్ల భారత ప్రజల్లో సానుభూతి రాకుండా చేయడం కోసం, అట్లాగే దాన్ని అంటి గెరిల్లా యుద్ధం ముందుకు వచ్చే సూచనలను దృష్టిలో ఉంచుకొని ఆ ఉద్యమాన్ని అణచడానికి, సరిహద్దుల్లో ఘర్షణలు సృష్టించడం అవసరమైంది. ఊడీ ఘటనను సాకుగా చూపి పాకిస్థాన్ అంతర్జాతీయంగా కశ్మీర్ సమస్యను లేవనెత్తకుండా అడ్డుకునే ప్రయత్నం చేస్తోంది. ఇలా కశ్మీర్‌కు సంబంధించిన విషయమే గాకుండా, ఈ సంవత్సరం మార్చ్‌లో జరిగిన ఉత్తరప్రదేశ్, పంజాబ్, గోవా, ఉత్తరాఖండ్, మణిపూర్ అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీని అధికారానికి తేవడానికి పాకిస్థాన్‌పై విద్వేషాన్ని రెచ్చగొట్టాల్సిన అవసరం మోడీకి ఏర్పడింది. అలా జాతీయోన్మాదాన్ని రెచ్చగొట్టి ఈ రాష్ట్రాల్లో ముఖ్యంగా వుత్తరప్రదేశ్, ఉత్తరాఖండ్‌లో అధికారం సంపాదించడానికి బీ.జే.పీ. ప్రభుత్వం ఊడి ఘటనను మలచుకొంది. అందులో విజయ వంతమైంది. అలాగే మోడీ కేంద్రంలో అధికారానికి రావడానికి భారత ప్రజలకు యిచ్చిన వాగ్ధానాలను నేరవేర్చక పోవడంతో మోడీ ప్రభుత్వంపై ప్రజల్లో చెలరేగుతున్న అసంతృప్తులను ప్రక్కదారి పట్టించడానికి జాతీయోన్మాదాన్ని, విద్వేష భావనను రెచ్చ గొడుతున్నది.

బీజేపీ బ్రాహ్మణీయ హిందూ ఫాసిజం దేశంలో జడలు విప్పుతూ ప్రజల్లో భయాందోళనలు కలుగజేస్తున్నది. ఎక్కడైనా ఫాసిస్టులు సామ్రాజ్యవాదుల, పెట్టుబడిదారులకు సేవ చేయడానికి ఎంతకైనా తెగిస్తారు. జర్మనీలో హిట్లర్ రీచ్‌స్టాగ్‌ను తనే తగులబెట్టించి కమ్యూనిస్టులపై త్రోసి వారిని నిర్మూలించడానికి ఉపయోగించుకున్న విధంగానే ప్రస్తుత పరిస్థితిలో దేశంలో వివిధ సమస్యలపై పోరాడుతున్న ఆదివాసులు, దళితులు, మైనారిటీలు, ప్రజాస్వామిక వాదులు, కార్మికులు, జాతుల పోరాటాలను అణచివేయడానికి మోడీ కుట్ర పన్నుతున్నాడు.

మోడీ అధికారంలోకి వచ్చిన వెంటనే ప్రధానమంత్రి పదవి స్వీకారోత్సవానికి ఇరుగు పొరుగు దేశాలైన సార్క్ దేశాల నాయకులను పిలిచాడు. అందరం కలిసికట్టుగా ఉండి, శాంతి యుతంగా మెలిగితే, అందరం అభివృద్ధి చెందవచ్చు అని ప్రవచనాలు పలికాడు. ఈ పదవీ స్వీకారోత్సవానికి పాకిస్థాన్ అధ్యక్షుడు నవాజ్ షరీఫ్ కూడ హాజరైనాడు. పఠాన్‌కోట్ దాడికి 5 రోజుల ముందు మోడీ భారత ప్రజలకు తెలియకుండానే విదేశీ పర్యటన నుండి నేరుగా ఒకరోజు కోసం నవాబ్ షరీఫ్ మనమరాలు పెండ్లికి హాజరవడానికి పాకిస్థాన్ వెళ్ళాడు. ఆ సమయంలో భారత ప్రజలందరూ మోడీ ప్రభుత్వం భారత- పాకిస్థాన్ మధ్య మంచి సంబంధాలకు ప్రయత్నిస్తున్నదనే భావించారు. కాని కశ్మీర్ ఆందోళన తర్వాత బెలూచిస్థాన్ సమస్యను ఢిల్లీ ఎర్రకోటపై లేవనెత్తడం, కశ్మీర్‌లో ప్రజలు తిరుగుబాటు చేసి సైన్యంపై రాళ్ళు విసరడానికి పాకిస్థాన్ అందిస్తున్న డబ్బు కారణమని ప్రకటించడం దగ్గర నుండి పాకిస్థాన్‌పై మోడీ ప్రభుత్వం యొక్క యుద్ధ కాంక్ష బయటపడుతూ వస్తున్నది.

కార్గిల్ యుద్ధానంతరం, బీజేపీ పరిపాలన కాలంలో పాకిస్థాన్‌తో సీజ్‌ఫైర్ ఒప్పందం జరిగేంతవరకు (2000 సం॥నుండి ప్రారంభించి 2003 వరకు) సరిహద్దుల్లో లక్షలాది సైన్యం ప్రభుత్వం మోహరించింది. ప్రతిరోజు ఇరువైపులా కాల్పులు జరిగేవి. దీనితో ఎంతో ప్రాణ నష్టంతో పాటు ఆస్థి నష్టం కూడా జరిగేది. సరిహద్దుల్లో ప్రజలు బిక్కుబిక్కు మంటు బ్రతుకుతూ, వాళ్ళ వ్యవసాయం మూలన పడగా, ఇళ్ళ నుండి దూరంగా బ్రతుకు లీడ్చవలసి వచ్చింది. ప్రస్తుతం కూడా సరిహద్దుల్లో అవే పరిస్థితులు నెలకొని ఉన్నాయి. అతి త్వరలో పాకిస్థాన్-భారత్ సరిహద్దులను శాశ్వతంగా మూసి వేస్తామని హోంమంత్రి రాజ్‌నాథ్‌సింగ్ ఈ మధ్యలోనే తీవ్రమైన హెచ్చరిక చేసాడు.

చైనా, పాకిస్థాన్‌తో జరిగిన యుద్ధాలు గుణపాఠాలుగా తీసికొని ప్రభుత్వాలు నడవకపోతే దేశానికి తీవ్రమైన నష్టం సంభవించడం ఖాయం. 1962లో చైనాతో యుద్ధం, 1965, 1971ల్లో పాకిస్థాన్‌తో యుద్ధాలు జరగగా 1999 కార్గిల్ యుద్ధం జరిగింది. ఈ యుద్ధాలతో ఇరు దేశాలకు కలిగిన ప్రయోజనాలు ఏమి లేవు. 1971లో తూర్పు పాకిస్థాన్‌ను 'విమోచన' చేసే పేరిట ఇందిరా నాయకత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం, ఆ రోజు పశ్చిమ బెంగాల్‌లో చెలరేగుతున్న నక్సల్బరీ ఉద్యమాన్ని అణచడానికి సైన్యాన్ని ఉపయోగించుకుంటూనే తూర్పు పాకిస్థాన్‌పై దండెత్తింది. పాకిస్థాన్‌ను రెండుగా చీల్చి బంగ్లాదేశ్‌ను ఏర్పరిచింది. ఈ విజయంతో

'ఇందిరాయే ఇండియా'గా ఇందిరాగాంధీని పాలకవర్గాలు ఆకాశానికెత్తినప్పటికీ ఆమె కీర్తి ప్రతిష్టలు త్వరలోనే అడుగంటాయి. 1999 సంవత్సరంలో కార్గిల్ యుద్ధ విజయంతో, ఆనాడు బీజేపీ కేంద్రంలో అధికారానికి వచ్చిన మాట నిజమే, కానీ ఈ యుద్ధ రాజకీయాల్లో భాగంగా 2004 ఎన్నికల్లో 'షైనింగ్ ఇండియా' అని నినదించిన, పాకిస్థాన్‌పై యుద్ధానికి కాలుదువ్వినప్పటికీ ఇవి ఏవి కూడ బీజేపీని అధికారానికి తీసికొని రాలేకపోయాయి. ఈ రోజు మోడీ కశ్మీర్ ఉద్యమాన్ని అణచడానికి, ఎన్నికల్లో అధికారాన్ని నిలుపుకోవడానికి ఈ యుద్ధనీతికి తెగబడితే చరిత్రలో ఇందిరకు, వాజ్‌పేయికి లభించిన నెగెటివ్ ఫలితమే మోడీకి కూడా దీర్ఘకాలంలో దక్కక తప్పదు. అయితే ప్రస్తుతం ఉత్తరప్రదేశ్, ఉత్తరాఖండ్‌లో లభించిన విజయాలు పాక్షికమైనవి. ఆ రాష్ట్రాల్లో గెలవడానికి ఇతర కారణాలు అనేకం ఉన్నాయి. యుద్ధోన్మాదం అందులో ఒక భాగం మాత్రమే.

పాకిస్థాన్‌ను అంతర్జాతీయ వేదికలపై ఒంటరి చేసే లక్ష్యంతో అమెరికాతో ఒత్తిడి చేయిస్తున్నది. అమెరికాలో కొత్త అధ్యక్షుడుగా ట్రంప్ఎన్నికైన తర్వాత పాకిస్థాన్‌ను ఈ విషయాల్లో హెచ్చరించాడు. ఇందుకు భిన్నంగా చైనా, పాకిస్థాన్ దేశాల మధ్య వ్యూహాత్మక భాగస్వామ్యంలో భాగంగా చైనా-పాకిస్థాన్ ఆర్థిక కారిడార్ (సిపిఇసి) పెద్ద ప్రాజెక్టు పురోగతిలో ఉంది. ఇది చైనాలోని పశ్చిమ జియాంగ్ నుండి పాకిస్థాన్‌లోని కశ్‌గర్‌లో ప్రవేశించి బెలూచిస్థాన్‌లోని గ్వాదర్ ఓడరేవు వరకు సాగుతుంది. ఎక్స్‌ప్రెస్ హైవేలు, రైల్వే లైను, విద్యుత్ ప్రాజెక్టులు లాంటి వాటితో ఈ కారిడార్‌కు ప్లాన్ జరిగింది. ఈ కారిడార్ వలన చైనా రాబోయే రోజుల్లో మలక్కా జలసంధిలో తనకు నాటో కూటమితో అవాంతరాలు ఏర్పడితే గ్వాదర్ ఓడరేవు ద్వార అరేబియా సముద్రం, అక్కడి నుండి హిందూ మహా సముద్రంలోకి ప్రవేశించివచ్చు. ఇలాంటి ప్రయోజనాలు కలిగిన చైనా బెలూచిస్థాన్‌లో ఇండియా కలుగజేసుకోవడాన్ని ఎట్టి పరిస్థితుల్లో ఒప్పుకోదు. మరో వైపు అమెరికా ప్రభావం పాకిస్థాన్‌లో బలహీనపడుతున్న క్రమంలో చైనా ఆ స్థానాన్ని భర్తీ చేయడానికి పాకిస్థాన్‌తో గట్టి స్నేహం చేస్తున్నది. ఈ పరిణామాలన్ని భారతదేశానికి తూర్పు-పడమర సరిహద్దుల్లో ఇబ్బందులు దినదినం పెంచుతున్నాయి. మరో వైపు ఇండియా అమెరికాతో వ్యూహాత్మక భాగస్వామ్యంతో అమెరికాకు అత్యంత సన్నిహితంగా తయారై, దక్షిణాసియాలో అమెరికాకు జూనియర్ పార్ట్‌నర్‌గా తన పాత్ర నిర్వహిస్తున్నది. చైనా, పాకిస్థాన్‌లతో సంబంధాల్లో శత్రు పూరిత వైఖరి అవలంభిస్తున్నది.

భారత ప్రభుత్వ వైఖరి ప్రమాదంగా మారుతున్న కొద్ది చైనా, పాకిస్థాన్‌ల మధ్య మైత్రి బంధం పెరుగుతున్నది. అలాగే పాకిస్థాన్‌ను చైనాతో పాటు ఇరాన్, టర్కీ, సౌదీ అరేబియా దేశాలు కూడా సమర్థిస్తున్నాయి. పాకిస్థాన్, భారతదేశాల మధ్య సమస్యల్లో చైనా ఇంతకాలం బ్యాలెన్స్‌గా ఉండే పరిస్థితి నుండి మోడీ బెలూచిస్థాన్ విషయాన్ని లేవనెత్తిన తర్వాత చైనా వైఖరిలో క్రమంగా మార్పు వస్తున్నది. చైనా ఆ తర్వాతనే కశ్మీర్‌పై ప్రకటన చేస్తూ కశ్మీర్‌లో జరుగుతున్న పరిణామాలు 'విచారించదగినవని' పేర్కొంది. దినదినం చైనా, పాకిస్థాన్ మధ్య మైత్రి దృఢం కాగా, పాకిస్థాన్‌ను అంతర్జాతీయంగా ఒంటరి చేయాలనే భారత ప్రభుత్వ ప్రయత్నాలు అన్ని విఫలం అవుతున్నాయి.

మోడీ నాయకత్వంలోని భారత ప్రభుత్వ పాలసీలు చైనా, పాకిస్థాన్, నేపాల్, శ్రీలంక దేశాలతో సహ జీవనం, మైత్రికి బదులు బెదిరింపులు, యుద్ధనీతి, విద్వేష భావనలను రెచ్చగొట్టుతున్నది. ఈ తప్పుడు విధానాలతో మోడీ ప్రభుత్వం మన దేశాన్ని గొప్ప విపత్కర పరిస్థితులోకి నెట్టి వేస్తున్నది. మోడీకి భద్రతా సలహాదారుగా ఉన్న అజిత్ దోవాల్ ఆలోచన ధోరణి ప్రకారం అంతర్జాతీయ రంగంలో 'బహుముఖ విధానాలను' అవలంభించాలని మోడీకి సలహాలిస్తున్నాడు. ఇరుగు పొరుగు దేశాలతో ఒకేసారి శాంతి, ఘర్షణలను కొనసాగించవచ్చని చెబుతున్నాడు. వాణిజ్యం, వ్యాపారం కొనసాగిస్తూనే సరిహద్దుల్లో ఘర్షణ, బెలూచిస్థాన్ లాంటి చోట్ల విధ్వంస కార్యకలాపాలని కొనసాగించాలని అజిత్ దోవాల్ ప్రభుత్వానికి సలహాలిస్తు అమలు చేయిస్తున్నాడు. ఈ 'బహుముఖ విధానం' అనే పాలసీ చివరకు దేశాల మధ్య యుద్ధానికే దారి తీయక తప్పదు.

ఏ రాజకీయాల వెనుకనైనా ఆర్థిక ప్రయోజనాలే ఇమిడి వుంటాయి. మోడీ ప్రభుత్వం అమెరికా ఆధిపత్యంలోకి ఒదిగిపోయి, దక్షిణ ఆసియా దేశాల్లో పెద్దన్నలా వ్యవహరిస్తూ చైనా ఆధిపత్యంను అరికట్టాలనే అమెరికా వ్యూహంలో భాగం కావడంతో భారతదేశానికి పెద్ద ముప్పు ఏర్పడుతున్నది. మోడీ ప్రభుత్వం మన దేశాన్ని ఆ సుడి గుండంలోకి దింపుతున్నది. ఈ ప్రమాదాన్ని నివారించడానికి బీజేపీ ముందుకు తెస్తున్న కుత్సిత యుద్ధ రాజకీయాలను ఓడించాల్సిన తక్షణం అవసరం భారత ప్రజల ముందుంది. సామ్రాజ్యవాదులకు, దళారీ పెట్టుబడిదారులకు ఊడిగం చేసే మోడీ ప్రభుత్వానికి వ్యతిరేకంగా ప్రజలంతా ముందుకు రావాలి. కశ్మీర్, ఈశాన్య జాతుల పోరాటాలతో సమైక్యమై భారత పాలకవర్గాల కుట్రలను ఓడించాలి. భారత-పాకిస్థాన్ మధ్య గల సమస్యలన్నింటినీ చర్చల ద్వార పరిష్కరించుకోవాలనే దృక్పథంతో ముందుకు వెళ్ళాలని భారత ప్రభుత్వంపై ఒత్తిడి తేవాలి. ○

## ఆర్థికం

# సామ్రాజ్యవాద ప్రపంచీకరణ ఆర్థిక విధానాలకు అవసరమైన ఏకీకృత మార్కెట్ కోసమే వస్తు సేవల పన్ను (జీఎస్‌టీ) విధానం

పన్నులు రెండు రకాలు. ప్రత్యక్ష, పరోక్ష పన్నులు. ఒకపక్కన సంపదలు, మరో పక్కన పేదరికం పెరుగుతూండడం మనం చూస్తున్నాం. ప్రత్యక్ష పన్నులు సంపదపై విధించేవి. సంపన్నులకు కష్టం కలగకుండా, నష్టం జరగకుండా వారి శ్రేయోరాజ్యాన్ని కాపాడడానికి సంపదపై ప్రత్యక్ష పన్నులను తగ్గించిన ప్రభుత్వం పరోక్ష పన్నులు విధించి పేదరికాన్ని మరింతగా పెంచడానికి వస్తుసేవల పన్నును ప్రవేశపెట్టింది. ప్రజాసంక్షేమం ఈ ప్రభుత్వ విధానం కాదని, వర్గ వ్యత్యాసాల్ని పెంచడమే దాని లక్ష్యమని అర్థమవుతున్నది.

కేవలం పరోక్ష పన్నుల వ్యవస్థపైనే దృష్టంతా కేంద్రీకరించి, దాన్నుంచి మరింత పిండుకోవడం ఎలా అన్న ఆలోచనే జీఎస్‌టీకి మూలం. నేరుగా సంపన్నులను ప్రభావితం చేసే ప్రత్యక్ష పన్నుల జోలికి మాత్రం ఎవరూ వెళ్ళరన్నది సత్యం. ఈ పరోక్ష పన్నులు ఉత్పత్తి, అమ్మకాలు, రవాణా, దిగుమతులపై విధించబడతాయి. ఇవికాక వినోదంపై పన్ను, సెస్సులు, సర్‌చార్జి వంటి ఇతర రూపాలలో కూడా పన్నులు ఉంటాయి. పరోక్ష పన్నులు మూడు రకాలుగా ఉంటాయి. 1. నిర్దిష్ట రూపంలో ఫలానా సరుకుపై ఫలానా శాతం పన్ను అని విధించడం. పరోక్ష పన్నులలో ఎక్కువ భాగం ఈ రూపంలోనే ఉంటాయి. దీని వలన పన్నురేటు పెంచుకుంటూ పన్ను ఆదాయం పెంచుకునే వీలుంటుంది. 2. అమ్మకం ధరలో పన్ను శాతం వలన పన్ను ఆదాయం పెరుగుతూ పోతుంది. చమురు ధర పెరిగినపుడల్లా దాని నుండి పన్ను ఆదాయం పెరగడం దీనికొక ఉదాహరణ. 3. వ్యాట్ రూపంలో పన్ను కేవలం వస్తువులపైనే విధిస్తారు. వస్తు ఉత్పత్తి జరిగిన స్థలం నుండి మొదలై చిల్లర వర్తకుని చేరేవరకు వివిధ దశలలో పన్ను విధిస్తారు. ఇది అన్ని రాష్ట్రాలలో ఒకే విధంగా లేదు. పరోక్ష పన్నులతో తన ఆదాయాన్ని పెంచుకోవడంలో మాత్రమే ప్రభుత్వానికి ఆసక్తి ఉన్నట్లు వెల్లడవుతున్నది. సామ్రాజ్యవాద ప్రపంచీకరణ (1991 నాటి) ఆర్థిక విధానాలు భారతదేశంలో మొదలయ్యి విలువ ఆధారిత పన్ను (వ్యాట్) ప్రవేశ పెట్టాలనే ప్రపంచబ్యాంకు షరతును 1994లో సంస్థాగత సర్దుబాటు కార్యక్రమానికి రుణమిచ్చి దేశవ్యాప్తంగా ఏకీకృత పన్ను వ్యవస్థను అమలు చేయాలన్న షరతును వాజ్‌పేయి ప్రభుత్వం 2000 సం॥లో వస్తుసేవల పన్ను బిల్లు రూపంలో తీసుకురావడానికి ప్రయత్నించింది. భారత రాజ్యాంగం ప్రకారం దేశమంతటా ఒకే పన్ను వ్యవస్థను అమలు చేసే అధికారం కేంద్ర ప్రభుత్వానికి లేనందున రాజ్యాంగ సవరణ అవసరం అయ్యింది. ఎన్‌డిఎ పాలన పోయి 2004లో అధికారంలోకి వచ్చిన యుపిఎ ప్రభుత్వం రాజ్యాంగ సవరణకు పూనుకున్నప్పుడు గుజరాత్ ముఖ్యమంత్రిగా ఉన్న నరేంద్రమోడీ తీవ్రంగా వ్యతిరేకించడంతో వస్తు సేవల పన్ను బదులు విలువ ఆధారిత పన్ను (వ్యాట్), కనీస ప్రత్యామ్నాయ పన్ను (మ్యాట్)ను ప్రవేశపెట్టింది. 2009లో ఐఎమ్ఎఫ్ మానస పుత్రులు మన్మోహన్ సింగ్, చిదంబరంల జంట జీఎస్‌టీ అమలుకు 2010ని లక్ష్యంగా ప్రకటించినా ఆచరణ సాధ్యం కాలేదు.

2014 మే లో ఆ నరేంద్రమోడీనే ప్రధానికాగానే రాజ్యాంగ సవరణ ప్రక్రియ మొదలయ్యింది. 2015 మే లో లోక్‌సభలో ప్రారంభమై 14 నెలల తర్వాత ఎట్టకేలకు 2016 ఆగస్టు 3న 122వ రాజ్యాంగ సవరణకు రాజ్యసభ కూడా ఆమోదం తెలిపింది. రాజ్యసభ సూచించిన మార్పులను ఆగస్టు 8న లోక్‌సభ మరల చర్చించి ఆమోదించింది. దీనిని మెజారిటీ రాష్ట్రాలు ఆమోదించంతో సెప్టెబర్ 8న రాష్ట్రపతి సవరణ బిల్లును ఆమోదించారు. మిగిలిన శాసన ప్రక్రియలను పూర్తి చేసుకుని 2017 జూలై 1 నుండి వస్తుసేవల పన్ను విధానం అమలు చేస్తామని కేంద్ర ఆర్థిక మంత్రి అరుణ్ జైట్లీ ప్రకటించాడు. ఏకీకృత పరోక్ష పన్నువ్యవస్థను తెచ్చి ఏకీకృత మార్కెట్ విధానానికి మార్చడమే వస్తుసేవల పన్ను లక్ష్యం. ఎక్సైజ్, అమ్మకం, సర్వీసు లాంటి పన్నులన్నీ జీఎస్‌టీలో మిళితం అయిపోతాయి. 2017 మార్చి 4న జరిగిన 11వ కౌన్సిల్ మీటింగ్‌లో తీర ప్రాంత రాష్ట్రాలలో ఆ రాష్ట్రాలే పన్ను వసూలు చేసుకునే సౌకర్యం, రైతులు, చిన్న వ్యాపారుల నుండి జిఎస్‌టి పన్ను వసూలు నుండి కొద్ది మేరకు  మినహాయింపు ఇవ్వడం జరిగింది. బడ్జెట్ 2వ దశ సమావేశాల్లోనే జిఎస్‌టి బిల్లును ఫైనల్ చేసారు. జులై 1 నుండి అమలులోకి తేవాలని నిర్ణయించారు.

పన్నులకు సంబంధించి రాజ్యాంగం రాష్ట్రాలకు కల్పించిన హక్కులను కేంద్రం తనకు దఖలు పరుచుకోవడం ద్వారా కేంద్రం ఫెడరల్ స్ఫూర్తికి విఘాతం కల్గిస్తోంది. వస్తుసేవల పన్ను వలన కేంద్రం విధిస్తున్న ఏడెనిమిది రకాల పన్నులు రద్దుకావడంతో పాటు రాష్ట్రాలకు ప్రధాన వనరుగా ఉండే రకరకాల పన్నులు రద్దవుతాయి. జీఎస్‌టీ అమలైతే తమిళనాడుకు 10 వేల కోట్ల రూపాయలు ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాలకు 5 వేల కోట్ల రూ॥, ఇలా అన్ని రాష్ట్రాలకు నష్టం వాటిల్లుతుంది. కేంద్రం పన్నుల్లో వాటా

ఇచ్చినా, కొంత కాలం పాటు లోటును పూడ్చినా ఆయా రాష్ట్రాలకు దీర్ఘకాలంగా జరిగే నష్టం పూడ్చడం జరగదు. ఈ రకమైన కేంద్రీకృత ఆర్థిక, రాజకీయ విధానాలు కారణంగా రాష్ట్రాలు స్వయం ప్రతిపత్తిని కోల్పోతాయి. కేంద్రం చెప్పుచేతల్లోకి ఈడ్చి వేయబడతాయి. రాష్ట్రాలకు ప్రత్యేక పన్నులు వేసే అధికారం, రాయితీలిచ్చే అవకాశం లేకపోతే పెట్టుబడులు ఆహ్వానించి అభివృద్ధి పనులు చేపట్టలేవు. ఆదాయ వనరులు తగ్గిపోతే సంక్షేమ కార్యక్రమాలు అమలు చేయలేవు. కేంద్రం దయాదాక్షిణ్యాలపైనే పూర్తిగా ఆధారపడే విధానం వస్తుంది. అయినాగాని వస్తుసేవల పన్ను విధానానికి, జీఎస్‌టీ కౌన్సిల్ ఏర్పాటుకు అనేక రాష్ట్రాలు ఆమోదించాయి. ఈ కౌన్సిల్‌లో కేంద్రానికి మూడోవంతు సభ్యత్వం, వీటో హక్కు ఉండడం వలన, పెద్ద, చిన్న రాష్ట్రాలన్నింటికి ఆదాయ వనరులెన్ని ఉన్నా ఒకే ఓటు ఉండడం వలన కేంద్రం ఆధిపత్యంకు తిరుగుండదు. ప్రజాసంక్షేమం, రాష్ట్రాల అవసరాల గురించి స్థానికంగా రాష్ట్ర ప్రభుత్వాల మీదనే ఒత్తిడి ఉంటుంది తప్ప కేంద్రానికి జవాబుదారీ తనం ఉండదు. విభిన్న సామాజిక, ఆర్థిక, రాజకీయ నేపథ్యాలున్న రాష్ట్ర ప్రభుత్వాలు కేంద్రానికి తలవంచి రాజ్యాంగ మౌలిక నిర్మాణానికి అనుగుణంగా ఒకప్పుడు రాసుకున్న ఫెడరల్ రాజ్యాంగానికి విఘాతం కల్పించే విధంగా సవరణలు తెచ్చి ప్రజావ్యతిరేక పన్ను విధానాన్ని అమలు చేస్తే, దానిని కొన్ని రాష్ట్రాలు నామ మాత్రంగా వ్యతిరేకించినా మెజారిటీ రాష్ట్రాలు ఆమోదించి అమలు చేయడం చూస్తే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలన్నీ సామ్రాజ్యవాద ప్రపంచీకరణ విధానాలకు తలఒగ్గి, వారి సేవకే అంకితమయ్యాయని అర్థమవుతున్నది.

జీఎస్‌టీ బిల్లును చట్టం చేయడానికి రాజ్యాంగ సవరణ చేస్తే ప్రజలకు జరిగే నష్టాన్ని చెప్పకుండా పూర్తిగా వాస్తవ విరుద్ధమైన విషయాలను అంటే దేశ స్థూల జాతీయోత్పత్తి వార్షికంగా రెండుశాతం పెరుగుతుందని, సామాన్య ప్రజలకు ప్రయోజనం చేకూరుతుందని, రాష్ట్రాల ఆదాయం పెరుగుతుందని, నల్లధనాన్ని అరికట్టవచ్చుని, పన్ను చెల్లించడం తగ్గుతుందని, పన్ను చెల్లించేవారి సంఖ్య పెరుగుతుందని, దీనితో ప్రభుత్వానికి ఆదాయం పెరుగుతుందని, వస్తు రవాణా తేలికగా, వేగంగా జరుగుతుందని పచ్చి అబద్దాలను మోడీ ప్రభుత్వం నిర్లజ్జగా ప్రచారం చేస్తున్నది. వస్తుసేవల పన్ను రేటును కేంద్రం పెంచుకుంటూ పోతుంది. దానివలన ధరలు పెరుగుతాయి. ద్రవ్యోల్బణం పెరుగుతుంది. ఇప్పుడు చిన్నా పెద్ద అన్నింటికి ఒకేరకంగా పన్ను పెరిగి పేద ప్రజల బతుకులు భారం అవుతాయి.

ప్రజలను ప్రత్యక్షంగా కొత్త రకాల పన్నుల పరిధిలోకి లాగితే వారి నుండి ప్రతిఘటన రావచ్చు. రాజ్యాంగ సవరణ ద్వారా రాజ్యం పరిధిలోకి లాగింది. ఆ ఊబి నుండి బయట పడకుండా చేయడానికే ఇంత సమయం తీసుకుంది. పాలకవర్గాల అవినీతి, అక్రమాల గురించి మాట్లాడే వారిపై నిర్బంధాన్ని అమలు చేస్తున్నారు, దోపిడీ చేసే బడాబాబులకు అన్ని రకాల అండగా ఉంటూ, రక్షణ కల్పిస్తూ, మరింతగా దోచుకునేందుకు కేంద్ర ప్రభుత్వం సహకరిస్తున్నది. అందులో భాగమే సంపన్నులకు పన్నురాయితీలు, మినహాయింపు, పాత బకాయిల రద్దు. ఈ రాజ్యాంగ సవరణ దీర్ఘకాలంలో పేదల పాలిట శాపం, సంపన్నులకు వరప్రసాదం కానున్నది.

జీఎస్‌టీ వలన పన్ను రేటు 15 నుండి 18కి పెరుగుతుంది. అది అక్కడితో ఆగదు. కేంద్ర ఆర్థికమంత్రి 18 శాతానికి మించి జీఎస్‌టీ రేటు పెంచం అని సభకుహామీ ఇవ్వలేదు. ధరల పెరుగుదలపై నియంత్రణ ఉండదనే దీని అర్థం. జాతీయ, అంతర్జాతీయ కార్పొరేట్లను అనుమతించడం ద్వారా సామాన్య ప్రజలపై ఆర్థిక భారాన్ని పెంచడమే నరేంద్ర మోడీ ప్రభుత్వ లక్ష్యం. సామాన్య ప్రజలకు జరిగే నష్టం ఎంత ఎక్కువగా ఉండబోతుందో నన్న కనీస స్పృహతో చట్టసభలలో, ప్రధాన మీడియాలో చర్చ జరగలేదు. పాలకవర్గాలు తమ వంతు లాభాల వేటలో పీడిత ప్రజల్ని పీల్చుకుతినేందుకు, వాటాలు వేసుకునే కుమ్ములాటే తప్ప మరొకటి కాదు. మొత్తం 20 రకాల పన్నులు జీఎస్‌టీ పరిధిలోకి వస్తాయి. ఈ వస్తుసేవల పన్ను చట్టం ప్రజల నడ్డివిరిచి పేదరికాన్ని పెంచేదే.

వాణిజ్య పరిశ్రమల మండలి (అసోచమ్) జీఎస్‌టీని ఆహ్వానిస్తూ కొన్ని నిజాలు వెల్లడించింది. జీఎస్‌టీ దేశ, విదేశీ పెట్టుబడులకు బ్రహ్మాస్త్రంగా ఉపయోగపడుతుందని చెప్పింది. వస్తు వినిమయం చేసే మధ్య తరగతి వర్గంపై అధిక భారం పడుతుంది. కనుక దానికి సిద్ధం కావాలి. పేదవర్గాలకు తిండిఖర్చు పెరిగి ఆదాయంలో అదే ప్రధానమయిపోతుంది. "మేకిన్ ఇన్ ఇండియా, బై మేక్ వన్ ఇండియా" అని నినాదాన్నిస్తున్నారు. దాని అర్థం స్పష్టమే. సంఘ్ పరివార్ శక్తుల ఆలోచనకు ప్రతిబింబంగా" అఖండ భారత్" అసలు అర్థం ఇదేనన్నమాట.

ఫెడరల్ వ్యవస్థ స్వాభావిక లక్షణమైన వికేంద్రీకరణకు వ్యతిరేకంగా కేంద్రీకరణ వైపు పయనిస్తున్న మన విధానాల లక్ష్యం సామ్రాజ్యవాద ప్రపంచీకరణలో భాగంగా ఆర్థిక సంస్కరణలను వేగవంతం చేయడమే. వనరులు, అధికారాలు కేంద్రానికే దఖలు చేయబడతాయి. భారతదేశం లోని ప్రజల శ్రమను, సంపదను సామ్రాజ్యవాదుల, దేశంలో దళారీ పాలకుల చేతుల్లోకి ఒప్పగించే జీఎస్‌టీ బిల్లుకు వ్యతిరేకంగా పోరాడుదాం. కార్మికవర్గ నాయకత్వంలో పోరాడి పీడిత ప్రజల రాజ్యం నిర్మిద్దాం. ○

# కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సమన్వయంతో చేసిన అత్యంత పాశవిక మారణకాండ



కా. సింహాచలం



కా. భారతి



కా. ప్రభాకర్



కా. మధు



కా. మున్నా



కా. కిరణ్



కా. మంజుల



కా. నరేష్

*(..........మొదటి పేజీ తరువాయి)*

పార్టీ, పి.ఎల్.జి.ఎకు చెందిన 22 మంది కామ్రేడ్స్‌తో పాటు వివిధ ప్రజా నిర్మాణాల్లో పని చేస్తున్న, నిరాయుధంగా వున్న 9 మంది యువతీ యువకులు అమరులైనారు. మరికొద్ది మంది గాయపడ్డారు. పి.ఎల్.జి.ఎ. కామ్రేడ్స్ పోలీసు కమాండో బలగాలతో హెూరాహెూరీ పోరాడి నేలకొరిగారు. ఈ పోరాటంలో గ్రేహౌండ్స్ సీనియర్ కమాండోను మట్టి గరిపించి మరో 4గురిని గాయపరిచారు. (ఘటనా వివరాలు కా.ఆర్.కె. ఇంటర్వ్యూలో చెప్పారు)

2014 డిసెంబర్ నుండి వరుసగా చేసిన అనేక ప్రయత్నాల్లో రాంగూడ దాడి నాలుగవది. ఆంధ్ర, ఒడిశా రాష్ట్రాల పోలీసులు చేస్తున్న సంయుక్త దాడులు 2014 నాటికి తీవ్రరూపం దాల్చాయి. నాయకత్వ నిర్మూలనే ప్రధాన లక్ష్యంగా కమాండో 'ఆపరేషన్ ఆలౌట్' పేరుతో ఈ దాడులు జరుగుతున్నాయి. 2014 డిసెంబర్, 2015 ఆగస్టులోను ఇదే పాకెట్‌లో పూర్తి సమాచారంతో తలపెట్టిన రెండు పెద్ద దాడులు శత్రు కదలికలు బహిర్గతం కావడంతో విఫల మయ్యాయి. 2015 డిసెంబంర్ నందపూర్ ఏరియాలో మూడవ సారి పి.ఎల్.జి.ఎ. బలగాలు మకాం మార్చడంతో రాత్రి 2 గం॥లకు యాదృచ్ఛికంగా ఎదురుపడి కాల్పులు జరిపినా సురక్షితంగా తప్పుకున్నారు. పై మూడు ఘటనలే కాకుండా నాయకత్వ నిర్మూలనే లక్ష్యంగా మరి కొన్ని ఏరియా డామినేషన్లు జరిగాయి. వాటన్నింటిని పి.ఎల్.జి.ఎ బలగాలు విఫలం చేశాయి.

ఇంత దుర్మార్గమైన మారణకాండ చేయడం వెనుక శత్రువు యొక్క వ్యూహాన్నీ, రాజకీయాల్ని చూసినట్లయితే ప్రధానంగా భారత విప్లవోద్యమంలో కీలక భూమికను నిర్వహిస్తున్న ఉద్యమ నాయకత్వాన్ని సమూలంగా నిర్మూలించడం, ఎ.ఒ.బి.లో ఉద్యమాన్ని కోలుకోకుండా దెబ్బతీసి రెండు దశాబ్దాలుగా నిలిచిపోయిన బాక్సైట్ గనులను వెలికి తీయడం, కాఫీ ప్లాంటేషన్ భూముల్ని ప్రజల నుండి దూరం చేయడం అనే అంశాలు వున్నాయి. అకస్మాత్‌గా జరిగిన ఈ దాడిని పి.ఎల్.జి.ఎ. కామ్రేడ్స్ అత్యంత సాహసంగా పోరాడి పాక్షికంగానైనా ఓడించగలిగారు. ప్రధాన నాయకత్వాన్ని కాపాడే క్రమంలో కొద్ది మంది నాయకత్వ కామ్రేడ్స్, పి.ఎల్.జి.ఎ. శ్రేణులు, మిలీషియా ప్రాణ త్యాగం చేశారు. ఈ వీరోచిత ప్రతిఘటన, ప్రజల మద్దతు వలన 50 మందికి పైగా కామ్రేడ్స్ సురక్షితంగా తప్పించుకోగలిగారు. ఆంధ్ర, ఒడిశా రాష్ట్రాలలో, దేశ విదేశాల్లో విప్లవ ప్రజలు ఈ మారణకాండ పట్ల తీవ్ర నిరసనను తెలియజేశారు. ఈ ఘటనపై నిజనిర్ధారణకు వచ్చిన వివిధ పౌరహక్కుల సంస్థలు, విద్యార్థి సంఘాలు ఇంకా అనేక సెక్షన్‌ల ప్రతినిధులు అక్కడికి వచ్చి జరిగిన మారణకాండను ప్రపంచానికి వెల్లడించారు. అక్కడ ప్రజల పరిస్థితిని అర్థం చేసుకొని విప్లవోద్యమ కృషిని అభినందించారు. పాలకవర్గాల ప్రజా వ్యతిరేక, అవినీతి, దుష్ట పాలనను అర్థం చేసుకొని మీడియా ద్వారా బహిర్గతం చేశారు. విప్లవవోద్యమ అవసరాన్ని, ప్రజల ఆకాంక్షగా విప్లవ శ్రేణులతో

# భారత విప్లవోద్యమ చరిత్రలో పెద్ద ఘటన

## ఏ.ఓ.బీ.లో జరిగిన రాంగూడ దాడి


కా. రాజేష్ పి.పి.సి.ఎం.



కా. శ్యామల


కా. కొమ్ము


కా. సిందే

### మిలీషియా కామ్రేడ్స్


కా. కమల


కా. లక్ష్మణ్


కా. జయరాం


కా. జొమ్మి

వారి అనుబంధాన్ని ఒక తప్పనిసరి అవసరంగా గుర్తించారు. విప్లవోద్యమ పురోగమనానికి వున్న అవకాశాల్ని వాస్తవ దృష్టితో అర్థం చేసుకున్నారు.

అమరులైన కామ్రేడ్స్‌లో ఎ.ఒ.బి. విప్లవోద్యమానికి వ్యూహాత్మక నాయకత్వాన్ని అందించిన కామ్రేడ్స్ ప్రసాద్, దయలు ఉన్నారు. పట్టణోద్యమంలో అపార అనుభవం కలిగిన కామ్రేడ్ గంగాధర్ వున్నాడు. మిలటరీ, ఆర్గనైజేషన్‌లలో అనుభవం కలిగిన కామ్రేడ్ కిరణ్ వున్నాడు. పార్టీకి చెందిన వివిధ రంగాలలో విశేష అనుభవం కల్గిన సీనియర్ కామ్రేడ్స్ లత, తాత, మధు, మమతలు వున్నారు. ఆయుధాల తయారీ రంగంలో నిష్ణాతుడైన కా॥ గౌతమ్ ఉన్నాడు. శతృవుతో హొరాహొరీ పోరాటంలో గెరిల్లా యుద్ధ పాటవాన్ని ప్రదర్శించే యోధులైన కామ్రేడ్స్ మున్నా, బిర్సు, రాజేష్, ఎర్రాల్, బుద్రి, మంజులలు వున్నారు. వీరేకాక క్రమశిక్షణ కల్గిన ప్రజా గెరిల్లాలు కామ్రేడ్స్ గంగాల్, చిలక, జ్యోతి, రజిత, నరేష్, దాసు, కమలలు వున్నారు. వీరితో పాటు గ్రామస్థాయి ప్రజా మిలీషియా, ప్రజాసంఘాలలో పని చేస్తున్న కామ్రేడ్స్ సిందే, కమల, శ్యామల, జొమ్మి, కొమ్ములు, జయరాం, లక్ష్మణ్, లొాయికల్, కావేరి మొదిలిలు వున్నారు. ఈ కామ్రేడ్స్ అందరూ వివిధ రంగాలలో నిష్ణాతులు మాత్రమే కాదు, ఉత్తమ కమ్యూనిస్టులు కూడా. ఒక్క మాటలో చెప్పాలంటే కామ్రేడ్ మావో చెప్పిన “రెడ్ అండ్ ఎక్స్‌పర్ట్”కు మంచి ఉదాహరణలు వీళ్ళు.

### కామ్రేడ్ చామల కిష్టయ్య (భాస్కర్, దయ, పూర్ణో, రాము)

45 సంవత్సరాల వయసున్న కామ్రేడ్ దయ 1990 నుండి అమరుడయ్యే నాటి వరకు 26 ఏళ్ళ పాటు అవిశ్రాంతంగా పని చేసి, ఎస్.జడ్.సి. స్థాయిలో వర్గ పంథాకనుగుణంగా ఒక దశాబ్ద కాలంగా వ్యూహాత్మక నాయకత్వాన్నందించిన మంచి కమ్యూనిస్టు కార్యకర్త.

నాటి తెలంగాణా సాయుధ పోరాటంలోనే కాక నేటి ప్రత్యేక ప్రజాస్వామిక తెలంగాణ పోరాటంలోనూ వీరోచిత పాత్ర వహించిన పోరాటాల ఖిల్లా నల్గొండ జిల్లాలోని వలిగొండ మండలం, దాసిరెడ్డిగూడెం గ్రామంలో నిరుపేద కుటుంబంలో చామల చంద్రమ్మ, రామయ్య దంపతుల కడుపు పంటగా దాదాపు 45 సంవత్సరాల క్రితం కామ్రేడ్ దయ జన్మించాడు. తల్లిదండ్రులు తమ బిడ్డకు ప్రేమగా కిష్టయ్య అనే పేరు పెట్టుకున్నారు.

కామ్రేడ్ దయ డిగ్రీ చదువుతున్న క్రమంలో రాడికల్ స్టూడెంట్స్ యూనియన్ (ఆర్.ఎస్.యు) కార్యకలాపాలకు ఆకర్షితుడయ్యాడు. అప్పటికే విప్లవ పార్టీ పని చేస్తున్న ప్రాంతం కావడంతో 1990లో పూర్తికాలం కార్యకర్తగా విప్లవోద్యమంలో భర్తీ అయ్యాడు. దక్షిణ తెలంగాణా ఉద్యమంలో నాలుగు సంవత్సరాలు రాచకొండ, కృష్ణపట్టి ఏరియాలలో పని చేసాడు. ఆ తర్వాత పార్టీ అవసరాల రీత్యా నల్లమలలో అప్పర్ ప్లాట్ ఏరియాకు బదిలీ అయ్యాడు. 1994లో కామ్రేడ్ దయ శ్రీకాకుళం డివిజన్ ఉద్యమంలో

భాగమయ్యాడు. కొద్దికాలానికి ఆ డివిజన్‌లోని ఉద్దానం దళానికి డిప్యూటీ కమాండర్‌గా భాస్కర్ పేరుతో ప్రజలకు చేరువయ్యాడు. 1996లో అదే దళానికి కమాండర్‌గా బాధ్యతలు చేపట్టాడు. 1998 కోపర్‌డంగ్ ఎన్‌కౌంటర్ తర్వాత పార్టీ నష్టాలను దృష్టిలో వుంచుకొని కామ్రేడ్ దయను ఉద్దానం ఏరియా నుండి నాగావళి ఏరియాకు బదిలీ చేయడం జరిగింది. అక్కడే శ్రీకాకుళం విజయనగరం జిల్లా కమిటీ సభ్యుడిగా ఆ తరువాత కార్యదర్శిగా అలాగే 2006లో రాష్ట్ర కమిటీ సభ్యుడిగా బాధ్యతల్లోకొచ్చాడు. కోరాపుట్ జిల్లా వుద్యమం అభివృద్ధిలో భాగంగా అభివృద్ధి చెందిన నారాయణపట్నా భూపోరాటానికి ప్రత్యక్ష నాయకత్వాన్ని అందిస్తూ శ్రీకాకుళం-కోరాపుట్ డివిజన్ కార్యదర్శిగా బాధ్యతలు చూశాడు. 2016లో ఉద్యమ అవసరాల రీత్యా జరిగిన మార్పుల్లో భాగంగా ఎమ్.కె.వి.బి. డివిజన్ కార్యదర్శిగా బాధ్యతలు స్వీకరించాడు.

1990 నుండి ప్రారంభమైన కామ్రేడ్ దయ విప్లవ పయనం నల్గొండలో రాచకొండ, కృష్ణపట్టి ఏరియాలు తర్వాత నల్లమల అటవీ ప్రాంతం అక్కడ నుండి ఉత్తరాంధ్రలోని శ్రీకాకుళం జిల్లా ఉద్దానం ప్రాంతానికి ఆ తర్వాత విజయనగరం జిల్లా నాగావళి ప్రాంతానికి ఆ తర్వాత కోరాపుట్‌లోని నారాయణపట్నాకు చివరికి ఎమ్.కె.వి.బి. డివిజన్‌లో కటాఫ్ ఏరియాకు మారుతూ బాధ్యతలు స్వీకరిస్తూ రెండున్నర దశాబ్దాల పైగా ప్రజలతో కలిసి ప్రజల ప్రేమాభిమానాలు చూరగొంటూ ప్రజా చైతన్యాన్ని పెంచుతూ విప్లవ ప్రజా ఉద్యమాన్ని ముందుకు తీసుకువెళ్ళాడు. ఉద్దానంలో పంజాబ్ సింగ్‌కు చెందిన 100 ఎకరాల కొబ్బరి తోట, గుట్ట ఏరియాలోని పాండ్రతల రామారావు ఆక్రమించిన 250 ఎకరాల భూమి, నారాయణపట్నాలో సొండి, బ్రాహ్మణ భూస్వాముల ఆధీనంలోని వందలాది ఎకరాల భూమి, శ్రీకాకుళం కొండబారెడి ఏరియాలో జీడి తోటల ఆక్రమణ పోరాటాలకు కామ్రేడ్ దయ నాయకత్వాన్ని అందించాడు.

తను నాయకత్వం వహించిన అన్ని ఏరియాల్లో గిట్టుబాటు ధరల (జీడిపిక్కలు, చింతపండు) కోసం పోరాటలు నిర్వహించి ప్రజలు విజయాలు సాధించారు. ప్రజా పంచాయితీలు, సారా బందు పోరాటాలు, విస్తాపన సమస్యలకు వ్యతిరేకంగా జరిపిన పోరాటాలు, ప్రజల దైనందిన సమస్యల కోసం జరిగిన అన్ని రకాల ఉద్యమాలకు కామ్రేడ్ దయ నాయకత్వం వహించి నిర్విరామంగా కృషి చేసాడు. ప్రజల ప్రేమ పాత్రుడైన కామ్రేడ్ దయ ప్రజల నాలుకలపై ఎల్లప్పుడు ప్రేమగా పిలుచుకునే ఆత్మీయుడిగా ఉండేవాడు. కష్టసుఖాలు, మంచిచెడులు అన్నింటిని పంచుకునే దయ ఆర్ధ్రత నిండిన చిరునవ్వుతో పలకరించి ప్రజల సమస్యలను తన సమస్యలుగానే పరిష్కరించేవాడు. అందుకే దయను అన్ని ఏరియాల్లో ప్రజలు తమ మనిషిగా భావించేవారు. శ్రీకాకుళ ఉద్యమంలో వెంపటాపు సత్యం, ఆదిభట్ల కైలాసంల తర్వాత గంటి రమేష్‌నూ అలాగే కామ్రేడ్ దయను ప్రజలు మా దేవుడు అనుకుంటారు. ప్రజలు అలా అనడంలో ఆశ్చర్యమేమి లేదు.

పోలీసులు ప్రజలను అరెస్టు చేసిన సందర్భాలలో వారి కుటుంబాలను కలవడం, ఓదార్చడం, ధైర్యం చెప్పడం, రాజకీయంగా అర్థం చేయించడం, వారిని ఉద్యమం వైపు నిలబెట్టడం, జైలు నుండి విడుదలై వచ్చిన వారిని కలిసి రాజకీయంగా అర్థం చేయించడం, వారిని ఉద్యమ పక్షాన నిలబెట్టడం పట్ల శ్రద్ధ పెట్టేవాడు. ప్రజలను ఎంత ప్రేమిస్తాడో శతృవుపై అంతే కసితో వుండేవాడు.

పాలకవర్గాల దమనకాండను ప్రతిఘటించడంలో భాగంగా ప్రత్యక్షంగా నాయకత్వం వహించిన భూస్వాములపై దాడులు నిర్వహించాడు. నీలభద్ర రైడ్‌లో గన్నె ఎర్రయ్య అనే బడా భూస్వామినీ, రక్షణగా వున్న ఇద్దరు పోలీసుల్ని చంపి, ముగ్గురు పోలీసులను గాయపర్చి 5 రైఫిల్‌లు స్వాధీనం చేసుకోవడంలో ముందున్నాడు. 1998 లో బొడిగడ్డ, బొడిపడ పోలీస్ స్టేషన్స్‌పై ఆయుధాల కోసం చేసిన జంట రెయిడ్స్‌లోనూ, 2009 నాల్కో రెయిడ్‌లోను భాగస్వామి అయ్యాడు. 2005 నాగావళి ఏరియాలో కూంబింగ్‌కు వచ్చిన శత్రువుపై కామ్రేడ్ దయ నాయకత్వంలో ఆపర్చునిటీ ఆంబుష్ చేసి ఒక పోలీస్ కానిస్టేబుల్‌ను గాయపర్చాడు.

కామ్రేడ్ దయ నిరంతరం క్యాడర్, ప్రజలకు దగ్గరగా వుండేవాడు. అందుకే ప్రజల, పార్టీ కార్యకర్తల విశ్వాసాన్ని అపారంగా చూరగొన్నాడు. తను ఏ ప్రాంతంలో పని చేస్తే ఆ ప్రాంత భాషను సొంతం చేసుకునేవాడు. ప్రజల భాషలో చొరవగా మాట్లాడుతూ వాళ్లలో ఒకడుగా మెలిగేవాడు. ఎక్కడ పని చేసినా ఆ ఏరియాలోని టెర్రయిన్ మీద పట్టు సంపాదించాడు. నారాయణపట్నా భూపోరాటంలో కూడా కామ్రేడ్ దయ పాత్ర కీలకమైనది. తన ఉపన్యాసాలతో ప్రజలను ఉత్తేజ పర్చడమే కాక పాటలతో కూడా ప్రజల హృదయాల్లో నిలిచిపోయాడు. దయ జీవితాన్ని శ్రీకాకుళ ఉద్యమంతో విడదీసి చూడలేము. కామ్రేడ్ దయ తన లోపాలను సరిచేసుకోవడంలో ఘర్షణ పడుతూ ఎప్పటికప్పుడు స్వయం విమర్శ చేసుకోవడమే కాక వాటి నుండి బయటపడటానికి కృషి చేసేవాడు. ఉద్దానంలో భాస్కర్‌గా, విజయనగరం, రాయ్‌గఢలో దయగా, నారాయణపట్నాలో పూర్ణోగా, నందపూర్‌లో తెలుగు ప్రజలకు రాముగా ప్రజల హృదయాల్లో చెరిగిపోని ముద్ర వేశాడు.

అమరుడు కామ్రేడ్ మంగన్న సహచరి స్వర్ణను పెండ్లి చేసుకొని

ఆమె అభివృద్ధికి సహకరించాడు. ఆమె వదద ఎన్‌కౌంటర్‌లో అమరురాలైంది.

కామ్రేడ్ మావో చెప్పిన "ప్రజలే గురువులు, పల్లెలే పాఠశాలలు, ప్రజలే చరిత్ర నిర్మాతలు" అనే మూడు సూత్రీకరణలను శ్రద్ధతో, నమ్రతతో నేర్చుకొని విప్లవ జీవిత క్రమమంతటా వాటిని ఆచరిస్తూ అక్కడనుండే నిజమైన విప్లవ నాయకుడిగా, ప్రజా సైనిక కమాండర్‌గా, ప్రజల మనిషిగా సజీవుడయ్యాడు. అంతటి ఆదర్శమూర్తి, ఎ.ఒ.బి. ఉద్యమానికి నాయకుడు మన కామ్రేడ్ దయ ఆదర్శ జీవితం మనకి మార్గదర్శి.

**కామ్రేడ్ బాకూరి వెంకటరమణరాజు (గణేష్, ప్రసాద్)**

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం, విశాఖ జిల్లా, హుకుంపేట మండలం, బాకూరు గ్రామంలో మధ్య తరగతి ఆదివాసీ కుటుంబంలో గణేష్ జన్మించాడు. తనకు తల్లిదండ్రులు ప్రేమతో పెట్టిన పేరు వెంకటరమణరాజు. కామ్రేడ్ గణేష్ విద్యార్థి దశలో ఆర్.ఎస్.యు. లో చేరి కార్యకలాపాల్లో చురుగ్గా పాలుపంచుకున్నాడు. 1990లలో ముఖ్యంగా విశాఖ ప్రాంతంలో 'గిరిజన హక్కుల పరిరక్షణ సంస్థ' (ఒ.పి.జి.ఆర్.) అనే ఒక సంఘం పని చేస్తుండేది. నేడు ప్రజల్లో పార్టీ ఎలా ప్రఖ్యాతి పొందిందో, అలాగే ఆ రోజుల్లో విప్లవోద్యమ గైడెన్స్‌లో నడిచినటువంటి ఒ.పి.జి.ఆర్. ప్రభావం అంతగా వుండేది. అది ఆదివాసీ ప్రజల అనేక సమస్యల్ని తీసుకుని పని చేసింది. కామ్రేడ్ గణేష్ డిగ్రీ పూర్తయిన తర్వాత ఒ.పి.జి.ఆర్. కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొన్నాడు. ఒ.పి.జి.ఆర్.కి అనుబంధంగా వున్న గిరిజన విద్యార్థి సంఘం (జి.ఎస్.యు.) 2000ల వరకు కూడా చురుగ్గా పనిచేసింది. జి.ఎస్.యు. కార్యకలాపాలు నడిపించడంలో, వుద్యోగ సెక్షన్స్‌ను ఆర్గనైజ్ చేయడంలో కామ్రేడ్ గణేష్ పాత్ర కీలకమైనది.

1996లో కామ్రేడ్ గణేష్ పూర్తికాలం కార్యకర్తగా గెరిల్లా జీవితంలో భాగమయ్యాడు. 1997 నుండి 1999 వరకు అరకు దళంలో పని చేస్తూ ఏరియా కమిటీ సభ్యుడిగా ఎదిగాడు. అరకు దళం రద్దయిన తరువాత కోరుకొండ ప్రాంతంలో పని చేస్తూ ఏరియా కమిటీ కార్యదర్శిగా జిల్లా కమిటీ సభ్యుడిగా ఎదిగాడు. కోరుకొండ ఏరియాలో ప్రజలతో మమేకమై నీటిలో చేపలా కలిసిపోయి కోరుకొండ గణేష్‌గా పేరు తెచ్చుకున్నాడు. అదే జిల్లా కమిటీలో సెక్రటేరియట్ సభ్యుడిగా ఎదిగాడు. 2006లో జరిగిన ఎ.ఒ.బి. మూడవ రాష్ట్ర మహసభలో కామ్రేడ్ గణేష్‌ను ఎస్.జడ్.సి.లోకి ఎన్నుకోవడం జరిగింది. అప్పటినుండీ విశాఖ డివిజన్ కార్యదర్శిగా బాధ్యతలు నిర్వహించాడు. 2008లో ఈస్ట్ డివిజన్ కార్యదర్శి గాయపడటంతో ఈస్ట్, విశాఖ రెండు జిల్లాలను కలిపి ఉమ్మడి జిల్లాగా ఏర్పర్చారు. దానికి కార్యదర్శిగా కామ్రేడ్ గణేష్‌ను నియమించారు. ఆ విధంగా 2013 వరకు విశాఖ, ఈస్ట్ రెండు డివిజన్‌ల ఉద్యమంలో కామ్రేడ్ గణేష్ పాత్ర కీలకమైనదిగా మారింది. 2013లో ఎ.ఒ.బి. ప్లీనం తర్వాత కామ్రేడ్ గణేష్‌ను ఎస్.ఎమ్.సి.లోకి తీసుకోవడంతో పాటు ప్రజా సంఘాల సమన్వయ బాధ్యతలు కూడా ఇచ్చారు. సాంస్కృతిక రంగాన్ని కూడా చూస్తున్న సందర్భంలో ఒక వర్క్‌షాప్‌ను నిర్వహించి పాటల క్యాసెట్ విడుదలకు కృషి చేశాడు. ఐక్య సంఘటన నిర్మాణాలకు సరైన మార్గదర్శకత్వాన్ని అందించడం, డివిజన్ సెక్రటరీగా బాధ్యతలు నిర్వహించడం, రాజకీయంగా తూర్పు కనుమల ఉద్యమాన్ని ముందుకు నడిపించడంలో కీలక భూమికను పోషించాడు.

రెండు దశాబ్దాల పాటు సాగిన బాక్సైట్ తవ్వకాలకు వ్యతిరేకంగా జరిగిన పోరాటం, కాఫీ ప్లాంటేషన్ భూముల ఆక్రమణ పోరాటాలు, అలాగే ప్రభుత్వ అణచివేతకు వ్యతిరేకంగా జరిగిన ప్రతిఘటన పోరాటాలకు కామ్రేడ్ గణేష్ ప్రత్యక్ష నాయకత్వం వహించాడు. తూర్పు కనుమల్లో 1/70 చట్టం అమలు కోసం జరిగిన పోరాటాల్లో, మైదానాల నుండి వచ్చిన ఆదివాసేతర భూస్వాములకు వ్యతిరేకంగా జరిగిన పోరాటాల్లోనూ, కాఫీ ప్లాంటేషన్, భూ ఆక్రమణ పోరాటాల్లోనూ, బాక్సైట్ వ్యతిరేక, విస్థాపన వ్యతిరేక పోరాటాల్లోనూ, గిట్టుబాటు ధరల కోసం (గొర్చె కందులు, పసుపు మున్నగు) జరిగిన ఆందోళనల్లోను, నిర్బంధానికి వ్యతిరేకంగా ప్రజా కదలికలలోను, తునికాకు, వెదురు కూలీ రేట్ల పెంపుదలలోను ప్రజలను అనేక సార్లు వేలాదిగా కదిలించాడు. తూర్పు కనుమల్లో మిలీషియాను కదిలించి అనేక రకాల పోరాటాల్లో భాగస్వాములను చేయడంలో ప్రధాన భూమికను పోషించాడు. సరెండర్స్‌ను ప్రోత్సహిస్తూ కౌన్సిలింగ్ పాలసీని ముందుకు తెచ్చిన పాలకవర్గాల కుట్రలను తిప్పి కొట్టాడు.

కామ్రేడ్ గణేష్ కలిమెల–మోటు, ఉప్పలవాడ, పాలూరు, అనకాపల్లి–చోడవరం, కోరాపుట్, మారేడిమిల్లి, చింతవారి పాలెం, బలిమెల, సీలేరు, ఆర్.ఉదయగిరి, నయాగఢ్, దామన్‌జోడి, గుణికిరాళ్ళ, చిన్నంటిజోల లాంటి ఏ.ఓ.బీ. లో జరిగిన దాడులన్నింటిలో ధైర్య సాహసాలతో చురుకుగా పాల్గొన్నాడు. విప్లవోద్యమానికి వేల సంఖ్యలో ఆయుధాలనందించిన నాయకుల్లో ఒకడు.

కామ్రేడ్ గణేష్ డిగ్రీ పూర్తయ్యాక విలేఖరిగా కొన్నాళ్లు పని చేశాడు. విద్యార్థి నేపథ్యంతో పాటు, విలేకరిగా పని చేసిన అనుభవం కలిగివుండటంతో రచనలు చేసే నైపుణ్యం సంపాదించాడు. వుద్యమ ప్రాంతంలో ప్రభుత్వ అణచివేత, బాక్సైట్ పోరాటం తదితర విషయాలపై మత్రికామయ్య, నాగమణి తదితర కలం పేర్లతో

అనేక సామాజిక పత్రికలకు రచనలు చేశాడు. ఎ.ఒ.బి. జోన్ పత్రిక బోల్షివిక్‌కు రచనలు చేసాడు. 2015 జులై–డిసెంబర్ బోల్షివిక్ 6వ బులిటెన్ తీసుకురావడంలో కామ్రేడ్ గణేష్ పాత్ర కీలకమైనది.

ఏ ఉద్యమమైనా అక్కడున్నటువంటి స్థానిక నాయకత్వం వున్నత స్థాయికి ఎదిగి ఆ వుద్యమానికి నేతృత్వం వహించడం వల్ల ఆ వుద్యమ పురోగమనానికి దోహదపడుతుంది. ఆ విధంగా స్థానిక ఆదివాసీ నేపథ్యంతో పాటు ఒక సాధారణ కార్యకర్త నుండి రాష్ట్ర స్థాయి వరకు అంచెలంచెలుగా ఎదిగి కామ్రేడ్ గణేష్ ఈ రోజు ఎస్.జడ్.సి స్థాయికి ఎదగడానికి పార్టీ సహకారంతో పాటు తన కృషి ప్రధానమైంది. తన కుటుంబం కాదన్నప్పటికీ తను ప్రేమించిన అరుణను పెళ్ళి చేసుకున్నాడు. ఆమెను ఉద్యమంలోకి తెచ్చి ఆమె ఎదుగుదలకు ఎంతో సహకరించాడు. ఆమె అరెస్టయి చిత్రహింసలకు గురై జైలు నిర్బంధాన్ని అనుభవించినప్పుడు, ఆ దెబ్బల తీవ్రతతో విడుదలైన తర్వాత కూడా అనారోగ్యం కారణంగా ఇబ్బంది పడుతున్నప్పుడు అన్ని సందర్భాల్లోనూ మానసికంగా ధైర్యం చెబుతూ ఎంతో తోడ్పాటునందించాడు. పోలీసులు ఎల్.ఐ.సి. పాలసీలో భాగంగా గణేష్ సహచరి అరుణను వేదించడం ద్వారా సరెండర్ పాలసీని ముందుకు తేవడానికి ప్రయత్నించినా, తండ్రిని కొట్టి ఇల్లు కూల్చి అనేక సార్లు ఇంటిపై దాడి చేసినా, కుటుంబాన్ని మానసికంగా కృంగదీసినా కామ్రేడ్ గణేష్ ఎలాంటి ఊగిసలాటకు గురి కాకుండా వర్గపోరాట రాజకీయాలను దృఢంగా ఎత్తిపడుతూ చివరి ఊపిరి వరకూ విప్లవోద్యమంలో కొనసాగాడు. ప్రభుత్వం, పోలీసులు కామ్రేడ్ గణేష్ కుటుంబంపై అమలు చేసిన నిర్బంధ దాడులను ఆదివాసీ ప్రజాసమూహాలు ఐక్యంగా ఖండించాయి. విప్లవోద్యమాన్ని ముందుకు తీసుకుపోయే క్రమంలో ఎదురుపడిన అనేక ఎగుడుదిగుడులను దృఢంగా ఎదుర్కొంటూ ముందుకు సాగాడు. సహచర కామ్రేడ్స్‌కు ప్రేమ, ఆప్యాయత, స్వేచ్ఛ, భరోసాను అందించడంలో కామ్రేడ్ గణేష్ అందరికీ ఆదర్శంగా వుండేవాడు.

కామ్రేడ్ గణేష్ 46 ఏళ్ళ జీవిత కాలంలో 1990 నుండి అమరత్వం పొందే నాటికి 26 ఏళ్ళ విప్లవ జీవితాన్ని దృఢదీక్షతో కొనసాగించాడు. తూర్పు కనుమల విప్లవోద్యమం చరిత్ర నుండి విడదీయరాని గొప్ప నాయకుడు. అక్కడి భూమి పుత్రుడు మన గణేష్.

## పి.కె.ఎమ్. కళాకారుడు కామ్రేడ్ ప్రభాకర్ (అరవిందు, హరి, గంగాధర్)

రంగారెడ్డి జిల్లా యాప్రాల్ గ్రామానికి చెందిన కాపుక అంజయ్య, రత్నమ్మల కొడుకు మన ప్రభాకర్. కామ్రేడ్ ప్రభాకర్ అసలు పేరు అరవిందు. అందరు హరి అనేవాళ్ళు. ప్రభాకర్ యాప్రాల్‌లోనే 10వ తరగతి పూర్తి చేసాడు. తర్వాత సివిల్ ఇంజనీరింగ్‌లో చేరాడు. చదువుకుంటూనే పని పాటలు నేర్చుకున్నాడు. పనిలో శ్రద్ధ, నేర్చుకోవడంలో వినయం విద్యార్థికుండాల్సిన ఈ ప్రాథమిక గుణాలు ప్రభాకర్‌కు జీవితాంతం కొనసాగాయి. అందుకే ప్రభాకర్ బహుముఖ ప్రజ్ఞాశాలిగా రూపొందాడు. ఇల్లు నిర్మాణంలో సెంట్రింగ్, ఎలక్ట్రికల్ పనితోపాటు టైలరింగ్ నేర్చుకొని కుటుంబానికి ఆర్థికంగా అండగా నిలిచాడు. చదువులో తను నేర్చుకున్న భూమి కొలతలు, ప్రాజెక్టు నిర్మాణాల జ్ఞానాన్ని దండకారణ్యంలో, ఎ.ఒ.బి.లో జనతనసర్కార్ ఏర్పడిన చోట ప్రజలకు చెక్ డ్యాంలు కట్టడానికీ, భూమి కొలతలు నేర్పడానికి ఉపయోగపడ్డాయి. చిన్నవయస్సులోనే భజన సంఘంలో చేరి దానినే కళారంగ పాఠశాలగా ఎంచుకొని పాటపాడటం, రాయటం, డప్పు, డోలక్ వాయిద్యాలు వాయించడం నేర్చుకొని తర్వాత కాలంలో తానే ఆయా రంగాలలో శిక్షణనిచ్చే స్థాయికి, ప్రామాణిక రచనలు చేసే స్థాయికి ఎదిగాడు. జె.ఎన్.ఎమ్. పాటలు, కార్యక్రమాలు ప్రభాకర్‌ని ఆకర్షించి ఆయన ఆలోచనల్లో మెరుగుదలను తెచ్చాయి. వాస్తవ దృష్టితో ఆలోచించిన ప్రభాకర్ విప్లవ ప్రజా ఉద్యమాల్లో చురుకైన కార్యకర్తగా ఎదిగాడు.

కామ్రేడ్ ప్రభాకర్ మంచి విద్యార్థిగా, నిత్యసత్యాన్వేషిగా, ఆచరణవాదిగా, బతుకు బాధల నుండి ఎదిగి వచ్చిన కష్టజీవిగా, కార్మికవర్గ రాజకీయాలు అందిపుచ్చుకున్న శ్రామికవర్గ మేధావిగా ఎదిగాడు. అందుకే ఓపిక, సహనం, నిబ్బరం, పట్టుదల, విశ్వాసంలతో అన్ని పనుల్లో బాధ్యతగా వుండేవాడు. 1997 వరంగల్‌లో తెలంగాణా డిక్లరేషన్ సభ జరిగిన నాటి ప్రత్యేక తెలంగాణ మలిదశ ఉద్యమం నుండి మంచి కార్యకర్తగా, అనేక సంఘాల సమన్వయకర్తగా క్రియాశీల భూమిక నిర్వహించాడు. 1997లోనే ఏర్పడిన ప్రజాకళామండలికి వ్యవస్థాపక సభ్యుడిగా తర్వాత కాలంలో రాష్ట్ర ఉద్యమ నాయకత్వంలో కీలకవ్యక్తిగా బాధ్యతను పోషించాడు. 'తెలంగాణా లొల్లి' పాటల క్యాసెట్, 'నివురుగప్పిన నిప్పు' డాక్యుమెంటరీ' నిర్మాణాల్లో తనే ముఖ్యుడుగా అన్ని పనులు సమన్వయించి పని చేసాడు. ఆ అనుభవంతో సి.ఆర్.బి. తయారు చేసిన 'విప్లవ తరంగం' డాక్యుమెంటరీ సినిమాకు అమరుడు లచ్చాల్‌తో కలిసి స్క్రిప్ట్ తయారు చేసాడు. డి.కె.లో వున్న కొద్ది కాలంలోనే తన ఆట, పాటలతో డప్పు, డోలు జ్ఞానంతో భూమి కొలతల పరిజ్ఞానంతో జనతన సర్కార్‌ల మరియు సి.ఎన్.ఎమ్. క్యాడర్‌ల, పి.ఎల్.జి.ఎ. శ్రేణులకు అవసరమైన శిక్షణను, ఉత్తేజాన్ని అందించి వారికీ, డి.కె. ప్రజలకు బాగా సన్నిహితమయ్యాడు. అలాగే ఎ.ఒ.బి.లో చెక్‌డ్యాం నిర్మాణాల్లో, వ్యవసాయ రైతాంగ సదస్సులో, వర్గవిశ్లేషణ పరిశోధనలో క్రియాశీలంగా పాల్గొన్నాడు.

తీవ్ర నిర్బంధ పరిస్థితుల్లో కామ్రేడ్ ప్రభాకర్ పట్టణోద్యమాన్ని గైడ్ చేయడంలో నూతన అనుభవాలను పొందుపరిచాడు. రహస్య-బహిరంగ కార్యకలాపాల మధ్య, తక్షణ-దీర్ఘకాలిక లక్ష్యాల మధ్య సమన్వయాన్ని సాధించాడు. ప్రత్యేక తెలంగాణ ఉద్యమ ప్రవహంలో కలగలిసి 'విప్లవ స్రవంతి'ని క్రమశిక్షణతో సెపరేట్‌గా మార్చ్ చేయించిన వారిలో ప్రభాకర్ ఒకరు.

రెండు దశాబ్దాలుగా ప్రజాసంఘ కార్యకలాపాలలో రాటుదేలిన ప్రభాకర్ ఎ.ఒ.బి. నాయకత్వంతో చేరి ఐక్య సంఘటన నిర్మాణాల సమన్వయానికి బాధ్యత తీసుకున్నాడు. పార్టీలోకి వచ్చే కొత్త క్యాడర్ అభివృద్ధికి తనదైన శైలిలో కొన్ని పథకాలు రూపొందించుకున్నాడు. సమస్యల మీద పాటలు రాసిన ప్రభాకర్ సామాజిక, ఆర్థిక, రాజకీయ, సాంస్కృతిక విషయాలలో తన అవగాహనను పెంచుకుంటూ అనేక అంశాలపై పరిశోధక స్థాయిలో వ్యాసాలు రాసాడు. 'శబ్దం' పత్రికను తేవడానికి విశేషంగా కృషి చేసాడు. మహిళా మార్గం, నడుస్తున్న తెలంగాణ లాంటి ప్రగతిశీల, విప్లవ పత్రికలకు రచనలు చేసి పంపేవాడు. కామ్రేడ్ ప్రభాకర్ గొప్ప శైలితో రాసిన పాటలు, రచనలు, ప్రత్యేక గొంతుతో పాడిన పాటల క్యాసెట్లు తీసిన డాక్యుమెంటరీలు మనకున్నాయి. అంతకంటే విలువైన ప్రభాకర్ పెనవేసుకున్న మానవ సంబంధాలు, విప్లవ రాజకీయ చైతన్యం కలగలిసిన వ్యక్తిత్వం సజీవంగా మనకు దారి చూపిస్తాయి.

## కామ్రేడ్ కొండమంచిలి సువర్ణరాజు (కిరణ్, రమేష్)

కామ్రేడ్ కిరణ్ ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం, పశ్చిమ గోదావరి జిల్లాకు చెందినవాడు. తన అక్క, బావ విప్లవోద్యమంలో వుండటంతో చూడటానికి శ్రీకాకుళం అడవికి వచ్చాడు. దళాల్ని, ప్రజల్ని అక్కడి పరిస్థితుల్ని చూశాడు. అప్పటికతను మైనారిటీ తీరని టీనేజ్ విద్యార్థి. దళిత కుటుంబంలో పుట్టిన కారణంగా వివక్షతను అనుభవించాడు. దీంతో పాటు, సామాజిక పరిస్థితులు ఆయన్ని ఘర్షణకు గురి చేసినాయి. ఈ క్రమంలోనే సరైన జీవిత మార్గాన్ని అన్వేషిస్తున్న క్రమంలో తన వాళ్ళు ఉద్యమంలో ఉండటం, ఆ వాతావరణం కిరణ్‌ను బాగా ప్రభావితం చేసింది. ఉద్యమంతోనే ఉండాలని గాఢంగా నిర్ణయించుకున్నాడు. ఇంటికి పంపిస్తే కూడా ఒంటరిగా వెదుక్కుంటూ మరల అడవికి చేరి దళాన్ని పట్టుకుని ఉండిపోయాడు. దళం కోసం వచ్చిన పోలీసు బ్యాచ్ దారిలో కనబడిన కిరణ్‌ను అరెస్టు చేసి జైలుకు పంపింది.

బహుశా రాష్ట్రంలో మొదటిసారి ఒక మైనర్ బాలుడి మీద టాడా కేసు పెట్టారు. ఇది పెద్ద సంచలన వార్త అయ్యింది. పౌరహక్కుల సంఘాలు తీవ్రంగా స్పందించాయి. రెండు సంవత్సరాలకు పైగా జైలు జీవితాన్ని అనుభవించాక కామ్రేడ్ కిరణ్‌పై కేసు కొట్టి వేశారు. జైలు కొచ్చిన సీనియర్ కామ్రేడ్స్ నుండి రాజకీయాలు నేర్చుకున్నాడు. రిమాండ్‌లో ఉన్న ఖైదీలకు విప్లవోద్యమం గురించి వివరించి చెప్పేవాడు. ఇంత చిన్నవాడికి అన్ని విషయాలు తెలియడం, క్రమశిక్షణ, చురుకుదనం అందర్ని ఆకర్షించేవి. జైలులో ఉండగానే ఉద్యమంలో కొనసాగాలనే తన సంకల్పాన్ని మరింత దృఢపర్చుకున్నాడు. ఉద్యమంలోకి వచ్చి గార్డ్‌గా చేరి క్రమశిక్షణ, చురుకుదనంతో తొందరగా నేర్చుకుని బాధ్యతగా వుండేవాడు. 2006లో విజయనగరం జిల్లాలో జె.వలస దగ్గర ఎస్.జడ్.సి. కామ్రేడ్‌పై దాడి జరిగినప్పుడు ఫైరింగ్ చేసి శతృవును వెనక్కి నెట్టాడు. మొత్తం టీం రిట్రీట్ కావడంలో కామ్రేడ్ కిరణ్ చేసిన చొరవ కీలకంగా ఉపకరించింది. రెండు సంవత్సరాల పాటు గార్డుగా తన బాధ్యతను పట్టుదలగా నిర్వహిస్తూ నాయకత్వం, కేడర్ నుండి నేర్చుకుంటూ అభివృద్ధి చెందాడు.

ప్రధాన బలగాల్లో పని చేయడానికి బదిలీ చేయడం కోసం చర్చించినపుడు వెంటనే సంసిద్ధతను వ్యక్తం చేశాడు. చిన్నప్పటి నుండీ కంటి సమస్య ఉన్నప్పటికీ, రాత్రిపూట నడకలు ఇబ్బంది అయినప్పటికీ దాన్ని పట్టుదలతో అధిగమిస్తాననీ, మిలటరీ నిర్మాణాల్లో పని చేయడం ఇష్టమని ఆ పనిలోకి మారాడు. ఆంధ్ర, ఒడిశా రెండు రాష్ట్రాల్లోనూ జరిగిన అనేక ప్రతిఘటన దాడుల్లో చురుగ్గా పాల్గొనడం ద్వారాను, కోరాపుట్, ఈస్ట్‌లలో జరిగిన అనేక పోరాటాలకు రక్షణ కల్పించడంలోను మంచి పాత్ర నిర్వహించాడు. ఆ నిర్మాణాల్లో రాజకీయాలు చెప్పడంలోనూ, స్థానిక ప్రజలతో మెలగడంలోను ఆదర్శంగా ఉండి పి.ఎల్. కమాండర్‌గా ఎదిగాడు. ఆ తర్వాత ఆర్గనైజేషన్ బాధ్యతలు స్వీకరించి డి.వి.సి.ఎమ్.గా ఎదిగి పార్టీ ఆధారపడే ఒక మంచి కమాండర్‌గా నిలిచాడు.

కామ్రేడ్ కిరణ్ తన పని, అధ్యయనం, ఎదుగుదలలో ఎదుర్కొంటున్న సమస్యలు, అన్యవర్గ ధోరణుల ప్రభావాల గురించి నిర్మాణాల్లో చర్చించడం, తన అభివృద్ధికి, పార్టీ అభివృద్ధికి కృషి చేయడం ఒక నిరంతర పోరాటంగానే జరిగింది.

## కామ్రేడ్ యాదమ్మ/భారతి (లత)

కామ్రేడ్ లత మెదక్ జిల్లాలోని ఉల్లి తమ్మాయిపల్లి గ్రామంలో పుట్టింది. తండ్రి రైల్వేలో నాల్గవ తరగతి ఉద్యోగి కావడంతో హైదరాబాద్‌లోని లాలాపేటలో స్థిరపడ్డారు. లతకు ఒక చెల్లి, ముగ్గురు తమ్ముళ్ళు ఉన్నారు. కన్నవారు పెట్టిన పేరు యాదమ్మ కాగా పెళ్ళయిన తర్వాత అత్తవారింట భారతిగా పేరు మార్చుకుంది. లతకు 11వ ఏటనే పెళ్ళయింది. 15వ ఏటనే లత తల్లయి య్యింది. భర్త పీపుల్స్‌వార్ పార్టీ కార్యకర్తగా వెళ్ళడం మొదట్లో లతకు కోపం

తెప్పించినా తర్వాత క్రమంగా చైతన్యవంతంగా అర్థం చేసుకొని భర్త ప్రేమించిన ప్రజల్ని, ఉద్యమాన్ని సొంతం చేసుకొని తను కూడా అదే బాటలో నడిచింది. కుటుంబ ఆర్థిక పరిస్థితుల రీత్యా బీడీలు చుట్టి, సేల్స్ గర్ల్‌గా పని చేసి కుటుంబాన్ని నెట్టుకొచ్చింది. ఆ తర్వాత క్రమంలో మహిళా సంఘ కార్యకలాపాలలో పాల్గొంటూ క్రియాశీల కార్యకర్తగా మారింది. తను చదువుకున్న 10వ తరగతి జ్ఞానంతో నర్స్ ట్రైనింగ్‌తో ఉస్మానియా యూనివర్సిటీ చుట్టూ వున్న బస్తీలు తిరిగి మహిళా హక్కుల గురించి చెబుతూ వైద్య సేవలు అందించింది. ఆ క్రమంలోనే హైదరాబాద్ జిల్లాకు మహిళా సంఘ అధ్యక్షురాలయ్యింది. కుటుంబ బాధ్యతల్లో భాగం పంచుకుంటునే కొడుకును పెద్ద చేసి విద్యా బుద్ధులు నేర్పి పెళ్ళి చేసింది. కొడుకు, కోడలు ఉద్యమ పథంలోనే వుంటూ తల్లిదండ్రుల మార్గాన్ని అనుసరిస్తామని నిర్ణయించుకున్నందుకు లత గర్వపడ్డది.

2011లో వయస్సు పెరిగినప్పటికీ, అనారోగ్య సమస్యలు వెంటాడుతున్నప్పటికీ ఆశయ సాధనకు అంకితమై కష్ట భరితమైన గెరిల్లా జీవితాన్ని ఎంచుకొని ఎ.ఒ.బి. ఉద్యమంలో భాగం అయ్యింది. అక్కడ ఒక డాక్టర్‌గా 5సంవత్సరాల పాటు సేవలందిస్తూ పాడియా, కలిమెల, కటాఫ్ ఏరియాలలోని ప్రజలకూ, విప్లవ శ్రేణులకు అవసరమైన వైద్యసేవలు అందించింది. ఆమె స్వభావంలో భాగమైన ప్రేమ, ఆప్యాయత, సహకార గుణం, సేవా తత్పరత ఈ వృత్తిలో ఆమెకు ఉపయోగపడ్డాయి. కామ్రేడ్ లత ఓపిక, వినయం, క్రమశిక్షణ కలిగిన ఉత్తమ గెరిల్లాగా, మంచి డాక్టర్‌గా మన్ననలు పొందింది. రాంగూడ సంఘటన సందర్భంగా కామ్రేడ్ లత తన దగ్గర ఆయుధం లేకున్నా నాయకత్వాన్ని రక్షించాలనే బాధ్యతతో నాయకత్వానికి రక్షణ కవచంగా నిలబడుతూ రిట్రీట్ కావడానికి సహకరించింది. కామ్రేడ్ లత జీవిత పయనంలో కష్టాలు తెలిసి నడిచింది. ఉన్నత ఆదర్శంతో ప్రజా వైద్య రంగంలో నిలిచిన మంచి సైనికురాలు.

### కామ్రేడ్ మమత

శ్రీకాకుళం జిల్లా, మందస మండలం, ఉద్దానం ప్రాంతం, నల్లబొడ్డూరు గ్రామంలో నిరుపేద రైతాంగ కుటుంబంలో జన్మించింది. తనకు ఊహ తెలియని వయస్సులో తల్లి మరణించడంతో తండ్రి మరో పెళ్ళి చేసుకున్నాడు. వారికి ముగ్గురు కొడుకులు. మమతతో కలిసి వారు నలుగురు. కుటుంబానికి వున్న వెనకబాటుతనంతో ఎవరినీ చదివించలేదు తల్లిదండ్రులు.

పీపుల్స్‌వార్ రాజకీయాలతో పరిచయాలు ఏర్పర్చుకుని కా. మమత 1989లో వృత్తి విప్లవకారిణిగా మారింది. కామ్రేడ్ మమత పార్టీ సంబంధాల్లో ఉంటూ మహిళా సంఘాలలో పని చేసింది. అదే సమయంలో పూర్తికాలం కార్యకర్తగా టెక్నికల్ రంగంలో పని చేస్తున్న కామ్రేడ్‌ను పెళ్ళి చేసుకుంది. రెండు సంవత్సరాల తర్వాత అతను అనారోగ్యంతో అమరుడయ్యాడు. ఆ సమయంలో తను బయట రహస్యంగా వుంటూ పని చేయలేనని పార్టీతో చెప్పి 1992లో పార్టీ దళాల్లోకి వచ్చింది.

సవర తెగ ప్రజల్ని ప్రేమిస్తూ కొండబారెడు దళంలో చాలా క్రియాశీలక పాత్ర పోషించింది. 1992 నుండి 96 వరకు అనారోగ్యం కారణంగా అడవి ఉద్యమానికి దూరంగా ఉన్నా వుద్దానంలో చురుగ్గానే పని చేసింది. 1996 నుండి కొండబారెడు దళంలోనే పని చేసి 1998లో ఏరియా కమిటీ సభ్యురాలయ్యింది. లోకల్ గెరిల్లా స్క్వాడ్‌లో వుంటూ అనేక మిలటరీ చర్యల్లో పాల్గొన్నది. 1999లో ఆమె తిరిగి వివాహం చేసుకుంది.

ఉద్దానం ప్రాంతంలో, కొండబారెడు దళంలో, మిలటరీ రంగంలో, ఈస్ట్ డివిజన్‌లో, టెక్నికల్ రంగంలో, సీఆర్‌సీ 3వ కంపెనీలో ఇలా అనేకరంగాలలో కామ్రేడ్ మమత సేవలందించింది. మిలటరీ రంగం విషయానికొస్తే 2001 లక్ష్మిపూర్ ఆంబుష్, పొలాడ్ రైడ్ (10-ఎస్.ఎల్.ఆర్.లు, 1-పిస్టల్ పి.ఎల్.జి.ఎ. స్వాధీనం అయ్యాయి) 2002లో గొట్లబద్ర ఆంబుష్, 2004లో కోరాపుట్ మల్టిరైడ్, 2009లో పాలూర్ ఆంబుష్, 2009 లో నాల్కొ రెయిడ్ తదితర మిలటరీ చర్యలలో కామ్రేడ్ మమత భాగమయ్యింది. ఎ.ఒ.బి. ఉద్యమానికి చెందిన మొదటి తరం మహిళగా 25 సంవత్సరాల సుదీర్ఘ విప్లవ జీవితం కొనసాగించింది కామ్రేడ్ మమత.

### కామ్రేడ్ ఎనమలపల్లి సింహాచలం (రెంజిమ్, మురళి, హరి, తాత, రవి)

విజయనగరం జిల్లా, బొబ్బిలి మండలం, చిన్ననందవలస గ్రామంలో నిరుపేద రైతాంగ కుటుంబంలో కామ్రేడ్ సింహాచలం జన్మించాడు. ఆ కాలంలో 5వ తరగతి వరకు చదువుకున్నాడు. అతని చిన్నతనంలోనే తల్లి మరణించడంతో చదువు మానేసి ఇంటి పనుల్లో తండ్రికి సహకారంగా వుంటూ వ్యవసాయ పనుల్లో సహకరించేవాడు. 18సంవత్సరాల వయసులో వివాహమయ్యింది. వారికి ఒక కూతురు, ఇద్దరు కొడుకులు కల్గారు. పిల్లలను కష్టపడి చదివించారు.

పోరాటాల నేపథ్యం వున్న ప్రాంతంలో పుట్టి పెరిగిన కామ్రేడ్ సింహాచలం మొదట సి.పి.ఐ.(ఎం.ఎల్.) పార్టీ యూనిటీలో పని చేసేవాడు. గంటి ప్రసాదం నాయకత్వంలో అనేక భూపోరాటాలలో పాల్గొన్నాడు. దళితులపై భూస్వాముల అన్యాయాలను అరికట్టాలనే

కసితో అనేక మంది ప్రజలను ఐక్యం చేసేవాడు. కోలాటం, బాగోతం వంటి కళా రూపాల్లో తనకు ప్రవేశం వుండేది. వివిధ కళారూపాల ద్వారా పార్టీ పిలుపును ప్రజల్లోకి తీసుకెళ్ళడం వంటి పనులలో కామ్రేడ్ సింహాచలం పాత్ర కీలకమైనది.

పార్టీ యూనిటీ, పీపుల్స్‌వార్‌లు ఏకమైన తర్వాత కామ్రేడ్ సింహాచలం పార్టీ పిలుపునందుకొని తూర్పు కనుమల ఉద్యమంలోకి అడుగుపెట్టాడు. కామ్రేడ్ సింహాచలం తూర్పు కనుమలలో మురళిగా, నారాయణపట్నాలో హరిగా, నందపూర్‌లో తాతగా, అమరుడయ్యే నాటికి కటాఫ్ ఏరియాలో రవిగా కువ్వి, ఒడియా, తెలుగు ప్రజల గుండెల్లో చెరగని ముద్ర వేసాడు. ఒర్ద ఫైరింగ్‌లో శత్రు తూటాలకు ముగ్గురు కామ్రేడ్స్ అమరులయ్యారు. తను చొరవ చేసి తన దగ్గరున్న గ్రెనేడ్‌ను దూకుడుగా వస్తున్న శత్రు బలగాలపై విసిరాడు. దాంతో వాడు తగ్గాడు, ఆ సమయంలో మిగిలిన కామ్రేడ్స్ క్షేమంగా రిట్రీట్ అయ్యారు. విప్లవోద్యమంలో రెండు దశాబ్దాలకు పైగా పనిచేసిన కామ్రేడ్ మురళి రైతాంగ కార్యకర్తగా, సాంస్కృతిక యోధుడిగా, వ్యవసాయ కమిటీ సభ్యుడిగా, వైద్యుడిగా సేవ లందించాడు. ప్రజలను, క్యాడర్‌ను ప్రేమగా చూసుకొనే మురళిని అందరూ పెద్ద మనిషిగా గౌరవించి తాతపేరును స్థిరపర్చుకున్నారు.

## కామ్రేడ్ దాసు (మధు)

కామ్రేడ్ మధు పశ్చిమ గోదావరి జిల్లాలో పేద దళిత కుటుంబంలో పుట్టి పేదరికాన్ని వివక్షతను అనుభవించాడు. కుల వివక్షతను, వర్గ అణచివేతను ఎదుర్కొనే క్రమంలో తనే కేంద్రంగా ఒక దళిత యువజన సంఘం నిర్మాణమయ్యింది. అక్కడ కమ్మ భూస్వామ్యాన్ని ఎదుర్కోవడం కోసం యువకులకు కర్రసామునేర్పి గురువు అయ్యాడు. గునపాన్ని కర్రలా తిప్పి స్థానిక శత్రువుల్లో భయాల్ని పుట్టించాడు. ధైర్య సాహసాలతో కొట్లాటల్లో ముందుండే మధును లక్ష్యంగా పెట్టుకున్న భూస్వామ్య వర్గం పోలీసు కేసులు పెట్టి ఇబ్బందుల పాలు చేసింది. ఈ పరిస్థితుల్లో తనకు లభించిన పరిచయాల్లో నుండి విప్లవోద్యమ సంబంధాల్లోకి వచ్చాడు. భార్యకి అర్థం చేయించినప్పుడు ఆమె కూడా ఉద్యమంలోకి పని చేయడానికి సిద్ధపడటంతో ఇద్దరు చిన్నపిల్లలను కుటుంబీకులకు అప్పజెప్పి శ్రీకాకుళం ఉద్యమంలో భాగమయ్యారు.

కొంత కాలం తర్వాత మధు సహచరి పిల్లల్ని విడిచి వుండలేక పోయింది. తను ఇంటిదగ్గరే ఉండటానికి నిర్ణయించుకుంది. తను మాత్రం 15సంవత్సరాల పాటు పిల్లలకు దూరంగా వుంటూనే రాజకీయ పట్టుదలతో విప్లవోద్యమంలో కొనసాగాడు. కామ్రేడ్ మధు ఎస్.జడ్.సి. కామ్రేడ్ మస్తాన్‌రావు (ఎన్.ఆర్)కు గార్డుగా ఎంతో సహకారంగా వున్నాడు. చాలా కాలం పాటు ఆయుధాల తయారీ రంగలో వుండి గ్రెనెడ్స్, తుపాకులు మొదలైనవి తయారు చేయడంలో నైపుణ్యం సంపాదించాడు. ఆదర్శవంతమైన కామ్రేడ్ మధు ఆచరణ ఒక మంచి నమూనాగా వుండి విప్లవం పట్ల కేడర్‌కు, ప్రజలకు నమ్మకాన్ని పెంచింది. తన ప్రవర్తన ద్వారా అందరి మనస్సుల్లో గాఢమైన ముద్ర వేసిన ఆదర్శ విప్లవ మూర్తి మధు. నాయకత్వం పట్ల విశ్వాసంతో నాయకత్వ రక్షణ బాధ్యతను ఎప్పుడు ప్రథమ కర్తవ్యంగా భావించేవాడు. ఆ కామ్రేడ్‌కు చెవులు వినబడకపోవడం లాంటి కొన్ని పరిమితులు వచ్చాయేగాని కార్మిక వర్గతత్వంలో ఎటువంటి సడలింపులు రాలేదు. 20 సంవత్సరాల పాటు విప్లవ లక్ష్యంతో పోరాడినవాడు. ఎటువంటి భేషజాలు లేని సామాన్య మానవుడు.

## కామ్రేడ్ సుర్జిత్ దర్రో (గౌతమ్)

ఛత్తీస్‌గడ్ రాష్ట్రం, ఉత్తర బస్తర్ డివిజన్, రావ్‌ఘాట్ ఏరియా, కొయిలిబెడ బ్లాక్, కందాడి గ్రామంలో ఆదివాసీ మధ్య తరగతి రైతు కుటుంబంలో దాదాపు 40 ఏళ్ల క్రితం కామ్రేడ్ గౌతమ్ జన్మించాడు. 6వ తరగతి వరకు చదువుకున్నాడు. పార్టీ, విప్లవ ప్రజా సంఘాలు బలంగా వున్న గ్రామమది. తన కుటుంబం కూడా విప్లవ కుటుంబం. తన తల్లి జి.పి.సి. సభ్యురాలిగా క్రియాశీలక పాత్ర పోషించింది. 2013లో తల్లి అమరురాలైంది. గౌతం సంఘంలో పని చేస్తూనే ప్రేమ వివాహం చేసుకున్నాడు.

2000 సంవత్సరంలో విప్లవోద్యమ అవసరాల రీత్యా కామ్రేడ్ గౌతమ్‌ను, తన సహచరిని పార్టీ పూర్తి కాలం కార్యకర్తలుగా భర్తీ చేసుకుంది. ఆమె ఒక రకమైన మానసిక జబ్బుతో ఆత్మహత్య చేసుకుంది. కామ్రేడ్ గౌతమ్ ఆ విషాదం నుండి తేరుకొని తన బాధ్యతల్లో నిమగ్నమయ్యాడు. కొద్ది కాలానికి తన పనిలోని అభివృద్ధిని పరిగణనలోకి తీసుకొని జోన్ టి.డి.లోకి బదిలీ చేశారు. దాదాపు 2 సంవత్సరాలు అక్కడ పని చేసి, టెక్నికల్ రంగంలో మంచి నైపుణ్యాన్ని సంపాదించాడు. అతను టెక్నికల్ రంగంలో ఎదిగే అవకాశాలున్నాయని అంచనా వేసిన ఎస్.జడ్.సి. సెంట్రల్ టెక్నికల్ డిపార్ట్‌మెంట్ అవసరాల కోసం కామ్రేడ్ గౌతమ్‌ను ఎంపిక చేసింది.

2003 నుండి సెంట్రల్ టెక్నికల్ డిపార్ట్‌మెంట్‌లోని భోపాల్ యూనిట్‌లో పనిచేశాడు. 2007 నుండి 2009 వరకు జైలు నిర్బంధాన్ని అనుభవిచాడు. తిరిగి పార్టీలో చేరి పార్టీ అవసరాల రీత్యా ఎ.ఒ.బి. టెక్నికల్ యూనిట్‌లో 2010లో భాగమయ్యాడు. క్రమశిక్షణా సూత్రాలకనుగుణంగా మెలగడంలో కామ్రేడ్ గౌతమ్ అందరికీ ఆదర్శంగా నిలిచాడు. తన అమరత్వం ఎ.ఒ.బి. జోన్‌కే కాక పార్టీకి లోటు అనడంలో అతిశయోక్తి లేదు.

## కామ్రేడ్ గెమ్మిలి కేశవరావు (బిర్సు)

విశాఖ జిల్లా, జి.మాడుగుల మండలం, తాడిపాలెం గ్రామం కామ్రేడ్ బిర్సుది. బతుకుదెరువు కోసం గాలికొండ ఏరియాలోని గర్శింబంద గ్రామానికి వచ్చాడు. ఇతనికి ఇద్దరు తమ్ముళ్లు వున్నారు. పార్టీ ప్రభావం వున్న ప్రాంతం కావడంతో దళం నిర్వహించే మీటింగులకు హాజరయ్యేవాడు. 2006లో పూర్తికాలం కార్యకర్తగా రిక్రూట్ అయ్యాడు. గాలికొండ దళంలో పనిచేస్తూ స్థానిక ప్రజలతో మమేకమయ్యాడు. పార్టీ అవసరాల రీత్యా ఎస్.జడ్.సి. కామ్రేడ్‌కు కొంతకాలం గార్డుగా పని చేశాడు. ఆ తర్వాత సి.ఆర్.సి. మొదటి కంపెనీలోకి పార్టీ అతన్ని బదిలీ చేసింది. కంపెనీలో వుంటూ మిలటరీ నైపుణ్యాన్ని పెంచుకున్నాడు.

జోన్‌లో పి.ఎల్.జి.ఎ. చేపట్టిన అనేక దాడులలో, ప్రజా వ్యతిరేకుల్ని శిక్షించడంలో కంపెనీ సభ్యుడిగా కామ్రేడ్ బిర్సు ప్రత్యేక భూమిక నిర్వహించాడు. ప్రజలను ఎంత ప్రేమించేవాడో శత్రువంటే అంతే కసితో ఉండేవాడు. అనేక ఫైరింగ్‌లలో తప్పించుకుని తర్వాత మరింత ధైర్యంగా శత్రువును ఎదుర్కొన్నాడు. శత్రువంటే ఓ అడుగు ముందుండేవాడు. శత్రు నిర్బంధం వెంటాడినా ఏనాడు కూడా వెనకడుగు వేయని వ్యక్తి కామ్రేడ్ బిర్సు. పార్టీ సభ్యుడి నుండి ఎ.సి. స్థాయికి, ఆ తర్వాత సెక్షన్ కమాండర్‌గా ఎదిగిన బిర్సు పార్టీకి ఆధారపడతగిన కామ్రేడ్ అయ్యాడు.

## కామ్రేడ్ పృథ్వి (మున్నా)

కామ్రేడ్స్ శిరీష–అక్కిరాజు హరగోపాల్‌ల ఏకైక సంతానంగా కామ్రేడ్ మున్నా జన్మించాడు. కామ్రేడ్ శిరీషది ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం, ప్రకాశం జిల్లా, టంగుటూరు మండలం, ఆలకూరపాడు గ్రామం. కామ్రేడ్ మున్నా తండ్రి అజ్ఞాత జీవితంలో వుండడం మూలంగా తల్లి పెంపకంలోనే పెరిగి పెద్దయ్యాడు. ఇంటర్ వరకూ చదువుకున్నాడు. తండ్రి మార్గమే సరైనదని దృఢంగా విశ్వసించిన కామ్రేడ్ మున్నాకు ఆ మార్గంలో అడుగుపెట్టడానికి తల్లి మమకారం ఆటంకం కాలేదు.

2008లో దండకారణ్యంలోకి అడుగు పెట్టడంతో తన విప్లవ ప్రస్థానం ప్రారంభమైంది. కామ్రేడ్ మున్నా చురుకుదనం, తెలివితేటలు, సాంకేతిక పరిజ్ఞానం, ఆసక్తిని గమనించిన పార్టీ అతన్ని మిలటరీ ఇంటెలిజెన్స్‌లో సభ్యుడిగా నియమించింది. ఒక సంవత్సర కాలం పాటు పని చేసిన తర్వాత పార్టీ అవసరాల రీత్యా ఎ.ఒ.బి.కి బదిలీ అయ్యాడు.

2009లో ఎ.ఒ.బి.లోని, శ్రీకాకుళం–కోరాపుట్ డివిజన్‌లోని నారాయణపట్నా ఏరియా యాక్షన్ టీంలో వుంటూ సి.ఆర్.సి. 3వ కంపెనీలో సభ్యుడయ్యాడు. కొంతకాలం పాటు జన మిలీషియా కమాండర్ బాధ్యతలు నిర్వహించాడు. అతి తక్కువ సమయంలో స్థానిక కువ్వి, ఒడియా భాషలు నేర్చుకున్నాడు. సమిష్టి అధ్యయనం నిర్వహించడంలో, పార్టీ రాజకీయాలను బోధించడంలో, మిలటరీ తర్ఫీదునివ్వడంలో మంచి నేర్పరి. మిలీషియా సభ్యులను రాజకీయ కార్యకర్తలుగా తీర్చిదిద్దడంలో కామ్రేడ్ మున్నా పాత్ర క్రియాశీలకమైనది. ఆ కృషి ఫలితంగా కొంత మంది మిలీషియా సభ్యులు పూర్తి కాలం కార్యకర్తలుగా రిక్రూట్ అయ్యారు.

తన రాజకీయ చైతన్యం, క్రమశిక్షణ, సమర్థతల రీత్యా 2013 జనవరిలో ప్లాటూన్ పార్టీ కమిటీ సభ్యుడిగా పదోన్నతిని పొందాడు. ఆ నిర్మాణంలో వుంటూ మిలిటరీ ఇంటలిజెన్స్ బాధ్యతలను నిర్వర్తిస్తూ, పలు మిలటరీ చర్యల్లో పాల్గొన్నాడు. కొన్ని చర్యలకు తానే నాయకత్వం వహించాడు. సురేష్, కేంద్రుక అర్జున్, దళై బలరాం వంటి ప్రజా ద్రోహులను ఖతం చేయడం, ప్రజా శతృవులను శిక్షించడం వంటి చర్యల్లో తన పాత్ర ముఖ్యమైనది. కలిమెల, నారాయణపట్నా అంబూష్‌లలో స్కౌట్ పార్టీ బాధ్యతగా నిర్వహించి ఆ చర్యలు విజయవంతం కావడానికి దోహదపడ్డాడు. 2014 జూన్‌లో మాచ్‌ఖండ్‌లో చేసిన అంబుష్‌లో ఒక అసిస్టెంట్ కమాండెంట్‌ను మట్టిగరిపించి మరొకడిని గాయపరచారు. ఈ చర్యకు కామ్రేడ్ మున్నా కమాండర్‌గా నాయకత్వం వహించాడు. వయస్సు పెరిగే క్రమంలో తాత్విక దృష్టి అలవర్చుకున్నాడు. మున్నా శ్రద్ధగా అధ్యయనం చేసి కొన్ని మిలిటరీ అంశాలను పత్రికలకు రాశాడు.

2014లో ఎమ్.కె.బి. డివిజన్, కటాఫ్ ఏరియా ఎల్.జి.ఎస్. (లోకల్ గెరిల్లా స్క్వాడ్) లోకి కామ్రేడ్ మున్నాను బదిలీ చేయడం జరిగింది. తరువాత సి.ఆర్.సి. ప్లాటూన్‌లో డిప్యూటీ కమాండర్‌గా ప్రమోట్ అయ్యాడు. రాంగూడ వద్ద జరిగిన శత్రు మూకుమ్మడి దాడిని వీరోచితంగా ప్రతిఘటిస్తూ, ఆ దాడి నుండి నాయకత్వ కామ్రేడ్స్‌ను కాపాడే కర్తవ్యాన్ని నెరవేర్చే క్రమంలో తన నవ యవ్వనాన్ని తృణప్రాణంగా అర్పించిన వీర కిషోరం కామ్రేడ్ మున్నా.

## కామ్రేడ్ రాజేష్

దండకారణ్యంలోని పశ్చిమ బస్తర్ డివిజన్ (ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం, బీజాపూర్ జిల్లా), భైరంగఢ్ ఏరియా, మాట్వాడ పంచాయితీ కోత్రపాల్ గ్రామస్తుడు. కామ్రేడ్ రాజేష్ కుటుంబం కట్టెకళ్యాణ్ ఏరియా నుండి కోత్రపాల్ వచ్చి స్థిరపడింది.

2006లో దళంలోకి పూర్తికాల కార్యకర్తగా రిక్రూట్ అయ్యాడు. మొదట మద్దేడు ప్లాటూన్‌లో పని చేస్తూ పలు దాడులలో

పాల్గొన్నాడు. అదే సమయంలో చేపట్టిన రాణిబోదిలి రెయిడ్‌లో కూడా కామ్రేడ్ రాజేష్ పాల్గొన్నాడు. 2007లో కామ్రేడ్ రాజేష్ ఎ.ఒ.బికి బదిలీ అయ్యి, సీఆర్‌సీ కంపెనీ-1లో భాగమయ్యాడు. 2012లో పి.పి.సి. సభ్యుడిగా పదోన్నతి పొందాడు. నయాగఢ్ దాడిలో, గునుకురాయి ఆంబుష్‌లో అసాల్ట్ పార్టీలో సభ్యుడిగా వున్నాడు. ఈస్ట్ డివిజన్‌లో కంపెనీ చేపట్టిన అన్ని దాడుల్లో కామ్రేడ్ రాజేష్ మంచి పాత్ర పోషించాడు.

## కామ్రేడ్ నంగాల్ రవ్వా (ఎర్రాల్)

కామ్రేడ్ నంగాల్ దక్షిణ బస్తర్ డివిజన్, పామేడ్ ఏరియా, ఎర్రపల్లి (ఎర్రం) గ్రామంలో దాదాపు 25 ఏళ్ల క్రితం జన్మించాడు. ఎర్రపల్లి ప్రారంభం నుండీ నేటి వరకూ ఉద్యమానికి బలమైన గ్రామం. తన చైతన్యాన్ని పెంచుకొని 2009లో వృత్తి విప్లవకారుడయ్యాడు. మొదట్లో పామేడ్, పువ్వర్తి ఎల్ఓఎస్ పరిధిలోని గ్రామాల్లో సివిల్ ఆర్గనైజర్‌గా పనిచేశాడు. ఒక సంవత్సరం తర్వాత డివిజన్ కమిటీ నిర్ణయం మేరకు పామేడ్ ఎల్‌జీఎస్‌లో రెండేళ్లు పని చేశాడు. ఆ తర్వాత కామ్రేడ్ నంగాల్ 9వ ప్లటూన్‌లోకి బదిలీ అయ్యాడు. అక్కడ నాలుగేళ్లు పని చేసి, రాజకీయంగా, సైనికంగా అభివృద్ధి చెందాడు. ఆ తర్వాత ఏఓబీకి బదిలీ అయ్యాడు. ఎర్రాల్ పేరుతో అక్కడ ప్రధాన బలగానికి చెందిన సీఆర్‌సీ ప్లటూన్‌లో పీపీసీ సభ్యుడిగా బాధ్యతలు నిర్వర్తించాడు. ఒక సంవత్సరం పాటు అక్కడ పని చేసి పార్టీ, పీఎల్‌జీఏ, ప్రజల విశ్వాసాన్ని చూరగొన్నాడు.

## కామ్రేడ్ బుద్రి

కామ్రేడ్ బుద్రి ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం, బీజాపూర్ జిల్లా, గంగులూర్ ఏరియా గోర్నం గ్రామంలో 27 సంవత్సరాల క్రితం జన్మించింది. ఆమెకు ఇద్దరు చెల్లెలు, ముగ్గురు తమ్ముళ్లు. మొదట వీరి కుటుంబం కట్టెకళ్యాణ్‌లో వుండేది. అక్కడ భూస్వాముల దోపిడీ, దౌర్జన్యాలను తట్టుకోలేక, తమకు వున్న భూమిని కూడా భూస్వాములు లాక్కోవడంతో ఆ కుటుంబమంతా గోర్నంకు వెళ్ళిపోయింది.

కామ్రేడ్ బుద్రి 2009 డిసెంబర్‌లో విప్లవోద్యమంలోకి పూర్తికాలం కార్యకర్తగా రిక్రూట్ అయ్యింది. 2010 మార్చిలో పార్టీ అవసరాల రీత్యా ఎ.ఒ.బి.కి బదిలీ అయింది. ఎ.ఒ.బి.లోని పార్టీ చేపట్టిన పలు ఆంబుష్‌లలో, ప్రజా శత్రువులను శిక్షించడంలో కామ్రేడ్ బుద్రి భాగమయ్యింది.

తన తండ్రి, చెల్లి, తమ్ముడు అరెస్టయినప్పుడు, తమ్ముడు పోలీసు కాల్పుల్లో అమరుడైనప్పుడు కామ్రేడ్ బుద్రి నిబ్బరంగానే వుంది. ప్రజా ఉద్యమంలో నిర్బంధం, అమరత్వం సర్వసాధారణమని గుర్తించి వర్గ శత్రువుపై మరింత కసితో ముందుకు సాగింది. 2014 మేలో పార్టీ ఆమెను పి.ఎస్-1(ప్రొటెక్షన్ స్క్వాడ్)లోకి బదిలీ చేసింది. పి.ఎస్.లో సెంట్రీ, కిచెన్ ఇన్‌చార్జ్ బాధ్యతల్లో కొనసాగింది. 2015 జనవరిలో డిప్యూటీ కమాండర్ బాధ్యతలు చేపట్టింది. 2015 అక్టోబర్‌లో కామ్రేడ్ బుద్రిని ఏరియా కమిటీలోకి తీసుకోవడం జరిగింది.

## కామ్రేడ్ ఉంగి (మంజుల)

కామ్రేడ్ మంజుల దండకారణ్యంలోని దర్భా డివిజన్ (ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం, సుకుమా జిల్లా), మలింగేర్ ఏరియా, బర్రెగూడెంలోని నిరుపేద ఆదివాసీ కుటుంబంలో సుమారు 23 సంవత్సరాల క్రితం జన్మించింది. ఆమె తల్లి ఉంగి, తండ్రి మాడివి జోగాల్. ఆమెకు ఒక అక్క, ముగ్గురు చెల్లెలు వున్నారు. వీరందరి చిన్నతనంలోనే తండ్రి అనారోగ్యంతో మరణించడంతో తన తల్లే కుటుంబ భారాన్ని మోసింది. 3సంవత్సరాలు మిలీషియాలో పనిచేసిన అనుభవం వున్న కామ్రేడ్ మంజుల కె.ఎ.ఎమ్.ఎస్.లో క్రియాశీలంగా పనిచేసింది. 2011 జూలైలో ఆమె పూర్తికాలపు కార్యకర్త అయింది. అప్పటికే తనకున్న ఉద్యమ అనుభవం, తెలివి తేటలు గమనించి ఇన్‌స్ట్రక్టర్స్ టీంలో నియమించడం జరిగింది.

ఒక సంవత్సర కాలం అందులో పని చేసిన కామ్రేడ్ మంజుల 2012లో ఎ.ఒ.బి.కి బదిలీ అయింది. నాయకత్వ రక్షణ కోసం ఏర్పరిచిన పి.ఎస్-2 (ప్రొటక్షన్ స్క్వాడ్)లో సభ్యురాలయింది. అందులో ఆమె డాక్టర్ బాధ్యతను నిర్వహించింది. తన అభివృద్ధిని గమనించిన పార్టీ 2016 ఆగస్టులో ఆమెను ఏరియా కమిటీలోకి ప్రమోట్ చేసింది.

## కామ్రేడ్ సురేష్ (నరేష్)

ఒడిశా రాష్ట్రం, శ్రీకాకుళం-కోరాపుట్ డివిజన్, నారాయణపట్నా ఏరియా, సామన గ్రామంలో నిరుపేద ఆదివాసీ కుటుంబంలో కామ్రేడ్ నరేష్ జన్మించాడు. తల్లిదండ్రులు ప్రేమతో పెట్టిన పేరు సురేష్. చిన్నతనంలోనే తల్లి మరణించడంతో తండ్రి మరో వివాహం చేసుకున్నాడు. కడుపునిండా ఏ రోజు కూడా బుక్కెడు బువ్వ తినలేని దారిద్ర్యం వెంటాడింది. ఆ సమయంలోనే నారాయణ పట్నా భూపోరాటం బద్ధలయింది. ఉన్నత లక్ష్యంతో 15 ఏళ్ళ ప్రాయంలోనే విప్లవోద్యమ బాట పట్టాడు కామ్రేడ్ నరేష్. మిలీషియాలో సభ్యుడయ్యాడు. పార్టీతో చర్చించి 2012 మార్చిలో పూర్తికాలం కార్యకర్తగా భర్తీ అయ్యాడు.

కామ్రేడ్ నరేష్ క్రమశిక్షణను గమనించిన పార్టీ ఎస్.జడ్.సి. సభ్యుడికి గార్డుగా నియమించింది. 2015లో పార్టీ నిర్ణయం మేరకు గార్డు నుండి బదిలీ అయ్యి ఈస్ట్ కంపెనీ పి.ఎల్.లోకి మారాడు.

### కామ్రేడ్ చిలక (పాయికే)

ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం, బీజాపూర్ జిల్లా, మస్కిల్ గ్రామంలో నిరుపేద ఆదివాసీ కుటుంబంలో 24 ఏళ్ల క్రితం కామ్రేడ్ చిలక జన్మించింది. పార్టీ ప్రభావం వున్న ప్రాంతం కావడంతో తన అన్న, అక్క పార్టీలో పని చేసేవారు.

కామ్రేడ్ చిలక 2009 డిసెంబర్‌లో పూర్తికాలం కార్యకర్తగా విప్లవోద్యమంలో భర్తీ అయ్యింది. 2010 మార్చిలో విప్లవావసరాల రీత్యా పార్టీ కొంతమంది కామ్రేడ్స్‌ని ఎ.ఒ.బి.కి బదిలీ చేసింది. అలా బదిలీ అయిన వారిలో కామ్రేడ్ చిలక కూడా వుంది. ఎ.ఒ.బి.లోని కోరాపుట్‌లో 3వ కంపెనీలోకి తీసుకున్నారు. ఒడిశా ప్రజలతో కలిసిపోవడమే కాక మీటింగులలో ఒడియా పాటలు కూడా పాడేది.

2016 ఆగస్టులో అవసరాల రీత్యా కామ్రేడ్ చిలకను పి.ఎస్-2 (ప్రొటక్షన్ స్క్వాడ్)లోకి పార్టీ బదిలీ చేసింది. ఎస్.జడ్.సి. మెంబర్ కామ్రేడ్ బాకూరి వెంకట రమణ (రాంగూడ ఘటనలోనే అమరుడయ్యాడు)కు గార్డుగా నియమించింది. రాంగూడ మూకుమ్మడి దాడిలో గాయాలై కదలలేని స్థితిలో వున్న కామ్రేడ్ చిలకను అక్టోబర్ 28న పోలీసులు పట్టుకొని, క్రూరమైన చిత్రహింసలకు గురిచేసి కాల్చి చంపారు.

### కామ్రేడ్ దాసూరాం

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం, విశాఖ జిల్లా, జి.మాడుగుల మండలం, బొయితల్ పంచాయితీ, వాకపల్లి గ్రామంలో నిరుపేద ఆదివాసీ కుటుంబంలో 22 ఏళ్ల క్రితం కామ్రేడ్ దాసూరాం జన్మించాడు. తనకు ఇద్దరు అక్కలున్నారు. జి.మాడుగులలోనే 10వ తరగతి వరకు విద్యనభ్యసించాడు. తమ గ్రామంలో 11 మంది మహిళలపై పోలీసులు అత్యాచారం చేయడం వంటి ఎన్నో సంఘటనలు అతని చైతన్యాన్ని తీవ్రంగా ప్రభావితం చేశాయి. కామ్రేడ్ దాసూరాం 2014లో విప్లవోద్యమంలోకి పూర్తికాలం కార్యకర్తగా వచ్చాడు. మొదట పెదబయలు దళంలో పని చేశాడు.

మిలటరీ రంగంలో తన నైపుణ్యాన్ని గమనించిన పార్టీ 2016 ఆగస్టులో సి.ఆర్.సి. పి.ఎల్.లోకి బదిలీ చేసింది. సహచర కామ్రేడ్స్‌తో స్నేహంగా వుండటమే గాక చదువురాని దళ కామ్రేడ్స్‌కు చదువు చెప్పేవాడు.

### కామ్రేడ్ జ్యోతి

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం, విశాఖ జిల్లా, పెదబయలు ఏరియా, ఇంజేరి పంచాయితీ, గునలోవ గ్రామంలో నిరుపేద కుటుంబంలో 18 ఏళ్ల క్రితం కామ్రేడ్ జ్యోతి జన్మించింది. 2013 చివరలో కామ్రేడ్ జ్యోతి విప్లవోద్యమంలోకి అడుగు పెట్టింది. తమ ఏరియాలో వున్న పెదబయలు దళంలో సభ్యురాలిగా నియమించబడింది. 2015 ఆగస్టులో పార్టీ అవసరాల రీత్యా కటాఫ్ ఏరియాకు బదిలీ అయ్యింది. కల్మషంలేని చిరునవ్వుతో కామ్రేడ్ జ్యోతి మొహం నిరంతరం వెలుగుతూ వుండేది.

### కామ్రేడ్ రజిత

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం, విశాఖ జిల్లా, పెదబయలు ఏరియా, ఇంజేరి పంచాయితీ, నానబరి గ్రామం కామ్రేడ్ రజితది. చిన్నప్పుడే తల్లిదండ్రులను కోల్పోయిన కామ్రేడ్ రజిత బంధువుల దగ్గర పెరిగి పెద్దదైంది. చిన్నప్పటి నుండి ఆమెకు ఫిట్స్ సమస్య వుండేది. 2013లో పెదబయలు దళంలోకి పూర్తికాలం కార్యకర్తగా రిక్రూట్ అయ్యింది. 2015 ఆగస్టులో కామ్రేడ్ జ్యోతితో పాటు రజిత కూడా కటాఫ్ ఏరియా దళానికి బదిలీ అయ్యింది. అనారోగ్యం వున్నప్పటికీ బరువులు మోయడంలో, నడకల్లో ఎలాంటి ఇబ్బంది పడేది కాదు. రాంగూడ ఎన్‌కౌంటర్ సందర్భంగా వీరోచితంగా పోరాడింది.

### కామ్రేడ్ మాడవి లక్కె (కమల)

దండకారణ్యంలోని దక్షిణ బస్తర్ డివిజన్ (ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం, సుకుమా జిల్లా)లో హలిగొండ గ్రామంలోని నిరుపేద కుటుంబంలో 19 ఏళ్ల క్రితం కామ్రేడ్ కమల జన్మించింది.

2013లో కామ్రేడ్ కమల క్రాంతికారీ ఆదివాసీ మహిళా సంఘటన్‌లో సభ్యురాలయ్యింది. కామ్రేడ్ కమల డిసెంబర్ 2015లో పూర్తికాలం కార్యకర్తగా పార్టీలోకి భర్తీ అయ్యింది. ఆమె ప్రతిపాదనను దృష్టిలో వుంచుకొని 2016 ఏప్రిల్‌లో పార్టీ ఆమెను ఎ.ఒ.బి.కి బదిలీ చేసింది. ఎ.ఒ.బి.లోని నాయకత్వ రక్షణ రీత్యా కామ్రేడ్ కమలను పి.ఎస్-2 (ప్రొటక్షన్ స్క్వాడ్)లోకి తీసుకోవడం జరిగింది.

### రాంగూడ మిలీషియా కామ్రేడ్స్

రాంగూడ దాడిలో స్థానిక మిలీషియా కామ్రేడ్స్ 9 మంది (నలుగురు మహిళలతో సహా) అమరులయ్యారు. వీరంతా స్థానిక ఒండ్రుపల్లి పంచాయితీలోని ఐదు గ్రామాలకు చెందిన యువతీ, యువకులే. ముగ్గుడుపల్లికి చెందిన కామ్రేడ్ సిందే, దకడపాదుర్‌కు చెందిన కామ్రేడ్స్ లక్ష్మణ్, లచ్చుమొదిలి, కావేరిమొదిలి; బచ్చలపాదుర్‌కు చెందిన కామ్రేడ్స్ కొమల, జొమ్మి, లొయికల్; సిమిలిపాదూర్‌కు చెందిన కామ్రేడ్ శ్యామల, కొజుర్‌గూడకు చెందిన కామ్రేడ్ జయరాంలు వున్నారు.

మిలీషియా కామ్రేడ్స్ పి.ఎల్.జి.ఎ. బలగాలు తమ ప్రాంతాలకు వచ్చినపుడు రక్షణలో భాగంగా సెంట్రీలు చేయడం, శత్రు

సమాచారాన్ని అందజేయడం చేసేవాళ్ళు. క్యాంపు నిర్వాహణలో సహకరించేవాళ్ళు. గెరిల్లా బలగాలకు అవసరమైన తిండి ఏర్పాట్లలో సహకరించడం ఆ విధంగా పి.ఎల్.జి.ఎ. అవసరాలు సమ కూర్చడంలో ముఖ్యపాత్రనే వహించారు. మిలీషియా కామ్రేడ్స్ అంతా కటాఫ్ ఏరియాలో జరిగిన అనేక ప్రజాందోళనలు, దర్నా, ప్రచార కార్యకలాపాల్లో చురుగ్గా పాల్గొన్నారు. ఆ ఏరియాలో విప్లవ ప్రచార ఆందోళన కార్యక్రమాలు సమన్వయం చేయడానికి ఎంతో తోడ్పాటునందించేవాళ్ళు. అమరుల స్థూప నిర్మాణాలు, విస్తాపన వ్యతిరేక కార్యకలాపాలన్నింటిలోనూ చురుకైన పాత్ర నిర్వహించారు.

అమరులైన 31 మంది కామ్రేడ్స్‌లో మెజారిటీ కామ్రేడ్స్ వర్గరీత్యా వ్యవసాయ కూలీ, పేదరైతాంగానికి చెందినవారే. కొద్ది మంది మాత్రం మధ్యతరగతి వాళ్ళు ఉన్నారు. పార్టీ యొక్క వర్గ పొందిక, సామాజిక పునాది ప్రధానంగా పీడిత ప్రజానీకంలోనే వుందనేది స్పష్టమవుతుంది.

ఆంధ్రప్రదేశ్, తెలంగాణా, ఒడిశా, ఛత్తీస్‌గఢ్ నాలుగు రాష్ట్రాలకు చెందిన 13 జిల్లాల ప్రాతినిధ్యం గల ఈ కామ్రేడ్స్‌లో 18 మంది పురుష కామ్రేడ్స్, 13 మహిళా కామ్రేడ్స్ వున్నారు. విప్లవోద్యమంలో వారి స్థాయిని చూసినట్లయితే ఇద్దరు రాష్ట్ర స్థాయి, ఇద్దరు డివిజన్ స్థాయి, 12 మంది ఏరియా స్థాయి కమిటీలకు చెందినవారు వున్నారు. వారితో పాటు 6గురు పార్టీ సభ్యులు, 9 మంది ప్రజా మిలీషియాకు చెందినవాళ్ళు ఉన్నారు. వీరంతా ఆంధ్ర-ఒడిశా సరిహద్దు ప్రాంత కమిటీ నాయకత్వంలో వివిధ ఏరియాల్లో బాధ్యతలు చూస్తున్న కామ్రేడ్స్.

అమరులైన కామ్రేడ్స్ మనందరికీ ఆదర్శప్రాయులు. వాళ్ళు కామ్రేడ్ మావో చెప్పిన ''ఫైట్ ఎగనెస్ట్ సెల్ఫ్'' సూత్రానికి అనుగుణంగా స్వార్థం శిరస్సును కసిగా గండ్రగొడ్డలితో నరికారు. తుదిశ్వాస విడిచే వరకూ ఆ కర్తవ్య నిర్వహణలో ఏ మాత్రం ఏమరుపాటుగా లేరు. ముఖ్యంగా స్వార్థానికి పునాదిగా వున్న ఈ దోపిడీ వర్గ సమాజాన్ని ధ్వంసం చేసేందుకు 'సాయుధ వ్యవసాయ వర్గపోరాట' ఆయుధాన్ని చివరి క్షణం వరకు వదలలేదు. వాళ్ళు సర్వం ప్రజల కోసమే అంకితమయ్యారు. అందుకే వాళ్ళు మన రోజువారీ జీవితంలో, ఆలోచనల్లో, పనుల్లో మార్గదర్శకులుగా వుండాలి. మనం వాళ్ళ విప్లవ జీవితాన్ని ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్ళాలి. అలా చేయడం ప్రస్తుత సామాజిక విప్లవానికి, భవిష్యత్ సమాజ నిర్మాణానికి ఎంతో అవసరం. ఆ కామ్రేడ్స్ మనకందించిన స్ఫూర్తితో ఈ దేశంలో నూతన ప్రజాస్వామిక విప్లవాన్ని విజయవంతం చేసి, సోషలిజం గుండా కమ్యూనిజం చేరేందుకు కృషి చేద్దాం. ○

*(..........47వ పేజీ తరువాయి)*

ప్రముఖ ఆర్థిక విశ్లేషకుడుగా, ఆధునిక తెలుగు పత్రికా రంగంలో నూతన ఒరవడి దిద్దిన ప్రముఖ పాత్రికేయుడుగా, సామన్య ప్రజలను కేంద్రం చేసుకొని రాసిన రచయితగా, పుష్కలమైన సమాచారంతో ధారాళమైన అంకెలు (డాటా)తో విలువల బలంతో, ఆశయ స్ఫూర్తితో, దేశభక్తితో, ప్రజల పక్షాన నిలిచి పోరాడిన మేధావి మన కామ్రేడ్ హనుమంతరావు. తన వ్యక్తిగత అవసరాల కోసం, పాలక వర్గాలకు భయపడి, పత్రికా యజమానుల కోసం తన దృక్పథాన్ని మార్చుకోలేదు. అందుకే ఆయన విప్లవ ప్రజా భిమానాన్ని చూరగొన్నారు. చిరస్మరణీయులయ్యారు.

కామ్రేడ్ హనుమంతరావుకు కాశీనాథుని నాగేశ్వరరావు పురస్కారం, ఆంధ్రప్రదేశ్ ఎకనామిక్ అసోసియేషన్‌లో జీవితకాలం గౌరవ సభ్యత్వం ఇచ్చి గౌరవించారు. డేటా న్యూస్ ఫీచర్స్ స్థాపకుడుగా డేటా హనుమంతరావు అయ్యారు. ఆర్థిక, సామాజిక విషయాల పట్ల శ్రద్ధతో ప్రతి సంవత్సరం క్రమం తప్పకుండా బడ్జెట్‌పై విశ్లేషణ చేసి వ్యాసాలు రాసేవారు. ఆయన రాతల్లో వ్యంగం ఉండేది తప్ప, అపహస్యం ఉండేదికాదు. ఆయన స్వయంగా పరిశోధకుడు. నిరంతర అన్వేషి. ఆయన జిజ్ఞాస ఎంతటిది అంటే, వృద్ధాప్యలో కంప్యూటర్ నేర్చుకున్నాడు. భారతదేశ వ్యవసాయ ఆర్థిక విషయాల అధ్యయనం కోసం 'గున్నార్ మిర్డాల్' రాసిన 'ఏసియన్ డ్రామా' కోసం తీవ్రంగా ప్రయత్నించి తెప్పించుకొని చదివారు.

ప్రపంచబ్యాంకు, ఐ.ఎమ్.ఎఫ్. విధానాలను, ఎల్.పి.జి. విధానాలను, వాటి ప్రభావాలను సామాన్య ప్రజల జీవన ప్రమాణాలు పడి పోవడాన్ని స్పష్టతతో, లోతైన అధ్యయనంతో రాసారు. హనుమంతరావు గారు ప్రపంచీకరణ దుష్పరిణామాలను వ్యతిరేకించడంలో భాగంగా అఖిల భారత ప్రజా ప్రతిఘటన వేదిక, ముంబాయి రెసిస్టెన్స్ లాంటి అనేక సంస్థలతో కలిసి పనిచేసారు. 2004లో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వంతో పీపుల్స్‌వార్ పార్టీ చర్చలు జరపడం కోసం ప్రయత్నించిన 'పీస్ ఇనీషియేటివ్'లో కీలక భూమికను పోషించారు. ఆదివాసీ ప్రజల అభివృద్ధి పట్ల నిజాయితీతో కూడిన విప్లవోద్యమ కృషిని గుర్తించి ప్రోత్సహిస్తూ రాసారు.

కామ్రేడ్ హనమంతరావుకు డిగ్రీల్లేవు గాని లోక జ్ఞానం, చుట్టూ చూపు, పరిశీలనాశక్తి, నిరంతర పత్రికా పఠనం, పది మందితో అనుదిన పరిచయాలు, జీవితానుభవం మెండుగా ఉన్నాయి. కష్టపడే స్వభావం, నిరాడంబరమైన జీవనశైలి, సహకార గుణం ఆయన జీవన గమనాన్ని తీర్చి దిద్దాయి. కామ్రేడ్ హనుమంతరావుకు వినమ్రంగా నివాళి అర్పిద్దాం.

○

## ఇంటర్వ్యూ

# సి.పి.ఐ. (మావోయిస్టు) కేంద్ర కమిటీ సభ్యుడు,

# ఏ.ఓ.బీ. ఇన్‌చార్జ్ కామ్రేడ్ రామకృష్ణతో రాంగూడ సంఘటనపై ఇంటర్వ్యూ

**ప్రశ్న: సి.పి.ఐ. (మావోయిస్టు)చరిత్రలో రాంగూడ ఘటన అతి పెద్ద ఘటన కదా! ఎలా జరిగింది? వివరించండి.**

**జ:** నిజమే మీరన్నట్లు రాంగూడ ఘటన మా పార్టీ చరిత్రలో జరిగిన అతి పెద్ద ఘటనగా చెప్పవచ్చు. కొన్ని బూర్జువా పత్రికలు ఈ దాడిని, ప్రభుత్వం మా పై చేపట్టిన 'సర్జికల్ స్ట్రైక్'గా వర్ణించడం మీరు గమనించే వుంటారు. ఈ దాడిలో ఆంధ్రప్రదేశ్, ఒడిశా రాష్ట్రాలకు చెందిన గ్రేహౌండ్స్, ఎస్.ఓ.జీ. కమాండో బలగాలతో పాటు కేంద్ర ప్రభుత్వ పారా మిలిటరీ బలగాలు కూడా పాల్గొన్నాయి. ఆంధ్రప్రదేశ్ డి.జి.పి. ఇచ్చిన ప్రకటన ప్రకారం 800 బలగాలు ఈ దాడిలో పాల్గొన్నాయి. అక్టోబర్ 24, 2016 ఉదయం 6 గంటలకు, మేము రోల్‌కాల్‌లో వున్నప్పుడు వాళ్ళ మమ్మల్ని చుట్టుముట్టారు. అప్పుడు ప్రభుత్వ సాయుధ బలగాలకు, మా పి.ఎల్.జి.ఎ. బలగాలకు మధ్య 45 ని॥ల నుండి 1గంట వరకు హోరాహోరిగా కాల్పులు జరిగాయి. ఈ పోరాటంలో మాకు పెద్ద నష్టమే జరిగింది. మా వైపు 31 మంది కామ్రేడ్స్ అమరులైనారు. వీరిలో స్పెషల్ జోనల్ కమిటీ సభ్యులు ఇద్దరు. డివిజనల్ కమిటీ సభ్యులు ఇద్దరు, ఏరియా కమిటీ సభ్యులు పన్నెండు మంది, పార్టీ సభ్యులు ఆరుగురు, వివిధ ప్రజాసంఘాలకూ, మిలీషియాకు చెందిన వారు 9 మంది వున్నారు. ఈ సందర్భంగా ప్రభుత్వ బలగాలలో ఒక సీనియర్ కమాండో చనిపోవడంతో పాటు మరొకరికి తీవ్రమైన గాయాలయ్యాయి. మరో నల్గురికి స్వల్పంగా గాయాలయ్యాయి.

ఈ ఘటనను అర్థం చేసుకోవాలంటే మరికొన్ని విషయాలను కూడా తెలుసుకోవాల్సి ఉంటుంది. కనుక అందుకు వీలుగా దానిని రెండు భాగాలుగా అంటే ఎ. దాడికి ముందు. బి. దాడి జరిగిన తీరు వివరిస్తాను.

**ఎ. దాడికి ముందు:** ఈ దాడి ప్రధానంగా మా పార్టీ పై స్థాయి నాయకత్వ కామ్రేడ్స్‌ను లక్ష్యంగా చేసుకొని జరిగింది. ఇటువంటి ప్రయత్నాలు జనవరి 2015 నుండి ఆపరేషన్ గ్రీన్‌హంట్ మూడవ దశ పేరుతో ముమ్మరం చేసారు. ఇటువంటి దాడులే జనవరి 2015 న 'బెజ్జి' పాకెట్‌లో, ఆగస్టు 2015న 'జంత్రి' పాకెట్‌లో, డిసెంబర్ 2015న 'నందపూర్' పాకెట్‌లో మా పై జరిగాయి. ఈ మూడు సందర్భాలలో కూడా నాయకత్వాన్నే లక్ష్యంగా చేసుకొన్నారు. వందలాది ప్రభుత్వ సాయుధ బలగాలు అత్యంత పకడ్బందీ పథకాలతో ఈ దాడులు నిర్వహించారు. అయినప్పటికీ మా పి.ఎల్.జి.ఎ. బలగాలు ఈ దాడులను వీరోచితంగా తిప్పికొట్టాయి.

ఈ వైఫల్యాల నుండి వాళ్ళు గుణపాఠాలు తీసుకున్నారు. ఈ సారి మరింత రహస్యంగా, మరింత కుట్ర పూరితంగా పథకం రూపొందించారు. ఈ పథకాన్ని, జరుగుతున్న మార్పులను మేం లోతుగా అర్థం చేసుకోలేకపోయాం. 23 ఉదయమే మా బలగాలన్నీ రాంగూడ మకాంకు చేరాయి. అప్పటిదాకా మా సంస్థాగత పనులు పూర్తి చేసుకొన్నాం. దీంతో బాహ్య వలయంలో వున్న రక్షణ బలగాలను కూడ వెనక్కి పిలిపించాము. ఆ రోజు జమైన మా బలగాలతో మాట్లాడి, పనులు ప్లాన్ చేసుకొని సాయంత్రమే విడి పోవాలనుకున్నాం. ఆ రోజు మేము ఎంపిక చేసుకొన్న రాంగూడ డేరా, రక్షణరీత్యా, బలహీనమైందనే విషయం మా దృష్టిలో వుంది. దానికి రెండు వైపుల 'ఎల్' ఆకారంలో నది ప్రవహిస్తూ వుంటుంది. ఆ డేరానే కాదు, మొత్తంగా ఆ పాకెట్ గ్రామాల పరిస్థితి అదే. ఆ పాకెట్ నుండి బయట పడాలంటే నదిని దాటకుండా బయటపడలేము. ఇదొక అనివార్య పరిస్థితి. ఈ విషయాన్ని దృష్టిలో వుంచుకొనే 23 సాయంత్రానికి పనులు పూర్తి చేసుకొని పాకెట్‌ను ఖాళీ చేయాలనుకున్నాం. కానీ ఆ రోజు మా బలగాల్లో కొన్ని బ్యాచీలు మకాంకు ఆలస్యంగా చేరడంతో మేమనుకున్నట్లు 23 సాయంత్రానికి పనులు పూర్తి కాలేదు. దీంతో ఆ పూట అక్కడే వుండి 24 సాయంత్రానికి మకాం ఖాళీ చేద్దామనుకున్నాము. ఇదే సందర్భంగా శత్రు సమాచారాన్ని వాకబ్ చేసాము. మా పరిసర ప్రాంతాల్లో శత్రు కదలికలు లేవనే విషయం తెలిసింది. ఈ సమాచారం కూడా, మేము ఆ రోజు అక్కడే వుండాలని తీసుకున్న నిర్ణయానికి ఊతమిచ్చింది.

మేము అక్కడే ఉండాలని నిర్ణయం తీసుకున్న తర్వాత అదే రాత్రి 7 గంటలకు మాకు దక్షిణాన వున్న కొండపై రెండు లైట్లు వెలిగి ఆరిపోయాయి. కానీ వాటిని లైట్లని నిర్ధారించుకోలేక పోయాము. రాత్రిపూట చుక్కలు అప్పుడపుడు అలా కన్పిస్తుంటాయని సరిపుచ్చుకొన్నాము. అదే రోజు ఉదయం రాంగూడకు చెందిన ఇన్‌ఫార్మర్ తల్లి చిత్రకొండకు వెళ్లేందుకు ప్రయత్నిస్తే, ప్రజలు ఆమెను అడ్డుకొన్నారు. ఆమె మాత్రం మనుమరాలిని పంపి తను వాపను వచ్చింది. ఈ విషయాన్ని ప్రజలు మాకు తెలియ చేసినప్పటికీ మేం ప్రమాదాన్ని శంకించలేక పోయాము. కొద్ది రోజుల ముందు ఒక విలేఖరికి కలుస్తామని చెప్పాము. అతన్ని 22 సాయంత్రం కలిసేందుకు వేరే గ్రామంలో అపాయింట్‌మెంట్ పెట్టాము. కానీ అతను 22 సాయంత్రానికి రమ్మన్న స్థలానికి రాకుండా, మా గురించి వాకబ్ చేస్తూ 23 రాత్రి 10 గంటలకు రాంగూడ గ్రామానికి వచ్చి మమ్మల్ని కలిసాడు. ఈ విషయం కొంత అసహజంగా వున్నప్పటికీ, సీరియస్‌గా తీసుకోలేదు.

వాస్తవంగా 23 ఉదయం నుండి రాత్రి 10 గంటల దాక, మా దృష్టికి వచ్చిన ఈ మూడు విషయాలు ప్రమాదాన్ని సూచించే సంకేతాలే. ఈ సంకేతాలను క్రోడీకరించుకున్నట్లయితే మేము అదనపు జాగ్రత్తలు తీసుకునే వాళ్లమే. కానీ క్రోడీకరించుకోలేదు. అదే మా వైఫల్యం.

ఇక మరో వైఫల్యమేమంటే 24 ఉదయం నుండి కొన్ని బలగాలు విడిపోవాల్సి రావడంతో రక్షణ ఏర్పాట్లు సడలించబడుతూ వచ్చాయి. సెంట్రీలు, పెట్రోలింగ్స్ నిర్వహణ, సైనిక నియమానుసారం జరగలేదు. మా ఈ వైఫల్యం శత్రువుకు మరింత కలిసి వచ్చింది. దీంతో రాత్రికి రాత్రే, ప్రజలెవరి కంట బడకుండా మేమున్న పాకెట్‌లోకి కమాండో బలగాలు ప్రవేశించాయి.

**బి. దాడి జరిగిన తీరు:** బలగాలు ఉదయం 6 గంటల కల్లా మేమున్న మకాంను చుట్టుముట్టి, ఒక బ్యాచ్ నేరుగా మా మకాంలోకి ప్రవేశించింది. ఆ సమయంలో మేం రోల్‌కాల్ చేస్తున్నాం. అయితే మా కామ్రేడ్స్ ముందుగా పోలీసులను గమనించి, కొంత సర్‌ప్రైజ్‌కు గురి అయినప్పటికీ, వెంటనే తేరుకొని ఫైరింగ్ ప్రారంభించారు. అయితే అప్పటికే దేరాను పోలీసులు చుట్టుముట్టి వుండటంతో, మా బలగాలు అక్కడే ఎక్కువ సేపు ప్రతిఘటన ఇవ్వకుండా, రాత్రి లైట్లు కనబడిన కొండవైపుకు రిట్రీట్ అయ్యారు. ఆ క్రమంలోనే కొండపై నుండి పోలీసులు కాల్పులు ప్రారంభించారు. దీనిని బట్టి రాత్రి కనిపించిన లైట్లు పోలీసులవని నిర్ధారణ అయింది. పై నుండి వస్తున్న కాల్పులను తిప్పికొడ్తూనే మా బలగాలు మరో వైపు కొండ కింది దిశగా వెళ్లాయి. అప్పటికే మా బలగాలను చుట్టుముట్టిన పోలీసు బలగాలు అన్ని వైపుల నుండి కాల్పులు ప్రారంభించారు. ఈ పరిస్థితిలో పోలీసు వలయాన్ని గండికొట్టి బయటపడే క్రమంలో ఎక్కువ మంది కామ్రేడ్స్ వీరోచితంగా పోరాడుతూ అమరులైనారు. ఈ సందర్భంగా గాయపడిన కామ్రేడ్స్‌ను పోలీసులు పట్టుకొని క్రూరంగా చిత్ర హింసలకు గురిచేసి, అప్పుడే కాల్చి చంపారు. 25వ తేది ఉదయం, గాయపడి తుప్పల్లో దాక్కున్న నల్గురు నిరాయుధ మిలీషియా కామ్రేడ్స్‌ను పట్టుకొని కాల్చి చంపారు. 26వ తేదీ, తీవ్రంగా గాయపడి రిట్రీట్ కాలేక గొయ్యిలో దాక్కున్న మహిళా కామ్రేడ్‌ను హత్య చేశారు. 27వ తేదీ, గాయపడి అక్కడ నుండి బయటపడ లేని మరో ఇద్దరు కామ్రేడ్స్‌ను పట్టుకొని కాల్చి చంపారు. మొత్తంగా ఈ హత్యాకాండ 24వ తేది నుండి 27వ తేది వరకు నాలుగు రోజుల పాటు జరిగింది. ఈ నాలుగు రోజుల పాటు హెలికాప్టర్‌లలో పాత బలగాల స్థానంలో నూతన పోలీసు బలగాలను దింపుతూ వచ్చారు. ఏ.పి. డి.జి.పి.తో పాటు పలువురు పోలీసు అధికారులు సంఘటనా స్థలానికి వచ్చి, మొత్తం కార్యక్రమాన్ని పర్యవేక్షించారు. ఈ సందర్భంగా పోలీసులు రాంగూడ గ్రామాన్ని కూడా చుట్టుముట్టి కాల్పులు జరిపారు. భయంతో చిన్న చిన్న డొంగల (పడవ)లో పారిపోతున్న ప్రజలపై కూడా కాల్పులు జరిపారు. ఈ సందర్భంగా ఒక రైతు గాయపడ్డాడు. ఈ ఘటన సందర్భంగా మా బలగాలు 85 మంది వున్నారు. అయితే వీరిలో చాలా మంది నిరాయుధులైన ప్రజా సంఘ నిర్మాణాలకూ, మిలీషియాకు చెందినవారు. ఈ సందర్భంగా 54 మంది కామ్రేడ్స్ సురక్షితంగా బయటపడ్డారు.

**2 ప్రశ్న. ఇంత భారీ సంఘటన ఎందుకు జరిగిందను కుంటున్నారు?**

**జ.** ఇక్కడ అసలు విషయం వుంది. వాళ్ళు (పోలీసులు) మమ్ముల్ని 'శాంతి భద్రతలకు' విఘాతం కల్గించే వాళ్లుగా చిత్రీకరించేందుకు ప్రయత్నిస్తున్నారు. 'శాంతి భద్రతల'ను కాపాడేందుకు మా పై దాడి చేసామంటున్నారు. ఇది పచ్చి అబద్ధం. ప్రజలెవరూ ఈ విషయాన్ని నమ్మరు. నమ్మటం లేదు కూడా. వాస్తవంగా ఈ దాడి వెనుక ఈ దోపిడీ ప్రభుత్వాలకు ఆర్థిక, రాజకీయ ప్రయోజనాలు వున్నాయి. ఈ దేశ పాలక వర్గాలైన దళారీ నిరంకుశ బూర్జువా, భూస్వామ్య వర్గాలు సామ్రాజ్యవాదులకు దళారీలుగా పని చేస్తున్నాయి. వీళ్ళు ఈ దేశ సంపదను సామ్రాజ్యవాదులకు దోచి పెట్టడమే కాకుండా తమ బొక్కసాలు కూడా నింపుకుంటున్నారు. ముఖ్యంగా ప్రపంచ పెట్టుబడిదారి వ్యవస్థలో సంక్షోభం తీవ్రతరమైన తర్వాత అందులో నుండి బయటపడేందుకు ఈ దోపిడీని మరింత తీవ్రతరం చేసారు. 'సంస్కరణల' ముసుగులో ఈ నయా వలస దోపిడీ దేశ ప్రజలపై విచ్చలవిడిగా కొనసాగుతున్నది. వాళ్ళిప్పుడు ఖనిజ సంపదను దోచుకోవడంపై ఎక్కువ దృష్టి పెట్టారు. ఇందులో భాగంగా ఆంధ్రప్రదేశ్‌లోని విశాఖ జిల్లా, ఒడిశాలోని కోరాపుట్ జిల్లాలలో పెద్దెత్తున బాక్సైట్ తవ్వకాలు మొదలు పెట్టి ఆదివాసీ ప్రజలను నిర్దాక్షిణ్యంగా విస్థాపితుల్ని చేస్తున్నారు. వాళ్ల చేస్తున్న ఈ బందిపోటు ప్రయత్నాలను మా పార్టీ నేతృత్వంలో ప్రజలు సమరశీల పోరాటాలతో ఎదుర్కొంటున్నారు. 'జల్, జంగల్, జమీన్' మావే అనే నినాదంతో తమ సంపదను తామే కాపాడుకొనేందుకు ఈ దోపిడీ ప్రభుత్వాలకు వ్యతిరేకంగా సంఘటితపడుతున్నారు. ఈ పరిణామాలు ఈ దోపిడీ ప్రభుత్వాలకు మింగుడు పడటం లేదు. ఆర్థికంగా, రాజకీయంగా ప్రజల నుండి ఎదురవుతున్న ఈ ప్రతిఘటనను, పాలకవర్గాలు ఏ మాత్రం సహించలేకపోతున్నారు. అందుకే వాళ్లు ఫాసిస్టు అణిచివేతను ప్రధాన పరిష్కారంగా ఎంచుకున్నారు. ఈ ఫాసిస్టు అణిచివేతను ఇప్పుడు గ్రీన్‌హంట్ మూడవదశ పేరుతో అత్యంత క్రూరంగా నిర్వహిస్తున్నారు. ఈ దాడి ద్వారా మా పార్టీనీ., పి.ఎల్.జి.ఎ.ను విప్లవ ప్రజానీకాన్ని పూర్తిగా దెబ్బతీసి తమ దోపిడీకి మార్గం సుగమం చేసుకోవాలను కుంటున్నారు. ఈ లక్ష్యంలో భాగంగానే రాంగూడ దాడి జరిగింది.

ఈ కారణాల రీత్యానే ఈ దాడికి ఆపరేషన్ ఆల్ ఔట్ 2 అనే పేరు పెట్టారు.

**3.ప్రశ్న. నిర్దిష్టంగా ఈ ప్రాంతంపై శత్రు దాడి పెద్ద ఎత్తున అమలు కావడాన్ని ఎలా అర్థం చేసుకోవాలి?**

**జ:** వాళ్ల మొదటి ప్రాధాన్యత, పై స్థాయి నాయకత్వాన్ని నిర్మూలించడం. ఇందుకనుగుణంగా, ఆ ప్రాంతంలో మా నాయకత్వ కదలికలుండటంతో వాళ్లను నిర్మూలించేందుకే ఆ ప్రాంతంపై ఇంత పెద్ద దాడి చేసారు. ఇక ఆ సరిహద్దు ప్రాంతమంతా బాక్సైట్ తవ్వకాలకు వ్యతిరేకంగా ప్రజల సమరశీల పోరాటాలు జరుగుతున్నాయి. నిర్దిష్టంగా కట్ ఆఫ్ ఏరియాలో సాయుధ వ్యవసాయ విప్లవం ఊపందుకొని, స్థానిక ఆదివాసీ రైతాంగం భూస్వాములకు వ్యతిరేకంగా మిలిటెంట్ పోరాటం చేపట్టి, వందలాది ఎకరాల భూములు ఆక్రమించడంతో పాటు సాయుధులవుతూ రాజ్యాధికార నిర్మాణాల దిశగా పురోగ మిస్తున్నారు. ఈ కారణాల రీత్యానే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆ ప్రాంతంపై ప్రత్యేకంగా కేంద్రీకరించారు.

**4.ప్రశ్న. ఈ ఘటన స్థానిక ప్రజలపై ఎలాంటి ప్రభావం వేసిందనుకుంటున్నారు?**

**జ:** ప్రజలు చరిత్రను నిర్మిస్తారు. అయితే ఈ ప్రయాణం సాదా సీదాగా ఉండదు. అనేక బాధాకరమైన అనుభవాల గుండా, తిరోగమనాలు, పురోగమనాలతో ఈ ప్రయాణం సుదీర్ఘంగానే వుంటుంది. ఈ క్రమంలోనే వాళ్ళు రాటుదేలుతారు. ప్రస్తుతం కటాఫ్ ఏరియా ప్రజలు కూడా విప్లవ యుద్ధంలో రాటు దేలుతున్నారు. నిర్దిష్టంగా ఈ సంఘటన గురించి చెప్పాలంటే వాళ్ళు, పార్టీనీ, పి.ఎల్.జి.ఎ.నీ, ప్రజా నిర్మాణాలను రక్షించుకొనేందుకు చాల బాధ్యతగా వ్యవహరించారు. ఎన్‌కౌంటర్‌కు ముందు పోలీసుల కదలికలను ఒకే గ్రామ ప్రజలు చూసారు. వాళ్లు మాకు సమాచారం ఇచ్చేందుకు వేగంగా వస్తుంటే, వాళ్లను పోలీసులు గమనించి పట్టుకొని కొట్టి వెనక్కి పంపారు. ఎన్‌కౌంటర్ తర్వాత తప్పుకొన్న మా బలగాలను కాపాడటం కోసం వాళ్లు చేయని ప్రయత్నం లేదు. వాళ్ల సహకారమే లేకపోతే పార్టీ అక్కడ నిలదొక్కుకోవటం కష్టం. ఈ సందర్భంగా వాళ్ల భాగస్వామ్యానికి సహకారం అనటం చిన్న మాట కూడా అవుతుంది. వాళ్లు తమ నేతలను, సొంత బిడ్డలను కోల్పోయి దుఃఖంలోనూ, ఆందోళనలోనూ ఉన్నప్పటికీ, సాధించుకున్న విజయాలను వదులు కొనేందుకు సిద్ధంగా లేరు. తిరిగి వర్గ పోరాటాన్ని పురోగమింప చేసేందుకు సమాయత్తమవుతున్నారు. ముఖ్యంగా ఈ సందర్భంగా చెప్పుకోవాల్సిన మరో ముఖ్య విషయమేమిటంటే, పట్టణ, మైదాన ప్రాంత ప్రజలు, ప్రజాస్వామిక వాదులు, మేధావులు వాళ్లకు అండగా నిలబడటం వాళ్లలో ఆత్మవిశ్వాసాన్ని ఇనుమడింప చేసింది.

**5.ప్రశ్న. దేశ వ్యాపితంగా ఈ ఘటనకు వ్యతిరేకంగా ప్రజలు, మేధావులు ఏ విధంగా స్పందించారు?**

**జ:** గతంలో వలె ఈ సారి కూడ ప్రజలు, ప్రజాస్వామిక వాదులు, మేధావులు ప్రభుత్వ దమనకాండను పెద్ద ఎత్తున నిరసించారు. సమాజంలో పెరుగుతున్న ప్రజాస్వామిక వాతావరణానికి ఈ కదలిక ఒక మంచి ప్రతీకగా వుంది. ఈ సారి ప్రత్యేకత ఏమిటంటే దేశ వ్యాపితంగా 12 యూనివర్సిటీల నుండి విద్యార్థులు సంఘటనా స్థలానికి వచ్చి, ఆదివాసీ రైతాంగాన్ని కలిసి నిజ నిర్ధారణ నివేదిక ద్వారా వాస్తవాలను ప్రకటించడమే గాకుండా, వారికి అండగా నిలిచారు. ఇంకా పౌరహక్కుల సంఘాలు, ఇతర ప్రజా సంఘాలు విడతలు, విడతలుగా సంఘటనా స్థలాన్ని సందర్శించి, ప్రజలను కలిసి వాస్తవాలను బహిర్గత పరచడమే కాకుండా స్థానిక ప్రజలకు మద్దతుగా నిలిచారు.

**6.ప్రశ్న. ఈ ఘటన మీ పార్టీ క్యాడర్‌పై ఎలాంటి ప్రభావం వేసిందనుకుంటున్నారు?**

**జ:** గతంలో ఇటువంటి పెద్ద సంఘటనలు జరిగినప్పుడు కొంతమంది అధైర్యపడి దిగజారిపోతుండేవాళ్ళు. ప్రస్తుతం ఈ సంఘటన సందర్భంగా ఒక్కరు కూడా దిగజారిపోలేదు. దీన్ని బట్టి పార్టీ దృఢ పడిందనే అనుకుంటున్నాము. ఈ మధ్య కాలంలో మేము పార్టీ, సైన్యం, ఐక్యసంఘటనలలో బోల్షివీకరణ క్యాంపెయిన్ నిర్వహించాము. ఈ క్యాంపెయిన్ వల్ల పార్టీ సిద్ధాంతపరంగా, రాజకీయంగా, సైనికపరంగా మెరుగుదల సాధించింది. కనుక ఈ సంఘటన పార్టీ శ్రేణులపై పెద్దగా నకారాత్మక ప్రభావాన్ని చూపదనే అనుకుంటున్నాము.

**7.ప్రశ్న. కొద్ది మంది మేధావులు పి.ఎల్.జి.ఎ. అంటే చావు సైన్యమనీ, మీ పార్టీకి ప్రజల మద్దతు లేదని రకరకాలుగా వ్యాఖ్యానించారు కదా! వాటి మీద మీ స్పందన ఏమిటి?**

**జ:** విప్లవోద్యమాన్నీ, విప్లవ నాయకత్వాన్ని లక్ష్యంగా చేసుకొని దుష్ప్రచార దాడి చేసేందుకు వాళ్లకు సామ్రాజ్యవాదుల నుండి ఆదేశాలు వున్నాయి. వాళ్ళకు త్యాగాలు లేకుండా చరిత్ర పురోగమనం వుండదనే విషయం అర్థం కాదు, అర్థం చేసుకోరు కూడా. నిజమే వాళ్ళన్నట్లు మేము కొండను ఢీకొంటాం, పర్వతాలను తవ్వుతాం, ఏటికి ఎదురీదుతాం. ఇటువంటి సంకల్పం, కార్యాచరణ లేకుండా వట్టి పోచికోలు కబుర్లతో కరుడు గట్టిన ఈ దోపిడీ వ్యవస్థను ఎవరు మార్చలేరు. వాళ్ళు ఉద్దేశపూర్వకంగా మాపై దాడి చేయాలనుకుంటున్నారు. కనుక విప్లవోద్యమం సమాజంలో తీసుకొచ్చిన మార్పులనూ, విప్లవోద్యమానికి పెరుగుతున్న ప్రజల

మద్దతును చూడ నిరాకరిస్తారు. అజేయమైన ప్రజా సైన్యం వాళ్ళకు చావు సైన్యంలా కనిపిస్తుంది. అది వాళ్ళ అత్యాశ మాత్రమే. వాళ్ళెప్పుడో రాజకీయ నిబద్ధతను కోల్పోయారు. వాళ్లు వృత్తిపరమైన అవకాశవాదులు. తమ స్వార్థ, సంకుచిత ప్రయోజనాల కోసం, కుతర్కంతో తమ 'తెలివి తేటల'ను దోపిడీ పాలకవర్గాలకు వుపయోగపెడ్తుంటారు. దేశంలో ఒక వైపున సామ్రాజ్యవాద గ్లోబలీకరణ ఆర్థిక విధానాలు మరో వైపున రాజకీయంగా ఫాసిస్టు విధానాలు అమలవుతున్న నేటి పరిస్థితుల్లో తమ స్వార్థ ప్రయోజనాలకు, డబ్బు సంచులకు అమ్ముడు పోయే మేధావుల సంఖ్య పెరుగుతున్నట్లు మనం గమనించవచ్చు. నేటి ఈ పరిస్థితి విప్లవ, కుహనా మేధావుల మధ్య ఖచ్చితమైన విభజన రేఖను గీస్తుంది. స్పష్టమైన పోలరైజేషన్‌ను మన ముందుంచుతుంది.

**8.ప్రశ్న. ఏ.ఓ.బీ. ఉద్యమానికి కోలుకోలేని దెబ్బతీశామని ప్రభుత్వం, పోలీసులు ప్రచారం చేస్తున్నారు కదా! మీరేమంటారు?**

**జ:** ఇటువంటి దుష్ప్రచారాన్ని పోలీసులు ఒక కళగానే అభ్యసించారు. ఎల్.ఐ.సి.లో భాగంగానే వాళ్లు ఇటువంటి దుష్ప్రచారానికి పాల్పడి, ప్రజల మనోస్థైర్యాన్ని దెబ్బతీసేందుకు ప్రయత్నిస్తుంటారు. వాస్తవంగా ఇది మాకు భారీ నష్టమే అయినప్పటికీ మా అమరులు లేని లోటును పూడ్చేందుకు మా కామ్రేడ్స్ అంతా వాళ్ల పనిలో రెట్టింపు కష్టానికి సిద్ధపడ్తున్నారు. మాకున్న గాఢమైన విప్లవకర ప్రజా పునాది నుండి నూతన శక్తులు ఎదిగి వస్తున్నారు. ఈ నష్టం మా సుదీర్ఘ ప్రయాణంలో, లక్ష్య సాధనలో చిన్న అవరోధమే.

**9.ప్రశ్న. సాయుధ శిక్షణ, బలాబలాల్లో పెద్ద తేడాను చూపి పోలీసు అధికారులు చేస్తున్న వాదనలో నిజం వున్నదా?**

**జ:** వాళ్ల వాదనలో పస లేదు. పెద్ద బలగాలు, సాయుధ శిక్షణ యుద్ధంలో అంతిమ విజయాన్ని చేకూర్చవు. ఏ యుద్ధంలోనైనా ప్రజల క్రియాశీలక పాత్ర నిర్ణయాత్మక మవుతుంది. చరిత్రలో వియత్నాం, కొరియా దేశాలు మొదలుకొని నేటి మధ్య ప్రాచ్య దేశాల వరకు ఈ విషయాన్నే రుజువు చేసాయి, చేస్తున్నాయి కూడా. ఆయా దేశాల ప్రజలు సామ్రాజ్యవాదాన్ని కాగితపు పులిగా తేల్చేశారు. అయితే ప్రజలు సాధించే అంతిమ విజయాలు అనేక కష్టాలతోనూ, కడగండ్ల తోనూ, బాధకరమైన అనుభవాలతోను కూడుకొని సుదీర్ఘమైన క్రమాన్ని తీసుకొంటాయి. ఈ క్రమంలో ఇరు పక్షాల బలాబలాల్లో కూడా తేడా వస్తుంది. ఇప్పుడు వాళ్లకున్న బలం, స్థితి ఎల్లకాలం అలాగే వుండదు. ఒక క్రమంలో ప్రజా సాయుధ శక్తులు అన్ని విషయాలలో పై చేయి సాధించి పరిస్థితిని తలకిందులు చేస్తాయి.

**10.ప్రశ్న. ఈ ఘటనకు సంబంధించిన ఏ ఏ లోపాలు గుర్తించారు? ఏమి గుణ పాఠాలు తీసుకుంటున్నారు?**

**జ:** యుద్ధమన్న తర్వాత త్యాగాలు అనివార్యం. అయితే అనవసర త్యాగాలు చేయకూడదనేది మా విధానం. రాంగూడ సంఘటనలో మా వైపు నుండి లోపాలు జరిగాయి. ఆ సందర్భంగా శత్రువు శక్తిని తక్కువగా అంచనా వేసాము. గెరిల్లా యుద్ధ నియమాలను పాటించడంలో కొంత అలసత్వం కూడ చోటు చేసుకుంది. మా ఈ లోపాలే శత్రువుకు తాత్కాలిక విజయావకాశాలుగా మారాయి. మాకు భారీ నష్టం జరిగింది. మేము ఆ తప్పులు చేయకుండా వుంటే కొంత మేరకు నష్టాలను నివారించుకో గలిగే వాళ్లం. యుద్ధ పరిస్థితిలో రోజు రోజుకు మార్పు వస్తున్నది. భారత పాలక వర్గాలు మమ్మల్ని తుడిచిపెట్టి వాళ్ల దోపిడీని తీవ్రతరం చేసేందుకు మా పై దాడిని పూర్తి స్థాయిలో కేంద్రీకరించారు. ఈ దాడిని గ్రీన్‌హంట్ మూడవ దశ అంటున్నారు. ఇటువంటి పరిస్థితుల్లో ప్రభుత్వ దాడిని ఓడించేందుకు మేము మరింతగా ప్రజలను అంటి పెట్టుకొని వుంటాము. ఈ యుద్ధంలో ఇదే మా అసలు బలం. అలాగే కార్మిక వర్గ క్రమశిక్షణను చైతన్యవంతంగా అమలు చేయడంతో పాటు నేడున్న కఠిన పరిస్థితులలో సైతం ఎంతటి కష్టాలకైన సిద్ధపడి గెరిల్లా యుద్ధ నియమాలను అమలు చేస్తాం. ఈ విధానాలే మమ్మల్ని గెలుపు వైపు నడిపిస్తాయి. గతంలో ఇటువంటి గడ్డు పరిస్థితుల్ని అధిగమించిన అనుభవం మా పార్టీకి వుంది.

**11. ఈ ఘటన ఏ.పీ రివైవల్ పై ఎటువంటి ప్రభావం వేస్తుంది?**

జ: తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలు అగ్ని పర్వతాల్లాంటివి. ఆ రెండు రాష్ట్రాలలో ప్రజల ఆగ్రహం అనే లావా ఉడుకుతున్నది. అక్కడి ప్రజలకు సుదీర్ఘమైన వర్గ పోరాట చరిత్ర ఉంది. త్యాగాల చరిత్ర వుంది. వాళ్ళు విప్లవంలోని ఆటుపోట్లను చూసారు. ఇటువంటి సంఘటనలు జరిగినపుడు ఏ మాత్రం నిరాశపడరు. ఇటువంటి సంఘటనలను సైతం ఆసరా చేసుకొని పాలక వర్గాలకు వ్యతిరేకంగా రాజకీయ పోరాటాన్ని ఎక్కుపెడ్తారు. ఇప్పుడు వాళ్లు రాంగూడ సంఘటనలో పాలక వర్గాలు, వాళ్ల హంతక కిరాయి పోలీసులు విప్లవకారులపైన, ప్రజలపైన అనుసరించిన అమానుషమైన, పాశవికమైన పద్ధతులను బహిర్గతం చేస్తూ, విమర్శిస్తూ పలురూపాల్లో రాజకీయ కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ఇక పోతే రివైవల్ గురించి మాట్లాడుకునేటప్పుడు మనం ఒక విషయాన్ని గుర్తుంచుకోవాలి. ఆ రెండు రాష్ట్రాలలో ఏ విప్లవ ప్రవాహం ఆగిపోలేదు. వేరు వేరు రూపాలలో అప్పటి నుండి కొనసాగుతూనే వుంది. ఆ ప్రజా విప్లవ ప్రవాహం మరో ప్రజా వెల్లువను తనదైన రీతిలో, వినూత్న పద్ధతుల్లో సృష్టిస్తోంది. అది బద్దలైన అగ్ని పర్వతం నుండి విరజిమ్మే లావాలా ఉంటుంది. ○

# బస్తర్, తెలంగాణ ప్రజల ప్రియతమ నేత, కురుసం రాంమూర్తి (జగత్)కు విప్లవ జోహార్లు



పర్వత శ్రేణుల పొడిచే పొద్దై
గల గల పారే గోదావరి పొంగై
ప్రతి రోజు విప్లవోత్తేజాన్ని నింపే
ఆదర్శ మూర్తి మన రాంమూర్తి

14.11.2016న ఉదయం ఏడు గంటలకు బీజాపూర్ జిల్లా, పర్సాగఢ్ పోలీస్ స్టేషన్ పరిధిలోని గుండం-చిన్నకాకిలేర్ గ్రామాల మధ్య దట్టమైన అడవిలో శతృ బలగాలు చేసిన దాడిలో పశ్చిమ బస్తర్ డివిజనల్ కమిటీ సభ్యుడు కా.కురుసం రామ్మూర్తి (జగత్)తో పాటు జన మిలీషియా కమాండర్ కా. బద్రు వీరోచితంగా పోరాడుతూ అమరులైనారు.

కా. కురుసం రామ్మూర్తి (జగత్, జగదీష్) 56 సం॥రాల క్రితం అప్పటి ఖమ్మం జిల్లా ప్రస్తుతం జయశంకర్ జిల్లా, వాజేడు మండలం కొంగాల గ్రామంలో పేద ఆదివాసీ కుటుంబంలో జన్మించాడు. చిన్నప్పటి నుండి సున్నితమైన హృదయం కలిగిన రాంమూర్తిని గ్రామంలో ప్రజలు ప్రేమగా సాయన్న అని పిలిచేవారు. ఆదివాసీ సాంప్రదాయాలతో తన మేనత్త కూతురు కా. రాజక్కతో చిన్నతనంలోనే తల్లిదండ్రులు పెళ్లి చేశారు. చిన్న తనం నుండే రాంమూర్తి తమ తల్లిదండ్రులతో పాటు పోడు వ్యవసాయం చేస్తూ కుటుంబానికి సహాయపడేవాడు. అప్పటివరకు ఆదివాసుల, పేద ప్రజల దోపిడీ నుండి విముక్తి గురించి ఆలోచిస్తున్న రాంమూర్తి పీపుల్స్‌వార్ గెరిల్లా దళాలను అక్కున చేర్చుకున్నాడు. 1984 నవంబర్‌లో భార్యా, పిల్లలను వదిలి పార్టీలోకి వచ్చాడు. ఇక అప్పటి నుండి తను అమరుడయ్యేవరకు మడమ తిప్పని విప్లవకారుడు, ప్రజల ప్రియతమ నాయకుడు రామ్మూర్తి.

దళ సభ్యునిగా 1985-86 రెండు సంవత్సరాలు భద్రాచలం, వెంకటాపురం ఆర్గనైజర్లతో ఉంటూ ఆదివాసీ రైతాంగాన్ని ఆర్గనైజ్ చేయడంలో రాంమూర్తి ముఖ్య పాత్ర పోషించాడు. మన పార్టీ బలపడకుండా చేయడం కోసం సంకన్‌పల్లి దబ్బా కన్నయ్య అనే ఊసూర్ బ్లాక్ జనపద్ అధ్యక్షుడు కత్తిగట్టి నిల్చాడు. అతడి ఆగడాలను ప్రజలు భరించలేని స్థితిలో 1988లో పార్టీ అతడిని ఖతం చేయడంలో రాంమూర్తి ముఖ్య భూమిక పోషించాడు. తన జీవిత సహచరి రాజక్క తమ ఇద్దరు పిల్లలను వదిలి 1986 నాటికి విప్లవోద్యమంలోకి రావడంలో రాంమూర్తి కృషి గొప్పది. వారి వైవాహిక జీవితం అన్యోన్యంగా ఉండేది.

1988 మార్చిలో జరిగిన బస్తర్ డివిజన్ డీఏకేఎమ్ఎస్ డివిజన్ ప్రథమ మహాసభలో అధ్యక్షునిగా ఎన్నుకోబడినాడు. 1989 ప్రారంభంలో నేషనల్‌పార్కు దళంకు డిప్యూటీ కమాండర్‌గా బదిలీపై వెళ్ళిన ఒకటి-రెండు నెలల్లోనే మూకవెల్లి గ్రామంలో శతృవుతో జరిగిన ఎన్‌కౌంటర్‌లో రాజక్క అమరురాలయ్యింది. బస్తర్ ఉద్యమంలో మొదటి మహిళా అమరురాలు కామ్రేడ్ రాజక్క.

1989లో ఫారెస్టు కమిటీ ప్రొటెక్షన్ దళంలో సభ్యుడిగా వుంటూ నాయకత్వం రక్షణ చూసాడు. పార్టీ క్రమశిక్షణ, పట్టుదలను చూసి రాంమూర్తిని ఏ.సి.ఎం.గా ప్రమోట్ చేశారు. 1991 జూన్‌లో మాడ్ ప్రాంతానికి బదిలీ అయ్యి డిప్యూటీగా బాధ్యతలు స్వీకరించాడు. 1991 నుండి రెండు సంవత్సరాలు ప్రభాత్ ప్రెస్ యూనిట్‌కు బాధ్యతలు నిర్వహించాడు. 1998 చివరలో మాడ్ డివిజన్‌లో కోహకమెట్ట కమాండర్‌గా, ఏసీఎస్‌గా రెండు సంవత్సరాలు బాధ్యతలు నిర్వహించాడు. 1999వ సం॥రం ప్రారంభంలో మద్దేడ్ ప్రాంతానికి బదిలీఅయ్యి, మూడు సంవత్సరాలు ఆ ఏరియా వుద్యమంలో మళ్ళీ భాగమయ్యాడు. 2000 సం॥లో రాంమూర్తి కామ్రేడ్ స్వర్ణను పార్టీ పద్ధతిలో పెళ్లి చేసుకున్నాడు.

2001 చివరలో ఉత్తర తెలంగాణా పార్టీ ప్రతిపాదన మేరకు ఆ ప్రాంత టెర్రయిన్, ప్రజలు పరిచయం ఉన్న రాంమూర్తిని తెలంగాణకు బదిలీ చేసింది. 2004 ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వంతో చర్చలు జరిగిన కాలంలో గోదావరి ప్రాంతంలో జరిగిన ప్రజా పోరాటాలలో చురుగ్గా పాల్గొన్నాడు. 2004 నుండి 2005 వరకు అమరుడు కామ్రేడ్ సోమన్న ప్రొటక్షన్ దళానికి కమాండర్‌గా బాధ్యతలు నిర్వహించాడు. ఈ సమయంలోనే కర్రెగుట్టలలోని జల్లి వద్ద జరిగిన పోలీసు కాల్పులలో వీరోచితంగా పోరాడి నాయకత్వ కామ్రేడ్స్‌ను రక్షించాడు. 2005 చివరి నుండి 2007 చివరివరకు ఎన్‌టీ ఎస్‌జెడ్‌సీ-15వ ప్లాటూన్‌లో ప్రొటక్షన్ బాధ్యతలు నిర్వహించాడు. తన రాజకీయ చైతన్యాన్ని గుర్తించి పార్టీ 2007లో డీవీసీఎమ్‌గా ప్రమోట్ చేసింది.

2008 నుండి 2015 వరకు ఆయన సీఆర్‌సీ సప్లయి దళం కమాండర్‌గా ఆ దళ కర్తవ్యాలన్నింటనీ శ్రద్ధగా, బాధ్యతాయుతంగా నిర్వహించాడు. సీఆర్‌సీ అప్పగించిన పనులు శ్రద్ధగా నిర్వహించాడు. సీఆర్‌సీ బలగాల వెంట సెంట్రల్ రీజియన్ వ్యాప్తంగా సప్లయి పనులు చేస్తూనే అనేక టి.సి.ఓ.సి.లలో పాల్గొన్నాడు.

చారిత్రాత్మకమైన నయాగఢ్ రెయిడ్‌లో రాంమూర్తి పాల్గొన్నాడు. నయాగఢ్ ఆయుధాలు, తూటాలు, డంపుల నిర్వహణలో ముఖ్య భూమిక పోషించాడు. పి.ఎల్.జి.ఏ. నిర్వహించిన 2010 ముకరం

(సంస్మరణ)

## ప్రముఖ ఆర్థిక విశ్లేషకుడు, సీనియర్ జర్నలిస్టు కామ్రేడ్ వాడకట్టు హనుమంతరావు (వి.ఎచ్.)కు నివాళి.



ఆంధ్రప్రదేశ్ లోని తూర్పు గోదావరి జిల్లా మండపేటలో 1925 ఆగస్టు 30న హనుమంతరావు జన్మించారు. 19 సంవత్సరాలకు ఎస్.ఎస్.ఎల్.సి. పూర్తి చేసారు. వీరేశలింగం సంఘ సంస్కరణోద్యమం, జాతీయోద్యమాల ప్రభావంతో పాటు అభ్యుదయ సాహిత్యంతోనూ, కమ్యూనిస్టు రాజకీయాలతోనూ ప్రభావితమయ్యారు. కమ్యూనిస్టు సిద్ధాంత నిబద్ధత, వామపక్ష భావాలుగల హనుమంతరావు గారు వితంతువు అయిన సరళగారిని ఆదర్శ వివాహం, కులాంతర వివాహం చేసుకున్నారు. వారికి ఇద్దరు కొడుకులు, ఒక కూతురు ఉన్నారు. పిల్లలకు కూడా ఆదర్శ వివాహాలు చేసారు. తన కండ్లను, భౌతిక దేహాన్ని మరణానంతరం వైద్య కళాశాలకు ఇవ్వాలని కోరారు. 2016 డిసెంబర్ 13న తన 91వ ఏట హైదరాబాద్‌లో కామ్రేడ్ హనుమంతరావు గారు వృద్ధాప్యంతో సహజ మరణం పొందారు. ఆయన కుటుంబ సభ్యులకు 'క్రాంతి' పత్రిక ప్రగాఢ సానుభూతి తెలియజేస్తుంది.

వీర తెలంగాణ పోరాటం కాలంలో హనుమంతరావు కమ్యూనిస్టు పార్టీ కేంద్రంలో స్టాఫ్ కార్యకర్తగా ఉన్నారు. పార్టీలో చీలికలు తర్వాత నక్సల్బరీ, శ్రీకాకుళ పోరాట కాలంలో విప్లవకారుల పక్షాన నిలిచాడు. భావజాల పరంగా విప్లవోద్యమాల వెంట వుంటూన్నప్పటికీ ఏ పార్టీలోను సభ్యుడు కాడు. చివరి వరకు వామపక్ష ఐక్యత కోరుకున్నారు. నూరేళ్ల అక్టోబర్ విప్లవ దినోత్సవాన్ని అందరూ కలిసి జరుపుకోవాలని ఆయన కోరుకున్నారు.

**65 యేళ్ళ జర్నలిస్టు ప్రస్థానం:** 1952 నుండి జర్మలిస్టుగా పని చేసారు. 1958లో విశాలాంధ్ర పత్రికకు ప్రథమ విలేఖరి. ప్రజాశక్తి, గొల్కొండ, ఈనాడు, ఎకనామిక్ టైమ్స్ లాంటి పత్రికల్లో పనిచేసారు. ఐ.ఎన్.ఎస్., యు.ఎన్.ఐ. లాంటి వార్తా సంస్థల్లో పని చేసారు. నెహ్రూ కాలంలో పార్లమెంటు విలేఖరిగా ఉన్నారు. ఐ.ఎన్.ఎస్. విక్రాంత్‌లో బంగ్లాదేశ్ యుద్ధంలో వార్తలు అందించారు. డేటాన్యూస్ ఫీచర్స్‌ను స్థాపించి 20 సం॥ల పాటు నిర్వహించారు. డి.ఎన్.ఎఫ్. ఇయర్ బుక్స్ 15 సం॥ల పాటు తీసుకువచ్చారు. ఆంధ్రప్రదేశ్ దర్శిని ప్రచురించారు. 8 సం॥రాల పాటు డేటా ఆంధ్రప్రదేశ్ పక్షపత్రిక నడిపారు. ఉద్యమం, ప్రజాపంథా, సంకేతం మున్నగు అభ్యుదయ, వామపక్ష భావాలు గల అనేక పత్రికలకు రెగ్యులర్‌గా వ్యాసాలు రాసారు. మొత్తంగా 5వేల వ్యాసాలు, 20 పుస్తకాలు రాసి, 12 పుస్తకాలకు సంపాదకత్వం వహించారు. వీక్షణం పత్రిక వ్యవస్థాపకుడుగా వీక్షణం వ్యవస్థ కోసం 15 సం॥లుగా నిరంతరం శ్రమించారు. 186 సంచికలు తేవడంలో బాధ్యతతో పాటు 166 వ్యాసాలు రాసి ఉన్నత స్థాయిలో కర్తవ్య నిర్వహణలో నిలిచారు. తన 60 సం॥ల జర్నలిస్టు అనుభవాన్ని (1952-2012) "జర్నలిస్టు అంతర్వీక్షణం"లో వివరంగా రాసారు. సి.డి.ఆర్.సి. కృషి ఫలితంగా 50 సం॥ల ఆంధ్రప్రదేశ్ (1956-2006) ఉద్గ్రంథం వెలుగు చూసింది. దాని వెనుక ఆయన ఆలోచనలు, ప్రోత్సాహం, కృషి వున్నాయి.

*(మిగతా 41వ పేజీలో......)*

---

ఆంబుష్‌లో పాల్గొన్నాడు.

ఆయన వయస్సు, అనారోగ్యాలను దృష్టిలో పెట్టుకుని 2015లో సీఆర్‌బీ ఆయనను డీకేలోని పశ్చిమ బస్తర్ డివిజన్ కమిటీలోకి బదిలీ చేసింది. అప్పటి నుండి అమరుడయ్యేవరకు రాంమూర్తి నేషనల్‌పార్కు ప్రాంతంలో డీవీసీఎమ్‌గా, ప్రజాసంఘాలను, జనతన సర్కార్‌లను చూసే బాధ్యతలను చూసాడు.

ఉద్యమ అవసరాల కోసం కోయ, హిందీ భాషలను చదవడం, మాట్లాడడం ఎంతో పట్టుదలగా నేర్చుకున్నాడు. ఆయా భాషలలో వెలువడే సాహిత్యం, అధ్యయనం చేస్తూ తనతోటి దళ సభ్యులకు రాజకీయాలు చెప్పేవాడు. తను ఇంటివద్దనే మూడవ తరగతి వరకు చదువుకున్నాడు. పార్టీలో దాన్ని మరింతగా మెరుగుపర్చుకుంటూ పార్టీ డాక్యుమెంట్లను అధ్యయనం చేసేవాడు. పార్టీలో అన్యవర్గ ధోరణులకు వ్యతిరేకంగా పోరాడటంలో దృఢంగా నిలబడ్డాడు.

బస్తర్‌లో మొదటి జన జాగరణ్ అభియాన్‌ను, సల్వాజుడుంను ఎదుర్కొంటూ ఉద్యమాన్ని నిలబెట్టడంలో తనవంతు పాత్రను చురుకుగా నిర్వహించాడు. శత్రువు మనపై జరిపిన దాడులలో, మనం శత్రువుపై చేసిన దాడులలో నిబ్బరంగా, ధైర్యంగా వుండేవాడు. దండకారణ్యంలో మొదటితరంలో భర్తీ అయ్యి నిలబడిన రాంమూర్తి డీఏకేఎమ్ఎస్ డివిజన్ అధ్యక్షునిగా రైతాంగ పోరాటాలు బలపడడానికి కృషిసల్పిన నాయకుడు. ఆడంబరాలులేని, దుబారాలేని సాదాసీదా జీవనశైలి, గడ్డుకాలంలో దృఢంగా, సాహసంగా నిలిచిన పోరాట పటిమ, పార్టీలో చివరి వరకు విశ్వసనీయుడుగా నిలబడడం, శత్రువుకు వెన్నుచూపని ధీరోదత్తత ఆయన ఆదర్శాలు. ఇవి నేటితరపు విప్లవకారులకు నిరంతరం ప్రేరణగా నిలుస్తాయి. ఇలాంటి ఆదర్శాలు ఉన్న రాంమూర్తిని కోల్పోవడం తీవ్రమైన నష్టం. అమరునికి వినమ్రంగా జోహార్లు చెబుదాం. రాంమూర్తి ఆశయాలను కొనసాగిద్దాం. ○

# అమెరికా అగ్రరాజ్య ఆధిపత్యాన్ని నిరంకుశంగా కొనసాగించేందుకే 45వ అధ్యక్షుడుగా డోనాల్డ్ జాన్ ట్రంప్ ఎన్నిక

అమెరికా అధ్యక్షుడిని అమెరికా ప్రజలు ప్రత్యక్షంగా ఎన్నుకుంటారని జరుగుతున్న ప్రచారంలో నిజం లేదు. ధనం, మోసం రెండూ లేని పార్లమెంటరీ, అధ్యక్ష ఎన్నికలు ప్రపంచంలో ఎక్కడా లేవు. అమెరికా అధ్యక్ష ఎన్నికల్లో మెజారిటీ ఓట్లతో ప్రత్యక్షంగా ప్రాథమిక స్థాయిలో గెలిచినా ఆ పార్టీ డెలిగేటు ఓటర్లలలో మెజారిటీ మద్దతు దొరికినా, ఎలక్టోరల్ కాలేజీలో మెజారిటీ పొందలేకపోతే అధ్యక్షులు కాలేరు. పెట్టుబడులు, ధనికవర్గం, అమెరికాను కంట్రోల్ చేస్తున్న సామ్రాజ్యవాద ఆధిపత్య ముఠా ఎలక్టోరల్ కాలేజీ రూపంలో చెక్ పెడుతుంది. 538 ఓట్లున్న ఎలక్టోరల్ కాలేజీ చాలా కీలకమైనది. ఎవరు అధ్యక్షులు కావాలో నిర్ణయించే అధికారం వీరిదే. ప్రజలే ఎన్నుకోవడం, ప్రజాస్వామ్యం అమలవుతుందని గొప్పలు చెప్పడం నిజంకాదు. 30 కోట్లకు పైగా ఉన్న అమెరికా జనాభాలో 12కోట్ల మంది ఓటర్లున్నా కింగ్ మేకర్స్ మాత్రం ఆధిపత్య ముఠానే.

అమెరికా ఎన్నికల్లో గెలిచేవి రెండు పార్టీలే, చరిత్ర పొడవునా ఈ రెండుపార్టీలే ప్రతీ 4 సంవత్సరాలకు ఒకసారి మారుతుంటాయి. ఒక్కోసారి అదే అధ్యక్షులు రెండు సార్లు ఎన్నిక కావడం ఉంది తప్ప వేరేవాళ్ళు అక్కడ అధ్యక్షులయ్యే అవకాశం లేదు. రిపబ్లికన్ పార్టీ, డెమక్రటిక్ పార్టీలకు చెందిన వాళ్ళే అత్యధిక స్థాయిలో ఎలక్టోరల్ కాలేజీలో ఉంటారు. వీరు దేశాన్ని, ప్రపంచాన్ని ఆర్థిక, రాజకీయ రంగాలలో అదుపు చేస్తున్న శక్తులని మరిచి పోకూడదు. సంపదలో, అధికారంలో ఎవరు అత్యధిక వాటా పొందాలో తేల్చుకునేందుకు మాత్రమే ఈ ఎన్నికల తతంగం తప్ప మరొకటి కాదు. కొన్ని సార్లు వారికి నమ్మకమైన పరోక్ష ప్రతినిధిని ఎన్నుకుంటే మరికొన్ని సార్లు తమ ప్రత్యక్ష ప్రతినిధినే ఎన్నుకుంటారు.

ఒక అంతర్జాతీయ పరిశోధనాసంస్థ ప్రపంచంలో సగానికి పైగా సంపద 65 మంది ధనాఢ్యుల (కుబేరులు) చేతుల్లో ఉంటే, అందులో 45 మంది ఒక్క అమెరికా సంయుక్త రాష్ట్రాల్లోనే ఉన్నారు అని ప్రకటించింది. వారికి ట్రంప్ ప్రత్యక్ష ప్రతినిధి. డోనాల్డ్ ట్రంప్గా ప్రసిద్ధి చెందిన బడా వ్యాపారవేత్త రాజకీయాల్లోకి వచ్చిన 18 నెలల్లోనే, మీడియా ప్రచారం చేసిన ఒపీనియన్ పోల్స్, ఎక్జిట్ పోల్స్‌కు, అమెరికాతో పాటు అన్నిదేశాల్లోను ప్రజలు ఊహించుకున్న దానికి భిన్నంగా అధ్యక్షుడయ్యాడు.

అమెరికాలో బానిసత్వం రద్దుకు ఆనాడు రిపబ్లికన్ పార్టీకి చెందిన అబ్రహం లింకన్ అధ్యక్షుడుగా ఉన్నప్పుడు చట్టం చేసారు. నేడుజాత్యహంకార వ్యాఖ్యలతో సభ్యుల మనసు గెలుచుకోవడం, వాళ్ళు ట్రంప్‌ను ప్రతినిధిగా ఎంచుకున్నారంటే ఆ పార్టీలో శ్వేత జాతి దురహంకారం ఎంతలోతుగా వెళ్ళూనుకున్నదో అర్థం చేసుకోవచ్చు. ట్రంప్ తన విపరీతమైన వ్యాఖ్యలతో విద్వేష, విధ్వంస రాజకీయాలతో ప్రైమరీ ప్రచారం కొనసాగించి మెజారిటీ శ్వేత జాతీయులను (యువత, కార్మిక శ్రేణులు, మధ్యతరగతి) రెచ్చగొట్టి ముందుకొచ్చాడు. రిపబ్లికన్ పార్టీ, ట్రంప్ నాయకత్వం ఒక స్పష్టమైన ఆధిక్యతా వాదాన్ని ముందుకు తెస్తున్నది. ప్రగతి నిరోధక, వర్ణవివక్ష, మిలటరిస్టు, ముస్లిం మైనారిటీ వ్యతిరేక, విదేశీ వ్యతిరేక రాజకీయాల సమాహారంగా, ఒక ఫాసిస్టు పోకడకు దారిని సుగమం చేసుకుంటూ నీచ, నికృష్ట, ఉన్మత్త ప్రేలాపనలకు తెగబడుతూ ట్రంప్ రూపంలో అమానవీయ శక్తి అమెరికా అధ్యక్ష పీఠాన్ని అధిరోహించింది.

ప్రపంచ దేశాల శ్రమను, వనరులను, మార్కెట్లను, మేధస్సును కొల్లగొట్టడం వల్ల అమెరికా అగ్రరాజ్యంగా మారింది. రెండో ప్రపంచ యుద్ధం ముగిసిన వెంటనే 1945లో హిరోషిమా, నాగసాకిలపై అణుబాంబులను ప్రయోగించి లక్షలాది మంది అమాయకుల ప్రాణాలను బలిగొన్నది. వియత్నాంపై 10 సం॥ దాడి చేసింది. 2003లో ఇరాక్‌పై దురాక్రమణ చేసి దేశాధ్యక్షుడు సద్దాం హుస్సేన్‌ను హతమార్చింది. లక్షలాది మంది ప్రజలు ప్రాణాలు కోల్పోయారు. అనేక వెనకబడిన దేశాల్లో తనకు లొంగని ప్రభుత్వాలను కూల్చి కీలుబొమ్మ ప్రభుత్వాలను ఏర్పరిచింది. ఇరాక్, ఆఫ్ఘన్‌లలో అమెరికా రగిల్చిన చిచ్చుమండుతూ లక్షలాది ప్రాణాలను బలిగొంటూనే ఉంది. ఇప్పుడు తాజాగా సిరియాలో గత 10 సం॥లలో 5 లక్షల మంది ప్రాణాలను కోల్పోయారు. 12 లక్షల మంది నిరాశ్రాయులయ్యారు. గతంలో ఇరాన్-ఇరాక్‌ల మధ్య యుద్ధంలో రెండు దేశాలకు ఆయుధాలు అమ్ముకుని లాభపడింది. నేటికి సరిహద్దు సమస్యలను సృష్టించి ఆయుధ వ్యాపారాన్ని కొనసాగిస్తుంది.

ప్రపంచ జనాభా 730 కోట్లు. అందులో క్రైస్తవులు, ముస్లింలు కలిసి 250 కోట్లున్నారు. ఒక్క 21వ శతాబ్దంలోనే జాత్యాంకార అమెరికా 20 ముస్లిం దేశాలపై అమలు జరిపిన యుద్ధాలలో మూడున్నర కోట్ల మంది ముస్లింలు హత్య గావించబడ్డారు. అరబ్ దేశాలలోని సున్నీ, షియా విభేదాన్ని సృష్టించిన అమెరికా సున్నీలను ప్రోత్సహించి షియాలపై దాడులు చేయిస్తుంది.

శరణార్థుల సమస్యను సృష్టించినది అమెరికా, ఇతర సామ్రాజ్యవాద దేశాలే. వీరు అంతర్జాతీయ చట్టాలను తుంగలో తొక్కి దాదాపు 20కి పైగా పేద ముస్లిం దేశాలపై యుద్ధాలకు పాల్పడిన ఫలితంగా అమెరికా, యూరప్‌లపై శరణార్థుల సమస్య వచ్చి పడింది.

క్యూబా అధ్యక్షుడిని చంపడానికి ఎన్నో ప్రయత్నాలు చేసింది. 60 సం॥లకు పైగా క్యూబాపై ఆర్థిక ఆంక్షలను అమలు చేసింది. అనేక దేశాలపై ఆంక్షలు విధిస్తూ ప్రపంచ మార్కెట్‌పై గుత్తాధిపత్యాన్ని కొనసాగిస్తున్నది. ప్రపంచంలో అనేక వ్యూహాత్మక ప్రాంతాల్లో సైనిక స్థావరాలను ఏర్పాటు చేసుకుని, అసమాన సైనిక ఒడంబడికలతో భారత్ లాంటి దేశాలను తన యుద్ధరథ చక్రాలకు కట్టేసుకుంటుంది. ట్రంప్ తాను అధ్యక్షుడినయితే ఉగ్రవాద నేపథ్యం ఉన్న 17 దేశాలను అమెరికాలో కాలు మోపనీయకుండా విధాన నిర్ణయం తీసుకుంటానని ఆ పేర్లు ప్రకటించాడు. అవి- ఫిలిప్పైన్స్, ఇరాక్, పాకిస్తాన్, ఇరాన్, ఈజిప్ట్, ఆఫ్ఘనిస్తాన్, సోమాలియా, సిరియా, యెమెన్, లెబనాన్, మలేషియా, సుడాన్, ఇండోనేషియా, సౌదీ అరేబియా, యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్, మాలి, లిబియా దేశాలు.

దశాబ్దాలుగా పాలస్తీనా సమస్య రావణకాష్టంలా రగులుతునే ఉంది. అమెరికా ఇజ్రాయిల్ దుర్మార్గాలకు వత్తాసు నివ్వడమే కాకుండా ఐక్యరాజ్య సమితిలో పాలస్తీనా నుండి ఇజ్రాయిల్ వైదొలగాలన్న తీర్మానాన్ని ప్రతీసారి వీటో చేస్తూ వస్తున్నది. ఆ విధానాన్నే కొనసాగించాలని ట్రంప్ అంటున్నాడు. ఇటువంటి చరిత్ర కలిగిన అగ్రరాజ్యానికి ట్రంప్ లాంటి వాడు అధినాయకుడయితే భవిష్యత్ పరిణామాలు ఎంతగా వికటిస్తాయో ఊహించడం కష్టం కాదు.

2008లో అమెరికాలో ప్రారంభమయిన సబ్‌ప్రైమ్ క్రైసిస్ యూరప్‌ను తర్వాత ప్రపంచాన్ని ముంచేసింది. ఆ సంక్షోభంలో గ్రీసులాంటి దేశాలు కోలుకోలేక కుదేలయ్యాయి. అన్ని దేశాల్లోను, అమెరికాలోనూ మాంద్యం పరిస్థితులు తీవ్ర ప్రభావాన్ని వేస్తున్నాయి. ఆఫ్రో-అమెరికా సంతతికి చెందిన నల్ల జాతీయుల నాయకుడుగా ప్రచారార్భాటంతో గెలిచి 8 సం॥లు పాలించిన, నోబెల్ శాంతి బహుమతి పురస్కారాన్నందుకున్న ఒబామా కాలంలో అమెరికా విదేశాల్లో జోక్యాన్ని, యుద్ధోన్మాదాన్ని, కుట్రల్ని, ఆంక్షల్ని పెంచిందే తప్ప తగ్గించ లేదు. నల్లజాతి మీద దాడులు గతం కన్నా పెరిగాయి. అమెరికాలో సామాన్య ప్రజల సామాజిక, ఆర్థిక, రాజకీయ రంగాలలో ఎదుర్కొంటున్న ఏ ఒక్క సమస్యను పరిష్కారం చేయలేదు. అవన్నీ సంక్షోభం కారణంగా అధికం అయ్యాయి. అమెరికాలో నల్లవారిని దొంగలుగా, బ్లాక్ మార్కెటర్లుగా, ఇళ్ళకు కన్నాలు వేసే వాళ్ళుగా పోలీసు వ్యవస్థ పరిగణిస్తుంది. నల్ల వాళ్ళతో అవిద్య, పేదరికం అధికంగా ఉండడమే దానికి కారణం. ఒబామా పాలనలో నల్లవాళ్ళ జీవితంలో ఎటువంటి మార్పు రాలేదు. ఇప్పుడు ఆ నల్లజాతిని లక్ష్యంగా చేసుకుని ట్రంప్ శ్వేత జాతిని ఐక్యం చేస్తున్నాడు.

సాధారణంగా నిరుద్యోగ సమస్యకు పరిష్కారం కోసం అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాల ఎజెండాను చూపి ఎన్నికల్లో ముందుకు సాగడం ఉంటుంది.. అవుట్ సోర్సింగ్ విధానం వల్లనే నిరుద్యోగ సమస్య పెరిగిందని విదేశీ వ్యతిరేకతను రెచ్చగొట్టడం, బాహ్య కారణాలను ప్రధానం చేయడంతో అమెరికన్ యువతలో మధ్య తరగతి ప్రజానీకంలో నూతన తరహాలో తప్పుడు చైతన్యం గల జాతీయతా భావాల్ని పెంచడం ద్వారా ట్రంప్ జాతి ఉన్మాదంతో పాటు, జాతీయ చావనిజాన్ని పెంచి పోషిస్తున్నాడు. దేశంలోను, ప్రపంచంతోను ఘర్షణకు సిద్ధం చేస్తున్నాడు.

గతంలో అమెరికా ఎన్నికల సందర్భంగా ఆ దేశ ఆర్థిక పరిస్థితి, ఉద్యోగ కల్పన, దేశ భద్రత, సంక్షేమ కార్యక్రమాలు అలాగే ప్రపంచంలో తన పట్టును కొనసాగించడం వంటి అంశాలు ప్రచారాస్త్రాలుగా ఉండేవి. ఈసారి ట్రంపు ఆ క్రమాన్ని పూర్తిగా మార్చి వేశాడు. విదేశీయులు, ఉద్యోగాల సమస్య ప్రధాన ఎజెండాగా మార్చి వేశాడు. జాత్యహంకార వారసత్వాన్ని ఇప్పుడు ట్రంప్ భుజాలకెత్తుకున్నాడు. అందుకే అమెరికా ఉద్యోగాలను భారతీయులు కొల్లగొడుతున్నారని, మెక్సికో నుండి అమెరికా వస్తున్నవాళ్ళు రేపిస్టులని, ఆసియన్ల ఉచ్చారణను, వికలాంగ పాత్రికేయులను హేళన చేయడం, తెల్ల వాళ్ళను హత్య చేసిన నల్ల వాళ్ళుఅనడం, అమెరికాకు రాకుండా ముస్లింలను నిషేధించాలనడం లాంటి ఉన్మాదపూరిత ప్రకటనలు చేస్తున్నాడు. నిజానికి ఈ తరహా రాజకీయాలకు మూలాలు అమెరికన్ రాజకీయ సంక్షోభంలోనే వున్నాయి. అమెరికాలో పెరుగుతున్న తుపాకీ సంస్కృతి, భారతీయుల హత్యలు, నల్లజాతివారిపై దాడులు, టెర్రరిస్టుల పేరిట ముస్లిం దేశాల నుండి అమెరికాకు వచ్చే వారిపై భయంకరమైన నియంత్రణలు, ఎన్నో రకరకాల ఆంక్షలు, నిషేధాలు, ఇప్పటికే అమలు జరుగుతూనే ఉన్నాయి. ఇక ట్రంప్ పాలనలో ఈ రకమైన వ్యవహార శైలి పరాకాష్టకు చేరడం, ఫాసిజం ప్రత్యక్షంగా, నగ్నంగా కళ్ళకుకట్టడం తప్ప మరొకటి జరగదు. ట్రంప్ ఎంచుకున్న ఈ విధానం అంతా అమెరికా గొప్పతనాన్ని, ముఖ్యంగా శ్వేత జాతి గొప్పతనాన్ని నిలబెట్టడం కోసం మాత్రమే. ఘనత వహించిన ప్రత్యర్థి హిల్లరీ క్లింటన్ ఓటమికి కారణాలు ఇవి కావచ్చు అని మీడియా చెబుతున్న కథనాలన్నీ, ఆమె ప్రజల్ని గెలుచు కోలేదనేందుకు చెప్పే కుంటిసాకులు తప్ప మరొకటి కాదు. ఒబామా ప్రభుత్వంలో 2007-2013 మధ్య విదేశీ వ్యవహారాల మంత్రిగా, రిపబ్లికన్ పార్టీ నాయకురాలిగా ఆమె ప్రస్తుత పరిపాలన విషయాలకు బాధ్యురాలు కనుక ప్రభుత్వ వ్యతిరేక ఓటు ప్రభావం కీలకమైనది అనే దానిలో కొంత వాస్తవం ఉంది అనుకోవచ్చు. ప్రజల మౌలిక సమస్యలను ప్రస్తావించకపోవడం, విధాన నిర్ణయాలలో మార్పులు ప్రకటించకపోవడం, కేవలం వ్యక్తిగత విమర్శలకే పరిమితమై ప్రచారం చేయడం, పర్సనల్ ఈమేయిల్ వినియోగించి ప్రభుత్వ కార్యక్రమాలు నిర్వహించడం లాంటి కారణాలు ప్రధానం కాదు. ఎన్నికలు ప్రజల అభిప్రాయాలకు

అనుగుణంగానే జరిగాయి అని ఒప్పించే మోసకారి తనమే తప్ప ఇది మరొకటి కాదు. అమెరికా దోపిడీ పాలకవర్గాల దీర్ఘకాలిక లక్ష్యాలను నెరవేర్చడానికి, అమెరికా దేశంలో నెలకొన్న సంక్షోభ భారాన్ని ప్రపంచ దేశాల మీద బలవంతంగా నెట్టడానికి సరికొత్త, శక్తివంతమైన వ్యక్తికావాలి. ప్రస్తుత తరుణంలో వేరే నమ్మకస్తుల మీద ఆధారపడడం కుదరదు. తమనుండే ప్రపంచాన్ని కలవర పెట్టి, విద్వేషాన్ని రెచ్చగొట్టి సైనిక నియంతృత్వాన్ని, యుద్ధోన్మాదాన్ని కొనసాగించ గల దిట్టకావాలి. ట్రంప్ మీద ఆ వర్గాలకు అటువంటి ఆశలున్నాయి. భవిష్యత్ చిత్రం అట్లాగే కనబడుతుంది. ప్రపంచంలోని 75 దేశాల్లో దాదాపు 800 అమెరికా సైనిక శిబిరాలున్నాయి. వందల బిలియన్ డాలర్లు ఖర్చు పెడుతున్నారు. 7,500 అణ్వాయుధాలు తయారు చేసుకున్న అమెరికా యుద్ధోన్మోదాన్ని సులభంగానే అర్థం చేసుకోవచ్చు.

ట్రంప్ ఎన్నిక తర్వాత ఇరాక్, సిరియా, ఇరాన్, సుడాన్, లిబియా, సోమాలియా, ఎమెన్ 7 దేశాల ప్రజలను 90 రోజుల వరకు, శరణార్థులను 120 రోజుల వరకు అమెరికా దేశంలోకి ప్రవేశించకూడదని ఆదేశించాడు. దీనిని ప్రపంచ దేశాలన్ని ఖండించాయి. ఈ విషయమై అమెరికా న్యాయస్థానాలు ఆ ఆదేశాన్ని తప్పుపడుతూ నిలిపి ఉంచాయి. ఆదేశ ఉన్నత న్యాయస్థానం (సుప్రీంకోర్టు) దిగువ కోర్టు తీర్పును సమర్థించింది. ఉన్నత న్యాయస్థానం తీర్పును ఒక ప్రేలాపనగా ట్రంపు వాఖ్యానించాడు. నూతన దేశాధ్యక్షుడయిన ట్రంప్‌కు ఆ న్యాయ వ్యవస్థ పట్ల ఎటువంటి గౌరవం ఉందో స్పష్టమవుతున్నది. మరల ఆ తర్వాత ట్రంపు 6 దేశాలపై ఆంక్షలు విధించాడు. దానిని కూడా కోర్టు చట్ట వ్యతిరేకం అంటూ రద్దు చేసింది.

నాటో సభ్యదేశాల ఆర్థిక భాగస్వామ్యం ఇంకా పెరగాలని డిమాండ్ చేస్తూ, ప్రస్తుతం కనకవర్షం కురవడం మంచి పరిణామం అని వ్యాఖానించాడు. బ్రిగ్జిట్ నుండి బ్రిటన్ బయటకు రావడం మంచి పరిణామమని, స్వతంత్ర గుర్తింపు అవసరం అని, స్వేచ్ఛా స్వతంత్ర బ్రిటన్ ప్రపంచానికి వరం లాంటిదని అన్నాడు.

200 మిలియన్ డాలర్లు (1400 కోట్ల రూ॥) ఖర్చుతో 28,000 మంది సైనికుల రక్షణలో 2017 జనవరి 20న ట్రంప్ అధ్యక్ష ప్రమాణ స్వీకారం చేసాడు. గతంలో ఎన్నడూ లేని విధంగా 63 సంఘాలు వాషింగ్టన్‌లోను, అన్ని సెక్షన్ల ప్రజలు దేశమంతటా అధ్యక్షుడుగా ట్రంప్‌ను వ్యతిరేకిస్తూ (50 రాష్ట్రాల్లో) నిరసన ప్రదర్శనలు చేసారు. న్యూయార్క్ పోస్ట్ పత్రిక 'యూఎస్‌ఏలో కొత్త మాఫియా యుగం ప్రారంభం' అని, న్యూయార్క్ టైమ్స్ పత్రిక "శత్రువును దెబ్బతీసి బలవంతంగా వైట్‌హౌస్‌లోకి నూతన అధ్యక్షుడు ట్రంప్ ప్రవేశం" అని రాస్తే, గ్లోబల్‌టైమ్స్ పత్రిక 'ఇతగాడెలా పరిపాలిస్తాడోనని చింతిస్తున్నారు' అంటూ రాసింది. 2017 ఫిబ్రవరి 28న సెనెట్‌ను సంభోదిస్తూ చేసిన అధ్యక్ష ప్రసంగంలో ట్రంప్ నేటి అమెరికా పరిస్థితిని వర్ణించాడు. అమెరికాలో పేదరికం పెరిగిందని, 1/6వంతు ప్రజలు ఆహారకూపన్లపై బతుకుతున్నారని, 9 1/2 కోట్లు అంటే జనాభాలో 1/4 వంతు నిరుద్యోగులున్నారని చెప్పి, ఇదంతా 8 సం॥ ఒబామా పాలనా పాపంగా అభివర్ణించాడు. అసలు ఇదంతా అమెరికా సామ్రాజ్యవాద శక్తులు ప్రజలపై చేస్తున్న దోపిడీ, అణిచివేతల ఫలితం. ఆ చరిత్రని ఒక సారి చూద్దాం.

1930ల నాటి ఆర్థిక మాంద్యం నుండి అమెరికా వ్యవస్థను బయట పడవేయడానికి 3సార్లు అధ్యక్షుడైన రూజ్‌వెల్ట్‌కు 2వ ప్రపంచ యుద్ధ పరిణామాలు సహకరించాయి. ప్రపంచ జి.డి.పి.లో (1945) అమెరికా జి.డి.పి. వాటా సగానికి చేరింది. నేడది 4వ వంతుకు పడిపోయింది. 1990లలో ప్రవేశపెట్టిన ప్రపంచీకరణ (ఎల్.పి.జి.) విధానాలు అమెరికా ఆర్థిక వ్యవస్థను సంక్షోభాల బారిన పడకుండా కాపాడుకోలేక పోతున్నాయని 2008 నాటి అమెరికాలో ప్రారంభమైన సబ్‌ప్రైమ్ క్రైసెస్ తేల్చి చెప్పింది. కాబట్టి ఫస్ట్, బెటర్, గ్రేట్ అమెరికా అనే నినాదాలు ముందుకొచ్చాయి. ఇది ట్రంప్ కొత్తగా తెచ్చిన నినాదం కాదు. ఈ ఎన్నికల్లో ట్రంప్‌ను గెలిపించాల్సిన అవసరం అమెరికా సాంప్రదాయ పెత్తందారీ ఆర్థిక వ్యవస్థ ఉన్మాద పూరిత విధానాల అమలుకు ఉంది. అందుకే ట్రంప్ ప్రపంచానికి పోటీగా అమెరికా అభివృద్ధిని, వాషింగ్టన్ మాత్రమే కాకుండా అమెరికా మొత్తాన్ని అభివృద్ధి చేయాలని జాతీయ వున్మాదాన్ని రెచ్చగొడుతున్నాడు.

1980 నాటికి అమెరికా ఆర్థిక వ్యవస్థ తీవ్ర సంక్షోభానికి గురైనపుడు ప్రపంచీకరణ విధానాలు ముందుకు తెచ్చారు. 25 సం॥ల ప్రపంచీకరణ విధానాల వెనుక అమెరికా పాలక వర్గాలదే కీలక భూమిక. దేశాల సరిహద్దులు అక్కర లేదన్న సీనియర్ బుష్ పాలనలో అమెరికా ఏకధృవ అగ్రరాజ్యంగా చెలామణి కాగలిగింది. ఇరాక్, ఆఫ్ఘనిస్తానులను సైనికంగా నియంత్రించడం సాధ్యంకాదని జూనియర్ బుష్ హయంలో రుజువయ్యింది. ఒబామా పాలనలో అనేక బలహీనతలు, ఓటములు అమెరికాను వెంటాడాయి. సీనియర్, జూనియర్ బుష్‌ల మొత్తం విధానాలు అమెరికా ఆర్థిక వ్యవస్థకు శాపంగా మారాయి. ఆ ఊబిలో పీకల దాక ఒబామా సర్కారు దిగబడిపోయింది. వీటికి తోడు అరబ్ వెల్లువ ఆ తర్వాత సిరియా లాంటి సమస్యలతో అమెరికాను ఆర్థిక, రాజకీయ, సైనిక సంక్షోభంలోకి నెట్టివేసాయి.

ఆర్థిక రంగంలో చైనా, సైనికంగా రష్యా బలపడి సవాల్ విసిరే పరిస్థితి నెలకొన్న నేటి ప్రత్యేక సందర్భంలో యూరప్‌లో కూడా అమెరికా పూర్వపు ఆధిపత్యం సన్నగిల్లింది. మధ్యప్రాచ్యం ఎదురు తిరుగుతున్నది. ఆర్థిక, రాజకీయ, సైనిక విషయాలలో అటు చైనా, ఇటు రష్యా వ్యూహాత్మకంగా బలపడుతున్నాయి. అమెరికా అనుకూల

*(మిగతా 24వ పేజీలో......)*

# దళితుల భూ పోరాటం

భూమి హక్కు కొరకు జూన్ 7న సంగ్రూర్‌లో జరిగిన ర్యాలీలో జిల్లాలోని పలు గ్రామాలకు చెందిన వేల మంది పాల్గొన్నారు. భూస్వాధీన పోరాట కమిటీకి చెందిన ఎర్రజెండాలతో అనేక మంది మహిళలు ఫోటోల్లో కనిపించారు. ఇతర జిల్లా కేంద్రాల్లోనూ ఇటువంటి ప్రదర్శనలు జరిగినట్టుగా వార్తలు వచ్చాయి. ఫోటోలు ఎగిసిన దళిత, స్త్రీవాద చైతన్యం, ప్రజాస్వామ్య స్ఫూర్తి సంగమాల కథను వినిపిస్తాయి.

పంజాబులో రైతు ఉద్యమాలకు సుదీర్ఘ చరిత్ర వుంది. అయితే భూస్వాధీన పోరాట కమిటీ (భూ.పో.క.) నేతృత్వంలో పంజాబులోని మాలవా ప్రాంతంలో అనేక గ్రామాల్లో జరుగుతున్న పోరాటాలు గతంలో జరిగిన పోరాటాల కంటే అనేక విధాలుగా భిన్నమైనవి. ఇవి ఒక కొత్త తరహా కుల/వర్గ పోరాటాలు. ఈ పోరాటంలో ఒకవైపు పంచాయితీ భూమిలోని మూడవ వంతు భాగానికి నిజమైన హక్కుదారులైన దళితులు వుంటే, మరో దిక్కు మోసంతో, ప్రభుత్వ పాలనాధికారుల కుమ్మక్కుతో ఆ భూమిని కబ్జా చేసిన ధనిక అగ్ర కులస్తులు, ముఖ్యంగా జాట్లు వున్నారు. ఈ పోరాటంలో విద్యార్థుల భాగస్వామ్యం గణనీయంగా వుండడమే కాక చాలా చోట్ల వాళ్ల చొరవ మూలంగానే ఆందోళన ప్రారంభమైంది. మహిళల సమాన భాగస్వామ్యమే కాదు వాళ్లు ముందు పీఠిన వున్నారు. ప్రపంచీకరణ, కార్పొరేటీకరణ నేపథ్యంలో విజృంభిస్తున్న వ్యక్తివాదాన్ని సవాల్ చేస్తూ సామూహికతకు ఒక నూతన నమూనాగా ముందుకు రావడం ఈ వుద్యమ విశిష్టత. పోరాటంలో ఏర్పడిన ఐక్యత వాళ్ల జీవితంలోనూ ప్రతిబింబిస్తున్నది. సమిష్టి పోరాట పునాదిపై భూమిని సాధించుకున్న దళితులు సమిష్టి సాగు, సమిష్టి శ్రమ, ప్రజాస్వామిక పంపిణీ అనే ప్రణాళికను రూపొందించుకుని, భూ.పో.క. జెండా కింద సమిష్టి భావజాలాన్ని నిర్మించుకున్నారు. విస్తృత చర్చల తర్వాత మధ్యలో సూర్యుని గుర్తు వున్న ఎర్రజెండాను కమిటీ పతాకగా వుండాలని నిర్ణయించుకున్నారు. ఖేడీ గ్రామానికి చెందిన దళితులు 1976లో తమకు కేటాయించిన నివాస స్థలంలో జెండా పాతి షామియానాలు వేశారు. ధనిక రైతుల, పోలీసు, ప్రభుత్వ అధికారుల నిర్బంధం, అణిచివేతలను ధిక్కరిస్తూ, సుడిగాలి వానలతో పోరాడుతున్నారు. ఏమైనా కానీ ఇప్పుడు వాళ్లు ఆ స్థలాన్ని వదలదలుచుకోలేదు. వీళ్ల సమిష్టి వంటశాలల నమూనాను కూడా ముందుకు తెచ్చారు. కుటుంబాలన్నీ కలిసి వండుకొని కలిసి భోంచేస్తారు.

పంచాయితీ భూముల వేలంలో పోలీసులు, ప్రభుత్వాధికారులు, అగ్ర కులస్తుల కుమ్మక్కు, మోసాలను వ్యతిరేకిస్తూ 2016 మే 24 సంగ్రూర్ జిల్లా భవానీగఢ్‌కు చెందిన బాలద్‌కలాం దళితులు చేసిన రోడ్డు రోకో ఆందోళనపై పోలీసులు బీభత్సకరంగా లాఠీచార్జ్ చేశారు. కాల్పులు కూడా జరిపారు. అనేక మంది ఆందోళనాకారులు గాయపడ్డారు. పలువురు అరెస్టయ్యారు. పలువురు మహిళలు కూడా పోలీసుల బీభత్సానికి గురయ్యారు. కోచింగ్ సెంటర్‌కి వెళ్తున్న ఇద్దరు అమ్మాయిలను పురుష పోలీసులు ఈడ్చి ఈడ్చి కొట్టారు. ఆందోళనలో పాల్గొన్న ఆ గ్రామాలను మే 28న పర్యటించిన పౌర స్పందన బృందం ఆ అమ్మాయిలను కలిసేప్పటికి వాళ్ల కాళ్ల మీద నాలుగు రోజుల క్రితపు కమిలిన గాయాలు ఇంకా తాజాగానే వున్నాయి. అయితే వాటిని చూపుతున్న వాళ్ల మొహాల్లో భయం కాక ఆత్మవిశ్వాసమూ, పోరాట దృఢ సంకల్పమూ కనిపించాయి. పోలీసులేమైనా చెయ్యనీ, ప్రాణాలు పోయినా సరే భూమిని వదలేది లేదని వాళ్లన్నారు.

మిగతా వాళ్లు కూడా ఇది కేవలం ఆర్థిక సమస్య కాదు, సామాజిక సమస్య కూడా అన్నారు. ఇది గౌరవానికి సంబంధించిన సమస్య కూడా. పంజాబులో, వ్యవసాయంలో యాంత్రీకరణ, క్రిమి సంహారక మందుల ప్రయోగంతో పశుగ్రాసం తగ్గిపోయింది. కేవలం కాలువ ఒడ్లకూ, పొలం గట్లకూ గడ్డి పరిమితమైంది. దళితులకు భూమి లేనందువల్ల దళిత మహిళలు అగ్ర కులస్తుల పొలాల్లోకి గడ్డి కోసుకురావడానికి వెళ్తారు. అక్కడ వాళ్లు అగ్రకులస్తుల చేతుల్లో ఎన్నో అవమానాలకు, అత్యాచారాలకు గురవ్వాల్సి వస్తుంది. ఇప్పుడు వాళ్లు అటువంటి అవమానాలను భరించదల్చుకోలేదు. వాళ్ల భూములను గుంజుకోవడానికి పోలీసు, ప్రభుత్వాధికారుల మద్దతుతో, కుటిల ప్రయత్నాల్లో ధనిక రైతులు వుంటే, దళితులు మాత్రం చివరి ఊపిరి వరకూ భూమిని వదిలేది లేదని గట్టిగా నిశ్చయించుకున్నారు.

శతాబ్దాల నుండి తర తరాలుగా అవమానాలను భరిస్తూ అగ్ర కులాల రైతుల పొలాల్లో విత్తనాలు వేస్తూ, కోతలు కోస్తూ వస్తున్న దళితులకు తమ భూమి అనే భావన ఒక కలగా వుండింది. 54 ఏళ్ల భూ.పో.క. ప్రముఖ కార్యకర్త, నేను ఆయన పేరు కావాలనే రాయడం లేదు, రెండేళ్ల కిందట తన సొంత పొలంలో పారపట్టిన తన అనుభవాన్ని పంచుకుంటూ తనను తాను మైమరిపోయాడు. భూమి వేలంలో దళితుల సామూహిక వేలంపాట కోసం 2014లో జరిగిన సుదీర్ఘపోరాటం నడిపిన ఏడు ఎనిమిది వందల పోరాటకారుల్లో ఆయన ఒకడు. అప్పుడు కూడా పోలీసులు ఇలాగే హింసను ప్రయోగించారు. ఆయన ఎంతగా గాయపడ్డాడంటే సంక్లిష్టమైన ఆపరేషన్ చేయాల్సి వచ్చింది. కాళ్లలో వేసిన స్టీల్

ఇప్పుడు కూడా నొప్పిపెడుతున్నది. గాయపు నొప్పి చాలా వుంది. అయితే మా పొలం అనే భావన వల్ల కల్గిన సంతోషం మాటున నొప్పి తెలియడం లేదని అతనన్నాడు. ఆంగ్లేయ పాలన రోజుల నుండి భూమి కోసం జరిగే పోరాటాలను చీల్చడానికి, బలహీనపర్చడానికి పాలకులు కుట్రలు పన్నుతూనే వున్నారు. కానీ నేడు పంజాబు దళితులు కేసులంటే భయపడ్డం మానేశారు.

పంజాబు గ్రామీణ పొందిక కుల ఆధిపత్యంపై ఆధారపడి వుంది. ఆర్థిక వనరులపై ముఖ్యంగా వ్యవసాయ భూములపై యాజమాన్య హక్కుల విషయంలో అసమానత వుంది. అందుకని ఈ భూపోరాటం కుల అణచివేతకే కాక కులతత్వానికి కూడా వ్యతిరేకంగా ఎక్కుపెట్టబడింది. దళిత పోరాటకారులు సామాజిక, ఆర్థిక విముక్తి పోరాటాలను జోడించారు. ఎందుకంటే భారత దేశంలో అధికార కులాలు, అధికార వర్గాలుగా కూడా వున్నాయి. భూస్వాములు, పెద్ద–చిన్న ధనిక రైతులు చాలా వరకు పై కులాలకు చెందిన వారు. దళితులు చాలా మేరకు భూమి లేని వాళ్లు. గ్రామాల్లో ప్రభుత్వ, పంచాయితీ అనే రెండు రకాల సమిష్టి భూములున్నాయి. విభజన తర్వాత పాకిస్తాన్‌కు వెళ్లిపోయిన వాళ్ల భూములు, అటుదిక్కు పంజాబు నుండి వచ్చిన వాళ్లకు పంచగా మిగిలిన భూములు, వారసులు లేకుండా మరణించిన వాళ్ల భూములు ప్రభుత్వ భూముల కిందికి వస్తాయి. ప్రతి గ్రామ పంచాయితీ అధీనంలో గ్రామానికి చెందిన సమిష్టి ప్రయోజనాల కోసం అంటూ కొంత భూమి వుంటుంది. పంజాబ్ విలేజ్ ల్యాండ్ రెగ్యులేషన్ ఆక్ట్, 1961 ప్రకారం సమిష్టి వ్యవసాయ భూముల్లో 30 శాతం ఎస్సీ కులాలకు రిజర్వేషన్ కల్పించబడింది. ఆందోళనలో పాల్గొంటున్న పంజాబీ కవి, నౌజవాన్ భారత్ సభ కార్యకర్త సుఖీందర్ సింగ్ 'కాగితాలపై 56,000 ఎకరాల భూమి దళితులకు కేటాయించబడింది. కానీ వాస్తవానికి ఒక్క అంగుళం భూమి కూడా దళితులకు లేదు' అన్నాడు. పంచాయితీ భూములు ఏటా వేలం వేయబడతాయి. ధనిక రైతులు డమ్మీ దళిత రైతు పేరుతో వేలం పాడి భూమిని కబ్జా చేసుకుంటారు. చాలా రోజుల నుండి దళితులు అన్ని వేదికలలోనూ తమ డిమాండ్‌ను లేవదీస్తున్నారు. కానీ మొదటి అసలైన ప్రారంభం 2008లో బర్నాల జిల్లాలోని బనరా గ్రామంలో జరిగింది.

**బనరా పోరాటం: ఒక నూతన ప్రారంభం**

దళితుల కోసం రిజర్వు చేయబడిన భూములను మోసంతో, ప్రభుత్వాధికారుల కుమ్మక్కుతో అగ్రకుల ధనిక రైతులు కబ్జా చేసుకున్నారు. 2008లో మొదటిసారి బనరా గ్రామ దళితులు ఈ అన్యాయాన్ని గట్టిగా సవాల్ చేశారు. బనరా గ్రామస్తుడు బహల్ సింగ్ క్రాంతికారీ మజ్దూర్ యూనియన్ జెండా కింద గ్రామంలో 250 దళిత కుటుంబాలను ఏకం చేసి, వాళ్ల హక్కుల గురించి తెలియజేశాడు. ఐక్య సమీకరణ మూలంగా వాళ్లలో హక్కుల గురించిన స్పృహతో పాటు సామూహిక శక్తి గురించి కూడా అవగాహన పెరిగింది. పోరాట ఐక్యత మూలంగా జాట్ కుల భూస్వాములకూ, ధనిక రైతులకు అమ్ముడుపోయిన డమ్మీ దళితుడు దొరకడం అసాధ్యమైపోయింది. ఈ పోరాటంలో మహిళల భాగస్వామ్యం గణనీయమైంది.

పోరాటం నుండి సమిష్టి అనే భావజాలం పుట్టింది. సమిష్టి వేలం పాట ద్వారా బనరా దళితులు గ్రామానికి చెందిన 30 శాతం పంచాయితీ భూమి (తొమ్మిది ఎకరాలు)ని పొంది, సమిష్టి పట్టా చేయించుకున్నారు. ఆత్మగౌరవం, మానవ ప్రతిష్ట దృష్టి నుండి చూస్తే తొమ్మిది ఎకరాల భూమి బనరా దళితులకు ప్రాణదాయినిగా మారింది. భూమిపై సమిష్టి యాజమాన్యం, సమిష్టి శ్రమ, సమాన పంపిణీ సిద్ధాంతంపై ఆధారపడి దళిత సామూహికతను పటిష్ట పర్చుకున్నారు. ఆహార పంటలు వేయడానికి చాలినంత భూమి లేదు. అందుకని వాళ్లు బాగా ఆలోచించి వరి, గోధుమ వంటి సాంప్రదాయ పంటల బదులుగా చరి, బర్సీం వంటి పశుగ్రాసపు పంటను ఎన్నుకున్నారు. ఈ పోరాటం సమిష్టికి చెందిన భవిష్యత్ నిర్మాణంకూ, దాని ప్రయోజనాలను తెలుసుకోవడానికి ఒక ప్రయోగశాలగా మారింది. ఆర్థిక కోణం నుండి చూసినపుడు భూమిలో ప్రతి కుటుంబానికి వచ్చిన చిన్న భాగం రీత్యా లభించిన ఆ భూమికి అంత ప్రాధాన్యత లేదు. ఆత్మగౌరవం, ప్రతిష్ట అనే కోణం నుండి చూసినపుడు మాత్రం చాలా ప్రాధాన్యత వుంది. పదకొండు మందితో ఎన్నికైన ఒక సమితి ఉత్పత్తి, పంపిణీల వ్యవహారం చూసుకుంటుంది.

దళిత సామూహికత భవిష్యత్ పోరాటాలకు ఛోదక శక్తిగానూ, అభిన్న ప్రవృత్తిగానూ మారింది. బనరా ప్రయోగ వ్యాప్తి ఐదేళ్లకు పైగా ఒకే గ్రామానికి పరిమితమైంది. కానీ దళిత సామూహికత అనే భావజాలం మొత్తం మాలవాలో వ్యాపించి, దళితులకు చెందాల్సిన భూమిని అక్రమంగా చేజిక్కించుకున్న ధనికరైతుల్లో కంపనం పుట్టించింది.

**శేఖా: సామూహికత తర్వాతి దశ**

బనరా సామూహికత భావజాలపు తర్వాతి ప్రయోగం 2014లో బర్నాలా జిల్లాలోని శేఖా గ్రామంలో జరిగింది. బనరా దళితుల ఐక్యత నుండి ప్రేరణ పొందిన పంజాబ్ స్టూడెంట్స్ యూనియన్ (పీఎస్‌యూ)కు సంబంధించిన కొంత మంది విద్యార్థులు ప్రభుత్వ రికార్డులను శోధించి బర్నాలా గ్రామంలోని పంచాయితీ భూముల్లో దళితుల వాటాను తెలుసుకున్నారు. గ్రామంలోని దళితులను ఐక్యం

చేశారు. రిజర్వ్ భూములు ఆ గ్రామంలోని భూమి లేని రైతులకు ఎన్నడూ లభించలేదు. విద్యార్థుల నాయకత్వంలో దళిత గ్రామీణ అభివృద్ధి వంటి పరిపాలనా కార్యాలయాల ముందు ధర్నా, ప్రదర్శన, ఘెరావ్ మొదలైనవి చేసి, ఐక్యంగా పోరాడి దళితులకు కేటాయించిన భూములను పొందడంలో విజయం సాధించారు. బనరా వలెనే శేఖా దళితులు కూడా సాధించుకున్న భూమిలో సమిష్టి వ్యవసాయం చేయాలని నిర్ణయించుకున్నారు. వ్యక్తివాద భావనను వ్యతిరేకిస్తూ సమిష్టి వ్యవసాయపు దళిత సామూహికత అనేది శాశ్వత వేదికగా మారింది. బనరా వలెనే మానవీయ ప్రతిష్ఠ, ఆత్మగౌరవంల దృష్ట్యా చూసినపుడు శేఖా పోరాటం కూడా ఆర్థిక న్యాయంతో పాటు సామాజిక న్యాయం కోసం జరిగిన పోరాటం. బనరా వలెనే శేఖా దళితులు కూడా సాంప్రదాయక పంటలను వదిలేసి పశుగ్రాసాన్ని పండించడం మొదలుపెట్టారు. దూరా భారాలు వెళ్లడం, భూస్వాముల చేత అవమానాలు భరిస్తూ గడ్డి కోయడం నుండి మహిళలకు విముక్తి లభించింది.

ఈ పోరాటపు మరొక ప్రాముఖ్యత ఏంటంటే దీనిని విద్యార్థులు ప్రారంభించారు. ఇతర గ్రామాల దళితులు కూడా విద్యార్థుల దగ్గరికి వెళ్లడం మొదలు పెట్టారు. మొత్తం రాష్ట్రంలో పోరాటాన్ని వ్యాప్తి చేయడానికి గాను సుదీర్ఘ చర్చల తర్వాత పోరాటానికి నిర్మాణ రూపం ఇవ్వడానికి, ఇతర పోరాటాలతో సమన్వయం సాధించడానికి భూస్వాధీన పోరాట కమిటీ ఏర్పడింది. మాలవా ప్రాంతం (సంగ్రూరు, మానసా, పటియాలా, జలంధర్, లుధియానా జిల్లాలు) లోని వందలాది గ్రామాల్లో భూ.పో.క. నాయకత్వంలో పోరాటాలు జరుగుతున్నాయి. దోవాబా ప్రాంతంలో కూడా ఇటువంటి పోరాటాలు జరిగే సూచనలు కనిపిస్తున్నాయి. ఈ పోరాటాల్లో, బాలద్‌కలాం పోరాటం అన్నింటి కంటే ప్రముఖమైనది. ఇక్కడ 375 ఎకరాల మిగులు భూములున్నాయి. ఇందులో దళితుల వాటా 125 ఎకరాలు. 2014లో భూ.పో.క. నాయకత్వంలో ఉమ్మడి వేలంలో భూమిని పొందడానికి ముందు వరకూ వాళ్లకు ఒక్క అంగుళం భూమి కూడా దొరకలేదు. 2014 ఏప్రిల్‌లో ప్రారంభమైన పోరాటంపై భూస్వాములు, పోలీసు, ప్రభుత్వ అధికారులు నిప్పులు కురిపించారు. అయినప్పటికీ పోరాట ఐక్యతను దెబ్బతీయలేకపోయారు.

**బాలద్‌కలాం: పోరాట ఐక్యత**

శేఖా విజయం తర్వాత ఇతర గ్రామాల్లోనూ పోరాటాలు ప్రారంభమయ్యాయి. ఈ పోరాటాల్లో బాలద్ కలాం పోరాటం ప్రాధాన్యత కలిగినది. మిగులు భూముల్లో 30 శాతాన్ని దళితులకు కేటాయించాలని 1961లో చట్టం చేసినప్పటికీ దళితులు తమ వాటా భూములను పొందలేకపోయారు. ధనిక రైతులు బినామీ వేలం పాటలతో దళితుల వాటా భూములను మింగుతూ పోయారు. తమ హక్కులను తెలుసుకున్న, సమిష్టి శక్తి చైతన్యం పొందిన దళితులు భూ.పో.క.గా ఏర్పడి ఉమ్మడి వేలం పాటలో భూములను పొంది, పట్టా చేయించుకొని వుమ్మడి వ్యవసాయాన్ని ప్రారంభించారు. ఇక్కడ కూడా 11 మందితో ఎన్నికైన కమిటీ సమిష్టి ఉత్పత్తి – పంపిణీలను చూస్తుంది. తర్వాతి వేలం పాట కోసం కొంత ఆదాయాన్ని మిగుల్చుకొని వుత్పత్తిని అన్ని కుటుంబాలకు పంచుతారు. కొంత భూమిలో పశుగ్రాసాన్ని పండిస్తూ మిగతా భూమిలో ఆహారా ధాన్యాలు పండిస్తున్నారు. నిన్నటి వరకూ తమ కాళ్ల చెప్పులుగా భావించిన దళితులు నేడు ఆత్మగౌరవంతో బతకడం భూస్వాములకు నచ్చడం లేదు. ప్రభుత్వాధికారులతో కుమ్మక్కై ఈసారి తిరిగి ఆ భూములను కబలించడానికి సిద్ధమవుతున్నారు. అయితే దళితులు ఆ భూములపై దృఢంగా నిలబడ్డారు. బాలద్ కలాం మొత్తం పంజాబ్‌కు ఒక నమూనాగా మారింది. వందలాది గ్రామాలు శతాబ్దాల కిందటి కుల సమీకరణలను బద్దలుకొడుతూ భూ పోరాటాన్ని విస్తృత ప్రజా పోరాటంగా మార్చబూనుకున్నారు. అయితే ఈ పోరాట వార్తలన్నీ ప్రధాన ప్రసార మాధ్యమాలకు అంటరానివయ్యాయి.

2014 పోరాటంలో పోలీసుల చేతిలో దారుణంగా దెబ్బలుతిని, అనేక వారాల పాటు అపస్మారక స్థితిలో వుండిన 40 ఏళ్ల పరంజీత్ కౌర్ పోలీసుల క్రూరత్వాన్ని తలుచుకొని ఏడ్చేసింది. మేం భూములను పొందడం వల్ల భూస్వాముల అవమానాల నుండి విముక్తి పొందాము. ఈ సంతోషం ముందు పోలీసు చిత్రహింసల బాధ చిన్నదైపోయింది అన్నదామె. ఆందోళనలో పాల్గొన్న పీఎస్‌యూకు చెందిన పృథ్వీ సింగ్ బాలద్ కలాం విజయం తర్వాత మాట్లాడుతూ 'సంగ్రూరు, బర్నాలా జిల్లాలకు చెందిన దాదాపు 20 గ్రామాల్లో దళిత సముదాయాలు ఏర్పడ్డాయి. అలాగే మాలవాలోని మిగతా గ్రామాల్లో దళితులు సామూహికతపై ఆధారపడి ఐక్యం అవుతున్నారు' అని చెప్పారు. చిన్న భూకమతాల్లో సమిష్టి వ్యవసాయం చేసిన తర్వాత, పెద్ద భూ కమతాల్లో సమిష్టి వ్యవసాయం చేయడం ఒక సవాల్‌గా మారింది. ఈ సవాల్‌ను దళితులు స్వీకరించారు. సమిష్టి సాగులోని ప్రయోజనాలను గుర్తించారు. ఇక్కడ కూడా సమిష్టి సిద్ధాంతపు పునాది ఏంటంటే సమిష్టి యాజమాన్యం, సమిష్టి శ్రమ, ప్రజాస్వామిక పంపిణీ.

**బడౌ: పోరాడడం కోసం చదువు**

బడౌ దళితులు పోరాటాన్ని నడిపిండానికి చదువు రాతలకు ప్రాధాన్యతను ఇచ్చారు. పౌర స్పందన బృంద సభ్యులు రౌదాస్ ధర్మశాలలో గ్రామస్తుల్ని కలిసినపుడు గోడల మీద భగత్‌సింగ్,

పాశ్, చేగువేరాల కొటేషన్లు చూసి ఆశ్చర్యపోయారు. భూ.పో.క.లో పూర్తికాలపు కార్యకర్తగా పనిచేస్తున్న పృథ్వీ సింగ్ మాట్లాడుతూ దళిత సముదాయాలు ఏర్పడ్డ గ్రామాల్లో గ్రంథాలయాలు ప్రారంభించే యోజన తయారైందని చెప్పాడు. గ్రంథాలయ ఆవశ్యకతను గురించి ప్రశ్నించినపుడు ఒక యువకుడు అంబేద్కర్‌ను కోట్ చేస్తూ బాధల నుండి విముక్తి పొందడానికి పోరాడాల్సి వుంటుంది. పోరాడడానికి చదువుకోవాల్సి వుంటుంది అని చెప్పాడు. సంవత్సరం కిందట పోరాటం ప్రారంభమైనపుడు ఇక్కడ కూడా పోలీసుల బీభత్సం పునరావృతం అయింది.

అసోసియేషన్ ఫర్ డెమొక్రటిక్ రైట్స్ (ఏఎఫ్‌డీఆర్)కు చెందిన విశేసర్ ప్రసాద్ మాట్లాడుతూ 16 గ్రామాల్లో దళిత సముదాయాలు ఎస్సీలకు కేటాయించిన దాదాపు 250 ఎకరాల భూమిపై హక్కును సాధించుకున్నారు. మిగతా గ్రామాల్లో పోరాటం కొనసాగుతున్నది అని చెప్పాడు.

**దళిత మహా పంచాయత్**

మేలో పంచాయితీ భూముల వేలానికి ముందే 2015 ఏప్రిల్లో 40 ఏళ్ల పరంజీత్ కౌర్ భవానీగఢ్‌లో దళిత మహా పంచాయత్‌ను నిర్వహించాడు. దీనిలో మాలవా ప్రాంతంలోని ఐదు జిల్లాలకు చెందిన దాదాపు వంద గ్రామాల నుండి వేలాది మంది పాల్గొన్నారు. ఇందులో దళిత సామూహికతను మరింత బలోపేతం చేయడానికి, ఇతర గ్రామాలకు దీనిని విస్తరించడానికి చర్చలు జరిగాయి. ఇందులో సూర్యబింబం మధ్యలో వున్న ఎర్రని జెండా తమ సంఘ పతాకగా వుండాలనే తీర్మానాన్ని ఏకాభిప్రాయంతో ఆమోదించారు. మార్చి 20న గాచోం గ్రామంలో మరొక దళిత్ పంచాయత్ జరిగింది. ఈ గ్రామ దళితులు కూడా భూమిని సాధించుకొని దళిత సముదాయాన్ని ఏర్పర్చుకున్నారు. 102 గ్రామాలకు చెందిన దళితులు ఈ కాన్ఫరెన్స్‌లో పాల్గొన్నారు. అప్పటి నుండి అనేక కాన్ఫరెన్స్‌లు జరిగాయి. జనేడీ గ్రామ కాన్ఫరెన్స్‌పై అగ్రకులాల వాళ్లు జరిపిన దాడిని గ్రామస్తులు తిప్పికొట్టారు.

అలాగే అనేక గ్రామాల్లో దళితులు పోరాటాన్ని కొనసాగిస్తున్నారు. అయితే మతోయి పోరాట ప్రాముఖ్యత ఏంటంటే ఈ పోరాటాన్ని విద్యార్థినులే ప్రారంభించారు. వాళ్లే నాయకత్వం వహించారు.

బనోరాలో పీఎస్‌యూ విద్యార్థుల పోరాటంతో ఉత్సాహితులైన, పట్టణంలో చదువుతున్న మతోయి గ్రామానికి చెందిన అమ్మాయిలు సందీప్ కౌర్ అనే విద్యార్థిని నాయకత్వంలో కాలేజీలోనూ, గ్రామంలోనూ కలిసికట్టుగా వుంటూ దళిత కుటుంబాలను ఐక్యం చేశారు. సుదీర్ఘ పోరాటం తర్వాత భూమిని సాధించుకొని సమిష్టి వ్యవసాయం చేస్తున్నారు. దళిత సముదాయాన్ని ఏర్పర్చారు.

ఇలాగే ఎన్నో గ్రామాల గణాంకాలు వున్నాయి. అయితే ఖేడీ గ్రామ పోరాటం సాటి లేనిది.

**ఖేడీ: అపహాస్యానికి గురైన సామాజిక న్యాయం**

1976లో ఖేడీ గ్రామానికి చెందిన భూమిలేని రైతులకు ఇంటి ప్లాట్లను కేటాయించారు. పంజాబు, హర్యానా హైకోర్టుకు చెందిన ఒక ఆదేశం ప్రకారం కేటాయించిన భూమిలో మూడేళ్ల లోపు ఇల్లు కట్టుకోకపోతే భూమి వాపస్ తీసుకోబడుతుంది. కానీ నాలుగేళ్ల క్రితం వరకూ వాళ్లకు తమకు భూమి కేటాయించారనే విషయం తెలియనే తెలియదు. గ్రామానికి చెందిన కొంతమంది చదువుకున్న యువకులు ఈ విషయం తెలుసుకొని సర్పంచ్, ప్రభుత్వ అధికారులను కలిస్తే గడువు అయిపోయిందనే సాకు చూపించడానికి ప్రయత్నించారు. కానీ బాలద్ కలాం తదితర గ్రామాల పోరాటాలతో ప్రేరణ పొందిన ఖేడీ దళితులు భూ.పో.క. నాయకత్వంలో తమ భూమిని ఎర్రజెండాలతో చుట్టుముట్టి, అక్కడే మకాం వేశారు. ధనిక రైతులు, పోలీసుల పీడన, బెదిరింపులను లెక్కచేయకుండా వాళ్లు తమ భూమిపై గట్టిగా నిలబడ్డారు. ఇది సమిష్టి వ్యవసాయానికి సంబంధించిన విషయం కాదు కానీ సమిష్టి వంటశాల ప్రయోగం జరిగిందిక్కడ.

ఈ మొత్తం పోరాటంలో పోలీసు, ప్రభుత్వాధికారుల పాత్ర స్పష్టంగా దళిత వ్యతిరేకమైనదని రుజువయింది. అధికారంపై అగ్ర కులాలకు చెందిన భూ యజమానుల ఆధిపత్యం వుండడమే దీనికి కారణం. భారతీయ కిసాన్ యూనియన్ కూడా ఈ ధనిక రైతుల చెప్పుచేతల్లో వుంది. కనుక దళిత పోరాటాలకు వ్యతిరేకంగా వుంది. అయితే కీరత్ కిసాన్ తదితర ఇతర రైతు, మానవహక్కుల, విద్యార్థి సంఘాలు దళిత పోరాటాలకు మద్దతునిస్తున్నాయి.

పంజాబులో వ్యవసాయంలో భూస్వామ్య సంబంధాలు కాకుండా పెట్టుబడిదారీ సంబంధాలున్నాయనే అవగాహనను ఈ పోరాటాలు ఖండిస్తున్నాయి. ఎందుకంటే అగ్రకులాల్లో, పాలనలో దళితుల పట్ల వివక్ష అనేది ఈనాటికీ ఒక వాస్తవం. 1961లో దళితులకు భూమిపై రిజర్వేషన్ కల్పించే చట్టం తయారైంది. కానీ ఇప్పటి దాకా అది కాగితాలకే పరిమితమైంది. విద్యార్థుల చొరవతో, భూమిపై హక్కు కోసం దళితులు ప్రారంభించిన పోరాటంలో విస్తృత ప్రజా పోరాటాలకు అవకాశాలు దాగి వున్నాయి. దళితులు తమ హక్కుల కోసం పోరాడడమైతే మొదలైంది. ఈ పోరాటంతో పాటే ముందుకు తెచ్చిన సమిష్టి అనే నమూనాను గ్రామీణ కమ్యూన్లు నిర్మించడానికి సైద్ధాంతిక పునాదిగా ఉపయోగించుకోవచ్చు.

(సమాయాంతర్ జూలై 2016 సంచిక నుండి)

○

## ఆపరేషన్ గ్రీన్‌హంట్ 3వ దశ- మిషన్-2017

## ప్రజలపై యుద్ధం-ప్రజల ప్రతిఘటన

ఆపరేషన్ గ్రీన్‌హంట్ మూడవ దశ 2014 చివర్లో మొదలైంది. ఈ దశలో ఏ యేటికాయేడు దేశ విప్లవ ప్రజలపై సైనిక దాడులు తీవ్రతరమవుతున్నాయి. ఆపరేషన్ గ్రీన్‌హంట్‌ను ప్రారంభంలోనే (2009 జులై-ఆగస్టు) దేశంలోని వందలాది విప్లవ, ప్రజాస్వామిక, దేశభక్తి, ప్రగతిశీల ప్రజా సంఘాలు, వ్యక్తులు 'ప్రజలపై యుద్ధం' గానే నిర్వచించారు. ఆపరేషన్ గ్రీన్‌హంట్‌కు పాలకులు నిర్దేశించుకున్న కాల పరిమితి (2017) దగ్గర పడుతున్న కొద్దీ సహజంగానే యుద్ధ తీవ్రత పెరుగుతోంది. ఈ నేపథ్యంలోనే పాలకవర్గ పాలసీని అర్ధసైనికబలగాలు నిర్దిష్ట లక్ష్యాలతో తమ పథకాలను ముందుకు తెస్తున్నాయి. ఇందులో భాగంగా దండకారణ్యం లోని బస్తర్‌లో విప్లవ కార్యకలాపాలను ఉక్కుపాదంతో అణచివేసే లక్ష్యంతో బస్తర్ మిషన్-2016 ప్రకటించారు. బస్తర్ మిషన్-2016 అని ప్రకటించినప్పటికీ, అది దేశవ్యాప్త విప్లవోద్యమంపై సాగిన దాడేనన్న విషయం తేటతెల్లమే. మిషన్-2016లో భాగంగా దండకారణ్యంలో దాదాపు 150 మంది విప్లవకారులు (వీరిలో అధికశాతం విప్లవ ప్రజా సంఘ నిర్మాణాల కార్యకర్తలు, విప్లవ ప్రజలు ప్రాణాలు కోల్పోయారన్నది స్పష్టం) ప్రస్తుతం పోలీసు-అర్ధ సైనిక బలగాలు ప్రకటించిన మిషన్-2017 ను దండకారణ్య విప్లవ ప్రజానీకం మిషన్-2016ను ఓడించిన విధంగానే బోల్షివిక్ పట్టుదలతో ఓడించి తీరుతుంది.

**మిషన్-2017 తయారీలు**

మిషన్-2017 కోసం బస్తర్ పోలీసులు కేంద్రం యొక్క ప్రత్యక్ష మార్గదర్శకత్వంలో 2016 చివరి నుండే తమ బహుముఖ దాడి పథకాలను సిద్ధం చేయసాగారు. ఇందులో భాగంగా జగ్దల్‌పూర్‌లో సెప్టెంబర్ మధ్యతో 'అగ్ని' అనే ప్రజా వ్యతిరేక పౌర సంస్థను ఏర్పర్చారు. 'అగ్ని' సంస్థ వేదికను అలంకరించిన బస్తర్ ఐ.జీ. కల్లూరి శివరాం ప్రసాద్ సహ బస్తర్‌లోని ఏడు జిల్లాల ఎస్.పి.లు ఉన్నారు. ఐ.జి. కల్లూరి ఆ సందర్భంగా ఎలాంటి దాపరికం లేకుండానే 'మావోయిస్టు మద్దతుదారులైన పట్టణ శక్తులతో అగ్ని పోరాడుతుంది' అంటూ దాని లక్ష్యాన్ని స్పష్టం చేశాడు. అగ్ని సంస్థ నేషనల్ కన్వీనర్ ఆనంద్ మిశ్రా తమ సంస్థ శాఖలను గ్రామ గ్రామానికి విస్తరిస్తామని ప్రకటించాడు. వీరిద్దరి ప్రకటన తక్షణం కార్యరూపం దాల్చడంలో భాగంగా అగ్ని సంస్థ ఏర్పడిన రోజే కామ్రేడ్ బేలా భాటియాపై తొలిదాడి జరగగా, గ్రామాలలో గొడ్డళ్ళ సంఘాలు (టేంగ్వ దల్) ఉనికిలోకి వచ్చాయి.

2016 నవంబర్ ఒకటిన ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం 16వ అవతరణ వేడుకల సందర్భంగా హాజరైన దేశప్రధాని మోడీకి ప్రోటోకాల్ నిబంధలను ఖాతరు చేయకుండా స్వాగతం చెప్పిన ఐ.జి. కల్లూరి 'వచ్చే ఎన్నికల నాటికి మావోయిస్టులను అంతమొందిస్తాం' అనడంతో దేశ ప్రధాని కల్లూరి జబ్బ చరుస్తూ 'వెరిగుడ్' అన్నాడు. ఇక దానితో పోలీసు-అర్ధసైనిక పథకాలకు, మిషన్-2017కు ఊపొచ్చింది.

2017 జనవరి రెండవ వారంలో దేశ హోంమంత్రి రాజ్‌నాథ్ సింగ్ ఛత్తీస్‌గఢ్ పర్యటనకు వచ్చి రాయపూర్‌లో అనేక ప్రకటనలు చేశాడు. వాటిలో బస్తర్‌లో మరో 50 పోలీసు స్టేషన్‌ల ఏర్పాటు, 35 కొత్త టవర్ల నిర్మాణం, భారీ వ్యయంతో (2400 కోట్లు) 850 కి.మీ. రోడ్ల నిర్మాణం అందులో ముఖ్యమైనవి. ఇప్పటికే ఆఘ మేఘాల మీద అనేక పోలీసుస్టేషన్లను డి.కె. వ్యాప్తంగా ఏర్పరుస్తున్న వాటికి ఈ 50 పి.ఎస్.లు అదనం. ఇవి ఇలా వుండగా మిషన్-2016కు ముందే దాని తయారీలో భాగంగా బస్తర్‌లో వైమానిక దాడులకు కేంద్రం అనుమతిచ్చిన విషయం విదితమే.

2016 లో బస్తర్ పోలీసు వర్గాలు విప్లవం నుండి దిగజారిన శక్తులలో నుండి ఎంపిక చేసుకున్న లంపెన్ శక్తులతో డి.ఆర్.జి. (డిస్ట్రిక్ట్ రిజర్వ్ ఫోర్స్)ని ఏర్పర్చారు. వారికి టెర్రయిన్‌పై పట్టు, ఇన్ఫార్మర్ల నెట్‌వర్క్‌తో బలమైన సంబంధాలుండడం, ప్రజల భాష, వ్యవహారశైలి పూర్తిగా తెలిసి ఉండడంతో దాడులలో వారు అతి దూకుడును ప్రదర్శించి మావోయిస్టుల నిర్మూలనలో ప్రధాన భూమిక నిర్వహిస్తారనీ బస్తర్ పోలీసులు డి.ఆర్.జి.ని ఏర్పర్చగా, కేంద్రం తన అర్ధసైనిక బలగాలలో నూతనంగా 'బస్తరియా బెటాలియన్' ఏర్పాటు (2016 చివరి నుండి) చేపట్టింది. తమ కంట్లో తమ వేలు పెట్టిన చందంగా బస్తర్ ప్రజలపైకి బస్తర్ యువతకు ఖాకీ డ్రెస్సులెక్కించి సాయుధంగా పంపేందుకు నిశ్చయించింది. ఇందులో మూడవవంతు మహిళలుండడం గమనార్హం. వీటి పరాకాష్టగా రాయపూర్‌లో 2017 జనవరిలో రాష్ట్ర ముఖ్యమంత్రి, రమన్‌సింగ్ ఏకీకృత (యూనిఫైడ్) కమాండ్ బలగాల ఇంచార్జీగా 'వార్ రూం'ను ప్రారంభించాడు. అత్యాధునిక పరికరాలతో దేశ విదేశీ నిపుణుల కనుసన్నలలో సైనిక ఆపరేషన్‌లను మానిటరింగ్ చేసేదే ఈ వార్ రూం. ఇందులో ప్రతి ఒక్క విప్లవకారుడి పూర్తి బయోడేటా (ఫోటో, పేరు, పార్టీలో బాధ్యతలు సహ పూర్తి చరిత్ర) ఉంటుంది. బస్తర్‌లో ఉద్యోగానికి వెళ్లే అధికారులకు ముందు ఇక్కడ శిక్షణ ఇచ్చి పంపిస్తారు.

పైన పేర్కొన్న పోలీసు తయారీలు అలా ఉండగా మరోవైపు 2017 ఫ్రిబ్రవరిలో భారత సైన్యం నుండి కొంతమంది వున్నతాధికారులు బస్తర్ పర్యటించారు. వీరితో పాటు అమెరికా బ్రిటన్, జర్మనీ తదితర యూరప్ దేశాల సైన్యాధికారులుండడం విశేషం. అలాగే ఛత్తీస్‌గఢ్ పొరుగున ఉన్న జార్ఖండ్ రాష్ట్ర

ముఖ్యమంత్రి భా.జ.పా. నాయకుడు రఘువర్ దాస్ ఛత్తీస్‌గడ్‌కు ఒక వైపు, ఒడిశా పోలీసు అధికారులు మరో వైపు సరిహద్దులలో గట్టి నిఘాను ఏర్పరుస్తున్నట్లు 2017 జనవరిలో ప్రకటించారు.

ఇకపోతే 2016 చివరి నుండి వరుసగా వివిధ వ్యక్తుల ద్వారా, సంస్థల ద్వారా ముందుకు వస్తున్న శాంతి చర్చలను కూడా మిషన్-2017లో భాగంగానే చూడాలి. 2016 అక్టోబర్‌లో దేశ అత్యున్నత న్యాయస్థానం సుప్రీంకోర్టు కొలంబియా తరహాలో మన దేశంలో కూడా మావోయిస్టులతో ఛత్తీస్‌గడ్ ప్రభుత్వం శాంతి చర్చలకు పూనుకోవాలని సూచించింది. ఆర్ట్ ఆఫ్ లివింగ్ సంస్థాపకుడు 'ఆధ్యాత్మిక గురువు' శ్రీ శ్రీ రవిశంకర్ ప్రకటన కూడా అందులో భాగమే.

పాలకవర్గాలు చేపట్టిన మిషన్-2017 బహుముఖ దాడిలో విప్లవోద్యమంపై విషం కక్కడం అతి నీచమైన, హేయమైన రూపం తీసుకుంది. దంతెవాడకు సమీపంలోని ఢోల్‌కల్ కొండపై వెయ్యేళ్ల కిందటి గణేశుడి విగ్రహం 2017 జనవరిలో కొండపై నుండి ఏ కారణాల చేతనో కిందపడి 16 ముక్కలైంది. వెంటనే ఐ.జి. కల్లూరి ఇది మావోయిస్టుల ఘాతుక చర్యగా ప్రచారం మొదలు పెట్టాడు. జనవరి 22 నాడు హీరాఖండ్ ఎక్స్‌ప్రెస్ రైలు పట్టాలు తప్పి 18 మంది ప్రయాణికులు ప్రాణాలు కోల్పోగా, 200 మంది గాయపడినారు. ఐ.జి. కల్లూరీకి మావోయిస్టులే కలలోకి వచ్చారు. వెంటనే ఈ దురాగతం మావోయిస్టుల పనే అన్నాడు.

పోలీసులు జనవరి 19 నాడు అతి విషాదకరమైన చర్యకు తెరలేపారు. నారాయణపూర్ జిల్లాలోని ఘెడాగం పరిసరాలలో పోలీసులే మందు పాతరను అమర్చారు. దానికి బలై ఒక బాలిక సహ ముగ్గురు మహిళలు మరణించగా, మరో ముగ్గురు గాయపడ్డారు. వెంటనే కల్లూరి దండు రంగంలోకి దిగి తమ దుర్మార్గాన్ని కప్పి పుచ్చుకోవడానికి మావోయిస్టుల మందుపాతరగా వార్తలకు ఎక్కించారు. మరో వైపు బాధిత ప్రజలను వెంటేసుకొని ఆ దండు నారాయణపూర్‌లో నిరసన ర్యాలీ ప్రదర్శించారు. అక్కడ బస్తర్ ఎస్.పి. ముందుకొచ్చి 'గొడ్డళ్ళు, బాణాలతో పురుషులు, కారంపొడితో మహిళలు మావోయిస్టులను తరమాలి అంటూ రెచ్చగొట్టాడు.

దండకారణ్యంలో పెద్దెత్తున మందుపాతరల వెలికితీత, ఆయుధాల స్వాధీనం, ప్రేలుడు పదార్థాలు పట్టుకోవడం, మావోయిస్టుల భారీ లొంగుబాట్లు, ఇనామీ మావోయిస్టుల అరెస్టు లాంటి వార్తలు వెలుగు చూడని రోజు బహుశా లేదేమో! లొంగుబాట్లు, అరెస్టులు, బూటకపు ఎన్‌కౌంటర్లలో మరణాలలో పోలీసులు చూపేవారిలో అధిక శాతం సాధారణ ప్రజలేనన్నది అనేక నిజ నిర్ధారణలలో వెల్లడవుతోంది.

అలాగే 2017లో వెలువడుతున్న వివిధ కోర్టు తీర్పులను మిషన్-2017లో భాగంగానే చూడాలి. దేశంలోని అనేక జైళ్లలో ఏళ్ల తరబడి కోర్టు తీర్పులకు నోచుకోకుండా, బెయిల్స్ దొరకకుండా ఎందరో విప్లవకారులున్నట్లే ఛత్తీస్‌గడ్, మహారాష్ట్ర జైళ్లలో కూడా ఉన్నారు. ఈ మధ్య వారి కేసులు పరిష్కారంలో పోలీసు "ప్రత్యేక శ్రద్ధ" కారణంగా మిషన్-2017 తీర్పులు వెలువడుతున్నాయి. రాయపూర్‌లో అరెస్టయిన రైతులూ, వ్యాపారులపై పేలుడు పదార్థాలు దొరికాయనే నేపంతో జిల్లా కోర్టు 5గురికి పదేళ్ళ జైలు శిక్ష విధించింది. గఢ్‌చిరోలి జిల్లా కోర్టులో మావోయిస్టులతో సంబంధాలున్నాయనే తప్పుడు ఆరోపణలతో ఢిల్లీ ప్రొఫెసర్ సాయిబాబా (90శాతం అంగవైకల్యం)ను, మరో నలుగురికి జీవిత ఖైదీ శిక్ష విధించారు.

ప్రజల పక్షం వహించిన మేధావులను, హక్కుల కార్యకర్తలను పోలీసులు విడవకుండా వేధిస్తున్నారు. 2017 జనవరి చివరిలో జగ్దల్‌పూర్ దగ్గర బేలా బాటియాపై ఐ.జి. కల్లూరి పోలీసులు, అగ్ని సంస్థ గూండాలు దాడి చేసి బస్తర్ వదలి వెళ్లాలని హెచ్చరించారు. ఆంధ్రప్రదేశ్, తెలంగాణకు చెందిన న్యాయవాదులు, ప్రజాస్వామికవాదులు బస్తర్‌లో అమలవుతున్న రాజ్యహింసను తెలుసుకోవడానికి ప్రయత్నించినందుకు 'ఛత్తీస్‌గఢ్ జన సురక్ష చట్టం' క్రింద అరెస్టు చేసి బెయిల్‌కు వీలులేని తప్పుడు కేసులు పెట్టి జైల్లో పెట్టారు. రాజ్యం ప్రజల హక్కులను అణచివేసే దాంట్లో భాగంగానే ఇలా చేస్తున్నారు.

దండకారణ్యంలో నిత్య నిర్బంధానికి నేడు మిషన్-2017 అని అంటున్నారు. ఈ మూడు నెలల్లో రాజ్య నిర్బంధాన్ని అర్థం చేసుకోవడానికి అందుబాటులో ఉన్న వివరాల మేరకు చూస్తే...మొత్తం దండకారణ్యంలో దక్షిణ, పశ్చిమ, ఉత్తర ప్రాంతాలలో రెగ్యులర్‌గా పోలీసు కూంబింగ్స్ జరగడం, ఇన్ఫార్మర్ల నెట్‌వర్క్‌ను తయారుచేయడం, ప్రజలను నిత్యం వేధించడం సర్వసాధారణంగా మారింది. దక్షిణ బస్తర్ డివిజన్‌లో వరుసగా అన్ని ఏరియాల్లోనూ జనవరి,ఫ్రిబవరి మాసాల్లో దాడులు నిర్వహించి ప్రజలను అనేక రకాల హింసలకు గురి చేస్తున్నారు. ఆ దాడుల్లో గుండంకు చెందిన మిలీషియా సభ్యుడు కా. సోడి మల్లాలును పట్టుకొని కాల్చి చంపారు. జనవరి 25న కేర్లపాల్ ఏరియాలో పూల్‌వగ్డె స్టేషన్ పరిధిలో గ్రామ సంఘ నాయకుడు అందాను కాల్చి చంపారు. జనవరి 29న కహేరి దులోడులో మడ్కం పొజ్జె (బిడ్డ తల్లి)ని కాల్చి చంపారు. అక్కడే షెల్ వేయడంతో తెర్రం గ్రామానికి చెందిన కార్టం ఐతే చనిపోయింది. ఫిబ్రవరి 10న బాసగూడు ఠాన పరిధిలో చిలకపల్లి వద్ద ఒక కామ్రేడ్‌ను కాల్చి చంపారు. వీరాపురం తాలిపేరు వద్ద మరోకరిని గాయపర్చారు. ఫిబ్రవరి 19న పామేడ్ ఏరియా కావుర్‌గట్టలో ఒక మహిళా కామ్రేడ్‌ను కాల్చిచంపారు. కాల్చి చంపిన అన్ని ఘటనలను ఎన్‌కౌంటర్ ఘటనలగానూ, నక్సలైట్లు కాల్పుల్లో చనిపోయినట్లు

పోలీసులు ప్రకటిస్తున్నారు.

పశ్చిమ బస్తర్‌లో జనవరి మొదటి వారంలో గంగలూర్, భైరంగడ్ ఏరియాల్లోనూ, రెండవ వారంలో నేషనల్ పార్క్ ఏరియాలోనూ, ఆ వెనువెంటనే జనవరి రెండవ వారంలోనే జప్పూరు ప్రాంతంలో వరుస కూంబింగ్‌లు జరిపారు. జనవరి 28న గంపూర్‌కు చెందిన కద్తి భీమా (30 సం॥లు), హెమ్లా సుక్మతి (16సం॥లు), కిరందూల్ సంతకు వెళ్లి వస్తుండగా పట్టుకొని చిత్రహింసలు పెట్టి, నడవలేని స్థితిలో కాల్చి చంపి ఎన్‌కౌంటర్లో చనిపోయినట్లు ప్రకటించారు. దీనికి నిరసనగా ప్రజలు పెద్ద సంఖ్యలో కదిలి కిరందూల్ ఠానాను ఘెరావ్ చేసి శవాలను స్వాధీనం చేసుకున్నారు. ఆప్ పార్టీ నాయకురాలు సోని సోడి గంపూర్‌కు వచ్చి ప్రజలకు మద్దతునిచ్చింది. అజిత్ జోగికి చెందిన కాంగ్రెస్ పార్టీ హత్యకు గురైన వారి కుటుంబ సభ్యులతో అసెంబ్లీ వద్ద ధర్నా నిర్వహించింది. హై కోర్టులో పిటిషన్ వేసి హత్యాకాండపై చర్య తీసుకోవాలని కోరారు. ఫిబ్రవరి 5న పిడియా జనతన సర్కార్ అధ్యక్షుడు కామ్రేడ్ సుక్కును లక్ష్యంగా చేసుకొని ఆటో ఫైర్ చేయడంతో అక్కడికక్కడే అమరుడయ్యాడు. గత ఏడు సంవత్సరాలుగా అధ్యక్షుడిగాను, 20 సంవత్సరాలుగా అక్కడ ఉద్యమానికి ప్రధాన నాయకుడుగా పనిచేసిన కామ్రేడ్ సుక్కు దాదా అమరత్వం ఏరియా ఉద్యమానికి తీవ్ర నష్టం. దీనిని కూడా ఎదురు కాల్పుల ఘటనగా పోలీసులు చిత్రించారు. ఫిబ్రవరి 18న గంపూర్ గ్రామం పైకి నాలుగు వందల మంది పోలీసులు వచ్చి దాడి చేసి ప్రజలను అనేక చిత్రహింసలకు గురి చేసారు. ఇందులో 40 మందికి పైగా గాయలయ్యాయి. మార్చ్ 3 నుంచి 7వరకు మద్దేడ్, నేషనల్ పార్క్ ఏరియాలో కూంబింగ్‌లు నిర్వహించిన పోలీసు పార్టీలు ఇద్దరు రైతులను పట్టుకుపోయారు.

దర్బా డివిజన్‌లో నిరంతరంగా దాడులు, ఎదురుకాల్పులు జరుగుతూనే ఉన్నాయి. బలవంతంగా సరెండర్లు చేయించడం, నక్సల్స్‌కు వ్యతిరేకంగా నినాదాలు ఇప్పించడం, భూస్వాములను, సంఘ వ్యతిరేక శక్తులను ఆర్గనైజ్ చేసి ప్రదర్శన చేయడం పోలీసుల కార్యక్రమం అయిపోయింది. జనవరి 14న ధన్ని కర్క ఏరియా సంఘ నాయకుడు కుంజం లింగాను పట్టుకొని కాల్చి చంపారు. జనవరి 16న ఛాంద మెట్ట వద్ద (కాంఘేరీ ఘాట్) బుద్రను పట్టుకొని కాల్చి చంపారు. వీటిని కూడా ఎన్‌కౌంటర్ మరణాలుగానే ప్రకటించారు. ఆరెన్‌పూర్ పోలీసు స్టేషన్ పరిధిలోని బూర్గుం-తోయే పారలో జరిగిన బూటకపు ఎన్‌కౌంటర్లో ఒక డి.వి.సి.ఎం.తో పాటు 6గురు కామ్రేడ్స్ అమరుల్యారు. దాడి, లూటీ, అరెస్టులు, చిత్రహింసలు, ఎన్‌కౌంటర్లు, తప్పుడు కేసులు, అత్యాచారాలు నిత్యకృత్యం అయిపోయాయి.

పశ్చిమ రీజియన్‌లో ముఖ్యంగా మహారాష్ట్రలో సి-60 కమాండో దాడులు నిరంతరం కొనసాగుతూనే ఉన్నాయి. చిత్రహింసలు, కాల్పులు, మహిళల అపహరణ, అరెస్టులతో పాటుగా కొత్తగా చిత్రహింసలు తర్వాత ఉప్పు, కారం అద్ది వినోధించడం లాంటి ఆటవిక విధానాలు కొనసాగిస్తున్నారు. జనవరి 18న అపహరించిన ఇద్దరు మహిళల ఆచూకి ఇంతవరకు లేదు. జనవరి 19న బాగ్రాగఢ్ తాలుకా మర్కనార్ ప్రజలు సమిష్టి పనులు చేసుకుంటున్నప్పుడు పోలీసులు విచక్షణారహితంగా కాల్పులు జరిపారు. ప్రజలు అనేక మంది గాయపడ్డారు. దానికి నిరసనగా ప్రజలు వేల సంఖ్యలో కదిలి ప్రదర్శన నిర్వహించి పోలీసు చర్యలను ఖండించారు.

ఉత్తర రీజియన్‌లో జనవరి 10న ఇర్పనార్ గ్రామంలో (నారాయణ పూర్ జిల్లా) టీనేజి అబ్బాయి మంగళ్ సలామీని కాల్చి చంపారు. జనవరి 19న మాడ్ కొండల్లోని పద్దిమెట్ట గ్రామం దగ్గర వంజా పద్దాను, గెరిల్లా కామ్రేడ్ చైతును కాల్పులు జరిపి హత్యచేశారు. మరో కామ్రేడ్‌ను గాయపర్చారు. పూర్వ బస్తర్‌లో ఒక దశాబ్ద కాలంగా జనతన సర్కార్ వ్యవసాయ రంగంలో పనిచేస్తున్న కామ్రేడ్ రామసాయిని (తిరుపతి) పట్టుకొని కాల్చి చంపారు. అక్కడే కామ్రేడ్ సుజిత్‌ని కాల్చి చంపారు. ఫిబ్రవరిలో కొండగాం పోలీసులు డొక్కెన్ కొద్రా దగ్గర కాల్పులు జరిపి 6గురి కామ్రేడ్స్‌ను హత్యచేసారు. అందులో బోధిలి ఆర్.పి.సి. అధ్యక్షుడు రాంసింగ్, గ్రామ పార్టీ కార్యదర్శి బలదేవ్, స్థానిక మిలీషియా పి.ఎల్. డిప్యూటీ కమాండర్ మంగ్లీ, సోని, జమిలి, సోండిలు అమరులయ్యారు. మార్చ్ 10న కుగ్డాజోర్ అడవుల్లో ఇద్దరు గెరిల్లాలు కామ్రేడ్స్ అజిత్, ఐతులను పోలీసులు కాల్చి చంపారు.

కొత్త క్యాంపులు వేయడం, రోడ్లు నిర్మించడం, పోలీసు కేంద్రీకరణను పెంచడం, సీరియస్‌గా దాడులు నిర్వహించడం ద్వారా మావోయిస్టు ఉద్యమాన్ని అణచడానికి తీవ్ర ప్రయత్నాలు చేస్తున్నారు. నిర్బంధం ప్రతిఘటనకు దారితీసి ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత వెల్లువలా పెల్లుబుకుతుంది. ఫిబ్రవరి 7న బైలాదిల్లా ఎన్.ఎం.డి.సి.పై దాడి చేసి వాహనాలను ధ్వంసం చేసారు. ప్రతిదాడికి అవసరమైన జెలిటిన్ తెచ్చుకున్నారు. మార్చ్ 3న మిర్తూల్‌లో రోడ్ ఓపెనింగ్ పార్టీపై పి.ఎల్.జి.ఎ. కామ్రేడ్స్ దాడి చేసి ఇద్దరిని చంపారు, ఇద్దరిని గాయపర్చారు. మార్చ్ 11న బెజ్జి దగ్గర పి.ఎల్.జి.ఏ. కామ్రేడ్స్ సాహసిక దాడి చేసి సి.ఆర్.పి బలగాలకు చెందిన 12 మందిని మట్టుబెట్టారు. 4గురిని గాయపర్చారు. 10 తుపాకులను స్వాధీనం చేసుకున్నారు. అన్ని ప్రాంతాలలోనూ మిలీషియా, పి.ఎల్.జి.ఎ. కామ్రేడ్స్ బూబీ ట్రాప్‌లు ఏర్పర్చి పోలీసులను గాయపర్చడం, చికాకు పర్చడం కొనసాగిస్తున్నారు. మహారాష్ట్రలోని గడ్చిరోలిలో సుర్జాగఢ్ ప్రాంతంలో మైనింగ్ పనులు నిలిపి వేయాలని డిమాండ్ చేస్తూ

*(మిగతా 18వ పేజీలో......)*

*(..........చివరి పేజీ తరువాయి)*

నక్సల్బరీ తిరుగుబాటు. అది భారత విప్లవోద్యమంలో ఊడలు దిగిన రివిజనిజానికి గొడ్డలి పెట్టు. ప్రపంచ సోషలిస్టు విప్లవంలో విడదీయరాని భాగం. అది రివిజనిజంతో తెగతెంపులు చేసుకొని మార్క్సిజం-లెనినిజం-మావో ఆలోచనా విధాన దిశానిర్దేశంతో మావోయిస్టు విప్లవ పార్టీ నిర్మాణానికి, సరైన రాజకీయ పంథాకు, వ్యూహానికి, పోరాట పద్ధతికి, నాయకత్వ శైలికి మహత్తర ఆరంభంగా నిలిచింది. ఒక్కమాటలో భారత విప్లవ చరిత్రలో అది ఒక గొప్ప మలుపు, ఒక గుణాత్మక ముందంజ.

మహత్తర నక్సల్బరీ పోరాటానికి నాయకత్వాన్ని అందించిన కామ్రేడ్ చారు మజుందార్ నేతృత్వంలో సి.పి.ఐ. (ఎంఎల్) ఏర్పడింది. అదే సమయంలో కామ్రేడ్ కన్హయ్ చటర్జీ నాయకత్వాన అదే సిద్ధాంతాన్ని, పంథాను, వ్యూహాన్ని అనుసరిస్తూ ఎంసిసి ఆవిర్భవించింది. ఇవే ఆనాటి చారిత్రక విప్లవ వెల్లువకు నాయకత్వం వహించాయి. నక్సల్బరీ పంథాకు తూట్లు పొడవజూసిన దేవులపల్లి వెంకటేశ్వరరావు, తరిమెల నాగిరెడ్డి, చంద్ర పుల్లారెడ్డి మొదలైన కుహనా విప్లవకారుల మితవాద అవకాశవాదాన్ని తిప్పికొట్టడం ద్వారానే విప్లవ వెల్లువ పురోగమించింది. అయితే ఆనాటి ఉద్యమ వ్యూహం సరైందే అయినప్పటికీ, ఎత్తుగడలపర లోపాలు, సిపిఐ (ఎంఎల్) లోపలా బయటా మితవాద శక్తుల విచ్ఛిన్నకర కార్యకలాపాలు, దేశవ్యాప్తంగా పాలకవర్గాలు కొనసాగించిన ప్రతీఘాతుక నిర్బంధకాండ వల్ల వరుసగా ఉద్యమం తీవ్రమైన నష్టాలు పొంది అది 1972 మధ్య నాటికి వెనకపట్టు పట్టింది. అవకాశవాదులు, విచ్ఛిన్నకారులు పార్టీని చీల్చి బలహీనపరిచారు.

అయితే నిజమైన విప్లవకారులు నక్సల్బరి నుండి విలువైన గుణపాఠాలు తీసుకొని విప్లవ విజయానికి ఆవశ్యకమైన మూడు అద్భుత ఆయుధాలు - పార్టీ, ప్రజాసైన్యం, ఐక్యసంఘటనలను పెంపొందించడం కోసం దృఢ సంకల్పంతో, త్యాగనిరతితో కృషి చేశారు. పార్టీ లోపల తప్పుడు ఎత్తుగడలకు, బయట మితవాద, 'అతివాద' అవకాశవాదాలకు వ్యతిరేకంగా సాగించిన సరైన సైద్ధాంతిక, రాజకీయ, నిర్మాణ, పోరాట కృషితో పార్టీ పునర్నిర్మాణమైంది. విప్లవోద్యమం తిరిగి పెల్లుబికింది. ఫలితంగా తిరిగి విప్లవశక్తులను కూడగట్టారు.

ఫలితంగా 1978 నుండి సిపిఐ (ఎంఎల్) (పీపుల్స్‌వార్) నేతృత్వంలో ఆంధ్రప్రదేశ్‌లో, సిపిఐ (ఎంఎల్) (పియు) నేతృత్వంలో బీహార్‌లో; ఎంసిసి నాయకత్వంలో బీహార్ కేంద్రంగా తొలి నుండి సాగించిన కృషి ఫలితంగా మరో విప్లవ వెల్లువ బద్ధలైంది. రైతాంగాన్ని సాయుధ వ్యవసాయ విప్లవ గెరిల్లా యుద్ధంలో, విద్యార్థి, యువజలను, కార్మికులు, మేధావులను విప్లవ, ప్రజాస్వామిక వుద్యమాలలో కదలించడం ద్వారా ప్రజాపునాది, స్వీయాత్మక శక్తులు గణనీయంగా పెంపొందాయి. 2000 సం॥ నాటికి అలలు అలలుగానే క్రమంగా ఉద్యమం 16-17 రాష్ట్రాలలోని విశాల మైదాన ప్రాంతాలకు, వ్యూహాత్మక ప్రాంతాలకూ, అనేక పట్టణాలు, నగరాలకూ విస్తరించింది. 'దున్నేవారిదే భూమి, విప్లవ రైతు కమిటీ/ విప్లవ ప్రజా కమిటీలకే సర్వాధికారాలు' అనే నినాదం ఉద్యమ ప్రాంతాలన్నింటా మారుమోగింది. పెద్దెత్తున ప్రజా గెరిల్లా దళాలు వృద్ధి చెందాయి. ఎర్ర ప్రతిఘటనా ప్రాంతాలు, గెరిల్లా జోన్లు ఆవిర్భవించాయి. మధ్య, తూర్పు భారతాల్లో దోపిడి పాలకవర్గాల అధికారం ధ్వంసమైన చోట బీజప్రాయంగా ప్రజా రాజ్యాధికార నిర్మాణాల స్థాపనా క్రమంలో వాటి రక్షణకూ, విస్తరణకూ, గెరిల్లా యుద్ధ అభివృద్ధికీ 2000 డిసెంబర్ 2న పార్టీ నాయకత్వాన ప్రజా విముక్తి గెరిల్లా సైన్యం (పిఎల్‌జిఏ) ఏర్పడింది. 2004 సెప్టెంబర్ 21న రెండు ప్రధాన విప్లవ స్రవంతులు ఐక్యమై భారత విప్లవోద్యమానికి నాయకత్వాన్ని అందించే ఏకైక కేంద్రంగా, సాపేక్షికంగా బలమైన పార్టీగా సిపిఐ(మావోయిస్టు) ఆవిర్భవించింది. దేశంలో మిగతా విప్లవకారులతో ఐక్యతా కృషిని కొనసాగించిన ఫలితంగా 2014 మే 1న సిపిఐ (మా.లె) (నక్సల్బరి) ఈ నూతన పార్టీలో కలిసింది. నూతన పార్టీ నేతృత్వంలో గెరిల్లా యుద్ధం వున్నత స్థాయికి అభివృద్ధి అయ్యింది. వ్యూహాత్మక ప్రాంతాల్లో గ్రామ, ఏరియా, జిల్లా స్థాయి విప్లవ ప్రజా రాజ్యాధికార అంగాలూ, గెరిల్లా బేసులు అభివృద్ధి చెందాయి. ఇది భారత విప్లవోద్యమంలో వెనుకపట్టులను, విద్రోహాలనూ, ఎగుడు-దిగుళ్లనూ, మలుపులూ -మెలికలనూ అధిగమిస్తూ, నక్సల్బరీ అందించిన అమూల్యమైన అనుభవాలను, గుణపాఠాలను నిర్దిష్ట పరిస్థితులకు సృజనాత్మకంగా అన్వయిస్తూ, రక్తసిక్తమైన త్యాగాల బాటలో, దృఢంగా, ధైర్యంగా పురోగమిస్తూ సాధించిన మరో గొప్ప చారిత్రాత్మక ముందంజ. ఈ ఉద్యమం నేడు ప్రపంచవ్యాప్తంగా ప్రభావాన్ని వేస్తూ ప్రపంచ విప్లవ కేంద్రం ఏర్పాటుకు సన్నాహాలను త్వరితం చేస్తోంది.

ఈ క్రమంలో ఉద్యమం అభివృద్ధి చెందకుండా పురిట్లోనే దెబ్బతీసేందుకు భారత పాలకవర్గాలకు చెందిన ఏ పార్టీ కేంద్రంలో/ రాష్ట్రాలలో అధికారంలో ఉన్నప్పటికీ సామ్రాజ్యవాదుల తక్కువ తీవ్రత కలిగిన యుద్ధ (ఎల్ఐసి) వ్యూహంతో 1980ల మధ్య నుండి విప్లవోద్యమంపై దఫదఫాలు అమలు చేస్తూ వచ్చిన బహుముఖ దాడిని కొనసాగించాయి. దాన్ని విప్లవోద్యమం ఎప్పటికప్పుడు తిప్పికొడుతూ వచ్చింది.

అయితే పాలకవర్గాలు ఈ ఉద్యమానికి గడగడ వణికిపోయాయి. అవి సిపిఐ (మావోయిస్టు)ను దేశ అంతర్గత భద్రతకు అతి పెద్ద ముప్పుగా ప్రకటించాయి. శత్రుదాడి 2005 నాటికి తీవ్రస్థాయికి చేరుకుంది. కొన్ని రాష్ట్రాలు, ప్రాంతాలలో ఉద్యమం తాత్కాలిక వెనకపట్టు పట్టింది. పాలకవర్గాలు సల్వాజుడుం, సేంద్ర, నాగరిక్ సురక్షా సమితి, శాంతికమిటీ తదితర పేర్లతో విప్లవ ప్రతిఘాతక క్యాంపెయిన్ల ద్వారా ప్రజల మధ్య అంతర్యుద్ధం సృష్టించి విప్లవోద్యమాన్ని రూపుమాపాలని ప్రయత్నించి విఫలం కావడంతో 2009 మధ్య నుంచి దేశవ్యాప్తంగా అత్యంత క్రూరంగా ప్రజలపై యుద్ధం-ఆపరేషన్ గ్రీన్ హంట్‌ను కొనసాగిస్తున్నాయి. ఈ బహుముఖ దాడి వల్లా, కొన్ని లోపాల వల్లా పెద్ద సంఖ్యలో వివిధ

స్థాయిల్లో ప్రత్యేకించి కేంద్ర, రాష్ట్ర స్థాయిల్లోని నాయకత్వాన్ని నష్టపోయాం. కొన్ని ప్రాంతాలు బలహీనపడ్డాయి. దీనితో 2013 నుంచి విప్లవోద్యమం గడ్డు పరిస్థితిని ఎదుర్కొంటున్నది. దీన్ని అధిగమించేందుకై తగిన ఎత్తుగడలను రూపొందించుకోవడమూ, పార్టీని బోల్షివీకరించే క్యాంపెయిన్‌ను చేపట్టడం ద్వారా తిరిగి పార్టీని, ప్రజాపునాదినీ బలోపేతం చేస్తూ, ప్రజా పోరాటాలనూ పెంపొందిస్తూ పార్టీ, ఉద్యమం శత్రు దాడిని ఎదుర్కొంటూ నిలదొక్కుకుంటున్నది. నేడు పార్టీ, ఉద్యమం ముందు అనేక పెను సవాళ్లు ఉన్నప్పటికీ గత 5 దశాబ్దాల అనుభవాల వెలుగు నుండి చూసినప్పుడు వాటిని అధిగమిస్తూ ఉద్యమాన్ని పురోగమించి తీరుతామని మన పార్టీ అంచంచల విశ్వాసంతో ప్రకటిస్తున్నది.

**ప్రియమైన కామ్రేడ్స్, మిత్రులారా!**

నక్సల్బరీ విప్లవ వెల్లువ గడచిన 5 దశాబ్దాలలో భారత విప్లవోద్యమంలో సిపిఐ (మావోయిస్టు) నాయకత్వంలో ఎన్నో గొప్ప విజయాలు, విలువైన అనుభవాలు సాధించాం. ఏ సంక్షుభిత అంతర్జాతీయ-దేశీయ పరిస్థితులు నక్సల్బరీ విప్లవ వెల్లువకు దారితీశాయో అవి నేడు మరింత తీవ్రతరమయ్యాయి. ఉద్యమం ఎదుర్కొంటున్న గడ్డు పరిస్థితిని అధిగమించి పురోగమించేందుకు భౌతిక పరిస్థితులు మున్నెన్నటి కంటే పరిపక్వంగా ఉన్నాయి. కనుక ఆ అమూల్యమైన అనుభవాన్ని సమర్థవంతంగా వినియోగించుకుంటూ అజేయమైన దీర్ఘకాల ప్రజాయుద్ధ పథంలో పురోగమించండి! ఇందుకోసం –

పార్టీని సైద్ధాంతికంగా, రాజకీయంగా, సైనికంగా, నిర్మాణపరంగా, సాంస్కృతికంగా బలోపేతం చేయాలి. సిద్ధాంతాన్ని ఆచరణకు సృజనాత్మకంగా అన్వయించడంలో, పార్టీలో తలయెత్తే మితవాద, 'అతివాద' అవకాశవాద ధోరణులకు వ్యతిరేకంగా పోరాడి పార్టీ సమైక్యతని పటిష్టం చేయాలి. పీడిత వర్గాలు, సెక్షన్లను వర్గ ప్రాతిపదికన ఐక్యం కాకుండా వివిధ రూపాల్లో ప్రభావితం చేస్తున్న పోస్టు మాడర్నిజాన్నీ, గాంధీయిస్టు, పార్లమెంటరిస్టు, రివిజనిస్టు వాదాలను, ప్రచండ-అవాకియన్‌ల నయా రివిజనిస్టు వాదాలను సైద్ధాంతికంగా ఎండగట్టాలి. కార్మిక వర్గ అంతర్జాతీయతను ఎత్తి పడుతూ ప్రపంచవ్యాప్తంగా అభివృద్ధి చెందుతున్న మావోయిస్టు విప్లవ శక్తులతో, సంస్థలతో ఐక్యం కావాలి.

సమాజంలోని పేద రైతులు, కార్మికులు, దళితులు, ఆదివాసీలు, విద్యార్థి యువజనులను, మహిళలు, మత మైనారిటీలను, పీడిత జాతులను, సంఘటితం చేయడం ద్వారా దీర్ఘకాల ప్రజాయుద్ధానికి ప్రజాపునాదిని అపారంగా పెంపొందించాలి. విశాల ప్రజలను సాయుధం చేస్తూ, అజేయమైన కఠిన పోరాట శైలిని, మావోయిస్టు యుద్ధ కళను అభివృద్ధి చేసి పిఎల్‌జిఏ యుద్ధ సామర్థ్యాన్ని పెంపొందించాలి. ప్రభుత్వ సాయుధ బలగాలను సంహరిస్తూ, ఆయుధాలను స్వాధీనం చేసుకుంటూ పిఎల్‌జిఏ శక్తినీ, పోరాట పటిమనూ పెంపొందించాలి. ఆపరేషన్ గ్రీన్ హంట్‌ను ఓడించే లక్ష్యంతో వ్యవసాయ విప్లవ గెరిల్లా యుద్ధాన్ని విశాల ప్రాంతాలకు విస్తరింపజేయాలి. వ్యూహాత్మక ప్రాంతాలలో దోపిడి పాలకవర్గాల అధికారాన్ని ధ్వంసం చేయాలి.

శత్రు అధికారాన్ని ధ్వంసం చేసిన చోట ప్రత్యామ్నాయ ప్రజా రాజకీయాధికార అంగాలను నిర్మించాలి, ఇప్పటికే ఉన్న వాటిని బలోపేతం-విస్తృతం చేయాలి. ప్రజాయుద్ధాన్ని దున్నేవారికే భూమి ప్రాతిపదికన సాగే భూస్వామ్య వ్యతిరేక-విస్థాపిత వ్యతిరేక భూ పోరాటాలతో, సామాజిక, ఆర్థిక, రాజకీయ, సాంస్కృతిక, సెక్షనల్ ప్రజా ఉద్యమాలతో, కశ్మీర్, అసోం, నాగా, మణిపురీ, బోడో వంటి జాతుల విముక్తి పోరాటాలతో సమన్వయించాలి. ప్రజలను విప్లవ మార్గం నుంచి మళ్లించేందుకు దేశంలో, ప్రపంచంలో పెరుగుతున్న మతోన్మాద, జాతీయోన్మాద, జాత్యహంకార ఫాసిస్టు ధోరణులకు/దాడులకు వ్యతిరేకంగా, ప్రత్యేకించి మన దేశంలో రోజు రోజుకూ తీవ్రతరమవుతున్న బ్రాహ్మణవాద హిందూఫాసిజానికి వ్యతిరేకంగా, ప్రజల జీవితాల్ని ధ్వంసం చేస్తున్న సామ్రాజ్యవాద సరళీకృత ఆర్థిక విధానాలకు వ్యతిరేకంగా, పర్యావరణాన్ని నాశనం చేస్తున్న విధానాలకు వ్యతిరేకంగా విశాల ప్రాతిపదికన సమరశీల ప్రజా ఉద్యమాల్ని నిర్మించాలి. లక్షలాది మంది పీడిత ప్రజారాశులను ప్రజాయుద్ధంలో క్రియాశీలంగా భాగంగా చేసే లక్ష్యంతో ఈ వుద్యమాలను అభివృద్ధి చేయాలి.

21వ శతాబ్దం సామ్రాజ్యవాదం నాశనమయ్యే, విప్లవాలు జయించే యుగం! రండి, నక్సల్బరీ చూపిన మార్గంలో పయనిద్దాం. నక్సల్బరీ అమరులు, నూతన ప్రజాస్వామిక విప్లవంలో నేలకొరిగిన వేనవేల వీరుల త్యాగాలు వృధా కావని చాటిచెబుతూ ఎర్రజెండాలను చేబూనుదాం. కార్మిక- కర్షక, విద్యార్థి-యువజన, మేధావులారా! పీడిత తాడిత విశాల ప్రజారాశులారా! సమైక్యంగా సామ్రాజ్యవాదాన్ని, భూస్వామ్యాన్ని కూల్చి నూతన ప్రజాస్వామిక విప్లవాన్ని విజయవంతం చేద్దాం. సాహసించి పోరాడితే అంతిమ విజయం ప్రజలదే!

★ నక్సల్బరీ ఏకీ రాస్తా!

★ మార్క్సిజం-లెనినిజం-మావోయిజం వర్ధిల్లాలి!

★ రకరకాల రివిజనిజం నశించాలి!

★ సామ్రాజ్యవాదం, దళారీ నిరంకుశ బూర్జువా-భూస్వామ్య విధానం నశించాలి!

★ దోపిడి పాలకవర్గాల అధికారాన్ని ధ్వంసం చేసి స్వావలంబనతో కూడిన విప్లవ ప్రజా రాజ్యాధికారాన్ని స్థాపించండి!

★ విప్లవ పార్టీ, ప్రజాసైన్యం, ప్రజా రాజ్యాధికారం లేకుండా ప్రజలకుండేదేమీ లేదు!

★ సాయుధ వ్యవసాయక విప్లవ యుద్ధం వర్ధిల్లాలి!

★ భారత నూతన ప్రజాస్వామిక విప్లవం వర్ధిల్లాలి!

**కేంద్రకమిటీ,**

1-3-2017 **భారత కమ్యూనిస్టు పార్టీ (మావోయిస్టు)**

**నక్సల్బరీ సాయుధ విప్లవ వెల్లువ 50వ వార్షికోత్సవాలను గ్రామగ్రామానా విప్లవోత్సాహం-ఉత్తేజాలతో జరపండి!**



# నక్సల్బరీ మార్గమే భారత పీడిత ప్రజల విముక్తికి ఏకైక మార్గం!

# ప్రజాయుద్ధ జ్వాలల్లో సామ్రాజ్యవాదాన్నీ, భూస్వామ్యాన్నీ భస్మీపటలం చేద్దాం!

# నూతన ప్రజాస్వామిక విప్లవాన్ని విజయవంతం చేద్దాం!

**ప్రియమైన కామ్రేడ్స్, మిత్రులారా!**

చిన్న నిప్పురవ్వ దావానలమైనట్టే బెంగాల్‌లోని డార్జిలింగ్ జిల్లా, సిలిగురి సబ్-డివిజన్, నక్సల్బరీ ప్రాంతంలో కామ్రేడ్ చారు మజుందార్ నాయకత్వంలో మార్క్సిజం-లెనినిజం-మావో ఆలోచనా విధానం(నేడు మావోయిజం)తో చైతన్యయుతమై, సంఘటితమైన సంతాల్ రైతాంగం నిర్వహించిన సాయుధ వ్యవసాయ విప్లవ పోరాటం భారతదేశ విప్లవ పథాన్ని నిర్దేశించింది. అప్పటి నుండి నక్సల్బరీ కేవలం ఊరు పేరుగా కాక ఒక రాజకీయ పంథాకు ప్రతీకగా నిలిచింది. 2017 మే 23 నాటికి చారిత్రక నక్సల్బరీ సాయుధ తిరుగుబాటుకు 50 వసంతాలు నిండుతాయి.

కామ్రేడ్ మావో నేతృత్వంలోని చైనా కమ్యూనిస్టు పార్టీ నాయకత్వంలో ఆధునిక కృశ్చేవ్ రివిజనిజానికి వ్యతిరేకంగా సాగించిన బృహత్తర చర్చ మరియు సాంస్కృతిక విప్లవ ప్రేరణతో కామ్రేడ్ చారు మజుందార్, కన్హయ్ చటర్జీ వంటి మొదటి శ్రేణి నాయకులతో సహా పెద్ద సంఖ్యలో మావోయిస్టు విప్లవకారులు రంగంలోకి దూకారు. సిపిఎం డార్జిలింగ్ జిల్లా కార్యదర్శిగా ఉన్న కామ్రేడ్ చారు మజుందార్ 1963-65 మధ్య పార్టీలో అంతర్గత సైద్ధాంతిక పోరాటం కోసం ఎనిమిది డాక్యుమెంట్లను కేడర్లలో పంపిణీ చేశారు. ఆయన పేద రైతాంగాన్ని మావో సిద్ధాంతాలతో చైతన్యపరచారు. దీంతో జోతేదార్లకు వ్యతిరేకంగా తిరుగుబాటుకు రంగం సిద్ధమైంది.

1967 మార్చి నుంచి పేద రైతాంగం జోతేదార్లపై, వడ్డీ వ్యాపారులపై తిరుగుబాటు చేసి వారి భూముల్ని స్వాధీనపర్చుకోనారంభించింది. ఆనాటి సిపిఎం నాయకుడు, రాష్ట్ర హోంమంత్రి జ్యోతిబసు ఆదేశాలతో పెద్దెత్తున దాడికి దిగిన ప్రభుత్వ సాయుధ పోలీసు బలగాలకూ రైతాంగానికీ మే 23న నక్సల్బరి గ్రామం వద్ద జరిగిన సాయుధ ఘర్షణలో ఒక పోలీసు మరణించగా మే 25న ప్రసాద్ జోతె వద్ద ప్రజలపై పోలీసులు విచ్చలవిడిగా జరిపిన కాల్పుల్లో ఆరుగురు మహిళలు, ఇద్దరు పిల్లలతో సహా 9 మంది ప్రజలు నేలకొరిగారు. చైనాలోని పెకింగ్ రేడియో నక్సల్బరీ తిరుగుబాటును "వసంతకాల మేఘగర్జన"గా అభివర్ణించింది. పాలకవర్గాలు ఆ తిరుగుబాటును మూడు నెలల్లోనే అణచివేశాయి. అయితే అది దేశవ్యాప్తంగా పేద రైతాంగంలో చైతన్యాన్ని రగిల్చింది. వారిలో నిద్రాణమై ఉన్న వీరత్వాన్ని మేల్కొల్పింది. అనతి కాలంలోనే నక్సల్బరీ జ్వాలలు దేశవ్యాప్తంగా శ్రీకాకుళం (ఆంధ్రప్రదేశ్); ముషాహరి (బీహార్); లఖింపూర్, ఖేరీ, తెరై (ఉత్తర ప్రదేశ్); దేబ్రా, గోపీవల్లభపూర్, బీర్‌భూం, సోనార్‌పూర్, కాంక్సా (బెంగాల్); పంజాబ్, కేరళ, తమిళనాడు, ఒడిశా, కశ్మీర్, అసోం, త్రిపుర రాష్ట్రాలకు వ్యాపించాయి. భూస్వాములకు మద్దతుగా వచ్చిన పోలీసు, పారామిలటరీ బలగాలకు, భారత సైన్యాలకు వ్యతిరేకంగా రైతాంగం సాయుధమై సాగించిన గెరిల్లా యుద్ధంతో భారత పాలకవర్గాలతో పాటు సామ్రాజ్యవాదులుభయ కంపితులయ్యారు. ఆనాటి విప్లవ వెల్లువలో గ్రామీణ ప్రాంతాలే కాదు, పట్టణ ప్రాంతాలు కూడా బాగా ప్రభావితమయ్యాయి. విద్యార్థి యువజనుల నాయకత్వంలో సాగిన పట్టణ గెరిల్లా యుద్ధంతో బెంగాల్ రాజధాని కోల్‌కతా నగరం అట్టుడుకిపోయింది.

ఈ తిరుగుబాటు ప్రాముఖ్యతను వివరిస్తూ కామ్రేడ్ చారు మజుందార్ ఇలా అన్నారు: 1. రైతులు భూమి, పంట కోసం కాక రాజ్యాధికారం కోసం పోరాడారు; 2. ప్రభుత్వ సాయుధ బలగాలపై సాయుధ పోరాటాన్ని నడిపారు; 3. సాంప్రదాయక ఆయుధాలపైనే ఆధారపడి శత్రు బలగాలపై దాడులు చేస్తూ తుపాకులను స్వాధీనం చేసుకున్నారు; 4. పోరాటంలో తమ స్వంత కాళ్లపై నిలబడ్డారు; 5. రివిజనిజాన్ని ఎదుర్కోవడం ద్వారానే ఈ పోరాటం అభివృద్ధి అయ్యింది; 6. మావో ఆలోచనా విధానాన్ని రైతాంగంలోకి తీసుకెళ్లడం ద్వారా మాత్రమే రివిజనిజాన్ని ఎదుర్కోగలమని ఈ పోరాటం నిరూపించింది.

మార్క్సిజం-లెనినిజం-మావో ఆలోచనా విధానాన్ని, సాయుధ వ్యవసాయ విప్లవం ఇరుసుగా నూతన ప్రజాస్వామిక విప్లవాన్ని విజయవంతం చేసే లక్ష్యంతో ప్రజాసైన్యాన్ని నిర్మించడం, సాయుధ పోరాటం ద్వారా ప్రాంతాల వారీగా అధికారాన్ని స్వాధీనం చేసుకోవడం, ముందు గ్రామీణ ప్రాంతాలను విముక్తి చేసి అంతిమంగా పట్టణాలను చుట్టుముట్టి దేశవ్యాప్తంగా విజయం సాధించడమనే దీర్ఘకాలిక ప్రజాయుద్ధ పంథాని భారతదేశ నిర్దిష్ట పరిస్థితులకు సృజనాత్మకంగా అన్వయించిన ఫలితమే మహత్తర

*(మిగతా 58వ పేజీలో......)*